
'రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు కళకళలాడాలి. పాడిపంటలతో పులకించిపోవాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4+20 వెల : ₹ 5.00

సంపుటి: 11 సంచిక: 297

శుక్రవారం 18-1-2019

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



వడ్డీ రేట్లు తగ్గించాలి..

ద్రవ్య లభ్యత పరిస్థితులను మెరుగుపరచాలి

ఆర్‌బీఐకి సీఐఐ, ఫిక్కీ సూచనలు –బిజినెస్‌లో



మెల్‌బోర్న్‌లోనూ మెరిస్తే..

నేడు ఆస్ట్రేలియాతో ఆఖరి వన్డే..

సిరీస్ విజయంపై భారత్ దృష్టి – స్పోర్ట్స్‌లో

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిగా

గోపాలకృష్ణ ద్వివేది



5లో

ప్రస్తుత ప్రధాన ఎన్నికల అధికారి సిసోడియా బదిలీ

- ఓటర్ల జాబితాల్లో అవకతవకలు, బోగస్ ఓటర్లను తొలగించడంలో అలసత్వమే కారణం
- బాధ్యతలు చేపట్టిన గోపాలకృష్ణ ద్వివేది
- అందరి సహకారంతో ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహిస్తానని వెల్లడి
- ఎన్నికల ఏర్పాట్లపై నేడు అఖిలపక్ష సమావేశం

ఉన్నత పదవుల్లో ఇండో అమెరికన్లు



11లో

- ముగ్గురు భారతీయ అమెరికన్లను కీలక పరిపాలనా స్థానాల్లో నియమించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నామినేట్ చేశారు. ఈ నామినేషన్లను శ్వేతసౌధం ఇప్పటికే సెనెట్‌కు పంపింది. ప్రస్తుతం గేట్‌వే ఫర్ యాక్సెలరేటెడ్ ఇన్నోవేషన్ ఇన్ న్యూక్లియర్ (గెయిన్) డైరెక్టర్‌గా ఉన్న రీటా బరన్వాల్‌ను ఇంధన శాఖ (అణు ఇంధన) అసిస్టెంట్ సెక్రటరీగా, న్యాయవాద అధ్యాపకుడిగా ఉన్న ఆదిత్య బమ్జాయ్‌ని ప్రైవసీ అండ్ సివిల్ లిబర్టీస్ ఓవర్‌సైట్ బోర్డు సభ్యుడిగా, ఫైనాన్షియల్ స్టెబిలిటీ ఓవర్‌సైట్ కౌన్సిల్‌లో డెప్యూటీ అసిస్టెంట్ సెక్రటరీగా ఉన్న బిమల్ పటేల్‌ను ట్రెజరీ అసిస్టెంట్ సెక్రటరీగా నియమించేందుకు ట్రంప్ ప్రతిపాదించారు.

పతనం అంచున గగ్గోలు!

జగన్ - కేటీఆర్ భేటీపై ఎల్లో సిండికేట్ దుష్ప్రచారం

హోదాకు మద్దతిస్తే స్వాగతించడాన్నీ తప్పబడతారా?

- టీఆర్‌ఎస్ పొత్తుకోసం చంద్రబాబు ప్రయత్నించడం వాస్తవం కాదా
- ఆ విషయం ఆయన స్వయంగా ప్రకటించలేదా?
- టీఆర్‌ఎస్ ఒప్పుకుని ఉంటే అది రాష్ట్ర ప్రయోజనాల కోసమని కీర్తించేవారు కాదా?
- నయవంచన దీక్షలు చేసి మళ్లీ కాంగ్రెస్‌తో పొత్తుకు సిద్ధపడడం ఏ విలువలకు తార్కాణం?
- అధికారం కోసం ఎన్ని అడ్డదారులైనా తొక్కడం బాబు నైజం
- అవకాశవాద పొత్తులకు ట్రేడ్‌మార్క్ ఆయనే..
- హోదాపైనా బాబు పలుమార్లు యూటర్న్‌లు..



సాక్షి, అమరావతి: జాతీయ స్థాయిలో ఫెడరల్ ఫ్రంట్‌కు సంబంధించి వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్, టీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.టి.రామారావు మధ్య జరిగిన భేటీపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వంది మాగధులు, టీడీపీ మంత్రులు– ఆయన ప్రయోజనాల పరిరక్షణకు వెన్నుదన్నుగా నిలుస్తున్న ఎల్లో మీడియా రెండు రోజులుగా గగ్గోలు పెడుతుండడం చూసి రాష్ట్ర ప్రజలు విస్తుపోతున్నారు. రాష్ట్రాన్ని అన్యాయంగా విభజించిన కాంగ్రెస్ పార్టీతో పొత్తు పెట్టుకున్న చంద్రబాబును, హరికృష్ణ భౌతికకాయం సాక్షిగా టీఆర్‌ఎస్‌తో పొత్తుకోసం ప్రయత్నించానని సాక్షాత్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు అటు అసెంబ్లీలోనూ, ఇటు తెలంగాణ ఎన్నికల సమయంలోనూ ప్రకటించినా ఏ మాత్రమూ తప్పు బట్టని ఎల్లో మీడియా నేడు రాద్ధాంతం చేస్తున్నది. కేవలం నాలుగు నెలల ముందు టీఆర్‌ఎస్‌తోనూ పొత్తుకు ప్రయత్నించి దానికి రాష్ట్ర ప్రయోజనాలు, దేశ ప్రయోజనాలు అని సూత్రీకరించిన చంద్రబాబు... టీడీపీతో పొత్తుకు టీఆర్‌ఎస్ ససేమిరా అనడంతో ఇపుడు యూటర్న్ తీసుకుని టీఆర్‌ఎస్ నాయకులు భేటీ జరపడంపైనే బురదజల్లే కార్యక్రమం చేయడం విశేషం. తనతోనూ, తన పార్టీతోనూ పొత్తుకు ఓకే అని ఉంటే టీఆర్‌ఎస్ మంచి పార్టీ. కలవక పోతే వాళ్లను వేరే వాళ్లకు ఆపాదించడం చంద్రబాబు అవకాశవాద రాజకీయానికి పరాకాష్ట. ఏ ఎండకా గొడుగు పడుతూ ... పచ్చి అవకాశవాదంతో ప్రజా ప్రయోజనాల కన్నా తన రాజకీయ ప్రయోజనాలే మిన్నగా రాజకీయాలు నడిపే చంద్రబాబుకు ఫెడరల్ ఫ్రంట్ ఇంతగా ఎందుకు వణుకు పుట్టిస్తున్నదనేది బోధపడటం లేదని విమర్శకులు వ్యాఖ్యానిస్తున్నారు. విభజన తరువాత నష్టపోయిన ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలనే డిమాండ్ తమకూ

మిగతా 2వ పేజీలో ▶

పేదలకు కోటా రాజకీయ సంకల్పం

8లో

డీజీపీగా ఠాకూర్ నియామకంపై

నీలినీడలు!



3లో

రాష్ట్రాల సొంత చట్టాల ద్వారా డీజీపీ నియామకం చెల్లదని సుప్రీంకోర్టు తీర్పు

- పంజాబ్, హరియాణా, కేరళ, పశ్చిమ బెంగాల్ వినతులను తిరస్కరించిన న్యాయస్థానం
- ఏపీలోనూ సొంత చట్టం ద్వారా డీజీపీ నియామకం
- రాజకీయ ప్రయోజనాల కోణంలోనే డీజీపీని నియమించిన సీఎం చంద్రబాబు



టీఆర్‌ఎస్ నేతలతో

తిరగొద్దు!

3లో

- పార్టీ నేతలు, మంత్రులకు చంద్రబాబు హెచ్చరిక
- స్నేహాలు, బంధుత్వాలుంటే వ్యక్తిగతంగా చూసుకోండి
- ఎవరైనా వారి పర్యటనల్లో పాల్గొంటే కఠిన చర్యలు
- కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్‌కు స్పందన లేదు
- అందుకే హడావుడిగా వైఎస్ జగన్‌తో కేటీఆర్ భేటీ
- బీజేపీ వ్యతిరేక ఓట్లు చీల్చాలనే కుట్ర

వైఎస్ జగన్‌పై హత్యాయత్నం కేసు

'సిట్' సహాయ నిరాకరణపై ఎన్‌ఐఏ పిటిషన్

- ఇంతవరకు విచారణ రికార్డులు అందచేయని విశాఖ పోలీసులు
- ఇతర మెటీరియల్‌ను అప్పగించాలన్న ఉత్తర్వులు బేఖాతర్
- కోర్టు ఆదేశాలను ఉల్లంఘించడంపై మెమో దాఖలు చేసిన ఎన్‌ఐఏ

- వివరాలు 5లో

'రెయిన్‌ట్రీ పార్క్'లో హైకోర్టు సిబ్బందికి వసతి

సాక్షి, అమరావతి: హైకోర్టులో విధులు నిర్వర్తించే 450 మంది ఉద్యోగులకు రెయిన్‌ట్రీ పార్క్ అపార్ట్‌మెంట్స్‌లో వసతి కల్పిస్తూ గురువారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆరు నెలలపాటు నెలకు ఒక్కొక్కరికి రూ.ఆరు వేల చొప్పున వసతి కోసం ఖర్చు చేయనుంది. ఉమ్మడి హైకోర్టు విభజన అనంతరం జనవరి 4న రాష్ట్ర హైకోర్టుకు కేటాయించిన సిబ్బందిని విజయవాడకు బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో సిబ్బందికి వసతి సౌకర్యం కల్పించాలన్న హైకోర్టు రిజిస్ట్రార్ ప్రతిపాదనకు సర్కార్ ఆమోదముద్ర వేసింది.

అంతర్రాష్ట్ర బదిలీల గడువు పొడిగింపు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల అంతర్రాష్ట్ర బదిలీల గడువును మరో ఆరునెలలు పొడిగిస్తూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు గురువారం ఆదేశాలు జారీ చేశాయి. జూన్ నెలాఖరు వరకు ఈ గడువు పొడిగిస్తున్నట్టు పేర్కొన్నాయి. అయితే అంతర్రాష్ట్ర బదిలీల కోసం ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే ఈ గడువు పొడిగింపు వర్తిస్తుంది. వచ్చిన దరఖాస్తుల మేరకు జూన్ ఆఖరుకు బదిలీల ప్రక్రియను పూర్తి చేయాలని ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీనిపై ఉద్యోగులు, ఉపాధ్యాయులు విస్తుపోతున్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారినే బదిలీలు చేసేందుకు గడువు పొడిగించడమేంటని వారు విమర్శిస్తున్నారు. సవరించిన నిబంధనల మేరకు కొత్త వారికి కూడా బదిలీల్లో అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

30 నుంచి అసెంబ్లీ సమావేశాలు

- ఫిబ్రవరి 5న బడ్జెట్
- పూర్తి స్థాయి ఓటాన్ అకౌంట్ బడ్జెట్ పేరుతో రెండు లక్షల కోట్లకు పైగా అంచనాలు

సాక్షి, అమరావతి: సాధారణ ఎన్నికలకు ముందు చివరి అసెంబ్లీ సమావేశాలు 30వ తేదీ ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతాయని రాష్ట్ర గవర్నర్ నర్సింహన్ గురువారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ సమావేశాల్లోనే రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయి ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. ఫిబ్రవరి 5వ తేదీన పూర్తి స్థాయి ఓటాన్ బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్నారు. ఈ సమావేశాలు వారం రోజుల పాటు నిర్వహించనున్నారు. ఎన్నికల ముందు ప్రజలను మభ్యపెట్టే ఎత్తుగడలో భాగంగా పూర్తి స్థాయి ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను రూ.రెండు లక్షల కోట్లకు పైగా అంచనాలతో రూపొందించనున్నారు. పలు రంగాలకు రూ.వేల కోట్లు కేటాయించినట్లు ప్రచారం చేసుకోవడమే ధ్యేయంగా బడ్జెట్ రూపకల్పన చేస్తున్నారు. అయితే పూర్తిస్థాయి బడ్జెట్‌లోనే ఏప్రిల్, మే నెలలకు ఓటాన్ బడ్జెట్‌కూ అసెంబ్లీ ఆమోదం తీసుకోనున్నారు. ఇందుకు సంబంధించి ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు శుక్రవారం ఆర్థిక శాఖ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఎన్నికల ముందు ఆయా రంగాలకు భారీ మొత్తంలో కేటాయించామనే ప్రచారం చేసుకునే విధంగా బడ్జెట్ రూపకల్పన చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

మమత ర్యాలీలో పాల్గొంటా: శతృఘ్న సిన్హా

కోల్‌కతా: తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత్రి, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ శనివారం కోల్‌కతాలో నిర్వహించనున్న మెగా ర్యాలీలో పాల్గొననున్నట్లు నటుడు, బీజేపీ ఎంపీ శతృఘ్న సిన్హా తెలిపారు. బీజేపీలో తనకు గౌరవం దక్కడం లేదన్న ఆయన, 'రాష్ట్ర మంచ్' సంస్థ తరఫున ఆ ర్యాలీకి హాజరవుతానన్నారు. కొందరు బీజేపీ నేతలు ఆర్ఎస్ఎస్ సమావేశాలకు హాజరవుతుండగా లేనిది తాను టీఎంసీ ర్యాలీకి వెళ్ల కూడదా అంటూ సిన్హా సమర్థించుకున్నారు. బీజేపీ పట్ల తన నిబద్ధతను ఎవరూ ప్రశ్నించలేరన్నారు. మమతా బెనర్జీని కీలక జాతీయ స్థాయి నేతగా ఆయన పేర్కొన్నారు. వివిధ పార్టీలకు చెందిన నేతలు హెచ్‌డీ దేవెగౌడ, మల్లికార్జున ఖర్గే, కేజ్రీవాల్, అఖిలేశ్ యాదవ్, తేజస్వీ యాదవ్ తదితరులు పాల్గొంటున్న ఆ ర్యాలీలో శతృఘ్న సిన్హా 'స్టార్ స్పీకర్'గా మారనున్నట్లు సమాచారం. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకున్న పలు నిర్ణయాలను బాహాటంగానే గత కొంతకాలంగా తప్పుబడుతున్న శతృఘ్న సిన్హా బీజేపీకి చెందిన మరో సీనియర్ నేత యశ్వంత్ సిన్హా ఏర్పాటు చేసిన 'రాష్ట్ర మంచ్'లో చేరారు. దీంతో ప్రభుత్వం ఆయనకు సెక్యూరిటీ సహా పలు సౌకర్యాలను ఉపసంహరించింది.



మనల్ని వద్దని.. వాళ్లతో కలిస్తే కోపం రాదా..!

మూడు ధర్మాసనాలు.. ఏడుగురు సింగిల్ జడ్జిలు

- హైకోర్టులో ధర్మాసనాలు, జడ్జిల సబ్జెక్టుల మార్పు
- పాలనాపరమైన నిర్ణయం తీసుకున్న ఏసీజే
- ఈ నెల 21 నుంచి అమల్లోకి

సాక్షి, హైదరాబాద్: కేసుల విచారణ సాఫీగా, వేగవంతంగా సాగేందుకు వీలుగా హైకోర్టులో ధర్మాసనాలను, ఆయా న్యాయమూర్తులు విచారించే సబ్జెక్టులను మారుస్తూ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ చాగరి ప్రవీణ్‌కుమార్ పాలనాపరమైన నిర్ణయం తీసుకున్నారు. మొన్నటి వరకు నాలుగు ధర్మాసనాలుండగా.. వాటిని మూడుకు కుదించారు. మొదటి ధర్మాసనానికి ఏసీజే జస్టిస్ ప్రవీణ్‌కుమార్, న్యాయమూర్తి జస్టిస్ మల్లవోలు సత్యనారాయణమూర్తి నేతృత్వం వహిస్తారు. రెండో ధర్మాసనం.. న్యాయమూర్తులు జస్టిస్ ఎస్‌వీ భట్, జస్టిస్ మంతోజ్ గంగారావు నేతృత్వంలో పనిచేస్తుంది. మూడో ధర్మాసనానికి న్యాయమూర్తులు జస్టిస్ ఆకుల వెంకటశేషసాయి, జస్టిస్ జవలాకర్ ఉమాదేవి నేతృత్వం వహిస్తారు. మిగిలిన న్యాయమూర్తులు సింగిల్ జడ్జిలుగా వ్యవహరిస్తారు. ఏసీజే నేతృత్వంలోని ధర్మాసనం.. చట్టాలను, చట్ట నిబంధనలను సవాలు చేస్తూ దాఖలయ్యే వ్యాజ్యాలను విచారిస్తుంది. అలాగే ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు, హెబియస్ కార్పస్ పిటిషన్లు, పర్యావరణం, కాలుష్యం సంబంధిత వ్యాజ్యాలతో పాటు క్రిమినల్ అప్పీళ్లను, ఉరిశిక్ష ఖరారు వ్యాజ్యాలపై విచారణ జరుపుతుంది. ఇక ఎస్‌వీ భట్ నేతృత్వంలోని ధర్మాసనం.. ఐటీ ట్రిబ్యునల్ అప్పీళ్లు, ఐటీ కేసులు, సెంట్రల్ ఎక్సైజ్ కేసులు, ఏపీ పునర్విభజన చట్ట నిబంధనలను, జీఎస్‌టీ, డీఆర్‌టీ తదితర చట్టాలను సవాలు



చేస్తూ దాఖలయ్యే కేసులను విచారిస్తుంది. జస్టిస్ శేషసాయి నేతృత్వంలోని ధర్మాసనం.. ఉద్యోగుల సర్వీసు వివాదాలకు సంబంధించిన అప్పీళ్లు, సర్వీసు చట్ట నిబంధనలను సవాలు చేస్తూ దాఖలయ్యే వ్యాజ్యాలపై విచారణ జరుపుతుంది.

ఏ ఏ కేసులు.. ఎవరు విచారిస్తారంటే..

ఇక సింగిల్ జడ్జిలుగా జస్టిస్ మంథాట సీతారామమూర్తి.. పురపాలక, రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్, సమాచార హక్కు చట్టం తదితర విషయాలకు సంబంధించిన కేసులపై విచారణ జరుపుతారు. జస్టిస్ ఉమ్మాక దుర్గాప్రసాద్‌రావు.. పంచాయతీ రాజ్, భూసేకరణ, పౌర సరఫరాలు, వ్యవసాయం, నీటి పారుదలశాఖ తదితర విషయాలకు సంబంధించిన కేసులను విచారిస్తారు. అలాగే కంపెనీ పిటిషన్లు, కంపెనీల అప్పీళ్లపై కూడా విచారణ జరుపుతారు. జస్టిస్ తాళ్లూరు సునీల్‌చౌదరి.. 2009 నుంచి దాఖలైన క్రిమినల్ అప్పీళ్లు, క్రిమినల్ రివిజన్ పిటిషన్లు (ఏసీబీ, సీబీఐతో సహా) విచారిస్తారు. జస్టిస్ గుడిసేవ శ్యాంప్రసాద్.. విద్యా, యూనివర్సిటీలు, కేంద్ర ప్రభుత్వ సంస్థలు, సాంఘిక, మైనారిటీ, బీసీ సంక్షేమ శాఖలు, వైద్య, ఆరోగ్యం తదితర విషయాలకు సంబంధించిన కేసులను విచారిస్తారు. జస్టిస్ తేలప్రోలు రజనీ.. బెయిల్, క్రిమినల్ పిటిషన్లతో పాటు 2008 వరకు దాఖలైన క్రిమినల్ అప్పీళ్లు, క్రిమినల్ రివిజన్ పిటిషన్లపై (ఏసీబీ, సీబీఐ సహా) విచారణ జరుపుతారు. జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు.. సివిల్ రివిజన్ పిటిషన్లు, సెంకడ్ అప్పీళ్లు తదితరాలను విచారిస్తారు. జస్టిస్ కొంగర విజయలక్ష్మి.. హోం, గనులు, పరిశ్రమలు, రవాణా, దేవాదాయ, ఎక్సైజ్, జీఏడీ తదితర విషయాలకు సంబంధించిన కేసులను విచారిస్తారు. ఈ ఏర్పాట్లు ఈ నెల 21వ తేదీ నుంచి తదుపరి మార్పులు చేసేంత వరకు అమల్లో ఉంటాయి. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఏర్పాటయ్యే నాటికి 14 మంది న్యాయమూర్తులుండగా.. ఈ నెల 14న జస్టిస్ బాలయోగి పదవీవిరమణ చేయడంతో న్యాయమూర్తుల సంఖ్య 13కి చేరింది. రాష్ట్ర హైకోర్టులో దాదాపు 1.90 లక్షల వరకు పెండింగ్ కేసులుండే అవకాశం ఉంది. ఇంత తక్కువ మంది న్యాయమూర్తులు ఈ స్థాయి కేసులను విచారించడం చాలా కష్టం. న్యాయమూర్తుల పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోకుంటే ప్రస్తుత ఉన్న 13 మంది న్యాయమూర్తులు తీవ్రమైన పని ఒత్తిడిని ఎదుర్కోవడం ఖాయంగా కనిపిస్తోంది.

పతనం అంచున గగ్గోలు!

▶ మొదటి పేజీ తరువాయి

ఆమోదయోగ్యమే కాక పూర్తి మద్దతు నిస్తామని చొరవతో టీఆర్ఎస్ ముందుకు వచ్చింది. మన రాష్ట్రంలోని 25 మంది ఎంపీలకు తోడుగా మరో 17 మంది ఎంపీలు హోదాకు మద్దతు నివ్వాలని ఇంత పారదర్శకంగా ఇరు వర్గాలూ ముందుకొచ్చినా ఏదో జరిగి పోయిందన్నట్లుగా టీడీపీ వర్గాలు, తందానా అన్నట్లుగా ఓ వర్గం (ఎల్లో) మీడియా రాష్ట్రానికి ద్రోహమే జరిగి పోయిందని ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందని వైఎస్సార్ కాంగ్రెస్ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.

అవకాశవాద రాజకీయం బాబు నైజం..

తెలంగాణలో అధికారంలో ఉన్న టీఆర్ఎస్‌కు ఆంధ్రప్రదేశ్‌లో ఎలాంటి బలమూ లేదు. పొత్తుపెట్టుకుని పోరాడాలన్న ఆసక్తీ లేదు. అయినా కూడా 'పొత్తు' పొడిచిందని, ఏపీకి ద్రోహం జరిగిందని, 'ముసుగులో గుద్దులాట' అనే పతాక శీర్షికలతో ఎల్లో మీడియా విషం చిమ్మడం ఏ తరహా పత్రికా విలువలో అర్థం కావడం లేదనే వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. అవకాశవాద రాజకీయాలకు పెట్టింది పేరు చంద్రబాబు. రాష్ట్రాన్ని విడగొట్టిన పార్టీతో ఆయన పొత్తుపెట్టుకుంటారు.. ప్రత్యేక హోదాను విభజన చట్టంలో పెట్టకుండా మోసం చేసినా ఆ పార్టీతో పొత్తుపెట్టుకుంటారు.. అసలు తెలంగాణ ఎన్నికల్లో టీఆర్ఎస్‌తో పొత్తు కోసం చంద్రబాబు తీవ్రంగా ప్రయత్నించారు. పొత్తు కుదుర్చుకుందామని కేటీఆర్ వద్ద చంద్రబాబు ప్రస్తావించారు. హరికృష్ణ మృతి చెందినపుడు ఆయన భౌతికకాయం సాక్షిగా ఆయన ఈ ప్రతిపాదన చేశారు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా బయటపెట్టారు. ఇదే అంశాన్ని కేటీఆర్ కూడా ధృవీకరించారు. తాము నో అన్నామని ఆయన చెప్పారు... టీఆర్ఎస్‌తో పొత్తుకు ప్రయత్నించానని, వారు కలిసి రాక పోవడంతో కాంగ్రెస్‌తో పొత్తు కుదుర్చుకున్నామని టీడీపీ నేతల సమావేశంలో చంద్రబాబే చెప్పారు. చంద్రబాబు తానే స్వయంగా ఒప్పుకున్న అంశం ఎంత మాత్రం ఎల్లో మీడియాకు తప్పుగా అనిపించలేదు. అలాగే ఏపీ ప్రజలకు ద్రోహం చేయడానికి చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని ఈ మీడియా భావించ లేదు కూడా. ఒకవేళ ఆరోజు పొత్తుకు టీఆర్ఎస్ ఒప్పుకుని ఉంటే రాష్ట్రప్రయోజనాల కోసం ఈ పొత్తు పెట్టుకున్నానని చంద్రబాబు తన వందిమాగధులతో ప్రచారం చేయించేవారు. ఆయన కనుసన్నల్లోని ఎల్లో మీడియా ఆ విషయాన్ని బాకాలూది ప్రచారం చేసేది. చంద్రబాబు ఏం చేసినా మంచిదేనన్నట్లుగా ఈ ప్రచారం సాగుతోంది. చంద్రబాబు మోసపూరిత వైఖరి, దిగజారుడు రాజకీయాల నైజం తెలిసే ఆనాడు కేసీఆర్ పొత్తుకు నో చెప్పారు. కేసీఆర్ నో చెప్పిన విషయాన్ని స్వయంగా మీడియా సమావేశంలోనూ, అసెంబ్లీలోనూ, తెలంగాణ ఎన్నికల ప్రచారం సందర్భంగానూ చంద్రబాబు చెప్పుకున్నారు కూడా. పొత్తుపెట్టుకోవడానికి తాను ప్రయత్నించానని చంద్రబాబు చెప్పారు.. అదే విషయాన్ని కేటీఆర్ కూడా చెప్పారు. చంద్రబాబు ప్రయత్నించారని, తాము నో అన్నామని కేటీఆర్ చెప్పారు. మరి జగన్ విషయంలో జరిగిందేమిటి? జగన్ అపాయింట్‌మెంట్ కోరి.. జగన్ నివాసానికి వచ్చి ఆయనతో మాట్లాడడానికి టీఆర్ఎస్ నాయకులు ఉత్సాహం చూపించారు. అదీ ఆయన విశ్వసనీయత. చంద్రబాబు విశ్వసనీయత లేని వ్యక్తి. మోసం, అబద్ధాలు ఆయన ట్రేడ్ మార్క్ కాబట్టే ఆయనతో పొత్తుకు నో చెప్పారు. జగన్ విశ్వసనీయత గలిగిన వ్యక్తి కాబట్టే ఆయనతో భేటీ అయ్యారు. అసలు టీఆర్ఎస్‌కు ఏపీలో ఏ మాత్రం బలం లేదు. ఏపీలో ఏ పార్టీతోనూ పొత్తులుండవని జగన్‌మోహన్‌రెడ్డి విస్పష్టంగా ప్రకటించారు కూడా.

అధికారం కోసం అన్ని అడ్డదారులా బాబూ..?

ప్రత్యేక హోదా కోసం మొదటి నుంచి పోరాడుతున్నది జగన్‌మోహన్ రెడ్డి మాత్రమే. ప్రత్యేక హోదాకు ఎవరు మద్దతిచ్చినా స్వాగతిస్తామని ఆయన ప్రకటించారు. ప్రత్యేక హోదా ఇచ్చే పార్టీకే మద్దతిస్తామని కూడా జగన్ చెబుతున్నారు. తాము ప్రత్యేక హోదాకు మద్దతిస్తామని పొరుగు రాష్ట్రం ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. రాష్ట్ర ప్రయోజనాలను కాంక్షించేవారైతే దీనిని స్వాగతించాలి కదా? మరి అలా చేయకుండా ఎల్లో మీడియాలో ఈ దిక్కుమాలిన ప్రచారం ఏమిటి? ఇదే చంద్రబాబు నైజం. నాలుగునెలల క్రితం తెలంగాణ ఎన్నికల్లో లబ్ధి కోసం తెలుగువారి ప్రయోజనాల పేరుతో టీఆర్ఎస్‌తో పొత్తుకు ప్రయత్నించారు. అది జరగకపోయేసరికి కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్నారు. అసలు తెలుగుదేశం పార్టీ పుట్టిందే కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా అన్న విషయాన్ని గాలికొదిలేశారు. తెలుగువారి ఆత్మగౌరవాన్ని మంటగలిపారు. రాష్ట్రాన్ని అడ్డగోలుగా విభజించిన పార్టీ కాంగ్రెస్ అని అంతకుముందు విమర్శించారు. సోనియాను ఇటలీ దయ్యం అని, కాంగ్రెస్‌కు పాతరేద్దాం అని తిట్టిపోశారు. రాహుల్ గాంధీ ఏ ముఖం పెట్టుకుని ఏపీకి వస్తారని నిలదీశారు. ఆ తర్వాత తెలంగాణ ఎన్నికల్లో అదే పార్టీతో పొత్తుపెట్టుకున్నారు. ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచి ఆయన నుంచి పార్టీని, ముఖ్యమంత్రి పీఠాన్ని లాక్కున్న చంద్రబాబు ఎన్నికల సమయంలో అదే ఎన్టీఆర్ ఫొటోకు దండలేస్తారు. ఆయన పేరుతో ఓట్లగుతారు. ప్రత్యేక హోదా విషయంలోనూ అంతే.. ఎన్నికలకు ముందు హోదా సంజీవని అని చంద్రబాబు అన్నారు. పదేళ్లు సరిపోదు.. పదిహేనేళ్లు ఇవ్వాలి అని అన్నారు. ఎన్నికలు ముగిశాక హోదా ఏమైనా సంజీవనా అని ఎద్దేవా చేశారు. హోదా అంటే జైలుకే అనడమే కాక పీడీ యాక్టుతోనూ బెదిరించారు. హోదా కన్నా ప్యాకేజీయే మేలని అన్నారు. అందరికన్నా మనమే ఎక్కువ సాధించాం అని ప్రకటించారు. ప్రజలంతా ప్రత్యేక హోదా కోసం పోరాడుతుండడంతో మరలా ప్లేటు ఫిరాయించి ఎన్నికలకు ఆరునెలల ముందు ప్రత్యేక హోదా పల్లవి అందుకున్నారు. నాలుగున్నరేళ్లు బీజేపీతో అంటకాగి కేంద్రంలో పదవులు అనుభవించిన చంద్రబాబు ఇపుడు కేంద్రానికి వ్యతిరేకంగా ధర్మపోరాటదీక్షలు చేస్తున్నారు. అధికారం కోసం ఎన్ని అడ్డదారులైనా తొక్కడం చంద్రబాబు నైజం అని విమర్శకులంటున్నారు.





టీఆర్ఎస్‌తో పొత్తుకు ప్రయత్నించినట్టు చంద్రబాబు ప్రకటించిన వార్తల క్లిప్పింగులు

స్వాగతించాల్సింది పోయి బురదజల్లుతారా..

ఫెడరల్ ఫ్రంట్ అనేది రాష్ట్రాలకు జరిగే అన్యాయంపై కలసికట్టుగా పోరాడాలనుకునే వివిధ ప్రాంతీయ పార్టీలన్నీ ఒక వేదిక పైకి వచ్చే అవగాహనా కార్యక్రమం. రాష్ట్రాలకు కేంద్రం అన్యాయం చేస్తున్నపుడు దానిని అడ్డుకోవడమే ఆ అవగాహన. ఏ రాష్ట్రానికి అన్యాయం జరిగినా ఈ పార్టీలు పోరాడతాయి. రేపు అందులోకి అఖిలేష్ రావచ్చు. మాయావతి రావచ్చు. స్టాలిన్ కూడా రావచ్చు. రాష్ట్ర ప్రయోజనాలు కాంక్షించే వారెవరైనా ఇందులో భాగస్వాములు కావచ్చు. అసలు ఇలాంటి అన్యాయాన్ని మనం స్వయంగా అనుభవించాం. పార్లమెంటు సాక్షిగా నాటి ప్రధాని ఇచ్చిన ప్రత్యేక హోదా హామీని కేంద్ర ప్రభుత్వం అమలు చేయలేదు. పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన హామీకే దిక్కులేదు. మన రాష్ట్రానికి జరిగిన ఈ అన్యాయాన్ని మనం కళ్లారా చూశాం. అలాంటి నేపథ్యంలో కేంద్రం అన్యాయం చేసినపుడు రాష్ట్రాలు సమైక్యంగా పోరాడాలి అనే భావనకు ఏ పార్టీ అయినా మద్దతు తెలపవచ్చు. మన రాష్ట్ర ప్రయోజనాలు కాపాడతామని ఎవరైనా ముందుకొస్తే స్వాగతించడంలో తప్పేముంది? మన 25 మంది ఎంపీలకు తోడు మరో 17 మంది ఎంపీలను మద్దతుగా ఇస్తామంటే వద్దనాల్సిన పనేముంది? 42 మంది ఒకే వేదికపైకి వచ్చి మన రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడతామంటే వద్దనాల్సిన అవసరమేముంది? అంటే అసలు మీకు ప్రత్యేక హోదా సాధించే ఉద్దేశం లేదా? ముందుండి పోరాడాల్సిన చంద్రబాబు ఐదేళ్లు మోసం చేశారు.. మన పోరాటానికి మద్దతిస్తామంటే దానిని కూడా స్వాగతించకపోవడం దుర్మార్గం కాదా? ప్రతిపక్షనేత జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లుగా పోరాడుతున్నారు. ఆ సందర్భంగా హోదా ఎవరు ఇస్తే వారికే మా మద్దతు అని పలు సందర్భాలలో ప్రకటించడమే కాకుండా హోదా కోసం ఎవరితోనైనా కలవడానికి సిద్ధమని పలు సందర్భాలలో ప్రకటించారు కూడా. అందుకే హోదా విషయంలో కేసీఆర్ ప్రకటనను ఆయన స్వాగతించారు.

రాయితీ పక్కదారి

సాక్షి, అమరావతి: కోళ్లు, చిన్నజీవాల పెంపకందారుల వడ్డీ రాయితీ పక్కదారిపడుతోంది. పశు సంవర్ధకశాఖ అధికారులు, బహుళ జాతి సంస్థల ప్రతినిధులు గ్రామాల వారీగా ఏజెంట్లను నియమించి పెంపకందారుల నుంచి వడ్డీ రాయితీని వసూలు చేసుకుంటున్నారు. ప్రభుత్వం రైతులకు చెల్లించే వడ్డీ రాయితీలో 10 నుంచి 20 శాతం వరకు కమీషన్లుగా తీసుకుంటున్నారు. బహుళజాతి సంస్థలు సరఫరా చేసే వాక్సిన్‌లు, ఇతర మందులపై పెంపకందారులు ఆధారపడి ఉండటంతో వారెంత కమీషన్లు వసూలు చేస్తున్నా మిన్నకుండిపోతున్నారు. కోడి పిల్లల కొనుగోలు మొదలు మందులు, మాంసం కొనుగోళ్ల అమ్మకాల వరకు అంతా బహుళ జాతి సంస్థలపైనే రైతులు ఆధారపడుతుండడంతో వారు చెప్పినట్లు చేయాల్సి వస్తోంది. పశు సంవర్ధకశాఖ వైద్యులు సైతం ఈ సంస్థలు ఇచ్చే వ్యాపారం, కమీషన్లపైనే మక్కువ చూపుతున్నారు. . సాలీనా రూ.100 కోట్ల విలువైన వాక్సిన్‌లను బహుళ జాతి సంస్థలు పెంపకందారులకు సరఫరా చేస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.15 కోట్ల విలువైన వాక్సిన్‌లు ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలు చేస్తున్నాయి. ఈనేపథ్యంలో వాణిజ్య బ్యాంకులు, జాతీయ సహకార అభివృద్ధి కార్పొరేషన్‌లు పెంపకందారులకు రుణాలు మంజూరు చేస్తున్నాయి. పెంపకందారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తున్న వడ్డీ రాయితీని బహుళ జాతి సంస్థల ప్రతినిధులు, పశు సంవర్ధకశాఖ వైద్యులు కమీషన్ల రూపంలో వసూలు చేస్తున్నారు. 2015–19 వరకు జాతీయ సహకార అభివృద్ధి సంస్థ పెంపకందారులకు రూ.275 కోట్ల రుణాలను మంజూరు చేసింది. వాణిజ్య బ్యాంకులు సాలీనా పెంపకందారులకు రూ.5000 కోట్ల వరకు రుణాలు ఇస్తున్నాయి. వీటిపై ప్రభుత్వం చెల్లించే వడ్డీ రాయితీలో 10 నుంచి 20 శాతం వరకు బహుళ జాతి సంస్థల ప్రతినిధులు, పశువైద్యశాఖ వైద్యులు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే వడ్డీ రాయితీలో 10 నుంచి 20 శాతం కమీషన్లు వసూలు చేయగా, వాణిజ్య బ్యాంకులు ఇచ్చే రుణాలపై వడ్డీ రాయితీని గుట్టుచప్పుడు కాకుండా వసూలు చేస్తున్నారు.

అందని రుణాలు, లభించని వడ్డీ రాయితీ

ప్రభుత్వం చెల్లించే వడ్డీ రాయితీ కేవలం పెద్ద రైతులు, పెంపకందారులకు లభిస్తోంది. కొంత మంది పెంపకందారులు రూ.100 నుంచి రూ.150 కోట్ల వరకు వ్యక్తిగతంగా రుణాలు తీసుకుంటున్నారు. వారు తీసుకున్న రుణానికి చెల్లించిన వడ్డీపై రాయితీని ఆ పెద్ద రైతులు, పెంపకందారులే పొందుతున్నారేకాని చిన్నరైతులు, చిన్నపాటి పెంపకందారులకు లభించడంలేదు. బ్యాంకర్లు కూడా పెద్ద రైతులకే రుణాలు ఇస్తుండటంతో వారికే వడ్డీ రాయితీ లభిస్తోంది. ప్రభుత్వం చెల్లించాల్సిన వడ్డీ రాయితీపై ఈ కమీషన్ల బెడద లేకుండా చూడాలని పెంపకందారులు కోరుతున్నారు.

చంద్రబాబుది నాలుకా? తాటిమట్టా?

- వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత బొత్స ధ్వజం
- తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్‌తో పొత్తుకు బాబు పాకులాడలేదా?
- రాష్ట్ర హక్కులు, కేసీఆర్ తిట్లు, శాపనార్థాలు అప్పుడు గుర్తుకురాలేదా?
- ఏపీలో టీఆర్ఎస్‌తో వైఎస్సార్‌సీపీ పొత్తు పెట్టుకుంటోందని తప్పుడు ప్రచారం
- రాష్ట్రంలో లేని పార్టీతో పొత్తెలా సాధ్యం బాబూ?
- వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఒంటరిగానే పోటీ చేస్తుంది
- చంద్రబాబుకు రాజకీయ ప్రయోజనాలే కావాలి.. మాకు రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం
- ప్రత్యేక హోదా కోసం మద్దతు కూడగడుతుంటే కడుపు మంట ఎందుకు?
- ఎల్లో మీడియా తప్పుడు భాష్యాలు, వ్యాఖ్యానాలతో వార్తలను వండివార్చింది
- రాష్ట్ర భవిష్యత్తు కోసం శ్రమిస్తున్న వైఎస్సార్‌సీపీపై నిందలా?

సాక్షి, హైదరాబాద్: బావమరిది హరికృష్ణ భౌతికకాయాన్ని పక్కన పెట్టుకుని టీఆర్ఎస్ పొత్తుకు ప్రయత్నించినప్పుడు రాష్ట్ర హక్కులు, కేసీఆర్ తిట్లు, శాపనార్థాలు సీఎం చంద్రబాబుకు గుర్తుకు రాలేదా? అని వైఎస్సార్‌సీపీ పార్టీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ నిలదీశారు. తెలంగాణ ఎన్నికల్లో టీఆర్ఎస్ జతకట్టేందుకు ప్రయత్నించి భంగపడ్డ చంద్రబాబు ఇప్పుడు అదే పార్టీతో ఏపీలో వైఎస్సార్‌సీపీ పొత్తు పెట్టుకుంటోందని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. బాబుది నాలుకా? తాటిమట్టా? అని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ స్వతంత్రంగానే అన్ని సీట్లకు పోటీ చేస్తుందని, ఏ పార్టీతోనూ పొత్తులుండబోవని స్పష్టం చేశారు. బొత్స గురువారం హైదరాబాద్ లోటస్‌పాండ్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. చంద్రబాబుకు రాజకీయ ప్రయోజనాలే తప్ప రాష్ట్ర ప్రయోజనాలపై ఆసక్తి లేదని ధ్వజమెత్తారు. ఏపీలో లేని పార్టీలతో పొత్తులు, పొడుపులు ఏమిటని ఎల్లో మీడియాను ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు కోసం శ్రమిస్తున్న వైఎస్సార్‌సీపీపై నిందలు వేయడం దారుణమని మండిపడ్డారు. బొత్స సత్యనారాయణ ఇంకా ఏం మాట్లాడారంటే... ''టీఆర్ఎస్ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి మాట్లాడిన సంగతి అందరికీ తెలుసు. రాష్ట్రాలకు జరుగుతున్న అన్యాయాలను ఎదిరించేందుకు, రాష్ట్రాలు తమ అధికారాలను కాపాడుకునేలా కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు గల అవకాశాల గురించి కేటీఆర్ బృందం జగన్‌తో చర్చించింది. ఈ సమావేశం తర్వాత ఇరు పార్టీల అధ్యక్షులు మీడియాతో మాట్లాడారు. సమావేశం ఉద్దేశాలను వివరించారు. ఏపీకి ప్రత్యేక హోదా కోసం తెలుగు రాష్ట్రాల ఎంపీలంతా ఒక్కతాటిపై ఉండి ఉమ్మడిగా పోరాడితే హక్కులను సాధించుకోవచ్చని, దీనివల్ల ఏపీకి మేలు జరుగుతుందని జగన్ చెప్పారు. ఇందులో తప్పేంటి? దీనిపై ఎల్లో మీడియా తప్పుడు భాష్యాలు, వ్యాఖ్యానాలు చేస్తూ వార్తలను వండివార్చింది. పొడిచిన పొత్తు.. ముసుగు తీసేస్తే అంటూ పెద్దపెద్ద అక్షరాలతో శీర్షికలు పెట్టి నానా యాగీ చేసింది. అర్థంపర్థం లేని వ్యాఖ్యానాలు చేసి ప్రజల్లో అపోహలు సృష్టించేందుకు యత్నించడం దురదృష్టకరం.



ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నారు

రాష్ట్ర ప్రజలను తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టిన కేసీఆర్‌తో వైఎస్సార్‌సీపీ ఎలా చర్చలు జరుపుతోందని, విభజన చట్టంలోని 10, 11, 13 షెడ్యూళ్లలో పేర్కొన్న విధంగా ఏపీకి ఒనగూడాల్సిన ప్రయోజనాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న టీఆర్ఎస్‌తో ఎలా మంతనాలు నడుపుతారని, అక్రమంగా ప్రాజెక్టులు కడుతున్నారని విమర్శలు చేస్తున్న వారితోనా మీ సఖ్యత అని, పోలవరం ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్న పార్టీతో ఎలా కలుస్తారని టీడీపీ నేతలు ప్రశ్నిస్తున్నారు. ఈ నాలుగు అంశాలను లేవదీయడం ద్వారా ప్రజల్లో అపోహలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఎల్లో మీడియా సహాయ సహకారాలు, సోషల్ మీడియా అండతో వైఎస్సార్‌సీపీపై బురద జల్లే ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. రాష్ట్రాల అధికారాలను పరిరక్షించుకునేందుకు, రాష్ట్రాల హక్కుల సాధన కోసం ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు చేయాలన్న ప్రయత్నంలో భాగంగా కేసీఆర్ వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు మమతా బెనర్జీ, నవీన పట్నాయక్, కుమారస్వామితోపాటు సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేష్ యాదవ్‌ను కలిసి ప్రాథమికంగా చర్చలు జరిపారు. ఇందులో భాగంగానే కేటీఆర్ వైఎస్ జగన్‌ను కలిసి మాట్లాడారు.

టీఆర్ఎస్ సహకారం తీసుకుంటే తప్పా?

ఇటీవలి తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో టీఆర్ఎస్‌తో పొత్తు కోసం చంద్రబాబు ఎందుకు ప్రయత్నించారు? తెలంగాణ ఎన్నికలకు ముందు చంద్రబాబు ఏం మాట్లాడారు? రాజకీయ ప్రయోజనాల కోసమే టీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకోవాలనుకుంటున్నాం అని చంద్రబాబు అన్నారు. టీఆర్ఎస్‌తో పొత్తుకు ప్రయత్నించానని, ఇందులో రహస్యం ఏముందని, తెలంగాణలో టీఆర్ఎస్, టీడీపీ కలిసి పోటీ చేస్తే ఎక్కువ సీట్లు వస్తాయని, తెలుగు రాష్ట్రాలకు మేలు జరిగేందుకు టీఆర్ఎస్–టీడీపీ కలయిక దోహదపడుతుందని ఎన్నికలకు ముందు చంద్రబాబు మాట్లాడారు. ఇవే వ్యాఖ్యలను ఏపీ అసెంబ్లీలోనూ చేశారు. దీన్నిబట్టి టీఆర్ఎస్‌తో పొత్తుకు తహతహలాడిందెవరు? చంద్రబాబే కదా. ఏపీకి ప్రత్యేక హోదా వచ్చేందుకు తమ వంతు సాయాన్ని అందిస్తామని టీఆర్ఎస్ ముందుకొస్తే వారి సహకారాన్ని తీసుకుంటే తప్పు ఎలా అవుతుంది? ఏపీ ప్రయోజనాల కోసం ప్రయత్నిస్తే దోషం ఎలా అవుతుంది? ఏపీకి ప్రత్యేక హోదా కోసం ఇతర రాష్ట్రాల మద్దతు కూడగడుతుంటే టీడీపీకి ఎందుకు కడుపు మంట? ఇందులో ముసుగేసుకున్నదెవరు? మీరా? మేమా? పారదర్శకంగా ఉన్న మమ్మల్ని ముసుగు తీసేయాలంటారా? ముసుగు వేసుకున్నది ఎవరు? ఇంతకాలం ముసుగు రాజకీయాలు చేస్తోంది ఎవరు? రాజకీయ లబ్ధి, స్వార్థ ప్రయోజనాల కోసం బీజేపీతో నాలుగేళ్లు సంసారం చేసిందెవరు? పదేళ్లపాటు హైదరాబాద్‌లో ఉండేందుకు అవకాశం ఉన్నా ఓటుకు కోట్లు కేసులో భయపడి అమరావతికి వచ్చింది చంద్రబాబు కాదా? అలాంటి పెద్దమనిషి ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని వైఎస్సార్‌సీపీపై, జగన్‌పై విమర్శలు చేస్తారు? తెలంగాణ ప్రాంతంలో అక్రమ ప్రాజెక్టులు కడుతుంటే ఇంతకాలం చంద్రబాబు నోరెందుకు మెదపలేదు? పోనీ మీడియా సమావేశంలో నిరసనైనా తెలిపారా?

> **టీఆర్ఎస్‌తో కలుద్దామని బాబే చెప్పారు**
>
> తెలంగాణ ఎన్నికలకు ముందు.. నందమూరి హరికృష్ణ శవాన్ని ముంగిట పెట్టుకుని చంద్రబాబు టీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకోవాలనే ఉద్దేశంతో కేటీఆర్‌తో మంతనాలు జరిపారు. కాదని చెప్పగలరా? టీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకునేందుకు ఎవరు ప్రయత్నించారు? టీఆర్ఎస్‌తో కలుద్దామని చంద్రబాబే స్వయంగా టీడీపీ కార్యకర్తల సమావేశంలో చెప్పారు. అసూయాపరులు ఏకమయ్యారన్న చంద్రబాబు విమర్శలో ఏమైనా అర్థం ఉందా? మాకు దేనికుండాలి అసూయ? ఇల్లు బాగుంటే ఊరు బాగుంటుంది. ఊరు బాగుంటే రాష్ట్రం బాగుంటుంది. తద్వారా ప్రజలు బాగుంటారు. జీవితాంతం తానే ముఖ్యమంత్రిగా ఉండాలని చంద్రబాబులాగా ఆలోచించడం మంచిది కాదు'' అని బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీని విమర్శించే అధికారం మీకు లేదు

అవినీతి, అక్రమాల్లో కూరుకుపోయిన టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీపై మోపుతున్న నిందల్ని, చేస్తున్న వక్ర భాష్యాలను ఖండిస్తున్నాం. ఏపీకి ప్రత్యేక హోదా సాధించాలన్నదే మా ధ్యేయం. ఏపీ అభివృద్ధే లక్ష్యంగా, తెలుగు ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నాం. ఎల్లో మీడియాలో కొన్ని వార్తలను చూసి నవ్వాలో ఏడవాలో అర్థం కావడం లేదు. ఒక పత్రికలో చంద్రబాబు, ఆయన సతీమణి అన్యోన్యంగా ఉన్న ఫోటో వేసి.. దానిపైన గుద్దులాట అని శీర్షిక పెట్టారు. ఈ విధంగా ఫోటోకు, శీర్షికకు ఏమాత్రం సంబంధం లేకుండా వార్త రాశారు. వీళ్లు రాసిన పొడిచిన పొత్తు వార్తలోనూ అంతే నిజం ఉంటుంది. హోదా సాధన కోసం టీఆర్ఎస్ మద్దతు ఇస్తామంటే వైఎస్సార్‌సీపీ స్వాగతిస్తోంది. ఇందులో తప్పేముంది? దానికి పెడార్థాలు తీస్తారా? తెలంగాణ ఎన్నికలకు ముందు చంద్రబాబు ఏమన్నారు? మన ముందు రెండు పార్టీలు– కాంగ్రెస్, టీఆర్ఎస్ ఉన్నాయి. రాజకీయ ప్రయోజనాల కోసం వీటిలో ఏ పార్టీతో కలిస్తే బాగుంటుందో చెప్పండని టీడీపీ కార్యకర్తలను బహిరంగంగా అడగలేదా? టీడీపీకి నిరంతరం రాజకీయ, స్వప్రయోజనాలు తప్పితే రాష్ట్ర, సామాజిక ప్రయోజనాలు అసలు ఉండవు. అలాంటి చంద్రబాబుకు ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న వైఎస్సార్‌సీపీని విమర్శించే హక్కు లేదు.

అన్ని వ్యవస్థలనూ నాశనం చేశారు

చంద్రబాబు రాష్ట్రంలో అన్ని వ్యవస్థలనూ నాశనం చేశారు. ఇందులో ప్రధానమైంది పోలీసు వ్యవస్థ. అధికార పక్షం చెప్పుచేతుల్లో ఈ వ్యవస్థ నడుస్తోంది. అందుకే నమ్మకం లేదంటున్నాం. ప్రతిరోజూ దోపిడీలు, దుర్మార్గాలు, అత్యాచారాలు, ప్రత్యర్థులను హింసించడం వంటి దారుణాలు సర్వసాధారణమైపోయాయి. భ్రష్టు పట్టించిన ఈ పోలీసు వ్యవస్థను సక్రమంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది. వైఎస్సార్‌సీపీ వచ్చాక ఈ వ్యవస్థను గాడిలో పెడతాం. పోలీసు శాఖకు మంచి పేరు వచ్చేలా చేస్తాం.

తెలుగు ప్రజలంతా సోదరభావంతో మెలగాలి

చంద్రబాబు మాటలు నమ్మి ఒకసారి ప్రజలు వంచనకు గురయ్యారు. ఆయన ఊసరవెల్లి రాజకీయాలకు చరమగీతం పాడాల్సిన అవసరం ఉంది. దేశ రాజకీయాల్లో మనకంటూ ఒక స్థానం ఏర్పడాలి. ఏపీ ప్రయోజనాలను కాపాడుకోవాలి. తెలుగు ప్రజలంతా సోదరభావంతో మెలగాలి. రాష్ట్రాలు తమ అధికారాల కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలన్న వాదనతో ఏకీభవిస్తున్నాం.

వచ్చే ఎన్నికల్లో ఎవరితోనూ పొత్తు పెట్టుకోం..

రాజకీయ పార్టీల మధ్య పొత్తులనేవి ఎన్నికల సమయంలో ఉంటాయి. భావ సారూప్యత గల పార్టీల మధ్య పొత్తులు కుదరడం సహజం. టీఆర్ఎస్ ఏపీలో లేదు కనుక పోటీ చేసే ప్రశ్నే ఉత్పన్నం కాదు. మరి అలాంటప్పుడు పొత్తు ఏంటి? పొత్తు పొడవడం ఏంటి? వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎవరితోనూ పొత్తు పెట్టుకోదు. ఒంటిగానే పోటీ చేస్తుంది. ఈ విషయాన్ని పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సందర్భాల్లో స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీకి ఏపీ ప్రయోజనాలే ముఖ్యం తప్ప చంద్రబాబులా రాజకీయ ప్రయోజనాలు కాదు. ఏపీ ప్రయోజనాల కోసం, హోదా సాధన కోసం ఎందాకైనా పోరాడుతూనే ఉంటాం. ఈ లక్ష్య సాధన కోసం ఎన్ని అవమానాలు ఎదురైనా భరిస్తాం.. ఎందాకైనా వెళతాం. ప్రత్యేక హోదాపై వైఎస్సార్‌సీపీ విధానం ఇంత స్పష్టంగా ఉంటే ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు పత్రికా సమావేశాలు పెట్టి తప్పు బడతారా? టీడీపీ సోషల్ మీడియా సహా మంత్రులు లేవనెత్తిన ప్రధానాంశాల లోగుట్టు ఏమిటో నేను చెబుతా.

డీజీపీగా ఠాకూర్ నియామకంపై నీలినీడలు!



రాష్ట్రాల సొంత చట్టాల ద్వారా డీజీపీ నియామకం చెల్లదని సుప్రీం కోర్టు తీర్పు

- పంజాబ్, హరియాణా, కేరళ,పశ్చిమ బెంగాల్ వినతులను తిరస్కరించిన న్యాయస్థానం
- ఏపీలో సొంత చట్టం ద్వారా డీజీపీ నియామకం
- రాజకీయ ప్రయోజనాల కోణంలోనే డీజీపీని నియమించిన సీఎం చంద్రబాబు
- ఎంపిక ప్రక్రియను యూపీఎస్సీ నుంచి తప్పించేందుకు చట్టంలో సవరణలు

సాక్షి, అమరావతి: సుప్రీంకోర్టు ధర్మాసనం తాజాగా వెల్లడించిన తీర్పు నేపథ్యంలో రాష్ట్ర డీజీపీగా ఆర్పీ ఠాకూర్ నియామకంపై నీలినీడలు అలుముకున్నాయి. సుప్రీంకోర్టు తీర్పు మేరకు డీజీపీ ఠాకూర్ నియామకం చట్ట విరుద్ధమేనని తేటతెల్లమైంది. తమ సొంత చట్టాల ద్వారా డీజీపీ నియామకానికి అనుమతించాలని కోరుతూ పంజాబ్, హర్యాణా, కేరళ, పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. దీనిపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం తీర్పు వెలువరించింది. రాష్ట్రాల సొంత చట్టాల ద్వారా డీజీపీ నియామకాలు చెల్లవని స్పష్టం చేసింది. అధికారంలో ఉన్న పార్టీ రాజకీయ జోక్యంతోపాటు ప్రజల రక్షణను దృష్టిలో ఉంచుకునే రాష్ట్రాల సొంత చట్టాల ద్వారా డీజీపీ నియామకం చెల్లదని గతంలో సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చిందని జస్టిస్ రంజన్ గొగోయ్ గుర్తుచేశారు. అలాగే యాక్టింగ్ డీజీపీ నియమాకాలను కూడా రాష్ట్ర ప్రభుత్వాలు చేయరాదని పేర్కొన్నారు. యాక్టింగ్ డీజీపీ పేరుతో వారి పదవీ కాలాన్నీ ఏళ్ల తరబడి పొడిగిస్తున్నారని, ఇది ఎంతమాత్రం భావ్యం కాదని తేల్చిచెప్పారు. రాష్ట్రాల డీజీపీ నియమాకానికి సీనియారిటీ మేరకు వారి సర్వీసులోని అంశాలను జోడించి ముగ్గురు పేర్లను యూనియన్ పబ్లిక్ సర్వీసు కమిషన్‌కు(యూపీఎస్సీ) పంపించాల్సి ఉందని, అందులో నుంచి ఒకరిని యూపీఎస్సీ ఎంపిక చేస్తుందని, అలా ఎంపిక చేసిన వ్యక్తిని డీజీపీగా రాష్ట్రాలు నియమించాల్సి ఉంటుందని జస్టిస్ రంజన్ గొగోయ్ తన తీర్పులో వెల్లడించారు.

చంద్రబాబు సొంత చట్టం

2006లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు యూపీఎస్సీ ద్వారానే డీజీపీని నియమించాల్సి ఉంటుంది. యూపీఎస్సీకి మూడు పేర్లు పంపిస్తే తనకు కావాల్సిన వారిని, రాజకీయంగా ఉపయోగపడే వ్యక్తిని డీజీపీగా నియమించుకోవడం సాధ్యం కాదని ముఖ్యమంత్రి చంద్రబాబు భావించారు. అందుకే డీజీపీ ఎంపిక ప్రక్రియను యూపీఎస్సీ నుంచి తప్పించేందుకు ఏకంగా చట్టంలో సవరణలు తీసుకొచ్చారు. రాష్ట్ర సొంత చట్టం మేరకే డీజీపీని నియమించాలని నిర్ణయించారు. 2018 జూన్ 30వ తేదీన యాక్టింగ్ డీజీపీగా పనిచేస్తున్న మాలకొండయ్య పదవీ విరమణ చేశారు. ఆయన పదవీ విరమణ చేసే చివరి నిమిషం వరకూ కొత్త డీజీపీ ఎవరనేది చంద్రబాబు తేల్చలేదు. చివరి నిమిషంలో ఐదుగురు పేర్లతో సీనియారిటీ జాబితా రూపొందించినట్లు కథ నడిపించారు. గౌతమ్ సవాంగ్, ఆర్పీ ఠాకూర్, కౌముది, సురేంద్రబాబు, అనూరాధ పేర్లతో సీనియారిటీ జాబితా రూపొందించామని, అందులో నుంచి ఆర్పీ ఠాకూర్‌ను డీజీపీగా నియమించినట్లు తెలిపారు. వాస్తవానికి గౌతమ్ సవాంగ్ డీజీపీ అవుతారని అందరూ భావించారు. ఆయన రాజకీయంగా ఉపయోగపడరనే ఉద్దేశంతోనే ఆర్పీ ఠాకూర్ వైపు చంద్రబాబు మొగ్గుచూపినట్లు సమాచారం. తాజాగా సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో డీజీపీగా ఠాకూర్ నియమాకం చట్ట విరుద్ధమే అవుతుందని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తుందో వేచి చూడాల్సి ఉందని ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు వ్యాఖ్యానించారు.

డీజీపీనా.. రాజకీయ నాయకుడా?

డీజీపీ ఆర్పీ ఠాకూర్ రాష్ట్ర ప్రభుత్వం పట్ల పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని, డీజీపీ అనే విషయాన్ని మరిచిపోయి రాజకీయ నేతగా మాట్లాడుతున్నారని అధికార యంత్రాంగం చెబుతోంది. విశాఖపట్నం ఎయిర్‌పోర్టులో ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై జరిగిన హత్యాయత్నం ఘటనపై డీజీపీ ఠాకూర్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. ఇలాంటి వ్యక్తి డీజీపీగా కొనసాగితే వచ్చే సాధారణ ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగే అవకాశం లేదని ఉన్నతాధికారి ఒకరు అన్నారు. రాజకీయ ప్రేరేపిత వ్యాఖ్యలు చేసిన డీజీపీలను ఎన్నికల కమిషన్ గతంలో ఎన్నికల విధుల నుంచి తప్పించి, కొత్తవారిని నియమించిందని ఆయన గుర్తు చేస్తున్నారు.

● ఏపీలో అవినీతి ప్రభుత్వంపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. చంద్రబాబు మాకొద్దు అనే నినాదంతో మూడు నెలల్లో ప్రజలు బాబును తరిమి కొడతారన్నారు. పూటకో మాట మాట్లాడే చంద్రబాబును చూసి ఊసరవెల్లి కూడా సిగ్గుపడుతోందని అన్నారు. గురువారం ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ.. 'సంక్రాంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు ఏపీకి వెళ్లి వచ్చా. నేను మీలా దేవాలయాల దగ్గర రాజకీయాలు చేయను. మాకు బంధాలు, బంధుత్వాల గురించి తెలుసు. బంధాలు, బంధుత్వాల గురించి మాట్లాడే నైతిక హక్కు చంద్రబాబుకు లేదు. ఏపీలో ఒక్క యాదవ సంఘానికే కాదు వెనుకబడిన వాళ్లకి కూడా మద్దతు ఇస్తాం' అని తలసాని పేర్కొన్నారు.

ఫిబ్రవరి 3న పల్స్ పోలియో



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ ఫిబ్రవరి 3వ తేదీన పోలియో చుక్కలు వేయనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం నిర్ణయించింది. ఒకే విడతలో జరిగే ఈ కార్యక్రమంలో 51.66 లక్షల మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ తెలిపింది. రాష్ట్ర వ్యాప్తంగా 37,493 పోలియో కేంద్రాలను, 1,49,977 మంది సిబ్బందిని ఏర్పాటు చేయనున్నారు. ప్రయాణంలో (బస్టాండ్‌లలో, రైల్వేస్టేషన్‌లలో) ఉన్నవారి కోసం 1,354 సంచార పోలియో కేంద్రాలను సిద్ధం చేయనున్నారు. అప్పుడే పుట్టిన బిడ్డలకు, సాధారణ ఆరోగ్య సమస్యలున్న చిన్నారులకూ పోలియో చుక్కలు వేయవచ్చునని, ప్రతి ఒక్కరు తమ ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించి వ్యాధి నిర్మూలనకు తోడ్పడాలని ఆరోగ్యశాఖ అధికారులు పేర్కొన్నారు.

రేడియో 'చిన్నమ్మ' ఇక లేరు

సాక్షి, అమరావతి: ఆకాశవాణి కేంద్రం నుంచి ప్రతిరోజూ ప్రసారమయ్యే 'పాడి–పంట' కార్యక్రమంలో 'చిన్నమ్మ'గా ఆబాలగోపాలాన్ని అలరించిన నిర్మలా వసంత్ (72) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె గురువారం హైదరాబాద్‌లో మరణించారు. ఈ నెల 8న కూడా ఆమె ఆకాశవాణి కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. వ్యవసాయ కార్యక్రమమే అయినా అన్ని వర్గాల శ్రోతలను ఆమె ఆకట్టుకునేవారు. ఆకాశవాణి కేంద్రం ద్వారా వ్యవసాయదారులకు ఆమె అందించిన సేవలను గుర్తు చేసుకుని రేడియో సిబ్బంది ఘనంగా నివాళులర్పించారు. నిర్మలా వసంత్ పల్లెటూరి యాసతో పాడిపంటకు జీవం పోశారని ప్రోగ్రాం స్టాఫ్ అసోసియేషన్ జాతీయ నాయకుడు వలేటి గోపీచంద్ కొనియాడారు.

అహ్లే సున్నతుల్ జమాత్ కమిటీ ఎన్నిక



అహ్లే సున్నతుల్ జమాత్ సంస్థ రాష్ట్ర కార్యవర్గ సభ్యులను సత్కరిస్తున్న ముస్లిం మత పెద్దలు

కొండపల్లి (ఇబ్రహీంపట్నం): అహ్లే సున్నతుల్ జమాత్ సంస్థ రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నిక కృష్ణా జిల్లా కొండపల్లి షాబూఖారీ మసీదు ఆవరణలో గురువారం జరిగింది. సూఫీ మత గురువు మహ్మద్ ఆల్తాఫ్ రజా అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్రంలోని 13 జిల్లాల ముస్లిం పండితులు, ఉలమాలు, ముఫ్తీలు, సూఫీలు, ముతవల్లీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లింలు, మసీదుల అభివృద్ధిపై విస్తృతంగా చర్చించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంస్థ గౌరవ అధ్యక్షునిగా మహ్మద్ గౌస్ మొహిద్దీన్ రజ్వీ (కాకినాడ), అధ్యక్షునిగా విజయవాడ పీఠాధిపతి ముఫ్తీ మహ్మద్ అబ్దుల్‌ఖాదర్ రజ్వీ, ప్రధాన కార్యదర్శిగా మౌలానా మహ్మద్ సమీ ఉజామా రజ్వీ (గుంటూరు), కోశాధికారిగా మత గురువు మహ్మద్ ఆల్తాఫ్ రజ్వీ (కొండపల్లి), ఉపాధ్యక్షులుగా మమ్మద్ గౌహారా అలమా (భవానీపురం), మౌలానా మహ్మద్ రఫీ (మచిలీపట్నం), అధికార ప్రతినిధిగా ముక్తార్ ఆలీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

టీఆర్ఎస్ నేతలతో తిరగొద్దు!

- స్నేహాలు, బంధుత్వాలుంటే వ్యక్తిగతంగా చూసుకోండి
- ఎవరైనా వారి పర్యటనల్లో పాల్గొంటే కఠిన చర్యలు
- కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్‌కు స్పందన లేదు
- అందుకే హడావిడిగా వైఎస్ జగన్‌తో కేటీఆర్ భేటీ
- బీజేపీ వ్యతిరేక ఓట్లు చీల్చాలనే కుట్ర
- టీడీపీపై షర్మిల ఫిర్యాదు చేయడం దురదృష్టకరం
- పవన్ కళ్యాణ్‌పై అసభ్యంగా ప్రచారం చేశారు
- సోషల్ మీడియాను ఎవరు దుర్వినియోగం చేసినా సహించం
- పార్టీ నేతలు, మంత్రులతో సీఎం చంద్రబాబు టెలికాన్ఫరెన్స్



ఐనవోలు గ్రామంలో జరిగిన ఎక్స్ఎల్ఆర్ఐ శంకుస్థాపన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, జేవీఆర్ స్కూల్ మేనేజ్‌మెంట్ స్కూల్ సిబ్బంది తదితరులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పర్యటించే తెలంగాణ రాష్ట్ర సమితి నేతల కార్యక్రమాల్లో టీడీపీ నేతలెవరూ పాల్గొనరాదని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. స్నేహాలు, బంధుత్వాలుంటే వ్యక్తిగతంగా చూసుకోవాలని.. అలా కాకుండా ఎవరైనా వారి పర్యటనల్లో టీడీపీ నేతలు పాల్గొంటే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు నేపథ్యంలో రాష్ట్ర ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భేటీ కావడంపై చంద్రబాబు గురువారం పార్టీ నేతలు, మంత్రులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇటీవలి రాష్ట్ర పర్యటనలో తలసాని చేసిన వ్యాఖ్యలపై సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆలయాల్లో మొక్కులకు వచ్చి రాజకీయ వ్యాఖ్యలు చేస్తారా అంటూ సీఎం ప్రశ్నించారు. బంధుత్వాలు, స్నేహాల పేరుతో పార్టీని పణంగా పెట్టరాదని, రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీయరాదన్నారు. కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్‌కు స్పందన లేకపోవడంవల్లే బుధవారం హడావిడిగా జగన్‌తో కేటీఆర్ భేటీ అయ్యారని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఈ భేటీతో టీఆర్ఎస్, వైసీపీ ముసుగు తొలగిపోయిందన్నారు.

బీజేపీ వ్యతిరేక శక్తులు ఏకం కాకుండా..

కాగా, బీజేపీ వ్యతిరేక శక్తులు ఏకం కాకుండా, ఆ ఓట్లను చీల్చాలని కుట్రలు చేస్తున్నారని చంద్రబాబు అన్నారు. దేశంలో పార్టీలను గందరగోళ పరచడం, ప్రజల్లో అయోమయం సృష్టించడమే వీరి లక్ష్యమని చంద్రబాబు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ప్రధాని నరేంద్ర మోదీ పాలన అప్రదిష్టపాలైందని, దానిని కప్పిపెట్టేందుకే ఇలాంటి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌కు హోదా ఇస్తే మాకు ఇవ్వాలని కేసీఆర్ అన్నారని, షెడ్యూల్–9, షెడ్యూల్–10 సంస్థల విభజనకు అడ్డంకులు పెట్టారని, చివరికి సుప్రీంకోర్టు తీర్పునూ అమలు చేయనివ్వలేదన్నారు. విభజన చట్టంలోని అంశాలు అమలుచేస్తారా? ×సుప్రీం₹ తీర్పును అమలుచేయమని చెబుతారా? పోలవరం ప్రాజెక్టుకు అడ్డంపడకుండా ఉంటారా అని చంద్రబాబు ప్రశ్నించారు. ఇదిలా ఉంటే.. టీడీపీపై షర్మిల ఫిర్యాదు చేయడం దురదృష్టకరమని చంద్రబాబు అన్నారు. సోషల్ మీడియాను దుర్వినియోగం చేసింది వైసీపీయేనన్నారు. సోషల్ మీడియాలో సీబీఐ పూర్వపు జేడీ లక్ష్మీనారాయణపై వైసీపీనే దుష్ప్రచారం చేసిందన్నారు. పవన్‌కళ్యాణ్ పెళ్లిళ్లపై అసభ్యంగా ప్రచారం చేశారని, టీడీపీ మహిళా నేతలపైన, నా కుటుంబ సభ్యులపైనా దుష్ప్రచారం చేశారని చంద్రబాబు చెప్పారు.

ఎక్స్ఎల్ఆర్ఐకు భూమిపూజ

గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం ఐనవోలు గ్రామంలో జేవియర్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఎక్స్ఎల్ఆర్ఐ) సంస్థకు చంద్రబాబు గురువారం భూమిపూజ చేశారు. ఈ సంస్థ కోర్సులన్నీ ఈ ఏడాది జూన్ నుంచే లయోలా కళాశాలలో ప్రారంభమవుతాయని, ఏడాదిన్నర కాలంలో భవనం పూర్తిచేస్తారని తెలిపారు. ఈ నెల 29న అనంతపురం జిల్లాలో కియా మోటార్స్‌లో తయారైన కారు రోడ్డు మీదకు రాబోతోందన్నారు. ఉండవల్లిలోని ప్రజావేదికలో జరిగిన మరో కార్యక్రమంలో వైఎస్సార్ జిల్లాకు చెందిన కాంగ్రెస్ మాజీమంత్రి మహ్మద్ అహ్మదుల్లా, ఆయన కుమారుడు అర్షబ్‌లకు టీడీపీ కండువాలు కప్పి సీఎం వారిని పార్టీలోకి ఆహ్వానించారు.

శ్రీకృష్ణదేవరాయ వర్సిటీ వీసీగా రహమతుల్లా

సాక్షి, అమరావతి: అనంతపురంలోని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఉపకులపతిగా ప్రొఫెసర్ ఎస్.ఎం.రహమతుల్లాను నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ప్రొఫెసర్ రహమతుల్లా ప్రస్తుతం హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీలో డీన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా, ఒంగోలులో కొత్తగా ఏర్పాటుచేసిన ఆంధ్రకేసరి టంగుటూరి యూనివర్సిటీ ఇన్‌ఛార్జి ఉపకులపతిగా విక్రమసింహపురి వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఆర్.సుదర్శనరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

ఏయూ వీసీ నాగేశ్వరరావుకు కల్నల్ హోదా

ఏయూ క్యాంపస్ (విశాఖ తూర్పు): ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.నాగేశ్వరరావుకు కల్నల్ హోదా లభించింది. నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) విభాగంలో గౌరవ హోదాలో ఆయనను కల్నల్‌గా నియమించారు. ఇటీవల భారత ప్రభుత్వం ఈ మేరకు గెజిట్ ఉత్తర్వులను విడుదల చేసింది. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచి ఆచార్య జి.నాగేశ్వరరావు ఒక్కరికే ఈ గౌరవం దక్కింది. విశ్వవిద్యాలయం కల్నల్ కామాండెంట్‌గా వీసీ వ్యవహరిస్తారు.

చాసో పురస్కారం నా అదృష్టం: షరీఫ్



చా.సో స్ఫూర్తి పురస్కారం అందుకుంటున్న వేంపల్లె షరీఫ్

విజయనగరం టౌన్: చాగంటి సోమయాజులు (చాసో) స్ఫూర్తి పురస్కారం అందుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని ప్రముఖ రచయిత, జర్నలిస్ట్ వేంపల్లె షరీఫ్ (కడప) పేర్కొన్నారు. చాసో 104వ జయంతి సందర్భంగా 24వ పురస్కార ప్రదానోత్సవం గురువారం విజయనగరంలోని చాసో సాహితీ వేదిక హాల్‌లో నిర్వహించారు. చాసో సాహిత్య ట్రస్ట్ వ్యవస్థాపకురాలు చాగంటి తులసి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో షరీఫ్‌కు పురస్కారం కింద రూ. 10 వేల నగదు పురస్కారం, జ్ఞాపిక, దుశ్సాలువ, ప్రశంశాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పురస్కార గ్రహీత వేంపల్లె షరీఫ్ మాట్లాడుతూ.. గతంలో తనకు కేంద్ర అకాడమీ అవార్డు లభించిందని, దానికన్నా చాసో పురస్కారం ఎక్కువ తృప్తినిచ్చిందని పేర్కొన్నారు. ఏదైనా కథ రాసిన తర్వాత నచ్చకపోతే నిర్దాక్షిణ్యంగా దాన్ని చించి పడేసి మరో కథకు వెళ్లేంత స్ఫూర్తిని చాసో పురస్కారం కలిగించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రముఖ జర్నలిస్టు రెహెనా (హైదరాబాద్), ప్రముఖ తమిళ రచయిత గౌరీకృబానందన్ (చెన్నై), డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

ఘోర రోడ్డు ప్రమాదం

- ఢీకొన్న రెండు కార్లు, ట్రాక్టర్
- ముగ్గురి మృతి.. ఆరుగురికి తీవ్ర గాయాలు
- నెల్లూరు–ముంబై జాతీయ రహదారిపై ఘటన



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు

మర్రిపాడు: నెల్లూరు–ముంబై జాతీయ రహదారిపై గురువారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం నందవరం సమీపంలో రెండు కార్లు, ఓ ట్రాక్టర్ ఢీకొనడంతో ముగ్గురు మృతిచెందారు. మరో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. కర్నూలు నుంచి నెల్లూరు వైపు వేగంగా వస్తున్న షిఫ్ట్ కారు.. అదుపుతప్పి కట్టెల ట్రాక్టర్‌ను ఢీకొంది. అదేసమయంలో ఎదురుగా బద్వేల్ వైపు వెళుతున్న మరో కారు.. ఈ రెండు వాహనాల్ని ఢీకొంది. ఈ ఘటనలో షిఫ్ట్ కారులో ప్రయాణిస్తున్న షాజియా పర్వీన్(40) అక్కడికక్కడే మృతిచెందారు. కారులో ఉన్న ఆమె భర్త వశీ అహ్మద్, కుమార్తెలు తుహారా బేగం, మొహిబీనా బేగం, ఉమైనాబేగంలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని ప్రైవేట్ వాహనంలో ఆత్మకూరు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ఉమైనా బేగం(18) కన్నుమూసింది. మరో కారులో ప్రయాణిస్తున్న జలదంకి మండలం గట్టుపల్లికి చెందిన గొట్టిపాటి రామానాయుడు(55)కు సైతం తీవ్ర గాయాలవగా, ఆత్మకూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స అందేలోపే రామానాయుడు మృతిచెందారు. అదే కారులో ఉన్న పెంచలమ్మ, నాగేంద్ర, డ్రైవర్ రియాజ్ అహ్మద్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. ఇదిలా ఉండగా పరిస్థితి విషమంగా ఉండడంతో వశీ అహ్మద్, తుహారా బేగం, మొహిబీనా బేగం, రియాజ్ అహ్మద్‌లను నెల్లూరుకు తరలించారు. మృతిచెందిన షాజియా పర్వీన్, ఉమైనా బేగంలది కర్నూలు. వ్యాపార రీత్యా వీరి కుటుంబం నెల్లూరులోని గాంధీనగర్‌లో నివాసం ఉంటోంది. ప్రమాద తీవ్రతతో నెల్లూరు–ముంబై రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులైన నందవరం గ్రామస్తులు స్పందించి క్షతగాత్రులను వాహనాలలో నుంచి బయటకు తీశారు.

కేటీఆర్‌తో సంప్రదింపులు ఫెడరల్ ఫ్రంట్ కోసమే

- అధికారం కోసం కూటమి పెట్టుకునే నీచ రాజకీయం చంద్రబాబుది
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే ఆర్కే రోజా



మాట్లాడుతున్న రోజా. చిత్రంలో వైఎస్సార్‌సీపీ నేతలు

నగరి/వేంపల్లె: కేటీఆర్‌తో సంప్రదింపులు ఫెడరల్ ఫ్రంట్ కోసమే అని ఎమ్మెల్యే ఆర్కేరోజా అన్నారు. చిత్తూరు జిల్లా నగరిలో గురువారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అలాగే వైఎస్సార్ జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గండిలోని ఆంజనేయస్వామిని దర్శించుకున్న అనంతరం ఆమె వేంపల్లెలో విలేకరులతో మాట్లాడారు. కేటీఆర్‌తో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేసిన సంప్రదింపులపై టీడీపీ నాయకులు చేసిన విమర్శలపై ఆమె విరుచుకుపడ్డారు. పచ్చకామెర్ల వారికి లోకమంతా పచ్చగా కనిపించినట్లు టీడీపీ వారికి ఎప్పుడూ ఎవరితో పొత్తు పెట్టుకుంటాం, ఎవరిని ఏమార్చి అధికారం చేజిక్కించుకోవాలన్న ఆలోచనే ఉంటుందని ధ్వజమెత్తారు. అందుకే జగనన్న ఎవరితో మాట్లాడినా వారికి పొత్తు ఆలోచనే వస్తుందన్నారు. కోడిగుడ్డు మీద ఈకలు పీకినట్లు జగనన్న చేసేది ప్రతిదీ తప్పు అని చెప్పడమే అలవాటుగా పెట్టుకున్నారన్నారు. 40 యేళ్ల రాజకీయ అనుభవం ఉందని గొప్పగా చెప్పుకునే ఆయనకు ఫెడరల్ ఫ్రంట్ ఎందుకు పెడతారో తెలియదా అన్నారు. కాంగ్రెస్, బీజేపీ దేశానికి అన్యాయం చేసిన పార్టీలని వాటిపై పోరాడేందుకు ఫెడరల్ ఫ్రంట్ పెట్టడంలో తప్పేంటన్నారు. విశ్వసనీయత, భావసారూప్యత ఉన్న పార్టీలు కలిసి పనిచేయడం ఎక్కడైనా జరుగుతుందని అందుకే పార్టీ అధ్యక్షుని హోదాలో జగన్‌మోహన్ రెడ్డిని కేటీఆర్ కలిసారన్నారు. దీనికి టీడీపీ నాయకులు పెడర్థాలు తీస్తున్నారన్నారు. వారు కలిస్తే పచ్చ నేతలకు వణుకెందుకు పుడుతోందన్నారు. అమరావతి శంకుస్థాపనకు కేసీఆర్, కేటీఆర్‌లు పిలవడమే కాకుండా శిలాఫలకంపై పేరును చెక్కించడం మీరంతా ఆ రోజు ప్రశ్నించకుండా గాడిదలు కాస్తున్నారా అని ధ్వజమెత్తారు. రామోజీరావును కలిసినప్పుడూ ఇలాగే రాద్ధాంతం చేశారన్నారు. ఓటుకు కోట్లు కేసులో కేసీఆర్ కాళ్లు పట్టుకొని దొంగలా విజయవాడకు పారిపోయింది ఎవరో ప్రజలందరికీ తెలుసునన్నారు. చంద్రబాబు వియ్యంకుడు కేటీఆర్‌ను కలవచ్చు, అందరికీ నీతులు చెప్పే పవన్ కళ్యాణ్ కలిస్తే తప్పులేదు.. జగనన్న కలిస్తే తప్పొచ్చిందా అన్నారు. తెలంగాణలో కేసీఆర్‌తో పొత్తు పెట్టుకోవడానికి ప్రయత్నించింది మీరుకాదా అని ప్రశ్నించారు. హరికృష్ణ మృతదేహం వద్ద కూడా రాజకీయం చేశారని, కేసీఆర్ ఛీ పొమ్మంటే కాంగ్రెస్ పార్టీతో కలిసారన్నారు. జగన్‌మోహన్ రెడ్డి దమ్ము గురించి టీడీపీ నాయకులు మాట్లాడుతున్నారని ఆయన దమ్ము, సత్తా ఏంటో మీకు, సోనియాగాంధీకి తెలుసు అన్నారు. ఓటమి భయం పట్టుకున్న చంద్రబాబు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే టీడీపీని ప్రజలు బంగాళాఖాతంలో కలిపేస్తారని హెచ్చరించారు.

షర్మిలపై అసభ్య ప్రచారంలో సీఎం పాత్ర లేదు: సోమిరెడ్డి



సాక్షి, అమరావతి: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుమార్తె షర్మిలపై సోషల్ మీడియాలో అసభ్యంగా ప్రచారం చేయడంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాత్ర ఉందని చెప్పడం సబబుకాదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఆమెపై సోషల్ మీడియాలో చేస్తున్న అసభ్య ప్రచారం బాధాకరమన్నారు. వెలగపూడి తాత్కాలిక సచివాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. సోషల్ మీడియాలో కొంతమంది పనిలేని వారు చాలా దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని మంత్రి ఆరోపించారు. ఇలాంటి పోకడలను నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం కఠిన చట్టాలు తేవాలని ఆయన కోరారు.

ఆ ఐదు కంపెనీలపై అమితప్రేమ

- రాజధానిలో రూ.25 వేల కోట్ల విలువైన పనులు వాటికే..
- ఆ కంపెనీల అర్హతలే టెండర్ నిబంధనలు
- ప్రతిపాదనల దశలోనే పనులు కేటాయించేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- మొదటి నుంచి వాటిపై సీఎంకు ప్రత్యేక అభిమానం

సాక్షి, అమరావతి: రాజధానిలో చేపట్టే ప్రాజెక్టులకు ఎక్కడా లేని విధంగా చదరపు అడుగుకు ఏడు వేల నుంచి పది వేల రూపాయలకుపైగా అంచనాలు రూపొందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. వాటిని ఎలాంటి పోటీ లేకుండా అస్మదీయ సంస్థలకు కట్టబెట్టేస్తోంది. కేవలం ఐదు నిర్మాణ సంస్థలకు నాలుగున్నరేళ్లలో రూ.25 వేల కోట్లకుపైగా పనుల్ని అప్పగించింది. ప్రతిపాదనల దశలోనే ముఖ్యమంత్రి నోటి మాటతో వందల కోట్ల రూపాయల పనుల్ని ఈ సంస్థలు చేజిక్కించుకుంటున్నాయి. కొన్ని కీలక ప్రాజెక్టుల ప్రతిపాదనలైతే ఆ ఐదు సంస్థలే తయారుచేసి సీఎం ఎదుట పెడుతుండగా.. ఆయన ఆమోదముద్ర వేసి వాటికే నిర్మాణ బాధ్యతల్ని అప్పగిస్తుండడం గమనార్హం. ఎల్ అండ్ టీ, ఎన్‌సీసీ, షాపూర్‌జీ పల్లోంజి, బీఎస్ఆర్ ఇన్‌ఫ్రా కంపెనీలకు 80 శాతానికిపైగా పనులు కేటాయించగా మిగిలిన పనుల్ని బీఎస్‌సీపీఎల్, మేఘ ఇంజినీరింగ్ కంపెనీలకు అప్పగించారు.

ఎల్ అండ్ టీకి 8 వేల కోట్లకు పైగా పనులు..

ఇప్పటివరకూ రూ.39,875 కోట్ల విలువైన పనుల్ని చేపట్టినట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించగా.. అందులో ఒక్క ఎల్ అండ్ టీ సంస్థకే రూ.8 వేల కోట్లకు పైగా పనుల్ని కట్టబెట్టారు. వెలగపూడిలోని తాత్కాలిక సచివాలయాన్ని ఈ సంస్థే నిర్మించగా.. ఇటీవలే మొదలైన శాశ్వత సచివాలయంలోని మూడు, నాలుగు టవర్లు, కృష్ణానదిపై ఐకానిక్ బ్రిడ్జి, తాత్కాలిక హైకోర్టు భవన నిర్మాణంతోపాటు రెండు భూ సమీకరణ లేఅవుట్ల అభివృద్ధి ప్రాజెక్టులు, పలు రోడ్ల ప్రాజెక్టులనూ ఎల్ అండ్‌టీ కే అప్పగించారు. సీడ్ యాక్సెస్ రోడ్, శాశ్వత సచివాలయంలో జీఏడీ టవర్, ఐఏఎస్ అధికారుల నివాస భవనాలు, రోడ్ల ప్రాజెక్టుల్లో ఎక్కువ భాగం ఎన్‌సీసీ చేజిక్కించుకుని మొత్తంగా రూ.4,700 కోట్ల విలువైన పనులు చేస్తోంది. షాపూర్‌జీ పల్లోంజి సంస్థ రూ.3 వేల కోట్లకు పైగా పనుల్ని చేపట్టగా వెలగపూడిలోని తాత్కాలిక సచివాలయంతో పాటు శాశ్వత సచివాలయంలోని ఒకటి, రెండు టవర్లు.. పూర్తిస్థాయి హైకోర్టు భవనం, గెజిటెడ్ అధికారుల భవనాలు, ఇతర పనులను అప్పగించారు.

ఆ కంపెనీల అర్హతలే టెండర్ నిబంధనలు..

రూ.వేల కోట్ల విలువైన పనుల్ని ఈ కంపెనీలకు కట్టబెట్టేందుకు ప్రభుత్వం టెండర్ల ప్రక్రియను వారికి అనుకూలంగా మార్చేస్తోంది. ఏ ప్రాజెక్టును ఎవరికివ్వాలో ముందే నిర్ణయించేస్తున్న ప్రభుత్వ పెద్దలు.. ప్రాజెక్టు డిజైన్లు, అంచనాలను సైతం ఆ కంపెనీలతోనే తయారు చేయిస్తున్నారు. పనులు అప్పగించిన తర్వాత ఆ కంపెనీలకున్న అర్హతలనే నిబంధనలుగా టెండర్లలో పెడుతుండడంతో ఇతర కంపెనీలకు అవకాశం దక్కడం లేదు. వెలగపూడిలో తాత్కాలిక సచివాలయ నిర్మాణాన్ని ఎల్ అండ్ టీ, షాపూర్‌జీ పల్లోంజి సంస్థలకు అప్పగించేందుకు టెండర్లలో ప్రి కాస్ట్ భవనాలు నిర్మించిన అనుభవం ఉండాలనే నిబంధన పెట్టారు. దీంతో దేశంలో ఎన్నో భవనాలు నిర్మించిన కంపెనీలు కూడా ఈ పనులకు అర్హత సాధించలేకపోయాయి. కానీ ఎల్ అండ్ టీ ప్రి కాస్ట్ కాకుండా సాధారణ గోడల్నే కట్టేసి.. ఆ తర్వాత నిబంధనలను మార్పు చేయించుకుంది. భవన నిర్మాణాలతో సంబంధం లేకుండా ఎస్టీపీ, రోడ్ల నిర్మాణం, అంతర్గత వసతుల పనులు చేసి ఉండాలనే నిబంధనను విధించడం ద్వారానే ఎల్ అండ్ టీ, షాపూర్‌జీ పల్లోంజి, ఎన్‌సీసీ కంపెనీలకు రూ.వేల కోట్ల విలువైన పనుల్ని కట్టబెట్టారు.

సర్కార్ పెద్దల కమీషన్లకు భయపడి..

రాజధాని నిర్మాణ వ్యవహారాలు చేపట్టిన సీఆర్‌డీఏ, ఏడీసీ (అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్) ప్రభుత్వ పెద్దలకు కావాల్సిన కంపెనీలతో కుమ్మక్కై నిబంధనలు వారికి అనుకూలంగా రూపొందిస్తున్నాయి. రాజధాని నిర్మాణంలో పాలుపంచుకుందామని మొదట్లో టాటా కన్‌స్ట్రక్షన్స్ వంటి కంపెనీలు ముందుకు వచ్చినా.. సర్కారు అనుకూల కంపెనీల ముందు నిలవలేకపోయాయి. సింగపూర్, ఇతర దేశాలకు చెందిన కంపెనీలు సైతం సర్కారు పెద్దల కమీషన్ల డిమాండ్లతో అవాక్కై వెనక్కి వెళ్లిపోయాయి. దీంతో పోటీ లేకుండా తాము తయారుచేసిన అంచనాల ప్రకారమే ప్రాజెక్టులు దక్కించుకుని ఆ కంపెనీలు లాభాలు పండించుకుంటుండగా.. సర్కారు పెద్దలు కమీషన్ల మత్తులో మునిగి మిగిలిన పనుల్నీ వారికే కేటాయించేందుకు వ్యూహ రచన చేస్తున్నారు.

గాలేరు-నగరిలో ఫోర్స్‌డ్ క్లోజర్!

- రెండో దశ పనుల్లో కాంట్రాక్టర్లకు ప్రభుత్వ పెద్దల బెదిరింపులు
- ఒప్పందాలను రద్దు చేసుకోకుంటే బ్లాక్ లిస్ట్‌లో చేరుస్తామని హెచ్చరికలు
- ప్రీక్లోజర్ దరఖాస్తులకు ఆగమేఘాలపై ఆమోదముద్ర
- ఆ తర్వాత రెట్టింపు దాటిన అంచనా వ్యయం..
- ఆమోదిస్తూ నేడో రేపో ఉత్తర్వులు జారీ
- మొబిలైజేషన్ అడ్వాన్సుల మాటున కమీషన్‌ల కోసం సరికొత్త ఎత్తుగడ
- కోటరీ కాంట్రాక్టర్లకు అప్పగించి రూ.360 కోట్లు వసూలు చేసుకునే ప్లాన్
- వాటినే ఎన్నికల్లో వెదజల్లడానికి స్కెచ్

వచ్చే నెలలో ఎన్నికల షెడ్యూల్ వెలువడవచ్చని భావిస్తున్న తరుణంలో సాగునీటి ప్రాజెక్టుల్లో కమీషన్ల వసూలుకు ప్రభుత్వ పెద్దలు సరికొత్త వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. ముడుపులు ఇవ్వని కాంట్రాక్టర్లను ఒప్పందాల నుంచి బలవంతంగా వైదొలిగేలా (ఫోర్స్‌డ్ క్లోజర్) బెదిరిస్తున్నారు. ఆ తర్వాత పనుల అంచనా వ్యయాన్ని భారీగా పెంచేసి కోటరీ కాంట్రాక్టర్‌లకు అప్పగిస్తూ మొబిలైజేషన్ అడ్వాన్సులను తిరిగి ముడుపుల రూపంలో వసూలు చేసుకుంటున్నారు. గాలేరు-నగరి రెండో దశ 1-7 ప్యాకేజీల పనులే ఇందుకు తాజా తార్కాణం.



సాక్షి, అమరావతి:

ఓ కాంట్రాక్టర్ తాను చేపట్టిన పనులు గిట్టుబాటు కానప్పుడు ఒప్పందం నుంచి స్వచ్ఛందంగా వైదొలగేందుకు అనుమతించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోవడాన్ని 'ప్రీక్లోజర్' అని వ్యవహరిస్తారు. ఆ దరఖాస్తు సహేతుకమైతే ఒప్పందాన్ని రద్దు చేసుకోవడానికి సర్కార్ అనుమతిస్తుంది. కాంట్రాక్టర్‌కు చెల్లించాల్సిన బిల్లులను కూడా చెల్లిస్తుంది. ఎన్నికల షెడ్యూలు వెలువడటానికి కొద్ది రోజుల ముందు కమీషన్ల వసూళ్ల కోసం ప్రీక్లోజర్ నిబంధనను ప్రభుత్వ పెద్దలు అస్త్రంగా మల్చుకున్నారు.

ముడుపుల కోసం స్కెచ్...

గాలేరు-నగరి సుజల స్రవంతి పథకం రెండో దశలో 1-7 ప్యాకేజీ పనుల కాంట్రాక్టు ఒప్పంద విలువ రూ.1,418.62 కోట్లు. టీడీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆ పనులను పట్టించుకోలేదు. బిల్లులు చెల్లించకపోవడంతోపాటు భూసేకరణ జరగకపోవడం, అటవీ అనుమతులు లేకపోవడంతో రెండో దశ ప్రధాన కాలువ (32.64 కి.మీ నుంచి 240 కి.మీ వరకు) తవ్వకం పనులను కాంట్రాక్టర్లు నిలిపివేశారు. ఇప్పుడు ఎన్నికలు సమీపించడంతో సర్కారుకు హఠాత్తుగా ఈ పనులు గుర్తుకొచ్చాయి. చిత్తశుద్ధితో ఈ పనులు చేపడితే ఎవరికీ అభ్యంతరం ఉండదు. కానీ ఏడు ప్యాకేజీల్లో మిగిలిపోయిన పనుల అంచనా వ్యయాన్ని 2018-19 ఎస్ఎస్ఆర్ ధరలు మేరకు రూ.3,626.82 కోట్లకు పెంచేలా ప్రభుత్వ పెద్దలు చక్రం తిప్పారు. వీటిని కోటరీ కాంట్రాక్టర్‌లకు అప్పగించి మొబిలైజేషన్ అడ్వాన్సులుగా ఇచ్చే రూ.360 కోట్లను ముడుపులుగా వసూలు చేసుకోవడానికి స్కెచ్ వేశారు.

వైఎస్ హయాంలోనే తొలిదశ పనులు పూర్తి..

శ్రీశైలం జలాశయం నుంచి 38 టీఎంసీలను తరలించి వైఎస్సార్, చిత్తూరు, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాల్లో 2.60 లక్షల ఎకరాలకు సాగు నీరు, 5 లక్షల మందికి తాగునీరు అందించేందుకు దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి గాలేరు-నగరి సుజల స్రవంతి పథకాన్ని 2004లో చేపట్టారు. గాలేరు-నగరి తొలి దశ, గండికోట-చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఎత్తిపోతల పథకం పనులను రూ.5,035.59 కోట్ల వ్యయంతో 2009 నాటికే పూర్తి చేశారు. గాలేరు-నగరి రెండో దశ అంచనా వ్యయం రూ.2,525.91 కోట్లు. ఇందులో 334 కి.మీ. పొడవున ప్రధాన కాలువతోపాటు బాలాజీ రిజర్వాయర్, పద్మసాగర్, మల్లెమడుగు జలాశయం, వేణుగోపాలసాగర్, శ్రీనివాససాగర్, వేపగుంట జలాశయం, అడవికొత్తురు జలాశయాల పనులు పూర్తి చేయాలి. అయితే 2014 తరువాత ఆ పనులపై టీడీపీ సర్కార్ దృష్టి పెట్టలేదు.

ఆర్థికశాఖ అభ్యంతరం చెప్పినా..

ఎన్నికలు ముంచుకొస్తుండటంతో వైఎస్సార్ జిల్లా పరిధిలో గాలేరు-నగరి రెండో దశ ప్రధాన కాలువ పనులకు సంబంధించిన ఏడు ప్యాకేజీల కాంట్రాక్టర్‌లను ఒప్పందాలు రద్దు చేసుకోవాలంటూ ప్రభుత్వ పెద్దలు బెదిరించారు. ప్రీ క్లోజర్‌కు అంగీకరించకుంటే బ్లాక్‌లిస్ట్‌లో చేరుస్తామంటూ హెచ్చరించారు. దీంతో గత్యంతరం లేక ఒప్పందాల రద్దుకు అనుమతించాలంటూ ఏడు ప్యాకేజీల కాంట్రాక్టర్‌లు దరఖాస్తు చేసుకున్నారు. దీనికి ఆగమేఘాల మీద ఆమోదముద్ర వేసేలా జలవనరుల శాఖ అధికారులపై ప్రభుత్వ పెద్దలు ఒత్తిడి తెచ్చారు. ఆ తర్వాత పనుల అంచనా వ్యయాన్ని భారీ ఎత్తున పెంచేయాలంటూ తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెచ్చారు. దీంతో ఏడు ప్యాకేజీల్లో మిగిలిపోయిన పనుల అంచనా వ్యయాన్ని తాజా ధరల మేరకు రూ.3,626.82 కోట్లకు పెంచేస్తూ జలవనరుల శాఖ అధికారులు ఆర్థిక శాఖకు పంపారు. ఎలాంటి కారణాలు లేకున్నా ప్రీక్లోజర్‌కు అనుమతించడం, భారీ ఎత్తున అంచనా వ్యయాన్ని పెంచేయడాన్ని తప్పుపడుతూ ఈ ప్రతిపాదనలను ఆర్థిక శాఖ తోసిపుచ్చింది. కానీ వీటికి ఆమోదముద్ర వేయాలంటూ ప్రభుత్వ పెద్దలు తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెచ్చారు. ఈ నేపథ్యంలో ఏడు ప్యాకేజీల అంచనా వ్యయం పెంపుపై ఉత్తర్వులు నేడో రేపో వెలువడనున్నాయి.


ముగ్గురు కాంట్రాక్టర్లకే..

అంచనా వ్యయాన్ని పెంచుతూ చేపట్టే పనులను తన కోటరీలోని ముగ్గురు కాంట్రాక్టర్లకే అప్పగించేలా నిబంధనలతో టెండర్ నోటిఫికేషన్ జారీ చేయాలంటూ జలవనరుల శాఖ అధికారులపై ప్రభుత్వ పెద్దలు ఒత్తిడి తెస్తున్నారు. ఎన్నికల షెడ్యూలు వెలువడేలోగా టెండర్ల ప్రక్రియను పూర్తి చేయాలని గడువు విధించారు. కోటరీ కాంట్రాక్టర్లకు ఆ పనులు కట్టబెట్టి మొబిలైజేషన్ అడ్వాన్సులను తిరిగి కమీషన్‌ల రూపంలో వసూలు చేసుకోవాలన్నది పెద్దల పథకం. ఇలా వసూలు చేసే రూ.360 కోట్లను ఎన్నికల్లో టీడీపీకి ఇం'ధనం'గా సమకూర్చి వెదజల్లడానికి పావులు కదుపుతున్నారు.

గాలేరు-నగరి రెండో దశ అంచనాలు పెంపు రూ.కోట్లలో

ప్యాకేజీ	అంచనా వ్యయం	పెంచిన అంచనా వ్యయం
కాలువ 32.64 కిమీ నుంచి 66.150 కిమీ వరకూ తవ్వకం	251.56	577.00
కాలువ 66.150 కిమీ నుంచి 96.50 కిమీ వరకూ తవ్వకం	239.76	555.34
కాలువ 96.50 కిమీ నుంచి 119 కిమీ వరకూ తవ్వకం	177.67	489.02
కాలువ 119 కిమీ నుంచి 141.35 కిమీ వరకూ తవ్వకం	213.45	512.16
కాలువ 141.35 కిమీ నుంచి 161.25 కిమీ వరకూ తవ్వకం	164.78	491.80
కాలువ 161.25 కిమీ నుంచి 203.85 కిమీ వరకూ తవ్వకం	158.92	414.97
కాలువ 203.85 కిమీ నుంచి 240 కిమీ వరకూ తవ్వకం	212.48	586.53
మొత్తం	1418.62	3626.82

వైఎస్ జగన్‌పై దాడి కేసులో ఏముంది?



సీఎం చంద్రబాబు

సాక్షి, అమరావతి: 'ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఆయన అభిమానే కోడి కత్తితో దాడి చేశాడు.. ఆ కేసులో ఏముంది.. ఆ కేసు దర్యాప్తును ఎన్ఐఏకు అప్పగించడం రాష్ట్ర హక్కులను హరించడమే'నని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. రాష్ట్ర హక్కులను హరిస్తే కేంద్రాన్ని వదిలిపెట్టేది లేదన్నారు. మాజీమంత్రి అహ్మదుల్లా టీడీపీలో చేరిన సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. ఎన్నికలకు కేవలం వంద రోజుల సమయం మాత్రమే ఉందన్నారు. ఇంటికి ఒకరు చొప్పున టీడీపీ కోసం ప్రచారం చేయాలని.. 25 లోక్‌సభ స్థానాల్లోనూ టీడీపీనే గెలిపించాలని కోరారు.

చంద్రబాబు దావోస్ పర్యటన రద్దు

దావోస్ పర్యటనను సీఎం చంద్రబాబు రద్దు చేసుకున్నట్లు ముఖ్యమంత్రి కార్యాలయ వర్గాలు గురువారం తెలిపాయి. ఆయనకు బదులుగా మంత్రులు యనమల రామకృష్ణుడు, నారా లోకేష్ నేతృత్వంలోని 15 మంది అధికారుల బృందం వెళ్లనుంది. ఈనెల 22 నుంచి 25 వరకూ అక్కడ జరిగే ప్రపంచ ఆర్థిక సదస్సులో ఆ బృందం పాల్గొననుంది.

చంద్రబాబూ.. డబుల్ గేమ్ మానుకో

బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు



మీడియాతో మాట్లాడుతున్న సోము వీర్రాజు

కడప కోటిరెడ్డి సర్కిల్: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు డబుల్ గేమ్ ఆడటం మానుకుంటే గౌరవంగా ఉంటుందని ఎమ్మెల్సీ సోము వీర్రాజు హితవు పలికారు. గురువారం వైఎస్సార్ జిల్లా కడపలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పుప్పాల శ్రీనాథ్‌రెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ఎన్నికలకు ముందు కేసీఆర్‌తో పొత్తు పెట్టుకునేందుకు చంద్రబాబు తహతహలాడారని, కేసీఆర్ ముఖం మీద కొట్టేసరికి దిక్కుతోచక కాంగ్రెస్‌తో కలిసే దౌర్భాగ్య స్థితికి వచ్చారని సోము వీర్రాజు ఆరోపించారు. అభివృద్ధి విషయంలో నాలుగున్నరేళ్లు నిద్రపోయి ఇప్పుడు షో చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం తానే లేఖ ఇచ్చానని ఒకపక్క చెబుతూ.. ఏపీకి వచ్చి అడ్డగోలుగా విభజన చేశారని చంద్రబాబు ప్రజలను రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. పోలవరానికి వ్యతిరేకంగా తెలంగాణ ఎంపీ రాజ్యసభలో నినాదాలు చేస్తుంటే టీడీపీ ఎంపీలు సీఎం రమేష్, సుజనాచౌదరి మౌనంగా నిలబడ్డారని గుర్తు చేశారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులిస్తుంటే.. నిధులివ్వలేదని కేంద్రాన్ని నిందించడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందుల రాజమోహన్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్‌రెడ్డి, మజ్దూర్ సేవా రాష్ట్ర అధ్యక్షుడు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలిపై బండలేస్తారా?

- షర్మిలకు భరోసా ఇవ్వాల్సింది పోయి బెదిరిస్తారా?
- ముఖ్యమంత్రి చేయాల్సిన పనేనా ఇది..
- వైఎస్సార్‌సీపీ నేత వాసిరెడ్డి పద్మ మండిపాటు



సాక్షి, అమరావతి: తనకు అన్యాయం జరుగుతోందని చెప్పిన బాధితురాలిపై బండలు వేయడం సీఎం చంద్రబాబుకే చెల్లిందని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి వాసిరెడ్డి పద్మ ధ్వజమెత్తారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుమార్తె, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ సోదరి షర్మిల మీద సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న దుష్ప్రచారంపై స్వచ్ఛందంగా కేసు నమోదు చేసి తక్షణ చర్యలు తీసుకోవాల్సిన చంద్రబాబు.. తన హోదాను మరచి ఎదురుదాడికి దిగడం, ఆమెపై బండలు వేయడం ఎక్కడైనా ఉంటుందా? అని వాసిరెడ్డి పద్మ నిలదీశారు. హైదరాబాద్‌లోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. పోలీసు వ్యవస్థను తన చెప్పుచేతల్లో పెట్టుకున్న సీఎం గత నాలుగున్నరేళ్లుగా రాష్ట్రాన్ని ఏ విధంగా పాలిస్తున్నారో అందరూ చూస్తూనే ఉన్నారన్నారు. ఇలాంటి పరిస్థితుల మధ్య షర్మిల హైదరాబాద్‌లో పోలీసులకు ఫిర్యాదు చేస్తే దాన్ని కూడా చంద్రబాబు తప్పుపడతారా? వేరే రాష్ట్రంలో ఫిర్యాదు ఇవ్వడమేంటని బెదిరిస్తారా? అని ఆమె ప్రశ్నించారు. షర్మిల ధైర్యంగా ముందుకు వచ్చినందుకు అభినందించాల్సిందిపోయి ఎదురుదాడి చేయడం దారుణమన్నారు. ఆమెపై దుష్ప్రచారం చేయాల్సిన అవసరం చంద్రబాబు, ఆయన గ్యాంగ్‌కు తప్ప ఎవరికీ లేదన్నారు. ఈ తరహా ప్రచారమే చంద్రబాబు ఇంట్లో వాళ్లపై జరిగితే ఆయన కళ్లప్పగించి చూస్తారా? అని ప్రశ్నించారు. సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగిన ఓ కుటుంబానికి చెందిన మహిళపైనే ఇంతటి దుష్ప్రచారం జరుగుతుంటే ఇక సాధారణ మహిళల పరిస్థితేంటని ఆందోళన వ్యక్తం చేశారు. చంద్రబాబు ఉసిగొల్పితేనే వర్ల రామయ్య, శోభా హైమావతి, బాబు రాజేంద్రప్రసాద్, జేసీ దివాకర్‌రెడ్డి లాంటి వాళ్లు షర్మిల గురించి మాట్లాడారని ఆరోపించారు. కాల్‌మనీ సెక్స్ రాకెట్ విషయంలో పోలీసులను ఎలా వాడుకున్నారో అందరికీ తెలుసునన్నారు. మహిళా అధికారి వనజాక్షితో టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని దురుసుగా ప్రవర్తిస్తే అతన్ని ఏం చేశారని ప్రశ్నించారు.

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిగా గోపాలకృష్ణ ద్వివేది

ప్రస్తుత ప్రధాన ఎన్నికల అధికారి సిసోడియా బదిలీ

- ఓటర్ల జాబితాల్లో అవకతవకలు, బోగస్ ఓటర్లను తొలగించడంలో అలసత్వమే కారణం.. బాధ్యతలు చేపట్టిన గోపాలకృష్ణ ద్వివేది
- అందరి సహకారంతో ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహిస్తానని వెల్లడి
- ఎన్నికల ఏర్పాట్లపై నేడు అఖిలపక్ష సమావేశం



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిగా గోపాలకృష్ణ ద్వివేదీ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గోపాలకృష్ణ ద్వివేదీని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్‌చంద్ర పునేఠా గురువారం నోటిఫికేషన్ జారీ చేశారు. ప్రస్తుత ప్రధాన ఎన్నికల అధికారి సిసోడియాను బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఎన్నికల ముందు ప్రస్తుత ప్రధాన ఎన్నికల అధికారిని బదిలీ చేయాలని నిర్ణయించడానికి ఓటర్ల జాబితాల్లో అవకతవకలు, బోగస్ ఓటర్లను తొలగించడంలో అలసత్వం తదితరాలే కారణమని అధికార వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్రంలో అధికార పార్టీ నేతలు లక్షల సంఖ్యలో బోగస్ ఓటర్లను చేర్పించడం, ప్రతిపక్షానికి మద్దతుదారులైన ఓటర్లను జాబితాల నుంచి తొలగించడం వంటి అక్రమాలు చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సిసోడియాను మార్చాలని కేంద్ర ఎన్నికల సంఘం స్వయంగా నిర్ణయం తీసుకుంది. ఆయన స్థానంలో నియమించడానికి ముగ్గురు అధికారుల పేర్లతో కూడిన జాబితా పంపాలని కోరింది. ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జాబితా పంపింది. వచ్చే ఎన్నికలను నిష్పక్షపాతంగా, సమర్థవంతంగా నిర్వహించాలనే ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిగా 1993 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన గోపాలకృష్ణ ద్వివేదీని కేంద్ర ఎన్నికల సంఘం ఎంపిక చేసిందని అధికార వర్గాలు తెలిపాయి.

ఎన్నికల ఏర్పాట్లను ప్రారంభించిన ఈసీ

రాష్ట్ర శాసన సభతోపాటు లోక్‌సభ సాధారణ ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు ప్రారంభించింది. ఇందులో భాగంగా సొంత జిల్లా, నియోజకవర్గం, మండల కేంద్రాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను అక్కడి నుంచి బదిలీ చేయాలని, అలాగే నాలుగేళ్లలో మూడేళ్లు ఒకేచోట పనిచేస్తున్న అధికారులను బదిలీ చేయాలని అన్ని రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులను ఆదేశించింది. ఈ మేరకు బదిలీల మార్గదర్శకాలను గురువారం పంపించింది. ఈ బదిలీల ప్రక్రియను ఫిబ్రవరి 28వ తేదీలోగా పూర్తి చేయాలని, సంబంధిత నివేదికను కేంద్ర ఎన్నికల సంఘానికి పంపించాలని పేర్కొంది. సొంత జిల్లాలో లేదా సొంత నియోజవర్గాల్లో పనిచేస్తున్న జిల్లా ఎన్నికల అధికారి(కలెక్టర్) రిటర్నింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్, ఐజీ, డీఐజీ, ఎస్పీ, డీఎస్పీ, పోలీసు ఇన్‌స్పెక్టర్, సబ్ ఇన్‌స్పెక్టర్‌లను ఇతర ప్రాంతాలకు బదిలీ చేయాలని ఆదేశించింది. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులందరూ నాలుగేళ్లలో మూడేళ్ల నుంచి ఒకేచోట పనిచేస్తుంటే, వారిని కూడా అక్కడ నుంచి బదిలీ చేయాలని వెల్లడించింది. గతంలో ఎన్నికల విధుల్లో ఆరోపణలు ఎదుర్కొన్న వారిని ఈసారి ఎన్నికల విధుల నుంచి దూరంగా ఉంచాలని స్పష్టం చేసింది. క్రిమినల్ కేసులు నమోదైన అధికారులను ఎన్నికల విధులకు వినియోగించరాదని తెలిపింది. ఓటర్ల జాబితా సవరణల్లో పాల్గొంటున్న అధికారులను కూడా జాబితాను ప్రకటించిన వెంటనే బదిలీ చేయాలని పేర్కొంది. ఆరు నెలల్లోగా పదవీ విరమణ చేసే ఉద్యోగులకు బదిలీల నుంచి మినహాయింపు ఇచ్చింది. పదవీ విరమణ చేసిన వారిని మళ్లీ సర్వీసులోకి తీసుకుంటే వారిని ఎన్నికల విధుల నుంచి తప్పించాలని తేల్చిచెప్పింది. మార్గదర్శకాల మేరకు బదిలీలు చేసినట్లుగా ఎన్నికల అధికారులందరూ జిల్లా ఎన్నికల అధికారికి, రాష్ట్ర ప్రధాన అధికారికి డిక్లరేషన్ సమర్పించాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది.

ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహిస్తా..

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గురువారం సాయంత్రమే ద్వివేదీ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఏపీ కేడర్‌కు చెందిన ద్వివేదీ కేంద్ర ప్రభుత్వంలో గత ఏడాది వరకూ సంయుక్త కార్యదర్శిగా పనిచేశారు. అనంతరం రాష్ట్ర సర్వీసుకు వచ్చారు. ప్రస్తుతం రాష్ట్ర పశుసంవర్థక శాఖ ముఖ్య కార్యదర్శిగా పనిచేస్తున్నారు. అలాగే సాధారణ పరిపాలన(సర్వీసెస్) శాఖ ముఖ్య కార్యదర్శిగానూ (ఇన్‌చార్జి) బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ద్వివేదీ మీడియాతో మాట్లాడారు. ఎన్నికలకు సమయం తక్కువగా ఉన్నప్పటికీ అందరి సహకారంతో నిష్పక్షపాతంగా, సమర్థంగా నిర్వహిస్తానని చెప్పారు. ఎన్నికల నిర్వహణకు ఈవీఎంలతోపాటు సిబ్బంది సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఓటర్ల జాబితాల్లో అవకతవకలు ఉంటే సరిచేస్తామన్నారు. తప్పులు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓటర్లు ఎప్పటికప్పుడు తమ పేరు ఓటర్ల జాబితాలో ఉందో లేదో తెలుసుకోవాలని సూచించారు. ఓటు విషయంలో ప్రతిఒక్కరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. ఓటు ఉందో లేదో తెలుసుకోవడానికి టోల్‌ఫ్రీ నెంబర్ ఉందన్నారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులతో శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటలకు సచివాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఎన్నికల ఏర్పాట్లపై, తీసుకోవాల్సిన చర్యలపై గోపాలకృష్ణ ద్వివేదీ అఖిలపక్ష నాయకులతో చర్చించనున్నారు.

సిట్ సహాయ నిరాకరణ

కోర్టులో ఎన్ఐఏ పిటిషన్

- ఇంతవరకు విచారణ రికార్డులు అందచేయని విశాఖ పోలీసులు
- ఇతర మెటీరియల్, వస్తువులను అప్పగించాలన్న ఉత్తర్వులు బేఖాతర్
- కోర్టు ఆదేశాలను ఉల్లంఘించడంపై మెమో దాఖలు చేసిన ఎన్ఐఏ



విశాఖలోని ఎన్ఐఏ తాత్కాలిక కార్యాలయం

సాక్షి, అమరావతి బ్యూరో, విజయవాడ లీగల్: ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విశాఖ ఎయిర్‌పోర్టులో హత్యాయత్నం కేసు విచారణకు సంబంధించి రాష్ట్ర పోలీసులు, సిట్ అధికారులు తమకు ఏమాత్రం సహకరించడం లేదని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) న్యాయస్థానం దృష్టికి తెచ్చింది. ఈ మేరకు ఎన్ఐఏ తరపున ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ గురువారం విజయవాడ ఎన్ఐఏ న్యాయస్థానంలో మెమో దాఖలు చేశారు. వాదనలను విన్న అనంతరం దీనిపై విచారణను న్యాయస్థానం రేపటికి వాయిదా వేసింది. వైఎస్ జగన్‌పై గత ఏడాది అక్టోబరు 25న జరిగిన హత్యాయత్నం తీవ్ర సంచలనం సృష్టించింది. ఘటన జరిగిన గంటల వ్యవధిలోనే సీఎం చంద్రబాబు, డీజీపీ ఠాకూర్‌లు స్పందిస్తూ కేసును తప్పుదారి పట్టించేలా వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో ఈ కేసు విచారణను స్వతంత్ర దర్యాప్తు సంస్థలతో నిర్వహించేలా ఆదేశించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ న్యాయస్థానాన్ని ఆశ్రయించడం తెలిసిందే. అనంతరం ఈ కేసుపై విచారణను ఎన్ఐఏకు అప్పగిస్తూ ఉత్తర్వులిచ్చినట్లు కేంద్ర హోం శాఖ న్యాయస్థానానికి నివేదించింది. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు చేపట్టిన విచారణకు సంబంధించిన రికార్డులు, మెటీరియల్, వస్తువులను ఎన్ఐఏకు అప్పగించాలని విశాఖ పోలీసులను కోర్టు ఆదేశించింది. అయితే విశాఖ పోలీసులు కేసుకు సంబంధించిన రికార్డులను ఇంతవరకు తమకు అప్పగించకుండా సహాయ నిరాకరణ చేయడంపై ఎన్ఐఏ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. విశాఖ పోలీసులు కోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తూ తమకు కేసు రికార్డులు, మెటీరియల్, ఆబ్జెక్ట్స్‌అందించడం లేదని పేర్కొంది.

23లోగా చార్జిషీట్ దాఖలు చేయకుంటే నిందితుడికి బెయిల్!

విశాఖ పోలీసు అధికారులు నిందితుడు శ్రీనివాసరావుకు సహకరిస్తున్నారని, తమ విచారణకు మాత్రం సహకరించడం లేదని ఎన్ఐఏ స్పష్టం చేసింది. ఈ కేసులో 90 రోజుల్లోగా అంటే ఈ నెల 23లోగా తాము చార్జ్‌షీట్ దాఖలు చేయాల్సి ఉందని, లేదంటే నిందితుడు శ్రీనివాసరావు బెయిల్‌పై బయటకు వచ్చే అవకాశం ఉందని ఎన్ఐఏ న్యాయస్థానానికి నివేదించింది. ఈ కేసులో తాము ఎఫ్ఐఆర్ దాఖలు చేసి చాలా రోజులైనా రాష్ట్ర పోలీసు అధికారులు విచారణకు ఏ మాత్రం సహకరించడం లేదని తెలిపింది. రికార్డులు లేకుండా చార్జ్‌షీట్ దాఖలు చేయలేమని కోర్టు దృష్టికి తెచ్చింది. కేసుకు సంబంధించిన రికార్డులు, మెటీరియల్, ఆబ్జెక్ట్‌లను తమకు అప్పగించేలా విశాఖ పోలీసులను ఆదేశించాలని ఎన్ఐఏ తరపున ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ న్యాయస్థానాన్ని కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి ఈ కేసు విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు. మరోవైపు వైఎస్ జగన్‌పై హత్యాయత్నం కేసులో నిందితుడు జనుపల్లి శ్రీనివాసరావు కస్టడీ శుక్రవారంతో ముగియనున్న నేపథ్యంలో నేడు కోర్టులో హాజరు పరిచే అవకాశం ఉన్నట్లు తెలిసింది. తదుపరి విచారణ నిమిత్తం నిందితుడిని మరో వారం రోజులు పాటు తమ కస్టడీకి అప్పగించాలని ఎన్ఐఏ కోరే అవకాశం ఉంది.

కుట్ర కోణం వెలుగులోకి వస్తోందనే...

ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌పై హత్యాయత్నం కేసులో రాష్ట్ర ప్రభుత్వ పెద్దలే సూత్రధారులని స్పష్టమవుతోంది. ఈ హత్యాయత్నం కేసులో కుట్ర కోణం వెలుగులోకి వస్తే తమ బండారం బట్టబయలవుతుందని బెంబేలెత్తుతూ రాష్ట్ర పోలీసుల ద్వారా కేసు విచారణను తప్పుదారి పట్టిస్తున్నారు. కోర్టు ఆదేశాలతో ఎన్ఐఏ ఈ కేసు విచారణను చేపట్టడంతో సహాయ నిరాకరణ అస్త్రాన్ని ప్రయోగిస్తున్నారు. న్యాయస్థానం ఆదేశాలను బేఖాతరు చేస్తూ రాజ్యాంగ సూత్రాలను కాలరాస్తూ రాష్ట్ర ప్రభుత్వం బరితెగించడం విస్మయపరుస్తోంది.

సీబీఐకి రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకట్ట

వైఎస్ జగన్‌పై హత్యాయత్నం కేసు విచారణను కేంద్ర ప్రభుత్వ సంస్థలు చేపడితే తమ కుట్ర బట్టబయలవుతుందని ప్రభుత్వ పెద్దలు ఆందోళన చెందారు. ఈ నేపథ్యంలోనే సీబీఐ విచారణకు అనుమతిస్తూ గతంలో ఇచ్చిన అనుమతిని రాష్ట్ర ప్రభుత్వం హఠాత్తుగా ఉపసంహరించుకుంది. ఈమేరకు 2018 నవంబరు 8న ప్రత్యేక జీవో జారీ చేసింది. జగన్‌పై హత్యాయత్నం కేసు విచారణను సీబీఐ చేపట్టకుండా అడ్డుకునేందుకే హడావుడిగా ఈ జీవో ఇచ్చినట్లు స్పష్టమవుతోంది.

'ఎన్ఐఏ'పై సహాయ నిరాకరణ అస్త్రం

న్యాయస్థానం ఆదేశాలతో జగన్‌పై హత్యాయత్నం కేసును విచారిస్తున్న ఎన్ఐఏను సైతం సీఎం చంద్రబాబు తీవ్రంగా వ్యతిరేకించడం న్యాయ నిపుణులను విస్మయపరిచింది. ఎన్ఐఏ విచారణను వ్యతిరేకిస్తూ చంద్రబాబు ప్రధాని మోదీకి లేఖ రాయడంపై జాతీయ స్థాయిలో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ఈ హత్యాయత్నం సూత్రధారులను రాష్ట్ర ప్రభుత్వం రక్షించేందుకు యత్నిస్తోందన్నది దీనిద్వారా మరింతగా ప్రస్ఫుటమైంది. రాష్ట్ర పోలీసుల సహాయ నిరాకరణపై ఎన్ఐఏ తాజాగా న్యాయస్థానంలో మెమో దాఖలు చేయడం గమనార్హం.

రికార్డులను తారుమారు చేసే అవకాశం?

న్యాయస్థానం ఆదేశించిన తరువాత నిబంధనల ప్రకారం జగన్‌పై హత్యాయత్నం కేసుకు సంబంధించిన అన్ని రికార్డులను రాష్ట్ర పోలీసులు ఎన్ఐఏకు అప్పగించాలి. కానీ విశాఖపట్నం పోలీసులు ఇంతవరకు ఆ పని చేయకపోవడం విస్మయపరుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ పెద్దల ఒత్తిడితోనే ఇలా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ రికార్డులను తారుమారు చేసే అవకాశం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

బెయిల్‌పై తరలించి మట్టుబెట్టే కుట్ర?

వైఎస్ జగన్‌పై హత్యాయత్నం ఘటన జరిగిన వెంటనే కేసు విచారణ చేపట్టిన విశాఖపట్నం పోలీసులు ఉద్దేశపూర్వకంగానే రెండు నెలలు దాటినప్పటికీ చార్జ్‌షీట్ దాఖలు చేయలేదు. మరోవైపు ఈనెల 9న విచారణ చేపట్టిన ఎన్ఐఏకు రికార్డులు అందించకుండా సహాయ నిరాకరణ చేస్తున్నారు. దీంతో ఎన్ఐఏ చార్జిషీట్ దాఖలు చేయడంలో జాప్యం జరుగుతోంది. ఈ నెల 23 వరకు ఇలాగే వ్యవహరించి నిందితుడు శ్రీనివాసరావుకు బెయిల్ వచ్చేలా చూడాలన్నది ప్రభుత్వ పెద్దల వ్యూహంగా ఉంది. బెయిల్‌పై శ్రీనివాసరావు బయటకు వస్తే తరువాత ఎలాంటి పరిణామాలు సంభవిస్తాయో అంతు చిక్కకుండా ఉంది. తన ప్రాణాలకు ముప్పు ఉందని ఇప్పటికే నిందితుడు తీవ్ర ఆందోళన వ్యక్తం చేయడం తెలిసిందే. భద్రత లేని బాహ్య ప్రపంచంలోకి శ్రీనివాసరావును తరలించి మట్టుబెట్టేందుకు కుట్ర పన్నారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఎన్ఐఏ దర్యాప్తుపై హైకోర్టుకు సర్కారు!


సాక్షి, అమరావతి: ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నం ఘటనపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) విచారణకు ఆదేశిస్తూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను న్యాయస్థానంలో సవాల్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఎన్ఐఏ దర్యాప్తుపై హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసేందుకు అంతా సిద్ధం చేసింది. ప్రస్తుతం హైకోర్టుకు సంక్రాంతి సెలవులు కావడంతో శుక్రవారం లేదా శనివారం హౌస్‌మోషన్ (న్యాయమూర్తి ఇంటి వద్ద విచారణ జరపడం) రూపంలో పిటిషన్ దాఖలు చేయనున్నట్లు సమాచారం. హౌస్‌మోషన్ రూపంలో అత్యవసరంగా విచారణ జరిపేందుకు హైకోర్టు నిరాకరిస్తే సోమవారం కోర్టు పునఃప్రారంభమయ్యాక ఈ వ్యవహారంపై వాదనలు వినాలని అభ్యర్థించనుంది. హౌస్‌మోషన్ రూపంలో ఈ వ్యాజ్యంపై విచారణ జరిపే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్న ఏపీ హైకోర్టు న్యాయమూర్తులంతా శనివారం లేదా ఆదివారం అమరావతి చేరుకునే వీలుంది. ఎన్ఐఏ తన దర్యాప్తును ఎప్పుడో ప్రారంభించినందున హౌస్‌మోషన్ రూపంలో విచారణ జరిపే అవకాశాలు తక్కువగా ఉన్నాయని భావిస్తున్నారు.

సీఎంతో డీజీపీ ఠాకూర్ భేటీ

ఎన్ఐఏ దర్యాప్తుపై సీఎం చంద్రబాబు గురువారం డీజీపీ ఠాకూర్‌తో ప్రత్యేకంగా సమావేశమై సుదీర్ఘంగా చర్చించారు. ఎన్ఐఏ విచారణను వ్యతిరేకిస్తూ కేంద్రానికి లేఖ రాసినా ప్రయోజనం లేకపోవడంతో కోర్టును ఆశ్రయించి దర్యాప్తును అడ్డుకునే విషయం ఈ సందర్భంగా చర్చకు వచ్చినట్లు తెలిసింది.

ఎన్ఐఏ విచారణకు హర్షవర్ధన్ గైర్హాజరు

సర్కారు పెద్దల అండతోనే పత్తా లేని హర్షవర్ధన్ చౌదరి?



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌పై హత్యాయత్నం కేసులో కీలకంగా భావిస్తున్న టీడీపీ నాయకుడు, విశాఖ ఎయిర్‌పోర్టులోని ఫ్యూజన్‌ఫుడ్స్ రెస్టారెంట్ యజమాని హర్షవర్ధన్ చౌదరి ఎన్ఐఏ విచారణకు గైర్హాజరయ్యారు. కేసు విచారణలో భాగంగా విశాఖలోని కైలాసగిరి పోలీస్ హెడ్‌క్వార్టర్స్ ప్రాంగణంలో తాత్కాలిక కార్యాలయం ఏర్పాటు చేసుకున్న ఎన్ఐఏ అధికారులు 3 రోజులుగా సాక్షులను విచారిస్తున్నారు. హత్యాయత్నం జరిగిన గతేడాది అక్టోబర్ 25న ఘటనాస్థలంలో ఉన్న వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలను కూడా సాక్షులుగా పేర్కొంటూ నోటీసులు పంపగా.. వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పనిచేసే కృష్ణకాంత్, మాజీ కార్పొరేటర్ జియ్యాని శ్రీధర్ 2 రోజులక్రితం హాజరయ్యారు. నోటీసులందుకున్న మిగతా వైఎస్సార్‌సీపీ నేతలు సైతం 2 రోజుల్లో విచారణకు హాజరవుతామని సమాచారమిచ్చారు. అయితే ఈ కేసులో కీలకంగా భావిస్తున్న టీడీపీ నేత, ఎయిర్‌పోర్ట్‌లోని ఫ్యూజన్ ఫుడ్స్ రెస్టారెంట్ యజమాని హర్షవర్ధన్ చౌదరి మాత్రం పత్తా లేకుండా పోయారు. ఈ నెల 15 తర్వాత విచారణకు హాజరుకావాలంటూ ఎన్ఐఏ అధికారులు ఆయన ఇంటికి నోటీసులు పంపినట్టు సమాచారం. గురువారం ఆయన హాజరుకావొచ్చని భావించారు. నిజానికి ఫ్యూజన్ ఫుడ్స్ రెస్టారెంట్ కేంద్రంగానే కుట్ర జరిగిందని, హర్షవర్ధన్ చౌదరికి తెలియకుండా శ్రీనివాసరావు.. వైఎస్ జగన్‌పై హత్యాయత్నం చేసేంతటి ఘాతుకానికి తెగబడడన్న వాదనలు బలంగా వినిపించినా.. పోలీసులు, సిట్ అధికారులు హర్షవర్ధన్ జోలికే పోలేదు. ఈ నేపథ్యంలో ఎన్ఐఏ విచారణకు హర్షవర్ధన్ చౌదరి హాజరైతే కీలక సమాచారం రాబట్టవచ్చన్న వాదనలు వినిపించాయి. దీంతో గురువారమే హర్షవర్ధన్ విచారణకు హాజరు కావొచ్చన్న ప్రచారంతో పెద్దఎత్తున మీడియా ఎన్ఐఏ తాత్కాలిక కార్యాలయం వద్ద గుమిగూడింది. అయితే హర్షవర్ధన్ సహా రెస్టారెంట్‌లో పనిచేసే సిబ్బంది ఎవ్వరూ హాజరు కాలేదు. పైగా హర్షవర్ధన్ ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతోపాటు కొద్ది రోజులుగా పత్తా లేకుండా పోయారన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇటీవల మంత్రి యనమల నగరానికి వచ్చినప్పుడు హల్‌చల్ చేశాడని, ఆ తర్వాత నుంచి కానరావట్లేదని టీడీపీ నేతలే చెప్పుకొస్తుండడం గమనార్హం. ప్రభుత్వ పెద్దల అండతోనే హర్షవర్ధన్ పత్తా లేకుండా పోయారన్న వాదన వినిపిస్తోంది. దీనిపై ఎన్ఐఏ వర్గాలు మాట్లాడుతూ.. ఒకటి, రెండు రోజులు చూసి అప్పటికీ హర్షవర్ధన్ విచారణకు రాకుంటే ఏం చేయాలో నిర్ణయిస్తామని చెప్పాయి.

సాక్షి
శుక్రవారం, జనవరి, 18

లోక్‌పాల్ ఎక్కడ?

లోక్‌పాల్‌ను ఎంపిక చేసేందుకు సెలక్షన్ కమిటీకి ఫిబ్రవరి ఆఖరులోగా పేర్ల జాబితా సమర్పించాలని సెర్చ్ కమిటీ అధ్యక్షుడు జస్టిస్ రంజనా ప్రకాశ్ దేశాయ్‌ని సుప్రీంకోర్టు గురువారంనాడు ఆదేశించింది. 2018 మార్చి నుంచి సర్వోన్నత న్యాయస్థానం కేంద్ర ప్రభుత్వానికి అనేక అవకాశాలు ఇచ్చింది. కానీ వ్యవహారం ఒక కొలిక్కి రాలేదు. నత్తనడక నడుస్తోంది. 2014 ఎన్నికల ప్రచారంలో తరచుగా వినిపించిన మాట లోక్‌పాల్. యూపీఏ ప్రభుత్వం అవినీతిమయమైనదని దుయ్యబడుతూ తాను అధికారంలోకి వచ్చిన వెంటనే లోక్‌పాల్‌ను నియమిస్తానని బీజేపీ ప్రధాని అభ్యర్థిగా నరేంద్రమోదీ ప్రకటించారు. మోదీ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించి (మే 26, 2014) నాలుగేళ్ళ ఎనిమిది మాసాలు గడిచిపోయినాయి. ఇంతవరకూ లోక్‌పాల్‌ను నియమించలేదు. లోక్‌పాల్‌ను నియమించాలనే పట్టింపు ప్రధానికి ఉంటే ఆ పని ఎప్పుడో జరిగేది. ఆ సంకల్పం లేదు. అంతే. ఎన్నికల ప్రచారంలో చేసిన బాసలు కపట రాజకీయంలో భాగమే అనుకోవాలి. గుజరాత్ ముఖ్యమంత్రిగా పని చేసిన 12 సంవత్సరాలలో కూడా మోదీ లోకాయుక్తను నియమించలేదు.

ప్రజాప్రతినిధులలో, ప్రజాసేవకులలో అవినీతిని అరికట్టేందుకు లోక్‌పాల్‌ను నియమించాలన్న ఉద్యమం 1960లలో మొదలయింది. 2010లో ఊపందుకున్నది. అరుణారాయ్ నాయకత్వంలో ప్రజల హక్కుకోసం జాతీయ ఉద్యమం (నేషనల్ కేంపేన్ ఫర్ పీపుల్స్ రైట్స్- ఎన్సీపీఆర్ఐ) జన్‌లోక్‌పాల్ బిల్లు తయారు చేసేందుకు ముగ్గురు సభ్యులతో ఒక కమిటీ నియమించింది. అరవింద్ కేజ్రీవాల్, ప్రశాంత్‌భూషన్, శేఖర్‌సింగ్‌లతో కూడిన కమిటీ ఒక ముసాయిదా బిల్లును రూపొందించారు. దాని ఆధారంగా 2011 జనవరిలో ఢిల్లీలో రాంలీలా మైదానంలో పెద్ద బహిరంగసభ జరిగింది. మూడు మాసాల అనంతరం 2011 ఏప్రిల్‌లో అన్నాహజారే జంతర్‌మంతర్‌లో లోక్‌పాల్ చట్టం కోసం నిరవధిక నిరాహారదీక్ష ఆరంభించారు. ప్రభుత్వం దిగివచ్చింది. బిల్లుకు తుదిరూపం ఇవ్వడానికి తొమ్మిదిమంది ప్రముఖులతో ఒక సంయుక్త సంఘాన్ని అన్నా హజారే నియమించారు. ఇందులో అయిదుగురు సీనియర్ కేంద్ర మంత్రులూ, నలుగురు పౌరసమాజ ప్రముఖులూ ఉన్నారు. ప్రణబ్‌కుమార్ ముఖర్జీ, కపిల్ శిబ్బల్, సల్మాన్ ఖుర్షీద్, వీరప్పమొయిలీ, పి చిదంబరం కేంద్ర మంత్రులు. శాంతిభూషణ్, సంతోష్‌హెగ్డే, కేజ్రీవాల్, ప్రశాంత్‌భూషణ్ పౌరసమాజం ప్రతినిధులు. సంయుక్త సంఘం రెండు అంశాలపైన విభేదాల కారణంగా బిల్లును ఖరారు చేయలేకపోయింది. సెలక్షన్ కమిటీలో రాజకీయ ప్రముఖులు ఉండాలా లేక రాజకీయేతర ప్రముఖులు ఉండాలా అనే అంశంపైనా, సీబీఐ లోక్‌పాల్ కిందికి రావాలా, లేదా అనే అంశంపైనా స్పష్టత కొరవడింది. చివరికి 2013 డిసెంబర్‌లో పార్లమెంటు ఆమోదించిన బిల్లులో ఈ రెండు అంశాల విషయంలో ఉద్యమకారులకు నిరాశ కలిగింది. సెలక్షన్ కమిటీలో ప్రధాని, లోక్‌సభ స్పీకర్, ప్రధాన న్యాయమూర్తి, ప్రతిపక్ష నాయకుడూ, ఒక న్యాయకోవిదుడూ ఉండాలని బిల్లులో ఉంది. సీబీఐ లోక్‌పాల్ పరిధిలోకి రాదని కూడా తేల్చారు. అవినీతిపై పోరాటానికి ఏదో ఒక చట్టం వస్తే అంతే చాలునని హజారే, తదితరులు భావించారు. 2014 జనవరి ఒకటో తేదీన జీవో వచ్చింది. తర్వాత నియమనిబంధనలు నిర్ణయించారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్, సభాపతి మీరాకుమార్, ప్రతిపక్ష నేత సుష్మాస్వరాజ్, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దత్తు, న్యాయకోవిదుడు పిపి రావులు రెండు విడతలు సమావేశమైనారు. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత 45 మాసాలపాటు లోక్‌పాల్ ఊసు లేదు. సెలక్షన్ కమిటీ సమావేశం లేదు. కామన్‌కాజ్ అనే ప్రభుత్వేతర సంస్థ (ఎన్జీవో) తరఫున ప్రశాంత్‌భూషణ్ దాఖలు చేసిన పిటిషన్‌పైన సుప్రీంకోర్టు స్పందించిన కారణంగా సెలక్షన్ కమిటీ సమావేశాలు 2018 మార్చి ఒకటి నుంచి ఇంత వరకూ ఆరుసార్లు జరిగాయి. పీపీ రావు మృతి కారణంగా ముకుల్ రోహత్గీని న్యాయకోవిదుడుగా కమిటీలో నియమించారు. సెలక్షన్ కమిటీ సమావేశాలకు లోక్‌సభలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు మల్లికార్జున్‌ఖర్గేని 'ఆహ్వానితుడుగా' పిలుస్తున్నారు. హాజరు కావడానికి ఆయన నిరాకరిస్తున్నారు. ఆహ్వానితుడికి ఓటింగ్ హక్కు ఉండదు. ఆయన వాగ్మూలం నమోదు కాదు. తనను సభ్యుడిగా ఆహ్వానించాలనీ, లోక్‌పాల్, లోకాయుక్త చట్టం, 2014, స్ఫూర్తిని అనుసరించి అతి పెద్ద ప్రతిపక్షానికి నాయకుడైన తనను ప్రతిపక్ష నాయకుడి హోదాలో ఆహ్వానించాలని ఆయన వాదన. మోదీ అంగీకరించరు. లోక్‌పాల్ చట్టానికి 2016లో ఎన్డీఏ సర్కార్ సవరణ తెచ్చేందుకు ఒక బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టినప్పటికీ అందులో ఈ వివాదానికి పరిష్కారం లేదు. ప్రతిపక్ష నాయకుడి హోదాలో లోక్‌సభలో ఎవ్వరూ లేరు కనుక కమిటీ సమావేశాలు సవ్యంగా జరగడం లేదనీ, సెర్చ్ కమిటీకి ప్రాథమిక సౌకర్యాలు లేవనీ అటార్నీ జనరల్ వేణుగోపాల్ కోర్టులో చెప్పారు. ఇది కేవలం ఒక సాకు. నిజంగా ప్రధానమంత్రికి లోక్‌పాల్ నియామకంపైన చిత్తశుద్ధి ఉంటే సెర్చి కమిటీ అధ్యక్షుడికి అవసరమైన సదుపాయాలు కల్పించవచ్చు. ఖర్గేని ప్రతిపక్ష నాయకుడిగా పరిగణించవచ్చు లేదా తక్కిన నలుగురు సభ్యులూ కలసి ఒక వ్యక్తిని లోక్‌పాల్‌గా నిర్ణయించవచ్చు. ప్రభుత్వం పట్టించుకోవడం లేదు కనుక సుప్రీంకోర్టు నేరుగా లోక్‌పాల్‌ను నియమించాలని ప్రశాంత్‌భూషణ్ వాదిస్తున్నారు. ఎంతో పట్టుదలతో పోరాడి సాధించుకున్న లోక్‌పాల్ చట్టం కేంద్ర ప్రభుత్వం ఉదాసీనత కారణంగా అయిదేళ్ళుగా నిష్ఫలంగా ఉండటం విషాదం. ఆర్టీఐ (సమాచార హక్కు చట్టం), సీఐసీ (సెంట్రల్ ఇన్ఫర్మేషన్ కమిషన్- కేంద్ర సమాచార వ్యవస్థ) నీరుగారి పోతున్నాయంటూ, స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు కోల్పోతున్నాయనీ మాజీ కేంద్ర సమాచార కమిషనర్ ప్రొఫెసర్ మాడభూషి శ్రీధరాచార్యులు ఆవేదన వెలిబుచ్చుతూ రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్‌కు లేఖ రాశారు. రాష్ట్రపతి అయినా పట్టించుకుంటారా?


గ్రహం అనుగ్రహం

శ్రీ విళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు పుష్యమాసం, తిథి శు.ద్వాదశి సా.5.20 వరకు, తదుపరి త్రయోదశి నక్షత్రం రోహిణి ఉ.9.40 వరకు, తదుపరి మృగశిర, వర్జ్యం ప.3.04 నుంచి 4.36 వరకు, దుర్ముహూర్తం ఉ.8.50 నుంచి 9.34 వరకు, తదుపరి ప.12.31 నుంచి 1.15 వరకు అమృతఘడియలు... ఉ.6.32 నుంచి 8.44 వరకు.

సూర్యోదయం : 6.38
సూర్యాస్తమయం: 5.42
రాహుకాలం : ఉ. 10.30 నుంచి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుంచి 4.30 వరకు

ఏకపక్ష నివేదికతో ఎవరికి మేలు?

విశ్లేషణ



ఐవైఆర్ కృష్ణారావు

కేంద్ర ప్రభుత్వం అభిప్రాయాల్ని పొందుపరచకుండా ఏపీకి కేంద్రం నుంచి 85 వేల కోట్లు రావాలంటూ లోక్‌సత్తా వ్యవస్థాపకులు జయప్రకాష్ నారాయణ ఎన్నికల ముందు ఒక నివేదిక ఇవ్వడం కొన్ని రాజకీయ ప్రయోజనాలకు అనుకూలంగా వ్యవహరించటమే అవుతుంది. జేపీ నిపుణుల కమిటీ నివేదిక విడుదల సమయాన్ని చూస్తే తెలియకుండానే వారు ఒక రహస్య ఎజెండాకు దోహదం చేశారా అని అనుమానమేస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన సమాచారం ఆధారంగా కమిటీ నివేదిక తయారైంది. ఏపీకి చెందిన అన్ని అంశాల్లో కేంద్రాన్ని దోషిగా చూపెట్టడానికి రాష్ట్రం చేస్తున్న ప్రయత్నానికి ఊతమిచ్చే రిపోర్ట్ గానే ఇది మిగిలిపోతుంది.

పవన్ కళ్యాణ్ నిజ నిర్ధారణ కమిటీ రిపోర్టును విడుదల చేసి ఈ మార్చి నెలకు సరిగ్గా ఒక సంవత్సరం. ఆ రిపోర్టు విడుదలైన వెంటనే జయప్రకాష్ నారాయణ ఆ కార్యక్రమాన్ని కొనసాగించాలనే ఉద్దేశంతో కొంతమంది నిపుణులతో మరి ఒక కమిటీని ఏర్పాటు చేశారు. ఏర్పడిన తొలి రోజులలో కమిటీ కార్యక్రమాలకు ప్రసార మాధ్యమాలలో విస్తృత ప్రచారం లభించింది. కానీ ఆ పైన ఈ కమిటీ ఏం చేస్తోంది అనేది చాలా గోప్యంగా ఉంచారు. సరిగ్గా పది నెలల తరువాత ఒక వారం క్రితం జేపీ విజయవాడలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి కేంద్రం నుంచి రాష్ట్రానికి 85 వేల కోట్లు రావాలని ప్రకటించేవరకు ఈ పది నెలల కాలం ఈ కమిటీ ఏం చేస్తున్నది ఎవరికీ తెలియదు. కమిటీలో ఉన్న వారందరూ వివాద రహితులు వారి వారి రంగాలలో నిష్ణాతులు. కానీ ఈ కమిటీ నివేదిక విడుదల చేసిన సమయాన్ని, విధానాన్ని బట్టి చూస్తే వారికి తెలియకుండానే వారు ఒక రహస్య ఎజెండాకు దోహదం చేశారా అని అనుమానం కలుగక మానదు.

పవన్ కళ్యాణ్ ఏర్పాటుచేసిన నిజ నిర్ధారణ కమిటీలో చర్చల సందర్భంగా ఒక అంశం ప్రధానంగా ప్రస్తావనకు వచ్చింది. కమిటీకి సమాచారాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందించింది. సమాచార హక్కుల చట్టం క్రింద ఒక పత్రం సమర్పించడం తప్పితే, కేంద్ర ప్రభుత్వం నుంచి సమాచారం తీసుకురావటానికి కానీ సంప్రదింపులు జరపటానికి కానీ కమిటీ పెద్దగా కృషి చేయలేదు. అటువంటి పరిస్థితులలో కమిటీ నివేదికలో ఈ మొత్తాలు కేంద్రం నుంచి రావాల్సిన మొత్తాలుగా చూపెట్టడం భావ్యం కాకపోవచ్చని నేను పేర్కొన్నాను. ఈ వాదనను కమిటీ అంగీకరించి తదనుగుణంగా నివేదికలో ఈ నిధులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పరిష్కరించుకోవలసిన నిధులుగా పొందుపరచడమైంది. ఇదే అంశాన్ని ఆరోజు విలేకర్ల సమావేశంలో కూడా నేను ప్రస్తావించాను. కానీ, జేపీ ఇవి కేంద్రం నుంచి రావాల్సిన మొత్తాలుగా పేర్కొనటంతో ఆ నివేదికలో పొందుపరచిన అంశాలకు భిన్నంగా ఆ అభిప్రాయం జనబాహుళ్యంలోకి వెళ్ళింది.

ఈ అంశం ఈ నిపుణుల కమిటీ నివేదికకు కూడా ఇంకా ఎక్కువ ప్రాముఖ్యంతో వర్తిస్తుంది. నిపుణుల కమిటీ తన అధ్యయనాన్ని పది నెలల సుదీర్ఘ కాలం కొనసాగించింది. ఈ సమయంలో కేంద్ర ప్రభుత్వాన్ని వారి విధానాన్ని కూడా తెలియజేయవలసిందిగా కమిటీ కోరి ఉండి ఉంటే వారి అభిప్రాయాలు కూడా కమిటీ పరిశీలించి తమ నివేదికలో పొందుపరిచే అవకాశం ఉండి ఉండేది. అప్పుడు కమిటీ నివేదికకు విశ్వసనీయత ఉండేది.అటువంటి ప్రక్రియ కమిటీ చేయలేదు. కేవలం రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన సమాచారాన్ని మూలంగా తీసుకొని కమిటీ తన నివేదికను తయారుచేసింది. ఇటువంటి ఏకపక్ష నివేదిక వల్ల ఒనగూరే ప్రయోజనం ఉండక పోవచ్చు.

ఇక రెండవ అంశం జేఎఫ్ఎఫ్‌సీ నివేదిక ఇచ్చిన కొన్ని రోజులకే ఈ నిపుణుల కమిటీని ఏర్పాటు చేశారు. పరిశీలించవలసిన అంశాలు క్లిష్టమైనవీ, బహుళమైనవీ కావు. రెండు మూడు నెలలలోపు ఈ కమిటీ రిపోర్టు వచ్చి ఉంటే దీని మీద నిర్మాణాత్మకమైన చర్చకు అవకాశం ఉండేది. కానీ, ఎన్నికల ముందు కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించకుండా వారి అభిప్రాయాల్ని పొందుపరచకుండా కేంద్రం నుంచి 85 వేల కోట్లు రావాలంటూ ఒక నివేదిక ఇవ్వడం కొన్ని రాజకీయ ప్రయోజనాలకు అనుకూలంగా వ్యవహరించటమే అవుతుంది.



ఇక కమిటీ నివేదికలోని ఒక్కొక్క అంశాన్ని పరిశీలిస్తే చాలా అంశాల్లో స్పష్టత హేతుబద్ధత కనిపించటం లేదు. ఎక్కడా కూడా ప్రత్యేక హోదా అంశాన్ని కమిటీ ప్రస్తావించ లేదు. ఈ విధంగా ఒక ప్రధానమైన, రాష్ట్రంలో ఆవేశపూరితంగా మారిన ఒక అంశంపై కమిటీ నివేదిక నీళ్లు చల్లినట్లయింది. ప్రత్యేక సహాయాన్ని గురించి ప్రస్తావిస్తూ రూ.16,447 కోట్ల మొత్తాన్ని ఈఏపీ స్కీమ్‌ల ద్వారా తీసుకోవడం సాధ్యం కాదని, ఈ సహాయాన్ని ఇవ్వటానికి ఇతర మార్గాలు అన్వేషించాలని కేంద్ర ప్రభుత్వం సూచించింది. ఈ అంశంలో నిధులు ఇవ్వటానికి ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించడానికి కేంద్రం సిద్ధంగా ఉన్నప్పటికీ, ప్రత్యేక హోదా విషయంలో ఇప్పుడు యూటర్న్ తీసుకుని భీష్మించుకుని కూర్చొని ఉన్న రాష్ట్ర ప్రభుత్వం ఆవిధంగా తీసుకోవడానికి సిద్ధంగా లేదు. అటువంటప్పుడు ఈ మొత్తాన్ని కేంద్రం నుంచి రావాల్సిన నిధులుగా చూపెట్టడంలో అర్థం లేదు. ఈ మొత్తాన్ని రాష్ట్రం తీసుకోవడానికి ఇష్టపడని మొత్తంగా చూపెట్టాల్సి ఉంటుంది.

ఇక వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ప్యాకేజీ గురించి పేర్కొంటూ బుందేల్‌ఖండ్ ప్యాకేజీ తరహాలో కేంద్ర ప్రభుత్వం రూ. 24,350 కోట్లు ఇవ్వాలని సూచించింది. అయితే బుందేల్‌ఖండ్ ప్యాకేజీలో.. అప్పటికే అమల్లో ఉన్న ఉపాధి హామీ పథకం లాంటి వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాలు భాగంగా చేయడం జరిగింది. ఆ మొత్తాన్ని తొలగించిన తర్వాత చేసిన ఎటువంటి పోలిక అయినా సమంజసంగా ఉంటుంది. అదేవిధంగా ప్రతి ప్యాకేజీలోనూ కేటాయింపులకు, చివరికి ఇచ్చే విడుదల మొత్తాలకు వ్యత్యాసాలు ఉంటాయి. మనకు జిల్లాకు 50 కోట్ల చొప్పున ప్రతి సంవత్సరం వచ్చిందీ విడుదలైన మొత్తాలూ. వీటిని పోల్చాలి అంటే బుందేల్‌ఖండ్ ప్యాకేజీలో కూడా మిగిలిన పథకాలలోని మొత్తాలను మినహాయించిన తర్వాత విడుదలైన నిధులను తీసుకొని పోలిక చేయాల్సి ఉంటుంది. పైపెచ్చు బుందేల్‌ఖండ్ ప్యాకేజీ 13 జిల్లాలకు వర్తిస్తుంది. మన వెనుకబడిన జిల్లాల ప్యాకేజీ 7 జిల్లాలకే వర్తిస్తుంది. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకోకుండా బుందేల్‌ఖండ్ ప్యాకేజీని పేర్కొని రూ. 24 వేల కోట్ల దాకా రావాల్సి ఉంటుందని పేర్కొనడం సరైంది కాకపోవచ్చు. ఈ వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి గురించి చర్చించేటప్పుడు కమిటీ మరో ప్రధాన అంశాన్ని ప్రస్తావించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వివిధ ప్రాంతాల మధ్య అభివృద్ధిలో చాలా వ్యత్యాసాలు ఉన్నాయి అనే వాస్తవాన్ని పేర్కొంటూ రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల మధ్య కోస్తా ప్రాంతానికి సమానంగా అభివృద్ధి చెందాలంటే బయట నుంచి వచ్చే పెట్టుబడిలో 85 శాతం ఈ ప్రాంతాలకు వెళ్లాల్సి ఉంటుందని కమిటీ పేర్కొంది. అలాంటప్పుడు ఈనాడు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రీకృతంగా మొత్తం పెట్టుబడులను రాజధాని ప్రాంతంలోనే చేయడాన్ని కమిటీ ప్రస్తావించలేదు ప్రశ్నించలేదు. 85 శాతం కొత్తగా వచ్చే పెట్టుబడులన్నీ వెనుకబడిన ప్రాంతాలకు వెళ్లాలని అన్నప్పుడు అది కేవలం కేంద్రం నుంచి వచ్చే సహాయంతోనే జరగదు. రాష్ట్ర ప్రభుత్వం కూడా తాను పెట్టే పెట్టుబడులను ఒక ప్రణాళిక ద్వారా వెనుకబడిన ప్రాంతాల్లో పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ అంశాన్ని ఎందుకనో కమిటీ పూర్తిగా విస్మరించింది.

ఇక 2014–15 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రెవెన్యూ లోటు విషయంలో ఆ సంవత్సరం కాగ్ నిర్ధారించిన మొత్తం రూ. 16 వేల 78 కోట్లు. దీనికి అదనంగా 2015–16 సంవత్సరంలో అయిన ఖర్చు రూ. 6,800 కోట్లు కలిపి మొత్తం రూ. 23 వేల కోట్ల దాకా 2014–15 సంవత్సరం లోటుగా తేల్చి, దానిలో రూ. 10,300 కోట్ల దాకా ఇంతవరకు భర్తీ చేసిన మొత్తంతో కలిపి కేంద్ర ప్రభుత్వం పూర్తి చేయాలని కమిటీ సూచించడం జరిగింది. ఈ అంశంపై కేంద్రం ఇప్పటికే ఒక నిర్దిష్టమైన అభిప్రాయాన్ని తీసుకొని సుప్రీంకోర్టులో అఫిడవిట్ కూడా దాఖలు చేసింది. కమిటీ ఈ అంశంమీద కేంద్ర ప్రభుత్వంతో చర్చించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇక పరిశ్రమల కేంద్ర కార్యాలయాలు హైదరాబాదులో ఉండటంతో భవిష్యత్తులో కట్టవలసిన పన్నులు అక్కడ కట్టడం వల్ల రాష్ట్రానికి వచ్చే నష్టాన్ని రూ. 3,800 కోట్లుగా నిర్ధారించారు. ఇది ఆంధ్రప్రదేశ్ తప్పకుండా రావాల్సినటువంటి మొత్తం. కానీ ఇంతవరకు ఈ మొత్తాన్ని భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఎక్కడా కేంద్రాన్ని అడగలేదు. కేవలం చట్టాన్ని సవరించాలని మాత్రమే కోరింది. సవరణ సాధ్యం కాదని కమిటీ తేల్చినందువలన ఈ మొత్తాన్ని వెంటనే చెల్లించవలసిందిగా రాష్ట్రం కేంద్రాన్ని అభ్యర్థిస్తే బాగుంటుంది.

పోలవరం విషయంలో కమిటీ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన సమాచారాన్ని విశ్లేషించకుండా నమ్మి నివేదికను రూపొందించింది. 2019 సంవత్సరానికి 41 మీటర్ల ఎత్తుతో పోలవరం ప్రాజెక్టు పూర్తి అవుతుందని కమిటీ ఎట్లా నమ్మిందో అర్థం కావటం లేదు. మొదటి నాలుగేళ్ల పని మందకొడిగా నడవడానికి కారణాలు, అనూహ్యంగా అంచనాలు పెంచడానికి కారణాలను కొంత లోతుగా అధ్యయనం చేసి ఉంటే బాగుండేది.

జాతీయ స్థాయి విద్యా సంస్థల ఏర్పాటు కేంద్రానికి కొత్త కాదు. ఇతర రాష్ట్రాల్లో ఏర్పాటుచేసిన దానికన్నా ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయడంలో అలసత్వం ఉందా అనే అంశాన్ని పరిశీలించి వ్యాఖ్యానించి ఉంటే బాగుండేది. ఆ పని చేయకుండా కొన్ని సంవత్సరాల్లో రావాల్సిన మొత్తం అంతటిని గంపగుత్తగా ఒకేసారి రావాలి అనేవిధంగా నివేదికలో రూపొందించటం కేవలం వాస్తవాలను వక్రీకరించడమే.

ఇక రాజధాని అంశాన్ని వివిధ మౌలిక సదుపాయాల కల్పనను కమిటీ ప్రస్తావించింది. గత సంవత్సరం నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్య పరిష్కారం మీద దృష్టి పెట్టకుండా కేంద్రాన్ని దోషిగా చూపెట్టడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నది. రాష్ట్రం వైఖరి ఆ విధంగా ఉన్నప్పుడు ఈ నివేదిక సమస్య పరిష్కారానికి తోడ్పడదు. కేంద్రాన్ని దోషిగా చూపెట్టడానికి రాష్ట్రం చేస్తున్న ప్రయత్నానికి ఊతమిచ్చే రిపోర్ట్ గానే ఇది మిగిలిపోతుంది.

వ్యాసకర్త ఏపీ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి
ఈ–మెయిల్ : iyrk45@gmail.com

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఫేక్



"నేను రాజీనామా చేశానంటూ భారతీయ జనతా పార్టీ అనుకూల చానెల్ రిపబ్లిక్ టీవీ ఫేక్ న్యూస్‌ను ప్రసారం చేస్తోంది. రాష్ట్రంలో మాకు మద్దతు పెరుగుతుండటంతో ప్రధాని నరేంద్ర మోదీ తన చానెల్ ద్వారా ఇలా ఫేక్ న్యూస్ ప్రసారం చేయిస్తున్నారు. నేను ఇక్కడే ఉంటాననీ, ఒడిశా ప్రజల తరఫున కాంగ్రెస్ పార్టీ పోరాడుతూనే ఉంటుందని ఆయనకు హామీ ఇస్తున్నా"

– నిరంజన్ పట్నాయక్
ఒడిశా పీసీసీ అధ్యక్షుడు

విశ్వగురు



"ప్రజలంతా సుఖంగా ఉండాలనే తత్వాన్ని భారతదేశం ఎప్పటి నుంచో విశ్వసిస్తోందని అంతా గుర్తు చేసుకోవాలి. ఒకప్పుడు విశ్వగురువుగా పేరొందినప్పటికీ మన దేశం ఎవరిపైనా పెత్తనం చెలాయించలేదని కూడా అందరూ గుర్తించాలి"

– వెంకయ్య నాయుడు
ఉప రాష్ట్రపతి

సెలబ్రేషన్



"భద్రతా దళాలకు సంబంధించి 2018ని గ్రేట్ ఇయర్ అంటే ఒప్పుకోను. ఒక్క యువకుడు కూడా మిలిటెంట్లలో చేరనప్పుడు, ఎన్‌కౌంటర్లలో ఉగ్రవాదులు, భద్రతా సిబ్బంది మరణించనప్పుడే గొప్ప ఏడాదిగా లెక్క"

– ఒమర్ అబ్దుల్లా
జమ్మూకశ్మీర్ మాజీ సీఎం

దారుణం



"ఏ మాత్రం ప్రతిభావంతంగా లేని స్క్రిప్ట్, నమూనా స్థాయికి దిగజారిపోయిన పాత్రలు, ప్రెస్ అడ్వయిజర్ పాత్రను జేమ్స్ బాండ్ 007లా మలచడం వెకిలిగా అనిపిస్తుంది. మాజీ ప్రధాని మన్మోహన్‌పై రూపొందించిన యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్ సినిమా దారుణంగా ఉంది"

– సాగరికా ఘోష్, జర్నలిస్టు

ఏడాది



"ఎనిమిదేళ్ల బాలికపై అత్యాచారం జరిపి, హత్య చేసిన ఘటనకు నేటితో ఏడాది. అటువంటి సంఘటనను ఖండించాల్సిన బీజేపీ నేతలు అత్యాచారం జరిపినవారికి మద్దతుగా ప్రదర్శనలు చేయడం బాధాకరం. అత్యాచారం వంటి నేరాలకు కూడా మతం రంగు పులమడం, దారుణాలను సమర్థించుకోవడం విచారకరం."

– మెహబూబా ముఫ్తీ, పీడీపీ అధ్యక్షురాలు

సీబీఐని చుట్టుముట్టిన ఆ రహస్యాలు ఏమిటి?

విశ్లేషణ



మాడభూషి శ్రీధర్

సీబీఐ డైరెక్టర్ పదవినుంచి ఆలోక్ వర్మను బదిలీ చేయడం అంటే తొలగించడమనే అర్థం. అర్ధరాత్రి హఠాత్తుగా ఆలోక్ వర్మను తొలగించే అధికారం ప్రభుత్వానికి లేదని, సీబీఐ చట్టం కింద కాకుండా నియామకాలు, తొలగింపుల కోసం ఏర్పాటయిన అత్యున్నత అధికార కమిటీకి మాత్రమే ఆ అధికారం ఉందని సుప్రీంకోర్టు తీర్పు వెల్లడిస్తే, ఇంకా న్యాయం మినుకుమినుకు మని మెరుస్తున్నదని సంతోషించాం. అంతలోనే ప్రధానమంత్రి, ప్రతిపక్ష నాయకుడు, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో కూడిన అత్యున్నతాధికార కమిటీ హఠాత్తుగా సమావేశమైంది. ముందే ఒక నిర్ణయం తీసుకున్నట్టు కనిపించే వాతావరణం. ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ హాజరైనప్పటికీ, తొలిరోజు ఏ నిర్ణయానికి రాలేదు. మరునాడు మళ్లీ కమిటీ సమావేశమైంది. ప్రధాని, ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గేతోపాటు ప్రధాన న్యాయమూర్తి ప్రతినిధిగా జస్టిస్ ఎ.కె. సిక్రీ హాజరయ్యారు. సమావేశం వేగంగా నిర్ణయం తీసుకున్నది. సీబీఐ డైరెక్టర్ పదవిలో ఉన్న ఆలోక్ వర్మను ఏ ప్రాధాన్యతాలేని ఫైర్ శాఖకు బదిలీ చేశారు.

కేవలం ఆ అధికారం ఉంది కనుక కమిటీ ఆయన్ను తొలగించేయవచ్చా? అందుకు ఆధారం ఏదీ ఉండనవసరం లేదా అని న్యాయపరమైన ప్రశ్న. కమిటీలోని ముగ్గురిలో ప్రతిపక్ష నాయకుడుగా ఉన్న ఖర్గే ఒక్కరే తొలగింపు చర్యను వ్యతిరేకించారు. జనవరి 10న అత్యున్నతాధికార కమిటీ సమావేశంలో జరిగిన చర్చలను, నిర్ణయాన్ని వివరించే మినిట్స్ పత్రం ప్రతి కావాలని అడిగారు.

సీవీసీ ఇచ్చిన నివేదిక ఆధారంగా సీబీఐ డైరెక్టర్‌ను తొలగించారని అంటున్నారు. మొదటిసారి వర్మను తొలగించినప్పుడు సుప్రీంకోర్టులో ఆయన సవాలు చేశారు. తొలగింపునకు కారణాలని భావిస్తున్న అంశాలను సీవీసీ పరిశోధించాలనీ, ఆ పరిశోధనను మాజీ న్యాయమూర్తి ఎ.కె. పట్నాయక్ పర్యవేక్షించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. జస్టిస్ పట్నాయక్ వర్మను తొలగించేంత తీవ్రమైన అవినీతి, అక్రమాల ఆరోపణలకు ఏవిధమైన సాక్ష్యాలు లేవని, కనుక వర్మ తొలగింపు చాలా తొందరపాటు చర్య అని విమర్శించారు. సీవీసీ నివేదికను, పట్నాయక్ నివేదికను చదివిన తరువాత, ఆలోక్ వర్మ వివరణను విని సొంత బుర్ర ఉపయోగించి నిర్ణయం తీసుకోవలసిన బాధ్యత కమిటీపైన ఉందని మల్లికార్జున ఖర్గే ప్రధానమంత్రికి రాసిన లేఖలో వ్యాఖ్యానించారు. మరొక డైరెక్టర్ తాత్కాలిక నియామక ప్రతిపాదనను కమిటీ ముందుకు ఎందుకు తీసుకురాలేదని కూడా ఆయన నిలదీశారు. జస్టిస్ పట్నాయక్ గారు ఆ సీవీసీ నివేదికతో తనకు ఏ ప్రమేయమూ లేదని, అది కేవలం సీవీసీకి మాత్రమే చెందిన నివేదిక అనీ, సీవీసీ దర్యాప్తును పర్యవేక్షించడానికి సుప్రీంకోర్టు నియమించిన మాజీ న్యాయమూర్తి స్వయంగా వివరిస్తూ ఉంటే ఆ నివేదికను కమిటీ సభ్యులకు ఇవ్వకుండా, పట్నాయక్ నివేదికను కమిటీలో పరిశీలించకుండా, ఇంత తీవ్ర నిర్ణయాలు ఎలా తీసుకుంటారు?


ప్రభుత్వం తనకు అధికారం లేకున్నా ఆలోక్ వర్మను తొలగించేసింది. ఆయన సవాలు చేస్తే సుప్రీంకోర్టు ఆయనకు కోల్పోయిన పదవి ఇచ్చింది. కానీ ఆలోక్ వర్మను రెండురోజుల్లో మళ్లీ తొలగించేశారు. తొలగించే నిర్ణయం తీసుకున్న కమిటీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి మొదటి రోజు ఉన్నారు. మరునాడు ఆయన ప్రతినిధిగా మరో జడ్జిగారు రావడమే కాకుండా ప్రధానితో పాటు ఏకీభవించి ఆలోక్ వర్మ తొలగింపు నిర్ణయాన్ని సమర్థించారు. ఇవి న్యాయవ్యవస్థ ప్రతిష్ఠకు విశ్వసనీయతకు సంబంధించిన కీలక అంశాలు. ఈ పరిణామాల్లో ఎక్కడా పారదర్శకత మచ్చుకైనా లేకపోవడం ప్రమాదకరం. జస్టిస్ పట్నాయక్ నివేదికను, సీవీసీ నివేదికను ఎవరు చూశారు? అందులో ఏముంది? వాటి ప్రతులు మల్లిఖార్జున ఖర్గేకు ఎందుకు ఇవ్వలేదు. ప్రధాన మంత్రి, న్యాయమూర్తి అయినా ఆ నివేదికలు చదివారా? అర్థం చేసుకున్నారా? అందులో కొంపముంచే ఆరోపణలు ఏమున్నాయని, ఎందుకు డైరెక్టర్‌ను తొలగించవలసి వచ్చిందో చెప్పవలసిన బాధ్యత ఆ పెద్దల మీద లేదా? ఇవి చాలా తీవ్రమైన ప్రశ్నలు.

నిజానికి ఈ దేశంలో ప్రతిపౌరుడికి తెలియాల్సిన వివరాలు ఇవి. సీబీఐ వంటి అత్యున్నతస్థాయి సంస్థలో అర్ధరాత్రి దర్యాప్తు బృందంలోని పోలీసు అధికారులను ఉన్నట్టుండి, ఏ కారణమూ చెప్పకుండా, దేశంలోని మారుమూల ప్రాంతాలకు చెల్లాచెదురుగా విసిరేస్తూ బదిలీలు జరపడం, అందు కోసం నంబర్ వన్, నంబర్ టు స్థానాల్లో ఉన్న ఉన్నతాధికారులను పదవిలోంచి తప్పించడం ఆశ్చర్యకరమైన పరిణామాలు. ఆ బృందం దర్యాప్తు చేస్తున్న ఆరోపణలు ఏమిటి? ఏ కీలకమైన నాయకులను రక్షించడానికి ఈ తతంగమంతా?

వ్యాసకర్త కేంద్ర మాజీ సమాచార కమిషనర్
professorsridhar@gmail.com

ఆ 'పొత్తు' దేశానికే నమూనా!

సందర్భం



వై. కోటేశ్వరరావు

ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాది, బహుజన సమాజ్‌పార్టీలు రెండూ కలిసి పొత్తు ఏర్పాటు చేసుకొని, 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఉమ్మడిగా పోటీ చేయ్యాలనే నిర్ణయానికి రావడాన్ని సోషల్ జస్టిస్ పార్టీ తరఫున ఆహ్వానం పలుకుతున్నాం. మొత్తం 80 స్థానాల్లో చెరి 38 స్థానాలు కలిపి 76 స్థానాల్లో పోటీ చేయాలని నిర్ణయించుకుని, తద్వారా ఐక్యకూటమి పని విధానానికి ఆ రెండు పార్టీలు ఒక నమూనాగా నిలిచాయి. మిగిలిన 4 సీట్లను మిత్రులకు వదిలివేయాలని భావించి, కలుపుకొని వెళ్ళే దృక్పథాన్ని ఆ పార్టీలు ప్రదర్శించాయి. దీంతో 1993లో బహుజన సమాజ్ పార్టీ అధినేత కాన్షీరామ్, సమాజ్‌వాదీ పార్టీ అధినేత ములాయంసింగ్ యాదవ్‌లు ఐక్యంగా పోరాడి, అధికారం సాధించిన గొప్ప చరిత్ర మళ్ళీ పునరావృతం కానుంది. ఇరుపార్టీలు విడివిడిగా పోటీచేసిన దుష్ఫలితంగానే 2014 లోక్‌సభ ఎన్నికల్లోనూ, 2017 శాసనసభ ఎన్నికల్లోనూ అగ్రకులోన్మాద, మతోన్మాద శక్తులు పైచేయి సాధించాయి. ఆ తరువాత జరిగిన గోరఖ్‌పూర్, ఫూల్‌పూర్, ఖైరానా లోక్‌సభ నియోజక వర్గాల ఉపఎన్నికల్లో ఎస్పీ, బీఎస్పీలు కలిసికట్టుగా పోటీచేయగా, బీజేపీ మట్టికరచింది. ఈ విజయాలు కాంగ్రెస్‌తో నిమిత్తం లేకుండానే సాధించటం విశేషం.

తాజాగా, ఈ రెండు పార్టీలే ఒక ఎన్నికల ఒప్పందానికి రావటం భారత రాజకీయాల్లోనే ఒక మలుపు, నిజానికి ఎస్పీ, బీఎస్పీల కలయిక అంటే, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఐక్యతే. ప్రస్తుతం ఏర్పడిన ఈ రెండు పార్టీల పొత్తు జ్యోతిబా పూలే, బాబాసాహెబ్ అంబేడ్కర్ ప్రవచించిన సామాజిక న్యాయం, సామాజిక ప్రజాస్వామ్య లక్ష్యాల దిశగా వేసే మరో ముందడుగుగా చరిత్ర పుటల్లో నిలిచిపోతుంది. ఈ రెండు పార్టీల కలయిక, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల రాజకీయ ఐక్యత ప్రాముఖ్యం కేవలం యూపీకే పరిమితం కాదు. యావత్ దేశానికీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కూడా వర్తిస్తుంది. జాతీయంగాగానీ, ప్రాంతీయంగాగానీ, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలూ, వివిధ రాష్ట్రాల్లోని ప్రాంతీయ పార్టీలు అన్నీ ఆధిపత్య కులం అనే ఉమ్మడి స్వభావం కలిగినట్టివే. అవి జాతీయ స్థాయిలోనూ, ప్రాంతీయస్థాయిలోనూ, ఒక దానికి మరొకటి నిజమైన ప్రత్యామ్నాయం కాజాలవు.

బీజేపీకి, కాంగ్రెస్‌కి మధ్య ఎలాంటి భిన్నమైన సామాజిక స్వభావం గానీ, ఆర్థిక విధానాలు గానీ లేవు. హిందుత్వ స్వభావం మాత్రం రెంటికీ ఉమ్మడి గుణమే. అది ఇటీవలి రాహుల్‌గాంధీ దేవాలయాల సందర్శనలు, పూజా పునస్కారాల ద్వారా అతి స్పష్టంగా బహిర్గతమౌతోంది. అయితే కాంగ్రెస్ పార్టీ మేకవన్నె పులిలాగా తన నిజస్వరూపాన్ని కప్పిపుచ్చుకుంటూ మోసపూరితమైన వాదనలతో లౌకికవాద జపంచేస్తూ కుయుక్తులతో ఎస్పీ, బీఎస్పీల సామాజిక శిబిరంలో దూరాలని కుటిలప్రయత్నం చేస్తోంది. గొర్రెలమందలోనికి దూరాలని తోడేలు చేసే దుష్ప్రయత్నం వంటిదే, ఇప్పుడు కాంగ్రెస్ చేస్తోంది. అయితే, ఈ కుట్రను పసిగట్టిన అఖిలేశ్, మాయావతిలు కాంగ్రెస్‌ని సరిగ్గానే దూరంగా పెట్టారు. ఈ విధానం తాత్కాలిక ఎత్తుగడగానే కాకుండా, వ్యూహాత్మకంగానే కొనసాగిస్తూ, జాతీయ స్థాయిలో నిజమైన సామాజిక ప్రత్యామ్నాయ రాజకీయశక్తులను కూడగట్టడం ఆ రెండు పార్టీల ముందున్న నేటి చారిత్రక కర్తవ్యం. ఇందుకు దోహదపడే విధంగా, ఆంధ్రప్రదేశ్‌లోనూ అలాగే, అన్ని రాష్ట్రాలలోనూ పోరాడుతోన్న సామాజిక, రాజకీయ, ప్రజాస్వామిక శక్తులు తమ తమ విధానాలను, కార్యాచరణనూ మలచుకోవాలి.ఈ మహత్తర కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ లోని సామాజిక రాజకీయ శక్తులు కూడా క్రియాశీలకపాత్ర వహించాలి. ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ప్రజలు ఒక స్వతంత్ర రాజకీయశక్తిగా 2019 ఎన్నికల్లో పోటీ చెయ్యాలి.

ఈ సందర్భంగా ఒక విషయం చెప్పాలి. పార్లమెంట్‌లో ఇటీవల 124వ రాజ్యాంగ సవరణ ద్వారా అగ్రవర్ణాలకు ఆర్థిక వెనుకబాటుతనం ముసుగులో 10% రిజర్వేషన్లు కల్పించిన సందర్భంలో ఎస్పీ, బీఎస్పీలు తీసుకున్న వైఖరి ప్రస్తుత రిజర్వేషన్ వర్గాలకు నష్టకరం అనే విషయం సుస్పష్టమే. ఎందుకంటే, రిజర్వేషన్లకు మౌలిక ప్రాతిపదికగా ఉంటున్న సామాజిక న్యాయానికి వ్యతిరేకంగా, ఆర్థిక వెనుకబాటుతనాన్ని మాత్రమే ప్రాతిపదికగా చేసుకొని కల్పించిన రిజర్వేషన్లను దేశంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ప్రజలందరూ ముక్తకంఠంతో తిరస్కరిస్తున్నారు. ఎస్పీ, బీఎస్పీలు ఈ విషయమై తమ వైఖరిని పునరాలోచించుకోవాలి. ఏదేమైనా ఉత్తరప్రదేశ్‌లో ఎస్పీ, బీఎస్పీల పొత్తును ఆహ్వానిస్తూ, రాష్ట్రంలోనూ, దేశంలోనూ ఆ నమూనాలో 2019 ఎన్నికల్లో తగుచర్యలు తీసుకొన వలసిన తక్షణ కర్తవ్యం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రాజకీయశక్తులపై ఉంది. ఓట్లు మనవే సీట్లూ మనవే, మన ఓట్లు మనకే వేసుకొందాం. రాజ్యాధికారాన్ని సాధించుకొందాం.

వ్యాసకర్త సీనియర్ అడ్వకేట్, సెంటర్ ఫర్ సోషల్ జస్టిస్, మొబైల్ : 98498 56568

నిధుల కోసం పట్టణాభివృద్ధి సంస్థల అగచాట్లు

అభివృద్ధి పనులకు డబ్బులివ్వని రాష్ట్ర ప్రభుత్వం

- జీతాలకు సరిపోతున్న ప్రభుత్వ నిధులు
- అక్రమ లేఅవుట్లు, భవనాల క్రమబద్ధీకరణపైనే ఆశలు

సాక్షి, అమరావతి: పట్టణాల్లో అభివృద్ధి పనులకు ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో ఆయా పట్టణాభివృద్ధి సంస్థలు ఆదాయం కోసం అల్లల్లాడుతున్నాయి. ఆదాయ వనరులు పెంచుకునేందుకు వివిధ మార్గాలను ఎంచుకుంటున్నాయి. విశాఖ, గోదావరి అర్బన్ అభివృద్ధి సంస్థ భూ సమీకరణ నోటిఫికేషన్లు జారీ చేశాయి. అయితే ఈ విధానానికి వ్యతిరేకంగా రైతులు ఆందోళన చేస్తుండటంతో అనధికార లేవుట్లు, భవనాల క్రమబద్ధీకరణ ద్వారా ఆదాయం పెంచుకునే యత్నాలు చేస్తున్నాయి. ప్రభుత్వం ప్రకటించిన బీపీఎస్ (బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్)ను వినియోగించుకునే యత్నంలో పడ్డాయి. ఇటీవల గోదావరి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ.. కాకినాడ రూరల్ పరిధిలోని రైతుల నుంచి భూమిని సమీకరించడానికి నోటిఫికేషన్ జారీ చేసింది. భూ సమీకరణకు ముందుకు వచ్చే రైతులకు ఎకరాకు 1200 చదరపు గజాల స్థలాన్ని ఇస్తామని పేర్కొంది. రైతుల నుంచి సమీకరించిన భూమిని అభివృద్ధి చేస్తామని ఆ నోటిఫికేషన్‌లో పేర్కొన్నది. కనీసం 500 ఎకరాలను రైతుల నుంచి సమీకరించాలని భావిస్తోంది. అయితే రైతులు పెద్దగా స్పందించకపోవడంతో ప్రభుత్వం ప్రకటించిన బీపీఎస్‌పై ఆశలు పెంచుకుంది. అనధికార కట్టడాల క్రమబద్ధీకరణ ద్వారా వచ్చే ఆదాయంలో 50 శాతం పట్టణాభివృద్ధి సంస్థకు జమ అయ్యే అవకాశం ఉండటంతో దానిని విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. గోదావరి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి సిబ్బంది జీతాలు, ఇతర ఖర్చులకు నాలుగేళ్ల నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు కేవలం రూ.5 కోట్లనే విడుదల చేసింది. ఇక విశాఖ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఇటీవల 800 ఎకరాల భూ సమీకరణకు నోటిఫికేషన్ జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పట్టణ గృహ నిర్మాణ పథకానికి భూమి కోసం రైతుల నుంచి భూమి సమీకరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. రైతుల నుంచి సమీకరించిన భూమికి అమరావతిలో ఇచ్చిన విధంగా 1,200 చదరపు గజాల స్థలం ఇస్తామని ప్రకటించినా, రైతుల నుంచి తీవ్రస్థాయిలో వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. అనంతపురం, కర్నూలు, మచిలీపట్నం, నెల్లూరు పట్టణాభివృద్ధి సంస్థలు కూడా ఆదాయం లేక మౌలిక సదుపాయాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేకపోతున్నాయి. ప్రభుత్వం నిధులు విడుదల చేయకుండా కొత్తగా పట్టణాభివృద్ధి సంస్థలను ఎన్ని ఏర్పాటు చేసినా ఫలితం ఉండదనే చెబుతున్నారు. ఈ సంస్థలు అనధికార నిర్మాణాలు, అనధికార లే అవుట్ల క్రమబద్ధీకరణపైనే ఎక్కువగా ఆశలు పెట్టుకుంటున్నాయి. వాటి ద్వారా వచ్చే ఆదాయంతో జీతాలు తీసుకుంటున్నాయి.

సర్కార్ 'సహకారం' ఏదీ?



ఈ నెల 10న విజయవాడలో ధర్నా చేస్తున్న సహకార సంఘాల ఉద్యోగులు (ఫైల్)

- సహకార సంఘాల ఉద్యోగుల సమ్మెపై స్పందించని ప్రభుత్వం
- తూతూమంత్రంగా కమిటీ వేసి చేతులు దులుపుకున్న వైనం
- ఉద్యోగులకు తీవ్ర నష్టం చేసేలా ఉన్న కమిటీ సిఫారసులు
- సర్కార్‌పై మండిపడుతున్న ఉద్యోగులు



తూర్పు గోదావరి జిల్లా ద్రాక్షారామంలో అర్ధనగ్నంగా నిరసన తెలుపుతున్న సహకార సంఘం ఉద్యోగులు (ఫైల్)

రామచంద్రపురం రూరల్: రాష్ట్రంలో సహకార సంఘాల ఉద్యోగులు గతేడాది డిసెంబర్ 17 నుంచి తమ సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సొసైటీలు ఇన్ని రోజులుగా మూతపడినా ఉద్యోగుల డిమాండ్లను నెరవేర్చడంలో ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 2,550 సహకార సొసైటీల్లో 8,200 మంది ఉద్యోగులున్నారు. మరోవైపు సమ్మె ప్రభావం రబీ సీజన్‌పై పడింది.

అన్యాయం చేసిన రాష్ట్ర ప్రభుత్వం

2014లో ఉద్యోగులకు వేతన సవరణ చేయడానికి అంగీకరిస్తూ నాటి ప్రభుత్వం 2009లో జీవో 151 జారీ చేసింది. 2014లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉద్యోగుల వేతన సవరణను గాలికొదిలేసింది. అప్పటి నుంచి సహకార ఉద్యోగుల సంఘం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తుండటంతో 2016లో ఏడుగురు ఉన్నతాధికారులతో కమిటీని నియమించి చేతులు దులుపుకుంది. ఈ కమిటీ విశాఖపట్నం, విజయవాడ, తిరుపతిలో సహకార సంఘాల అధ్యక్షులు, సహకార బ్యాంకుల అధ్యక్షులు, అధికారులతో సమీక్షలు నిర్వహించి 2017లో ప్రభుత్వానికి నివేదికను సమర్పించింది. అప్పటి నుంచి ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందని ఉద్యోగ సంఘాలు మండిపడుతున్నాయి.

కమిటీ సిఫార్సులు అంగీకరించని ఉద్యోగులు

ఉన్నతాధికారుల కమిటీ ఉద్యోగులకు వేతనాలు 10 శాతం పెంచాలని సూచించగా.. ఉద్యోగ సంఘాలు 50 శాతం పెంచాలని కోరుతున్నాయి. 2014కు బదులు 2016 నుంచి వేతన సవరణ చేయాలని కమిటీ సిఫారసు చేయగా దీన్ని ఉద్యోగ సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. ఉద్యోగి పదవీ విరమణ చేసినప్పుడు గ్రాట్యుటీ రూ.5 లక్షలు ఇవ్వాలని ఉద్యోగులు కోరుతుండగా.. కమిటీ రూ.2 లక్షలు చాలని ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. 2011 తర్వాత విధుల్లో చేరిన ఉద్యోగులను తొలగించాలని కమిటీ చేసిన సిఫార్సును ఉద్యోగ సంఘాలు ఖండిస్తున్నాయి.

రైతుల పాట్లు

సహకార సంఘాల ఉద్యోగుల సమ్మెతో డీసీసీబీ శాఖల్లో లావాదేవీలు నిలిచిపోయాయి. ఖరీఫ్ పెట్టుబడులు, కుటుంబ ఖర్చుల కోసం ఈ సంఘాల్లో పలువురు రైతులు బంగారు ఆభరణాలు కుదువ పెట్టారు. సంక్రాంతి పండుగ నాటికి వాటిని విడిపించుకోవాలని చూసిన రైతులు ఈ సమ్మెతో నిరాశ చెందారు. మరోపక్క 2017 డిసెంబర్‌లో తీసుకున్న రుణాలు 2018 డిసెంబర్ నెలాఖరులోగా చెల్లిస్తేనే వడ్డీ రాయితీ వర్తిస్తుంది. అయితే సమ్మె వల్ల వడ్డీ రాయితీ కోల్పోయారు. ఇతర వాణిజ్య బ్యాంకుల్లో రబీ పంటకు రుణాలు పొందాలనుకునేవారు పీఏసీఎస్‌ల నుంచి నో అబ్జెక్షన్, నో డ్యూ సర్టిఫికెట్లు పొందాల్సి ఉంటుంది. సొసైటీల సమ్మెతో వీటిని పొందే పరిస్థితి కన్పించడం లేదు. సొసైటీల ద్వారా స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందక అధిక ధరలకు బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సిన దుస్థితి వచ్చిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ ఇబ్బందులకు ప్రభుత్వమే కారణమని ఇప్పటికైనా సహకార సంఘాల ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి వారి సమ్మెకు తెరదించాలని రైతులు కోరుతున్నారు.

పదవీ విరమణ వయసు 60 ఏళ్లకు పెంచాలి



సహకార సంఘాల ఉద్యోగులకు 50 శాతం వేతనాలను పెంచినా ప్రభుత్వంపై ఆర్థిక భారం పడదు. ఈ భారాన్ని సంఘాలే భరిస్తాయి. కమిటీ సిఫార్సుల మేరకు కాకుండా 2014 నుంచే వేతనాలను సవరించాలి. పదవీ విరమణ వయసును 60 ఏళ్లకు పెంచాలి. రాత పరీక్ష లేకుండా సీనియారిటీ ప్రకారం.. డీసీసీబీల్లోని ఖాళీ పోస్టులను సహకార సొసైటీల ఉద్యోగులతో భర్తీ చేయాలి. పదవీ విరమణ చేసేటప్పుడు గ్రాట్యుటీ కింద రూ.5 లక్షలు చెల్లించాలి.

–పెంకే సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి, ఏపీ రాష్ట్ర సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ (సీఐటీయూ)

ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి వీడాలి



దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి నష్టాల్లో ఉన్న సహకార సంఘాలను లాభాల బాట పట్టించారు. టీడీపీ పాలనలో సహకార సంఘాలు మళ్లీ దయనీయ స్థితిలోకి వెళ్లిపోయాయి. ఉద్యోగులు నెల రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వానికి పట్టకపోవడం శోచనీయం. ప్రభుత్వం తక్షణం సమస్యలు పరిష్కరించాలి.

– కొవ్వూరి త్రినాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక ప్రధాన కార్యదర్శి

పింఛన్లపై వంచన!

- లక్షన్నర మంది హెచ్ఐవీ బాధితులుంటే పింఛన్ 30 వేల మందికే
- 12 వేల మందికి పైనే డయాలసిస్ రోగులు.. 3 వేల మందికే సాయం
- టీబీ రోగులు లక్షన్నర మందికి పైనే.. 30 శాతం మందికే నెలకు రూ.500
- ఆరోగ్యశ్రీపైనా అదే తీరు

బాధితులు ఇలా.....

జబ్బు	బాధితుల సంఖ్య	ప్రస్తుతం పింఛను పొందుతున్నది	పింఛను కోసం ఎదురుచూస్తున్నవారు
హెచ్ఐవీ	1.50 లక్షలు	30 వేలు	1.20 లక్షలు
క్షయ	1.60 లక్షలు	20.000	1.40 లక్షలు
డయాలసిస్	12 వేలు	3,000	9 వేలు
థలసేమియా	4 వేలు	000	4 వేలు

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా 3.50 లక్షల మందికి పైగా హెచ్ఐవీ రోగులుండగా కేవలం 30 వేల మందికి మాత్రమే నెలకు రూ.వెయ్యి చొప్పున పింఛను ఇస్తుండటంతో బాధితులు వైద్య ఖర్చులు భరించలేక అల్లాడుతున్నారు. ఏఆర్‌టీ (యాంటీ రిట్రోవైరల్) కేంద్రాల్లో మందులు తీసుకునే 1.50 లక్షల మందిని మాత్రమే పింఛన్లకు అర్హులుగా పేర్కొన్న ప్రభుత్వం ఆమేరకైనా అందరికీ ఇవ్వకుండా కోతలు విధించింది. హెచ్ఐవీ, టీబీ రోగులు నాలుగున్నరేళ్లుగా పింఛన్‌ల కోసం లెక్కలేనన్ని సార్లు కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. చిక్కి శల్యమైన తమను ఆదుకోవాలని అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా సర్కారు కనికరించలేదు. రోగం ఒక శాపం కాగా వివక్ష మరో శాపమై తమను వెంటాడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదేనా న్యాయం?

రాష్ట్రంలో 1.60 లక్షల మంది క్షయ వ్యాధిగ్రస్థులున్నారు. వీరికి పౌష్టికాహారం అత్యవసరం. పౌష్టికాహారం కోసం నెలకు రూ.500 చొప్పున ఇస్తామన్న టీడీపీ సర్కారు కనీసం 20 వేల మందికి కూడా అందించడం లేదు. రాష్ట్రంలో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతూ డయాలసిస్ చేయించుకుంటున్న కిడ్నీ బాధితులు 12 వేల మందికిపైనే ఉండగా పింఛన్లు పొందేవారు 3 వేల మంది కూడా లేరు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారు దీనికి అదనం. 15 శాతం మందిని కూడా ఆదుకోకుండా పింఛన్ మొత్తాన్ని పెంచి అందరికీ న్యాయం చేస్తున్నామని సర్కారు బుకాయించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కొత్తగా ఒక్కరికీ ఇవ్వలేదు...

రాష్ట్ర ప్రభుత్వం 2015 నుంచి కొత్తగా ఒక్క హెచ్ఐవీ బాధితుడికి కూడా పింఛను మంజూరు చేయలేదు. వివక్ష ఎదుర్కొంటున్న హెచ్ఐవీ బాధితులు పింఛన్ అడిగేందుకు ముందుకు రాలేక నరకం అనుభవిస్తున్నారు. ఇక థలసేమియా బాధితులు 4 వేల మంది వరకు ఉన్నట్లు అంచనా. వీరికి ఆరోగ్యశ్రీ కింద వైద్యం అందకపోగా పెన్షన్ కూడా ఇవ్వట్లేదు.

బకాయిలు కట్టకుండా బీమా పెంచితే ఏం లాభం?

రాష్ట్రంలో 1.32 కోట్ల కుటుంబాలు ఆరోగ్యశ్రీ పరిధిలో ఉన్నాయి. ఈ పథకానికి సంబంధించి సుమారు రూ.400 కోట్ల మేర సర్కారు బకాయి పడటంతో పది రోజులుగా ప్రైవేట్ ఆస్పత్రులు సేవలను నిలిపివేశాయి. వాస్తవాలు ఇలా ఉండగా తాజాగా ప్రభుత్వం రూ.2.50 లక్షలున్న ఇన్సూరెన్సు కవరేజీని రూ.5 లక్షలకు పెంచుతున్నట్లు ప్రకటించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వైద్య సేవలు అందించకుండా బీమా మొత్తాన్ని పెంచుతున్నట్లు ప్రకటించడం వల్ల ప్రయోజనం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇదంతా కేవలం మరో నెల రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ వెలువడనున్న నేపథ్యంలో ఓట్ల కోసం సర్కారు ఆడుతున్న డ్రామాగా అభివర్ణిస్తున్నారు.

ప్రమాదంలో పర్యావరణం

- కుచించుకుపోతున్న కొండపల్లి ఫారెస్ట్
- పెరుగుతున్న జనాభా, భూముల అభివృద్ధి, మైనింగ్ పేరుతో అడవులు ధ్వంసం
- విద్యార్థుల సర్వేలో వెలుగుచూసిన వాస్తవాలు

సాక్షి, అమరావతిబ్యూరో: ప్రభుత్వ పెద్దల స్వార్థం కారణంగా రాజధాని ప్రాంతంలోని పచ్చదనం నానాటికీ హరించుకుపోతోంది. అభివృద్ధి మాటున అక్రమాలకు రాచబాట వేసి పచ్చని అటవీ ప్రాంతాన్ని ధ్వంసం చేసేస్తున్నారు. దీనికి తోడు విజయవాడ శివారు ప్రాంతంలో రోజురోజుకు పెరుగుతున్న కాలుష్య ప్రభావం అటవీ ప్రాంతంలో పచ్చదనాన్ని సైతం మోడుబారిపోయేలా చేస్తోంది. తత్ఫలితంగా పర్యావరణం దెబ్బతినడమే కాకుండా.. పక్షులు, వన్యప్రాణులు కనుమరుగవుతున్నాయి. విజయవాడ శివారు ప్రాంతంలో ఉన్న కొండపల్లి రిజర్వు ఫారెస్ట్ స్వరూపంపై నగరానికి చెందిన మేరీస్ స్టెల్లా కాలేజ్, ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐఐఐటీ) హైదరాబాద్‌కు చెందిన విద్యార్థులు సర్వే చేయగా ఆశ్చర్యకమైన విషయాలు వెల్లడయ్యాయి.

కుచించుకుపోయిన అటవీ ప్రాంతం..

విజయవాడ శివారు ప్రాంతంలో ఉన్న కొండపల్లి రిజర్వు ఫారెస్ట్ రాష్ట్రంలోని భౌగోళిక స్వరూప రీత్యా పెద్దగా విస్తరించి ఉంది. దాదాపు 121 చదరపు కిలోమీటర్ల పరిధిలో పచ్చనిచెట్లు, కీటకాలు, పక్షిజాతులు, పలురకాల వన్యప్రాణులతో విస్తరించి ఉండే అటవీ ప్రాంతంలో ప్రస్తుతం 77.97 చదరపు కిలోమీటర్ల మేరకు కుచించుకుపోయినట్లు వెల్లడయింది. 1992–2018 ఏళ్ల మధ్య కాలంలో 48 చదరపు కిలో మీటర్ల అటవీప్రాంతంలో పచ్చదనం కనుమరుగయిందని సర్వేలో తేల్చారు.

కాలుష్యమే కాటేస్తుందా?

విజయవాడ ప్రాంతాన్ని నవ్యాంధ్ర రాజధానిగా ప్రకటించడంతో నాలుగున్నరేళ్లుగా నానాటికీ పెరుగుతున్న జనాభా, వాహనాలతో పాటు రాజధాని ప్రాంతంలో వెలసిన ప్రభుత్వ కార్యాలయాలు, పరిశ్రమలు, పవర్ ప్లాంట్లు, అక్రమ మైనింగ్‌తో పెరిగిన కాలుష్య ప్రభావంతో పచ్చదనం హరించుకుపోతోంది. దీనికితోడు భూముల అభివృద్ధితో, అక్రమ క్వారీయింగ్‌తో అటవీ ప్రాంతాన్ని ధ్వంసం చేసి ఆక్రమణ చేస్తుండడంతో వృక్షజాతి నాశనమవుతోంది. దీంతో కాలుష్య ప్రభావం పెరిగి అరుదైన కీటకాలతో పాటు.. అటవీ ప్రాంతంలో ఉండే సీతాకోకచిలుకలు, పలు రకాల వన్యప్రాణులు అంతరించిపోతున్నాయి. గతంలో అటవీ ప్రాంతంలో దాదాపు 2 వేల నుంచి 3 వేల వరకు వృక్ష, కీటక, వన్య జాతులు ఉండే పరిస్థితి నుంచి ప్రస్తుత కాలంలో వెయ్యి జాతులు కూడా కన్పించని దుస్థితి నెలకొంది. జింకలు, దుప్పిలు, కణితులు, నెమళ్లు, అడవి పందులు, కనుజులు మాత్రమే అక్కడక్కడా కన్పిస్తున్నాయని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు.

సాధారణ వర్షపాతం..

కొండపల్లి అటవీ ప్రాంతంలో పచ్చదనం హరించుకుపోతుండడంతో సీజన్లలో కురవాల్సిన సాధారణ వర్షాలు కురిసే పరిస్థితులు లేవు. భూగర్భజలాలు అడుగంటి పోతున్నాయి.

అక్రమ బ్లాస్టింగ్‌తో..

కొండపల్లి రిజర్వు ఫారెస్ట్ చుట్టూ ఉన్న రెవెన్యూ భూముల్లో మైనింగ్‌కు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. ఈ మైనింగ్ నిర్వాహకులు అధికార పార్టీ నేతల బినామీలు కావడంతో అటవీ ప్రాంతంలోకి చొచ్చుకొస్తున్నారు. అనుమతులు లేని రిగ్గు బ్లాస్టింగ్ చేస్తుండడంతో భారీ పేలుళ్లు సంభవిస్తున్నాయి. ఈ పేలుళ్ల ప్రభావంతో దాదాపు 10 కిలోమీటర్లు భూమి కంపించడంతో పాటు ధ్వనించడంతో వన్యప్రాణులు విలవిలలాడిపోతూ జనారణ్యంలోకి వచ్చి వేటగాళ్ల దెబ్బకు బలవుతున్నాయి.

పచ్చదనం తగ్గిపోతోంది..

కాలుష్య ప్రభావం, మైనింగ్ వ్యవహారాలతో పచ్చదనం తగ్గిపోతుందన్నది వాస్తవం. గతం కంటే చాలా వరకు అటవీ ప్రాంతంలో పచ్చదనం తగ్గింది. దీంతో కొన్ని అరుదైన కీటకాలు, వన్యప్రాణులు కనుమరుగవుతున్నాయి. సాధారణ వర్షపాతం కూడా నమోదవ్వడం లేదు.

– బి.లెనిన్‌కుమార్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్

రోడ్ల నిర్మాణంపై దృష్టిపెట్టిన డ్రాగన్

- 2020 నాటికల్లా 13 లక్షల కిలోమీటర్ల రోడ్ల నిర్మాణం
- 26 వేల కిలోమీటర్లు మేర ఎక్స్‌ప్రెస్‌వే
- వీటి ద్వారా చైనా మిలిటరీని త్వరితగతిన తరలిచేందుకు అవకాశం

వాషింగ్టన్: ప్రపంచంలోనే అతి పెద్ద మిలిటరీ శక్తిని కలిగి ఉన్న చైనా ఇప్పుడు రోడ్ల నిర్మాణంపై దృష్టిపెట్టింది. పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ(పీఎల్‌ఏ)గా పిలిచే చైనా మిలిటరీని ఒక చోట నుచి మరోక చోటికి త్వరితగతిన తరలించేందుకు ఆ దేశం 2020 నాటికల్లా 13 లక్షల కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే లక్ష కిలోమీటర్ల మేర రైల్వే మార్గంతో పాటుగా గంటకు 250 కి.మీ వేగంతో ప్రయాణం చేయగల 10 వేల కిలోమీటర్ల మేర హైస్పీడ్ రైల్వే ట్రాక్‌ను చైనా కలిగి ఉన్నట్లు 'చైనా మిలిటరీ పవర్'నివేదికలో పేర్కొన్నట్లు పెంటగాన్ యూఎస్ కాంగ్రెస్‌కు వెల్లడించింది. ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, నిధుల కేటాయింపులే లక్ష్యంగా బీజింగ్ పనిచేస్తోందని తెలిపింది. రవాణా మార్గాల అభివృద్ధి ద్వారా భవిష్యత్తులో పీఎల్‌ఏ భారీ ఎత్తున తన బలగాలను వేగంగా తరలించేలా చైనా ప్రణాళికలు రూపొందించింది. దీంతోపాటుగా స్వదేశీ యుద్ధవిమానాలను అభివృద్ధి చేయడంతో పాటుగా దక్షిణ చైనా సముద్ర భాగంలోని ద్వీపాల్లో మిలిటరీ అవుట్‌పోస్టుల నిర్మాణం కూడా చేస్తోంది. చైనాలో ఉన్న విమానాశ్రయాల్లో 1/3 వంతు ఎయిర్‌పోర్టులు అటు మిలిటరీకీ, ఇటు పౌరులకు ఉపయుక్తమైనవిగా ఆ దేశం నిర్మించింది. ఇక అంతరిక్షంలో ఆధిపత్యం కోసం పీఎల్‌ఏ కసరత్తులు చేస్తోందని పెంటగాన్ కార్యాలయం యూఎస్ కాంగ్రెస్‌కు నివేదించింది.


కుంభమేళాలో రాష్ట్రపతి దంపతులు



అలహాబాద్: అలహాబాద్‌లో జరుగుతున్న కుంభమేళాలో రాష్ట్రపతి దంపతులు గురువారం పాల్గొన్నారు. ప్రత్యేక విమానంలో ఉదయం 9.30 గంటలకు రాష్ట్రపతి దంపతులు బంరౌలీ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకోగా, ఉత్తరప్రదేశ్ గవర్నర్ రామ్‌నాయక్, సీఎం యోగిఆదిత్య నాథ్, కేబినెట్ మంత్రులు వారికి స్వాగతం పలికారు. గంగా, యమున, సరస్వతీ నదుల సంగమ స్థానంలో రామ్‌నాథ్‌కోవింద్ ఆయన సతీమణి సవితాకోవింద్‌తో కలసి 'గంగా పూజ'ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూపీ గవర్నర్, ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య, ఆరోగ్య శాఖమంత్రి సిద్ధార్థ్ నాథ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు. ప్రసిద్ధి చెందిన కొంతమంది సాధువులను రాష్ట్రపతి కలసి, సాయంత్రం 4.30 గంటలకు ప్రత్యేక విమానంలో తిరిగి ఢిల్లీ వెళ్లారు. గత సంవత్సరం నిర్వహించిన మాగ్ మేళాకు కూడా రామ్‌నాథ్ కోవింద్ కుటుంబసమేతంగా హాజరయ్యారు.

నిబంధనలు మాకో లెక్కా?!

- ఇంజనీరింగ్ కళాశాలల ఇష్టారాజ్యం
- ఏఐసీటీఈ నిబంధనల అమలుకు గండి
- రికార్డుల్లో తప్పుడు సమాచారంతో మాయాజాలం
- ప్రహసనంగా మారుతున్న ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీలు



సాక్షి, అమరావతి: కొత్త ఇంజనీరింగ్ కాలేజీల ఏర్పాటు, ఇంజనీరింగ్ కోర్సుల నిర్వహణకు సంబంధించి అఖిల భారత సాంకేతిక విద్యామండలి(ఏఐసీటీఈ) ప్రవేశపెట్టే విధానాలు, నిబంధనలు నీరుగారిపోతున్నాయి. క్షేత్రస్థాయిలో తనకంటూ ఒక యంత్రాంగం లేకపోవడం, పూర్తిగా రాష్ట్రప్రభుత్వాల పరిధిలో ఉండే యూనివర్సిటీలపైనా, ఉన్నత విద్యామండళ్లపైనా ఆధారపడుతున్నందన నిబంధనలకు ఎక్కడికక్కడ గండి పడుతోంది. సిబ్బంది, ల్యాబ్‌లు, ఇతర అంశాలకు సంబంధించిన నియమాలను ఏమీ పాటించకున్నా... అన్నీ పాటిస్తున్నట్లుగా తప్పుడు రిపోర్టులతో కాలేజీల యజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. ఏఐసీటీఈ తరచూ నిబంధనలు మారుస్తుండడం, ఏడాదికో రకమైన విధానాలను ప్రకటిస్తుండడంతో వాటిని క్షేత్రస్థాయిలో అమలు చేయడంలో వర్సిటీలు, ఉన్నత విద్యామండళ్లు సరిగా స్పందించడం లేదు. 'ఏఐసీటీఈ రోజుకో నిబంధనను విడుదల చేస్తుంటుంది. అవన్నీ అమలు చేయాలంటే సిబ్బంది లేరు. మాటిమాటికీ మార్పులు చేస్తూ ఇచ్చే నిబంధనలు అమలు చేయడం ఎవరికి సాధ్యం' అని ఉన్నత విద్యామండలి వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.

ఫ్యాక్టు ఫైండింగ్ నివేదికల్లో అంతా డొల్లే..

కొత్త ఇంజనీరింగ్ కాలేజీల ఏర్పాటుకు, కొత్తగా కోర్సుల అనుమతికి సంబంధించి ఏఐసీటీఈ నిబంధనలను క్షేత్రస్థాయిలో కాలేజీలు పాటిస్తున్నాయా? లేదా? అని పరిశీలించి నివేదికలు ఇవ్వాల్సిన బాధ్యత ఆయా యూనివర్సిటీలదే. యూనివర్సిటీలు ఫ్యాక్టు ఫైండింగ్ కమిటీలను నియమించి, తమ పరిధిలోని కాలేజీలు ఏఐసీటీఈ నిబంధనలను పాటిస్తున్నాయా? లేదా? అనే దానిపై అధ్యయనం చేపడుతాయి. అయితే, ఈ ఫ్యాక్టు ఫైండింగ్ కమిటీలు వాస్తవ పరిస్థితిని పరిశీలించకుండానే.. నిబంధనల ప్రకారం అన్నీ ఉన్నట్లుగా రిపోర్టులు ఇచ్చేస్తున్నాయి. ఇందుకు స్థానికంగా రాజకీయ ఒత్తిళ్లు, ఆయా యాజమాన్యాలు అందించే ముడుపులే కారణం అన్నది బహిరంగ రహస్యమే. మరోపక్క ఏఐసీటీఈకి ఆయా కాలేజీలు సమర్పించే పత్రాలు, నివేదికలు కూడా వాస్తవానికి భిన్నమైనవేనని పేర్కొంటున్నారు. ఏఐసీటీఈకి ఒకరకమైన నివేదికలు ఇస్తుంటారు. విద్యార్థుల స్కాలర్‌షిప్పులకు సంబంధించిన సమాచారం వేరే రకంగా ఉంటుంది. కాలేజీ వెబ్‌సైట్‌లోని వివరాలకు, అఖిల భారత ఉన్నత విద్యా సర్వే(ఏఐఎస్‌హెచ్‌ఈ)కి ఇచ్చే నివేదికలకు పొంతన ఉండదు. ఇక కాలేజీలో అడ్మిషన్లకు, ఫీజుల నిర్ణయానికి సంబంధించి రాష్ట్ర అడ్మిషన్లు, ఫీజుల నియంత్రణ కమిటీ (ఏఎఫ్‌ఆర్‌సీ)కి ఇచ్చే నివేదికలు వేరేగా ఉంటున్నాయి. కాలేజీలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బోధనా సిబ్బంది ఉండాలి. కానీ ఉన్నట్లుగా రికార్డుల్లో చూపించడమే తప్ప నిజంగా ఉండరు. కాలేజీల్లోని అధ్యాపకులు, ఆచార్యులకు కేంద్రప్రభుత్వ వేతన సవరణ సంఘం నిర్ణయించిన మేరకు జీతాలు ఇవ్వాలి. అధ్యాపకులకు రూ.49 వేలు ఇవ్వాల్సి ఉండగా, రూ.15 వేలు, రూ.20 వేలు మాత్రమే అందజేస్తున్నారు. ఇవేవీ రికార్డుల్లో కనిపించవు.

నాణ్యతా ప్రమాణాలపై దృష్టి

ఇంజనీరింగ్ కాలేజీల్లో ల్యాబ్‌లు, ఫ్యాకల్టీ, సదుపాయాలకు ప్రాధాన్యం ఇచ్చిన ఏఐసీటీఈ ఇకపై వాటితోపాటు నాణ్యతా ప్రమాణాలు, ఉపాధి అవకాశాల పెంపుపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. వచ్చే విద్యాసంవత్సరం నుంచి చేపట్టే ప్రవేశాల్లో ఈ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలంటూ కొత్త ఆదేశాలు జారీ చేసింది. విద్యార్థుల ఇంటర్న్‌షిప్, ఫ్యాకల్టీ నిరంతరం అప్‌గ్రేడ్ అయ్యేలా శిక్షణ, ఒక్కో కాలేజీ కనీసంగా 5 కంపెనీలతో ఒప్పందాలు, ప్రతి కాలేజీలో క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ ఏర్పాటు, ఇంజనీరింగ్ విద్యపై అవగాహన పెంపొందించడంతోపాటు వారిలో సృజనాత్మక ఆలోచన విధానాన్ని పెంపొందించేలా పరీక్షల్లో సంస్కరణలు అమలు చేసేందుకు, విద్యార్థులకు తగిన సలహాలు సూచనలు ఇచ్చేందుకు 'ఇనిస్టిట్యూషన్ ఇండస్ట్రీ సెల్'ను ప్రతి కాలేజీలో కచ్చితంగా ఏర్పాటు చేయాలని పేర్కొంది. అధ్యాపకులు నిరంతరం ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంపై అప్‌గ్రేడ్ కావాలి. అందుకోసం వారికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలి. కాలేజీలో విద్యాబోధనలో నాణ్యతా ప్రమాణాల పెంపునకు చేపట్టాల్సిన చర్యలపై ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ ఎప్పటికప్పుడు పక్కా ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలి. కాలేజీకి నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) గుర్తింపు లభించేందుకు అవసరమైన అన్ని చర్యలు ఈ సెల్ ఆధ్వర్యంలో చేపట్టాలి. అలాగే ప్రతి బ్రాంచి నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్‌బీఏ) గుర్తింపు లభించేలా చర్యలు చేపట్టాలి. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా పరీక్షల విధానంలో సంస్కరణలు అమలు చేయాలి. అందుకు అనుగుణంగా సిలబస్‌ను మార్చుకోవాలి. విద్యార్థులు సృజనాత్మకంగా ఆలోచించేలా అవకాశాలు కల్పించాలి. ఇందుకోసం ఓపెన్ బుక్ పరీక్ష విధానం అమల్లోకి తీసుకురావాలి.

కొత్త నిబంధనలు అమలయ్యేనా?

ఏఐసీటీఈ తాజాగా కొన్ని కొత్త నిబంధనలను విడుదల చేసింది. కొత్తగా కోర్సులకు అప్రూవల్‌కు దరఖాస్తు చేసే వారు తప్పనిసరిగా కొన్ని నిబంధనలు పాటించాలని పేర్కొంది. బీఈ/బీటెక్ కోర్సులను నిర్వహించే ఇంజనీరింగ్ కాలేజీలతోపాటు పీజీ ఇంజనీరింగ్, ఆర్కిటెక్చర్, మేనేజ్‌మెంట్, ఫార్మసీ తదితర కాలేజీలన్నీ ఈ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాల్సిందేనని స్పష్టం చేసింది. అయితే వీటిని క్షేత్రస్థాయిలో అమలు పరిచే యంత్రాంగం లేక మళ్లీ ఎప్పటిలాగే ఫ్యాక్టు ఫైండింగ్ కమిటీలు ఏఐసీటీఈ కళ్లకు గంతలు కడతాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రాహుల్ నిర్ణయమే ఫైనల్

తెలంగాణ సీఎల్పీ నేత నియామక బాధ్యతను ఏఐసీసీ చీఫ్‌కు కట్టబెడుతూ తీర్మానం..

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ శాసనసభా పక్ష (సీఎల్పీ) నేతను ఎన్నుకునే అధికారం ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీకి దఖలు పడింది. సీఎల్పీ నేతను నియమించే అధికారాన్ని రాహుల్‌కు కట్టబెడుతూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఏకగ్రీవ తీర్మానం చేశారు. గురువారం ఉదయం 9 గంటలకు అసెంబ్లీ ప్రాంగణంలోని సీఎల్పీ కార్యాలయంలో 19 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సమావేశమయ్యారు. అధిష్టానం నుంచి కేరళ రాష్ట్రానికి చెందిన లోక్‌సభ సభ్యుడు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి ఆర్సీ కుంతియాలు ఈ సమావేశానికి హాజరయ్యారు. వేణుగోపాల్, కుంతియాలు 19 మంది సభ్యుల నుంచి వ్యక్తిగతంగా అభిప్రాయాలను సేకరించారు. ఎమ్మెల్సీలతో కూడా మాట్లాడారు.

ఒక్కొక్కరితో 5 నిమిషాల పాటు మంతనాలు

సీఎల్పీ నేత రేసులో ఉన్న పీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి, భట్టి విక్రమార్క, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిలకు మద్దతుగా కొందరు తమ అభిప్రాయాన్ని తెలిపారు. మరికొందరు పార్టీని పూర్తిగా ప్రక్షాళన చేయాలని, కొత్తవారికి అవకాశమివ్వాలని కోరినట్టు తెలిసింది. సీఎల్పీ పదవిని ఆశిస్తున్న సబితా ఇంద్రారెడ్డితో పాటు ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కూడా తనకు సీఎల్పీ నేతగా పనిచేసే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేసినట్టు సమాచారం. ఒక్కో ఎమ్మెల్యేతో 5 నిమిషాలు మాట్లాడిన అధిష్టానం దూతలు వారు చెప్పిన అభిప్రాయాలను వినడంతో పాటు సీఎల్పీ నేతగా అధిష్టానం ఎవరిని నియమించినా కట్టుబడి ఉండాలని సూచించారు.

అసెంబ్లీ హాలులో మరో భేటీ

దాదాపు గంటన్నరపాటు సీఎల్పీ కార్యాలయంలో సమావేశమైన అనంతరం అధిష్టానం దూతలతో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అసెంబ్లీ కమిటీ హాలులో మళ్లీ సమావేశమయ్యారు. ఇందులో సీఎల్పీ నేతను నియమించే అధికారాన్ని ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీకి కట్టబెడుతూ తీర్మానాన్ని టీపీసీసీ చీఫ్ ఉత్తమ్ ప్రతిపాదించారు. ఈ తీర్మానానికి సభ్యులంతా ఏకగ్రీవ ఆమోదం తెలిపారు.

నేడు ప్రకటించే చాన్స్..

సీఎల్పీ నేత ఎవరన్నది శుక్రవారం ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. గురువారమే ప్రకటించాల్సి ఉన్నా రాహుల్ ఢిల్లీలో అందుబాటులో లేని కారణంగా ఆలస్యమైనట్టు కాంగ్రెస్ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. సీఎల్పీ నేతగా పార్టీ సీనియర్ ఎమ్మెల్యే మల్లు భట్టివిక్రమార్కను నియమించే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.




కీసర టోల్‌ప్లాజా వద్ద భారీగా కార్లు

తిరుగుముఖం పట్టిన పల్లెవాసులు

కీసర (కంచికచర్ల): సంక్రాంతి పండుగను ముగించుకుని గురువారం ప్రజలు తిరుగుముఖం పట్టారు. కార్లు, బస్సులు, బైక్‌లు వివిధ వాహనాల్లో హైదరాబాద్ తదితర ప్రాంతాలకు బయలుదేరారు. ఈ నేపథ్యంలో కృష్ణా జిల్లా కీసర టోల్ ప్లాజా వద్ద కార్లు బారులుతీరాయి. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. టోల్‌గేట్ రశీదు ఇవ్వకుండా డబ్బులు వసూలు చేస్తున్నారని వాహనదారులు ఆరోపిస్తున్నారు. గురువారం ఒక్కరోజే 20 వేల వాహనాలు రాకపోకలు సాగించాయని టోల్‌ప్లాజా అధికారులు తెలిపారు.

ఆగిన అగ్రిగోల్డ్ ఏజెంట్ గుండె

డిపాజిటర్ల ఒత్తిడితో మృతి.. విశాఖలో ఘటన



అప్పలరాజు (ఫైల్)

కొత్తవలస రూరల్(శృంగవరపుకోట): డిపాజిటర్ల ఒత్తిడితో అగ్రిగోల్డ్ ఏజెంట్ గుండె ఆగి మృతిచెందిన ఘటన విశాఖపట్నం జిల్లాలో జరిగింది. కుటుంబ సభ్యులు అందించిన వివరాలు.. విజయనగరం జిల్లా కొత్తవలస మండలం చిన్నిపాలెం పంచాయతీ జోగయ్యపాలేనికి చెందిన సప్ప అప్పలరాజు(56) విశాఖపట్నం టౌన్ కొత్తరోడ్డు ప్రాంతంలో టైలరింగ్ చేసుకుంటూ.. కుమారుడిని ఉన్నత చదువులు చదివించుకునేందుకు పార్ట్ టైంగా అగ్రిగోల్డ్ ఏజెంట్‌గా చేరాడు. తనకు తెలిసినవారందరితో అగ్రిగోల్డ్‌లో డిపాజిట్లు కట్టించాడు. తీరా ఆ సంస్థ బోర్డు తిప్పేయడంతో తాము కట్టిన మొత్తాలను తక్షణమే చెల్లించాలని.. ఆస్తి అమ్మి అయినా సరే చెల్లించాలని కనుమ రోజున తీవ్ర ఒత్తిడి చేశారు. ఆ ఘటనతో అప్పలరాజు గుండెపోటుతో కుప్ప కూలిపోయాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించేసరికే మృతిచెందాడు. మృతదేహానికి బుధవారం జోగయ్యపాలెంలో అంతిమ సంస్కారాలు నిర్వహించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. డిపాజిటర్ల దగ్గర నుంచి లక్షలాది రూపాయలు అగ్రిగోల్డ్‌కు కట్టించాడని, వారి ఒత్తిడితో గుండె ఆగి మృతిచెందాడని సీనియర్ ఏజెంటు హరిబాబు చెప్పారు.

నెల్లూరులో మిథాని ప్లాంట్

మిథాని చైర్మన్ దినేశ్‌కుమార్ లిఖీ

సాక్షి, హైదరాబాద్: భారతదేశపు వ్యూహాత్మక అవసరాలను నెరవేరుస్తూనే వ్యాపారపరంగా ఎదిగేందుకు మిశ్రధాతూ నిగమ్ (మిథాని) ప్రయత్నిస్తోందని సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ దినేశ్ కుమార్ లిఖీ తెలిపారు. సంస్థ విస్తరణకు గత మూడేళ్లలో రూ.500 కోట్ల వరకూ పెట్టుబడులు పెట్టామని చెప్పారు. స్టెయిన్‌లెస్ స్టీల్ ట్యూబుల తయారీ కంపెనీ టుబాసెక్స్ (స్పెయిన్)తో కుదిరిన ఒప్పందంపై సంతకాలు చేసేందుకు గురువారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా దినేశ్‌కుమార్ మాట్లాడుతూ..నేషనల్ అల్యూమినియం కంపెనీ లిమిటెడ్ (నాల్కో)తో కలసి రూ.4,000 కోట్లతో నెల్లూరులో ప్లాంట్ ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నామన్నారు. నాల్కో, మిథానీల భాగస్వామ్యంతో ఏర్పాటు చేసే ఈ ఫ్యాక్టరీలో అల్యూమినియం ఆధారిత మిశ్రధాతువుల తయారీ చేస్తామని చెప్పారు.

రైల్‌సాథీ యాప్ విడుదల

ప్రారంభించిన రైల్వే బోర్డు చైర్మన్ వీకే యాదవ్



తిరుపతి రైల్వే స్టేషన్ ఎదుట వంద అడుగుల జాతీయ జెండాను రిమోట్ ద్వారా ప్రారంభిస్తున్న రైల్వే బోర్డు చైర్మన్ వినోద్‌కుమార్ యాదవ్

తిరుపతి అర్బన్: ప్రయాణీకులకు రైల్వే సమగ్ర సమాచారాన్ని అందించేందుకు రూపొందించిన 'రైల్‌సాథీ' యాప్‌ను రైల్వే బోర్డు చైర్మన్ వినోద్‌కుమార్ యాదవ్ గురువారం ప్రారంభించారు. రైల్వే జనరల్ బుకింగ్, రిజర్వేషన్ కౌంటర్లు, వెయిటింగ్ హాళ్లు, రైల్వే పోలీసు విభాగాల కార్యాలయాలు, చైల్డ్ హెల్ప్‌డెస్క్, ఆర్వో వాటర్, పార్సల్ ఆఫీస్, ఏటీఎంలు, టికెట్ పీఎన్‌ఆర్ చెకింగ్, ఆహార నాణ్యతపై ఫిర్యాదులు, తదితర అన్నిరకాల సేవలను ఈ యాప్ ద్వారా పొందవచ్చునని పేర్కొన్నారు. కార్యక్రమంలో తుడా చైర్మన్ నరసింహయాదవ్, రైల్వే డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, డీఆర్‌ఎం విజయ్‌ప్రతాప్ సింగ్, తదితరులు పాల్గొన్నారు. కాగా, తిరుపతి రైల్వే స్టేషన్ ప్రధాన ద్వారం వద్ద 100 అడుగుల ఎత్తులో ఏర్పాటు చేసిన హైమాస్ ఫ్లడ్‌లైటెడ్ జాతీయ జెండాను వినోద్‌కుమార్ యాదవ్ గురువారం సాయంత్రం ఆవిష్కరించారు. దేశంలోని 75 ఏ–1 రైల్వే స్టేషన్ల నగరాలలో రైల్వేశాఖ ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి మాజీ ఎంపీ వెలగపల్లి వరప్రసాద్, రైల్వే అధికారులు, ఉద్యోగులు, రైల్వే స్కౌట్స్ అండ్ గైడ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

లేహ్‌కు ఐటీబీపీ వాయవ్య విభాగం

న్యూఢిల్లీ: దేశానికి తూర్పు ప్రాంతంలో చైనా సైనిక బలం పెరుగుతుండటంపై ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో భారత ప్రభుత్వం వ్యూహాత్మకంగా ఐటీబీపీ కమాండ్‌ను చండీగఢ్ నుంచి లేహ్‌కు తరలించనుంది. 3,488 కిలో మీటర్ల మేర భారత్–చైనా సరిహద్దును ఐటీబీపీ (ఇండో–టిబెట్ సరిహద్దు పోలీస్) వాయవ్య విభాగమే కాపలా కాస్తుంది. ప్రస్తుతం దీని ప్రధాన కార్యాలయం చండీగఢ్‌లో ఉంది. దీనిని జమ్మూ కశ్మీర్‌లోని లేహ్‌కు తరలించేందుకు ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఏప్రిల్ 1 నుంచి ఐటీబీపీ వాయవ్య విభాగం కార్యకలాపాలు లేహ్ నుంచే జరగాలని స్పష్టం చేసింది. ఇన్‌స్పెక్టర్ జనరల్ స్థాయి అధికారి ఈ విభాగానికి అధిపతిగా ఉంటారు.

మేపై వీగిన అవిశ్వాసం

19 ఓట్ల స్వల్ప ఆధిక్యంతో విజయం ● మరో బ్రెగ్జిట్ ఒప్పందానికి తనతో కలిసి రావాలని ఎంపీలకు పిలుపు



అవిశ్వాస తీర్మానం వీగిపోయిన అనంతరం విజయదరహాసం చిందిస్తున్న బ్రిటన్ ప్రధాని థెరిసా మే

లండన్: బ్రిటన్ పార్లమెంటులో ప్రధాని థెరెసా మే ప్రభుత్వంపై ప్రతిపక్షం ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై జరిగిన ఓటింగ్ వీగిపోయింది. మేకి అనుకూలంగా 325 ఓట్లు రాగా, వ్యతిరేకంగా 306 ఓట్లు వచ్చాయి అనంతరం ఆమె మాట్లాడుతూ ఎంపీలంతా పార్టీలకతీతంగా తమ స్వప్రయోజనాలను పక్కనబెట్టి కొత్త బ్రెగ్జిట్ ఒప్పందం కుదుర్చుకోవడం కోసం తనతో కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. మే రెండేళ్లపాటు యూరోపియన్ యూనియన్ (ఈయూ)తో చర్చలు జరిపి బ్రెగ్జిట్ ఒప్పందాన్ని కుదుర్చుకొస్తే, అది బ్రిటన్ ప్రయోజనాలకు పూర్తిగా విరుద్ధంగా ఉందంటూ పార్లమెంటు గత మంగళవారం బ్రెగ్జిట్ బిల్లును భారీ ఆధిక్యంతో తిరస్కరించింది. అదేరోజు ప్రతిపక్ష లేబర్ పార్టీ నాయకుడు జెరెమీ కార్బిన్ మే ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టగా దానిపై ఓటింగ్ బుధవారం జరిగింది. బ్రెగ్జిట్ బిల్లుపై ఓటింగ్‌లో మే ఓడిపోయినా, అవిశ్వాసంలో మాత్రం 19 ఓట్ల స్వల్ప ఆధిక్యంతో గెలుపొందారు. బ్రిటన్ పార్లమెంటులో అవిశ్వాసంపై ఓటింగ్ జరగడంపై గత 26 సంవత్సరాల్లో ఇదే తొలిసారి.

సోమవారమే మరో ఒప్పందం

అవిశ్వాసంలో గెలిచిన అనంతరం మే మాట్లాడుతూ 'ఇప్పుడు బ్రెగ్జిట్‌కు దారి కనుక్కోవడంపై దృష్టిపెట్టే అవకాశం మనకు లభించింది. మనం ఈయూ నుంచి బయటకు రావాలని బ్రిటన్ ప్రజలు కోరుకుంటున్నారు. ఎంపీలంతా తమ స్వప్రయోజనాలను పక్కనబెట్టి, బ్రెగ్జిట్ ఒప్పందం కోసం మాతో కలిసి నిర్మాణాత్మకంగా పనిచేయాలి' అని ఆమె కోరారు. గతంలో చెప్పినట్లుగానే సోమవారమే మరో కొత్త బ్రెగ్జిట్ ఒప్పందాన్ని సభ ముందు ఉంచుతానని మే స్పష్టం చేశారు. 'ఇది అంత సులభమైన పని కాదు. కానీ దేశ ప్రయోజనాల కోసం పనిచేయాల్సిన అవసరం ఉందన్న విషయం ఎంపీలకు తెలుసు. వారంతా ఏకాభిప్రాయానికి వచ్చి, దీన్ని సాధించాలి. తమకు ఏం వద్దో ఎంపీలు ఇప్పుడు స్పష్టంగా చెప్పారు. పార్లమెంటుకు ఏం కావాలో తెలుసుకునేందుకు ఇప్పుడు మనం అంతా కలిసి పనిచేయాలి. ఈయూ నుంచి బయటకు రావాలన్న బ్రిటన్ ప్రజల కోరికను నెరవేర్చడం మన బాధ్యత అని నేను భావిస్తున్నా' అని మే వెల్లడించారు.

మొండిపట్టు వీడాలి: కార్బిన్

థెరెసా మే తన మొండిపట్టును వీడి భవిష్యత్తు ప్రణాళికలపై తీవ్రంగా ఆలోచించాలని ప్రతిపక్ష నాయకుడు జెరెమీ కార్బిన్ అన్నారు. అసలు ఏ ఒప్పందమూ లేకుండా బ్రెగ్జిట్ జరగదని మే హామీ ఇస్తేనే తదుపరి ఆశాజనక చర్చలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. భవిష్యత్తులోనూ తాము అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెట్టే అవకాశం ఉందన్నారు. మరోవైపు బ్రెగ్జిట్‌ను సాధించేందుకు తాను ఏ పార్టీ ఎంపీతోనైనా మాట్లాడేందుకు సిద్ధంగా ఉన్నానని మే ప్రకటించారు. కాగా, బ్రెగ్జిట్‌పై రెండోసారి ప్రజాభిప్రాయ సేకరణ జరపాల్సిందిగా దాదాపు 170 వాణిజ్య సంస్థలు మే, కార్బిన్‌లను కోరుతున్నట్లు టైమ్స్ పత్రిక తెలిపింది.

'ప్లాన్ బీ'పై 29న ఓటింగ్

తొలి బ్రెగ్జిట్ ఒప్పందం బిల్లు పార్లమెంటు తిరస్కరణకు గురవడంతో థెరెసా మే ప్రవేశపెట్టనున్న ప్రత్యామ్నాయ బిల్లుపై ఈ నెల 29న దిగువ సభలో ఓటింగ్ జరగనుంది. సోమవారం మే ప్రత్యామ్నాయ బిల్లును సభలో ప్రవేశపెట్టి, తన తదుపరి చర్యలేంటో చెబుతారనీ, 29న పూర్తిగా రోజు మొత్తం చర్చించిన తర్వాత ఓటింగ్ ఉంటుందని హౌజ్ ఆఫ్ కామన్స్ నాయకురాలు ఆండ్రియా లీడ్సమ్ చెప్పారు. ఈయూ నుంచి బ్రిటన్ మార్చి 29న బయటకు రావాల్సి ఉంది. అంటే బ్రెగ్జిట్‌కు సరిగ్గా రెండు నెలల ముందు ప్రత్యామ్నాయ బిల్లుపై పార్లమెంటులో ఓటింగ్ జరగనుంది.

ఐఐటీ హైదరాబాద్‌లో బీటెక్ ఏఐ

దేశంలో తొలి, ప్రపంచంలో మూడో ఇన్‌స్టిట్యూట్‌గా ఘనత

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ విద్యలో కృత్రిమ మేధస్సు(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)ను ప్రత్యేక బ్రాంచ్‌గా బీటెక్ ప్రోగ్రామ్‌ను ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్(ఐఐటీ హెచ్) ప్రారంభించింది. దీంతో దేశంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను బ్రాంచ్‌గా పూర్తిస్థాయిలో నాలుగేళ్ల బీటెక్ ప్రోగ్రామ్‌ను అందించనున్న తొలి ఇన్‌స్టిట్యూట్‌గా ఘనతకెక్కింది. అంతర్జాతీయంగానూ మూడో ఇన్‌స్టిట్యూట్‌గా నిలిచింది. ప్రస్తుతం బీటెక్ (ఏఐ) కోర్సును ఎంఐటీ (యూఎస్), కార్నెగీ మిలన్ యూనివర్సిటీ(యూఎస్)లే ఆఫర్ చేస్తున్నాయి. 2019–2020 విద్యా సంవత్సరం నుంచి ఐఐటీ హైదరాబాద్‌లోనూ ఏఐ బ్రాంచ్ అందుబాటులోకి రానుంది. తొలి బ్యాచ్‌లో జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ర్యాంకు ఆధారంగా 20 మందితో దీన్ని ప్రారంభించనున్నట్లు ఐఐటీ హెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్.యు.బి.దేశాయ్ తెలిపారు. ఏఐ, మెషిన్ లెర్నింగ్ విభాగాల్లో నెలకొన్న డిమాండ్‌కు అనుగుణంగా విద్యార్థులకు పరిపూర్ణమైన నైపుణ్యాలను అందించేలా బీటెక్ (ఏఐ) బ్రాంచ్ కరిక్యులమ్‌ను రూపొందించినట్లు చెప్పారు. ఏఐ ఆధారిత పరిష్కారాలు మన దేశంలో హెల్త్‌కేర్, పంటలు, భద్రత, రక్షణ వంటి పలు విభాగాల్లో ఉపయోగపడుతున్నాయని ఐఐటీ హెచ్‌ఆర్ అండ్ డీ డీన్, ప్రొఫెసర్ ఎస్.చన్నప్పయ్య తెలిపారు. ఇతర బ్రాంచ్‌ల్లో బీటెక్‌లో చేరిన అభ్యర్థులు కూడా ఏఐను మైనర్ కోర్సుగా ఎంపిక చేసుకునే అవకాశం కల్పించనున్నట్లు వివరించారు. ఈ విభాగంలో మానవ వనరుల డిమాండ్–సప్లయ్ మధ్య వ్యత్యాసం తగ్గించే దిశగా అడుగులు వేస్తామన్నారు.

పేదలకు కోటా రాజకీయ సంకల్పం

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు చేస్తున్నాం
- కోట్లాది ఉద్యోగావకాశాలను సృష్టించామన్న ప్రధాని



కొత్తగా ప్రారంభించిన ఆస్పత్రిలో వసతుల్ని పరిశీలిస్తున్న ప్రధాని మోదీ

అహ్మదాబాద్: ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు 10శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు చేపట్టిన రాజ్యాంగ సవరణ తమ ప్రభుత్వ రాజకీయ సంకల్పమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. ఈ రిజర్వేషన్లను ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు చేస్తామని అన్నారు. అహ్మదాబాద్‌లో గురువారం ఆయన సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ అండ్ రీసెర్చ్ ఆస్పత్రిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మోదీ మాట్లాడుతూ..'కొత్త రిజర్వేషన్లను ఈ విద్యా సంవత్సరం నుంచే దేశవ్యాప్తంగా ఉన్న 40వేల కాలేజీలు, 900 వర్సిటీల్లో అమలు చేస్తాం. ఆయా సంస్థల్లో అందుబాటులో ఉండే సీట్లను మరో 10 శాతం పెంచుతాం. అన్ని వర్గాల ప్రజలు సమాన అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది' అని తెలిపారు. దేశవ్యాప్తంగా 100 రోజుల్లో 7 లక్షల మంది పేదలు ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ పథకం కింద వైద్య సేవలు పొందారని ఆయన తెలిపారు. దేశంలోని హెలిప్యాడ్, ఎయిర్ అంబులెన్స్ ఉన్న ఏకైక ఈ 1500 పడకల ఆస్పత్రి పనులు 2012లో మొదలయ్యాయి. అధునాతన సదుపాయాలున్న ఈ సూపర్ స్పెషాలిటీ ప్రజా వైద్యశాలను అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నిర్మించింది. ఆయుష్మాన్ భారత్ కోసమే నిర్మించిన ఈ ఆస్పత్రి పేపర్ వినియోగం లేకుండా సేవలందించనుంది.

కోట్లాది ఉద్యోగావకాశాల సృష్టి

తమ ప్రభుత్వం గత నాలుగున్నరేళ్లలో వివిధ రంగాల్లో కోట్లాది ఉద్యోగావకాశాలను సృష్టించిందని ప్రధాని మోదీ అన్నారు. దుబాయ్ షాపింగ్ ఫెస్టివల్ ప్రేరణతో నిర్వహిస్తున్న అహ్మదాబాద్ షాపింగ్ ఫెస్టివల్– 2019ను ప్రారంభించిన సందర్భంగా మోదీ మాట్లాడుతూ..'పర్యాటకం కావొచ్చు, తయారీ లేక సేవల రంగం కావొచ్చు.. కోట్లాది ఉద్యోగావకాశాలను గత నాలుగున్నరేళ్లలో సృష్టించాం. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపనను సాధ్యమైనంత మేర ప్రోత్సహించాం. చిన్న పరిశ్రమల కోసం రూపకల్పన చేసిన జెమ్ (గవర్నమెంట్ ఈ మార్కెట్ ప్లేస్) వేదికగా రూ.16,500 కోట్ల వ్యాపారం జరిగింది' అని తెలిపారు. ఇకపై జీఎస్టీ రిటర్నుల ఆధారంగానే బ్యాంకులు అప్పులు ఇచ్చే విధానం రాబోతోందన్నారు. పరోక్ష పన్నుల విధానాన్ని కుదించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గ్రామీణరంగం దెబ్బతిన్న కారణంగా 2018లో దాదాపు కోటికిపైగా ఉద్యోగావకాశాలు తగ్గిపోయినట్లు 'సెంటర్ ఫర్ మోనిటరింగ్ ఇండియా' అనే స్వతంత్ర సంస్థ తెలిపిన నేపథ్యంలో ప్రధాని మోదీ ప్రభుత్వం కోట్లాది ఉద్యోగావకాశాలను సృష్టించిందంటూ వ్యాఖ్యానించడం గమనార్హం.

వైబ్రంట్ గుజరాత్ ట్రేడ్ షో ప్రారంభం

ప్రధాని మోదీ గాంధీనగర్‌లో వైబ్రంట్ గుజరాత్‌లో భాగంగా మహాత్మా మందిర్ ఎగ్జిబిషన్ అండ్ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన ట్రేడ్ షోను ప్రారంభించారు. అనంతరం కొన్ని స్టాళ్లను పరిశీలించి, వివరాలు తెలుసుకున్నారు. 22 వరకు కొనసాగనున్న ఈ ప్రదర్శనలో 25 పారిశ్రామిక, వాణిజ్య రంగాల వారు పాల్గొంటున్నారు. గుజరాత్‌లో విదేశీ పెట్టుబడులను ఆకర్షించడానికి 2003లో సీఎంగా ఉన్న సమయంలో మోదీ వైబ్రంట్ గుజరాత్‌ను ప్రారంభించారు. శుక్రవారం తొమ్మిదో ఎడిషన్ వైబ్రంట్ గుజరాత్ గ్లోబల్ సమ్మిట్‌ను ప్రారంభిస్తారు. శనివారం సూరత్‌లో హజీరా గన్ ఫ్యాక్టరీని ప్రారంభిస్తారు. తర్వాత కేంద్రపాలిత ప్రాంతం దాద్రానగర్ హవేలీలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

ఇద్దరు కలెక్టర్ల బదిలీ

- పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్‌గా ప్రవీణ్‌కుమార్
- విశాఖ జిల్లా కలెక్టర్‌గా కాటంనేని భాస్కర్
- పలువురు అధికారులకు అదనపు బాధ్యతలు

సాక్షి, అమరావతి: పశ్చిమగోదావరి, విశాఖపట్నం జిల్లా కలెక్టర్లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్‌చంద్ర పునేఠ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ప్రవీణకుమార్‌ను పశ్చిమగోదావరి జిల్లాకు.. పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ కాటంనేని భాస్కర్‌ను విశాఖపట్నం జిల్లాకు బదిలీ చేశారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఆర్పీ సిసోడియాను గిరిజన శాఖ ముఖ్య కార్యదర్శిగా నియమించారు. ఈ నేపథ్యంలో ఆ బాధ్యతల నుంచి ఎస్ఎస్ రావత్‌ను తప్పించారు. రావత్ ఇకపై సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శిగా కొనసాగనున్నారు. సాధారణ పరిపాలన (రాజకీయ) కార్యదర్శి ఎన్.శ్రీకాంత్‌కు సాధారణ పరిపాలన (సర్వీసుల) విభాగం బాధ్యతలను అదనంగా అప్పగించారు. ఉన్నత విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కె.దమయంతికి పశుసంవర్ధక శాఖ ముఖ్య కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నట్టు సీఎస్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కిడారి, సోముల హత్య కేసు నిందితులకు రిమాండ్



నిందితులను ఎన్ఐఏ కోర్టులో తరలిస్తున్న అధికారులు

విజయవాడ లీగల్: అరకు ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు, సోముల హత్య కేసులో నిందితులు ఎడల సుబ్బారావు, ఎడల ఈశ్వరి, జమిలి శోభన్, కొర్రా కోమలి, ధర్మయ్యలను గురువారం ఎన్ఐఏ అధికారులు కోర్టులో హాజరుపరిచారు. కేసును విచారించిన ఎన్ఐఏ కోర్టు న్యాయమూర్తి వీరందరికీ ఈనెల 31వరకు రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. అనంతరం.. ఎడల సుబ్బారావు, జమిలి శోభన్‌లను ఐదు రోజులపాటు తమ కస్టడీకి ఇవ్వాలని కోరుతూ అదే కోర్టులో అధికారులు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై వాదోపవాదాల పిమ్మట ఆ ఇద్దరినీ ఎన్ఐఏ కస్టడీకి న్యాయమూర్తి అనుమతించారు.

ప్రభుత్వంతో అమీతుమీకి సిద్ధం

- అగ్రిగోల్డ్ బాధితుల వివరాల సేకరణ
- వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన 6 నెలల్లో బాధితులకు నష్టపరిహారం
- అగ్రిగోల్డ్ బాధితుల బాసట కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు లేళ్ల అప్పిరెడ్డి

నెహ్రూనగర్ (గుంటూరు)/సాక్షి, అమరావతి: అగ్రిగోల్డ్ విషయమై ప్రభుత్వంతో అమీతుమీకి సిద్ధమవుతున్నట్లు అగ్రిగోల్డ్ బాధితుల బాసట కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు లేళ్ల అప్పిరెడ్డి ప్రకటించారు. అందులో భాగంగానే క్షేత్ర స్థాయిలో బాధితుల జాబితాను రూపొందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఎన్నిసార్లు అడిగినా బాధితుల జాబితాను ఆన్‌లైన్‌లో పెట్టని ప్రభుత్వ అలసత్వానికి నిరసనగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు తామే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఆయన వివరించారు. గురువారం గుంటూరు రెడ్డిపాలెం రోడ్డులోని సంజీవయ్య నగర్ స్కూల్లో అగ్రిగోల్డ్ బాధితుల నమోదు కేంద్రాన్ని అప్పిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా అప్పిరెడ్డి మాట్లాడుతూ ఎవరూ అధైర్య పడాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వం మెడలు వంచైనా అందరికీ న్యాయం జరిపిస్తామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి బాధితులను ఆదుకోవాలని హితవు పలికారు. లేనిపక్షంలో ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. బాధితుల వివరాలు సేకరించి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే బాధితులకు ప్రతి ఒక్కరికీ పరిహారం అందేవిధంగా చూస్తామని హామీ ఇచ్చారు.



బాధితులతో మాట్లాడుతున్న అప్పిరెడ్డి, పక్కన ఎమ్మెల్యే ముస్తఫా తదితరులు

20న బాసట కమిటీ సమావేశాలు

ఈ నెల 20న రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ అగ్రిగోల్డ్ బాసట కమిటి సమావేశాలు నిర్వహిస్తామని లేళ్ల అప్పిరెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలో అగ్రిగోల్డ్ బాధితులు 19.52లక్షల మంది ఉన్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటిస్తే.. పది లక్షల మంది ఉన్నారంటూ ప్రభుత్వ సలహాదారు కుటుంబరావు చెబుతున్నారంటే గోల్‌మాల్ చేయాలని ప్రయత్నిస్తున్నారని అప్పిరెడ్డి తప్పుబట్టారు. 20న నిర్వహించే విస్తృతస్థాయి సమావేశాల్లో అగ్రిగోల్డ్ బాధితుల వివరాలు సేకరించే ప్రక్రియను చేపట్టేలా దిశానిర్దేశం చేస్తామన్నారు.

స్పీకర్‌గా పోచారమే

- గడువులోగా ఆయన ఒక్కరే నామినేషన్
- సీఎం విజ్ఞప్తితో ఏకగ్రీవానికి ఒప్పుకున్న ప్రతిపక్షాలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌గా పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నిక కానున్నారు. పోచారం ఎన్నికపై అసెంబ్లీ సచివాలయం శుక్రవారం అధికారిక ప్రకటన చేయనుంది. స్పీకర్ ఎన్నిక ఏకగ్రీవానికి సహకరించాలని సీఎం కేసీఆర్ చేసిన విజ్ఞప్తికి ప్రతిపక్ష పార్టీలు అంగీకరించాయి. దీంతో గురువారం పోచారం ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. ఆయన అభ్యర్థిత్వాన్ని సీఎం కేసీఆర్, కాంగ్రెస్ సీనియర్ ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క ప్రతిపాదించారు. పోచారం తరఫున ఆరు సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. శాసనసభ స్పీకర్‌గా పోచారం ఎన్నికైనట్లు ప్రొటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్‌ఖాన్ శుక్రవారం అధికారికంగా ప్రకటించనున్నారు. అనంతరం సీఎం కేసీఆర్‌తోపాటు మిగిలిన ప్రతిపక్ష ఎమ్మెల్యేలు కలసి పోచారం శ్రీనివాస్‌రెడ్డిని స్పీకర్ స్థానంలో కూర్చోబెడతారు.

ఊరిపేరే ఇంటి పేరుగా...: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బాన్సువాడ మండలం పోచారం గ్రామంలో 1949 ఫిబ్రవరి 10న పరిగె శ్రీనివాస్‌రెడ్డి జన్మించారు. సొంత ఊరు పోచారం పేరే శ్రీనివాస్‌రెడ్డి ఇంటి పేరుగా స్థిరపడిపోయింది. 1976లో పోచారం రాజకీయాల్లో ప్రవేశించారు. 1994, 1999, 2009, 2011 (ఉప ఎన్నిక), 2014, 2018లో బాన్సువాడ అసెంబ్లీ స్థానం నుంచి ఎమ్మెల్యే అయ్యారు. 2004లో బాన్సువాడ నుంచి ఓడిపోయారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని టీడీపీ ప్రభుత్వాలలో 1998లో గృహనిర్మాణ, 1999లో భూగర్భ గనులు, 2000లో పంచాయతీరాజ్‌శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 2014 నుంచి 2018 వరకు వ్యవసాయ మంత్రిగా పని చేశారు.

కుటుంబ వివరాలు...

పూర్తి పేరు: పరిగె శ్రీనివాస్‌రెడ్డి
తల్లిదండ్రులు: పరిగె పాపవ్వ, రాజిరెడ్డి,
భార్య: పుష్ప, **సంతానం:** ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె

కొలువుదీరిన తెలంగాణ అసెంబ్లీ

- సీఎం సహా 114 మంది ఎమ్మెల్యేల ప్రమాణం
- ముఖ్యమంత్రి తర్వాత మహిళా సభ్యులకు అవకాశం
- గైర్హాజరైన రాజాసింగ్, అక్బరుద్దీన్, జాఫర్, మాధవరం, సండ్ర
- శుక్ర, శనివారాల్లో ఇందులో ముగ్గురి ప్రమాణస్వీకారం
- 11:30కు ప్రారంభమై 1:40కి ముగిసిన తొలిరోజు కార్యక్రమాలు



అసెంబ్లీలో ఉత్తమ్‌తో కరచాలనం చేస్తున్న కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర రెండో శాసనసభ గురువారం కొలువుదీరింది. ఉదయం 11:30 గంటలకు ప్రారంభమైన సభలో సీఎం కేసీఆర్ సహా 114 మంది ఎమ్మెల్యేలుగా ప్రమాణ స్వీకారం చేయగా, ఐదుగురు ఎమ్మెల్యేలు గైర్హాజరయ్యారు. కొందరు ఎమ్మెల్యేలుగా తాము రాజ్యాంగ బద్ధులమై ఉంటామని, మరికొందరు సభా నియమాలకు కట్టుబడి ఉంటామని ప్రమాణం చేశారు. 15 మంది ఎమ్మెల్యేలు పవిత్ర హృదయంతో.. మిగిలినవారు దైవసాక్షిగా ప్రమాణం చేశారు. ఎన్నికల ఫలితాల ప్రకటన అనంతరం.. ఎమ్మెల్యేగా గెలిచినట్లుగా రిటర్నింగ్ అధికారి ఇచ్చిన ధ్రువీకరణ పత్రాన్ని శాసనసభ అధికారులకు అందజేసి ప్రమాణం చేశారు. ఆ తరువాత రిజిస్టర్లో సంతకాలు చేశారు. ప్రమాణం సమయంలో కొందరు ఎమ్మెల్యేలు సభా నియమాలకు కట్టుబడి ఉంటామని పలకడానికి బదులుగా సభ నియామకాలకు కట్టుబడి ఉంటామని పేర్కొన్నారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ ప్రమాణ పత్రం చదవడంలో తడబడ్డారు.

ముందుగానే వచ్చిన కేసీఆర్

ఉదయం 11:30 గంటలకు సభ ప్రారంభం కావాల్సి ఉండగా.. టీఆర్ఎస్, మజ్లిస్ ఎమ్మెల్యేలు ఉదయం 11:15 గంటలకే సభలోకి వచ్చారు. తర్వాత 10 నిమిషాలకు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వచ్చారు. సీఎం కేసీఆర్ 11:26కు సభ లోపలికి చేరుకున్నారు. ఉదయం 11:30 గంటలకు ఎమ్మెల్యేలంతా లేచి నిలబడి ప్రొటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్ ఖాన్‌కు గౌరవంగా స్వాగతం పలికారు. జాతీయ గీతంతో సభాకార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకార క్రమాన్ని ప్రొటెం స్పీకర్ వెల్లడించారు. ముందుగా సీఎం, తర్వాత మహిళా ఎమ్మెల్యేలు, మిగిలిన సభ్యుల ప్రమాణ స్వీకారం వరుస క్రమంలో ఉంటుందని వెల్లడించారు. సీఎం కేసీఆర్ 11:34 గంటలకు దైవసాక్షిగా ప్రమాణం చేశారు. ప్రొటెం స్పీకర్ వద్దకు వెళ్లి ధన్యవాదాలు తెలియజేసి, రిజిస్టర్‌లో సంతకం చేశారు.

ఈసారి మహిళా సభ్యులకు అవకాశం

సాధారణంగా సీఎం తర్వాత మంత్రులు, ప్రధాన ప్రతిపక్ష నేత ప్రమాణం చేస్తారు. అయితే ఈసారి హోం మంత్రి (ఆయన కూడా ఎమ్మెల్సీ) మినహా ఇతర శాఖలకు మంత్రులు లేకపోవడంతో సీఎం తర్వాత మహిళ ఎమ్మెల్యేలు, ఆ తర్వాత మిగిలినవారు ప్రమాణ స్వీకారం చేశారు. సీఎం తర్వాత వరుసగా ఖానాపూర్ ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్, అనసూయ ధనసరి (సీతక్క), గొంగిడి సునీత, బానోత్ హరిప్రియ, పద్మాదేవేందర్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి ప్రమాణం చేశారు. మిగతా ఎమ్మెల్యేల ప్రమాణం అలంపూర్ ఎమ్మెల్యే వీఎం అబ్రహంతో మొదలై మధ్యాహ్నం బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డితో (1:39 గంటలకు) ముగిసింది.

స్విస్ బ్యాంకుల్లో నేపాలీల నల్లధనం

కాట్మండు: నేపాలీలు రూ.3,580 కోట్ల నల్లధనాన్ని అక్రమంగా స్విస్ బ్యాంకుల్లో దాచుకున్నట్లు సెంటర్ ఫర్ ఇన్వెస్టిగేటివ్ జర్నలిజం(సీఐజే) వెల్లడించింది. 55 నేపాలీలు విదేశీ సంస్థల్లో అక్రమ మార్గాల్లో పెట్టుబడులు పెట్టినట్లు సీఐజే పేర్కొంది. 'నేపాలీ లీక్స్ 2019: ఇల్లీగల్ వెల్త్ వాచ్' పేరిట బుధవారం రాత్రి విడుదల చేసిన ఓ నివేదికలో ఈ విషయాలను సీఐజే బహిర్గతపరిచింది. నల్లధనాన్ని స్విస్ బ్యాంకుల్లో దాచుకోవడం నేపాలీలు 1996లోనే ప్రారంభించడం గమనార్హం. ఈ నివేదికను 3 వేలకు పైగా ఆర్థిక, కోర్టు పత్రాలను క్షుణ్ణంగా విశ్లేషించడంతోపాటు 70 మందిని ఇంటర్వ్యూ చేసి రూపొందించినట్లు తెలిపింది. నల్లధనం దాచుకున్న వారిలో రాజకీయ నేతలు, వ్యాపార అధిపతుల్లో నాన్ రెసిడెంట్ నేపాలీలు ఉన్నట్లు పేర్కొంది. వీరిలో వ్యాపారవేత్తలు ఉపేంద్ర మహాతో, చంద్ర ధాకల్, మిను షా ఛిబర్ ఉన్నట్లు తెలిపింది. విదేశాల్లో పెట్టుబడిన పెట్టిన అత్యధికులు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల రూపంలో తిరిగి దేశంలోకి మళ్లించినట్లు బయటపెట్టింది. ఓ భారతీయురాలిని వివాహం చేసుకున్న వ్యాపారవేత్త మిను షా అత్యధికంగా రూ.260 కోట్లు దాచుకున్నారని తెలిపింది.

మెల్‌బోర్న్‌లోనూ మెరిస్తే...



ధోని, కోహ్లి

నేడు ఆస్ట్రేలియాతో ఆఖరి వన్డే

టి20 సిరీస్‌ను 1-1తో ముగించి సంతృప్తి పడినా, టెస్టు సిరీస్‌లో 2-1తో విజయం సాధించి చరిత్ర సృష్టించిన టీమిండియా... వన్డే సిరీస్‌ను వశం చేసుకునేందుకు ఒక్క అడుగు దూరంలో ఉంది. శుక్రవారం జరిగే మూడో మ్యాచ్‌లో గెలుపొందితే... దాదాపు రెండు నెలల ఆస్ట్రేలియా పర్యటనలో అజేయంగా నిలిచినట్లవుతుంది. మరోవైపు పరువు దక్కించుకోవాలంటే తప్పక నెగ్గాల్సిన స్థితిలో ఉంది ఆతిథ్య జట్టు. ఇరు జట్లకు ప్రతిష్టాత్మకంగా మారిన మెల్‌బోర్న్ వన్డేలో మెరిసేదెవరో?

- సిరీస్ విజయంపై భారత్ దృష్టి
- రెండు మార్పులతో ఆతిథ్య జట్టు
- ఉదయం గం॥7.50 నుంచి సోనీ సిక్స్, టెన్ 3లలో ప్రత్యక్ష ప్రసారం

మెల్‌బోర్న్ : ఎంతో చర్చ జరిగి, మరెంతో ఆసక్తి రేపిన ఆస్ట్రేలియా పర్యటన ముగింపునకు వచ్చింది. నవంబరు 21న బ్రిస్బేన్‌లో టి20తో మొదలైన పోరాటానికి... మెల్‌బోర్న్‌లో నేడు జరుగనున్న మూడో వన్డేతో తెరపడనుంది. ప్రస్తుతం 1–1తో సమంగా ఉన్న సిరీస్ ఫలితాన్ని కూడా ఇదే మ్యాచ్ తేల్చబోతోంది. ఈ క్రమంలో తమ చారిత్రక పర్యటనకు అంతే ఘనంగా వీడ్కోలు పలకాలని కోహ్లి సేన భావిస్తుండగా, సొంతగడ్డపై పూర్తిగా విఫలమైందన్న అప్రతిష్టను తప్పించుకోవాలని ఫించ్ బృందం ప్రయత్నిస్తోంది. కీలకమైన ఈ మ్యాచ్‌లో భారత్ ఒకటి లేదా రెండు మార్పులతో దిగనున్నట్లు తెలుస్తోంది. ఆస్ట్రేలియా రెండు మార్పులు చేయనుంది.



ఫించ్

రాయుడు ఉంటాడా?

బ్యాటింగ్‌లో నాలుగో నంబరు స్థానంపై ఆందోళన తొలగిందని భావిస్తే, బౌలింగ్‌లో ఐదో బౌలర్ బెంగ పట్టుకుంది టీమిండియాకు. పేసర్ బుమ్రాకు విశ్రాంతితో ఇది తాత్కాలికమే అయినా, అతడి స్థానంలో వచ్చిన ఖలీల్ అహ్మద్, హైదరాబాదీ సిరాజ్ తీవ్రంగా నిరాశపర్చారు. వికెట్లు తీయలేకపోగా రెండు మ్యాచ్‌ల్లోనూ భారీగా పరుగులిచ్చారు. దీంతో మెల్‌బోర్న్‌లో పేస్ ఆల్‌రౌండర్ విజయ్‌శంకర్, లెగ్ స్పిన్నర్ యజువేంద్ర చహల్‌లలో ఒకరిని ఆడించే అవకాశం కనిపిస్తోంది. అరంగేట్రంలోనే విజయ్ శంకర్ ఇక్కడి పిచ్‌లపై 10 ఓవర్లు వేయగలడా? అనే అనుమానాలున్నాయి. దీన్నిబట్టి చూస్తే చహల్‌నే తీసుకోవచ్చు. లేదా, నిఖార్సైన మూడో పేసరే తగినవాడనుకుంటే సిరాజ్ స్థానంలో ఖలీల్‌ను మళ్లీ బరిలో దింపొచ్చు. ప్రధాన పేసర్లు భువనేశ్వర్, షమీ, స్పిన్నర్లు జడేజా, కుల్దీప్ ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్‌ను కట్టిపడేస్తున్నారు. ఆస్ట్రేలియాను రెండు మ్యాచ్‌ల్లోనూ 300 మార్క్ చేరకుండా అడ్డుకున్నారు. ఇక గత మ్యాచ్‌లో ధావన్, కోహ్లి రాణించడంతో రోహిత్ సహా టాప్–3 బ్యాట్స్‌మెన్ ఎప్పటిలాగే టాప్ గేర్‌లోకి వచ్చినట్లైంది. మాజీ కెప్టెన్ ధోని తన ముగింపు సామర్థ్యాన్ని మరోసారి చాటుకోవడం, దినేశ్ కార్తీక్ విలువైన ఇన్నింగ్స్ ఆడటంతో మిడిలార్డర్ ఫామ్‌పై సందేహాలు తొలిగాయి. మిగిలింది అంబటి రాయుడు మాత్రమే. నాలుగో నంబరులో సరైనోడనుకున్న రాయుడు ఈ సిరీస్‌లో ఉనికి చాటలేదు. జట్టు కూర్పులో ఆరో బౌలర్‌గా పనికొస్తాడని కేదార్ జాదవ్‌ను ఆడిస్తే రాయుడి స్థానం ఇబ్బందుల్లో పడ్డట్లే. ఒకవేళ అవకాశం దక్కితే... ముమ్ముందు ప్రధాన టోర్నీలకూ తన పేరు పరిశీలనలో ఉండాలంటే అతడు ఈ మ్యాచ్‌లో తప్పక రాణించాలి.

వారి స్థానంలో స్టాన్‌లేక్, జంపా

టీమిండియా టాపార్డర్‌కు పూర్తి భిన్నంగా ఉంది ఆతిథ్య జట్టు టాపార్డర్. కెప్టెన్ అరోన్ ఫించ్ పేలవ ఫామ్ నుంచి బయటకు రావడం లేదు. ఇన్ స్వింగర్లను ఎదుర్కోవడంలో ఫించ్ చేతులెత్తేస్తున్నాడు. మరో ఓపెనర్ అలెక్స్ క్యారీ అంతంతే అన్నట్లున్నాడు. వన్‌డౌన్ బ్యాట్స్‌మన్ ఖాజా ఫర్వాలేదనిపిస్తున్నాడు. షాన్ మార్ష్ అద్భుత ఫామ్‌తో పాటు హ్యాండ్స్‌కోంబ్, స్టొయినిస్, మ్యాక్స్‌వెల్ రూపంలో లోతైన బ్యాటింగ్ లైనప్ ఉండటం ఆసీస్ బలం. పేసర్ బెహ్రెన్‌డార్ఫ్ గాయంతో దూరమవడం, స్పిన్నర్ లయన్ ప్రభావం చూపలేకపోతుండటంతో వీరి స్థానాల్లో బిల్లీ స్టాన్‌లేక్, ఆడమ్ జంపాలను ఆడించనుంది. మార్ష్‌ను త్వరగా వెనక్కు పంపి, యువ పేసర్ జెయ్ రిచర్డ్సన్‌ను సమర్థంగా ఎదుర్కొంటే మ్యాచ్‌లో కోహ్లి సేనదే పై చేయి అవుతుంది.

ఈ మ్యాచ్‌లో గెలిస్తే ఆస్ట్రేలియా గడ్డపై భారత్ తొలిసారిగా ద్వైపాక్షిక వన్డే సిరీస్‌ను కైవసం చేసుకుంటుంది. 1985లో ప్రపంచ చాంపియన్‌షిప్, 2008లో కామన్వెల్త్ బ్యాంక్ టోర్నీలు నెగ్గినా... అవి మూడు లేదా అంతకంటే ఎక్కువ జట్లు పాల్గొన్నవి. 2016లో భారత్-ఆస్ట్రేలియా తొలిసారిగా ఐదు వన్డేల ముఖాముఖీ సిరీస్‌లో తలపడ్డాయి. ఆసీస్ 4-1తో విజయం సాధించింది.

1

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్, ధావన్, కోహ్లి (కెప్టెన్), రాయుడు/జాదవ్, ధోని, దినేశ్ కార్తీక్, జడేజా, కుల్దీప్, విజయ్ శంకర్/ చహల్, భువనేశ్వర్, షమీ.
ఆస్ట్రేలియా: క్యారీ, ఫించ్ (కెప్టెన్), ఖాజా, షాన్ మార్ష్, హ్యాండ్స్‌కోంబ్, స్టొయినిస్, మ్యాక్స్‌వెల్, జంపా, స్టాన్‌లేక్, సిడిల్, రిచర్డ్సన్

పిచ్, వాతావరణం

మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ (ఎంసీజీ) పిచ్‌పై బౌన్స్ పేసర్లకు ఉపయోగపడుతుంది. పెద్ద బౌండరీలు కావడంతో స్పిన్నర్ల పాత్ర కీలకం కానుంది. వర్ష సూచన లేదు. 27 డిగ్రీలు మించని ఉష్ణోగ్రతతో వాతావరణం ఆటకు అనుకూలంగా ఉండనుంది.



త్రిశంకు స్వర్గంలో...

- పాండ్యా, రాహుల్‌ల భవిష్యత్తు
- అంబుడ్స్‌మన్‌ను నియమించని సుప్రీం కోర్టు
- బీసీసీఐ ముందు న్యాయపరమైన చిక్కులు

న్యూఢిల్లీ: టీవీ షోలో సరదాగా మాట్లాడే ప్రయత్నంలో నోరు జారడం ఎంత తీవ్ర పరిణామాలకు దారి తీస్తుందో హార్దిక్ పాండ్యా, కేఎల్ రాహుల్ ఊహించలేకపోయారు. నిషేధం కారణంగా ఇప్పటికే ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌తో పరిమిత ఓవర్ల సిరీస్‌కు దూరమైన వీరిద్దరు మళ్లీ ఎప్పుడు క్రికెట్‌లో అడుగు పెడతారో చెప్పలేని పరిస్థితి నెలకొంది. బీసీసీఐ నియమావళి ప్రకారం ఆటగాళ్లపై క్రమశిక్షణా చర్యలు తీసుకునే తుది అధికారం బోర్డు నియమించిన అంబుడ్స్‌మన్‌కే ఉంది. ఇద్దరు క్రికెటర్లపై విచారణ అనంతరం బీసీసీఐ సీఈఓ రాహుల్ జోహ్రి కూడా తన నివేదికను అంబుడ్స్‌మన్‌కే ఇవ్వాలి. అయితే ఇప్పటికిప్పుడు అంబుడ్స్‌మన్‌ను నియమించేందుకు సుప్రీం కోర్టు నిరాకరించింది. లోధా కమిటీ సిఫారసుల అమలు, బీసీసీఐ ఎన్నికలు తదితర అంశాలతో పాటు పాండ్యా–రాహుల్‌ల అంశంపై కూడా సుప్రీం కోర్టులో గురువారం వాదనలు జరిగాయి. క్రికెట్ పరిపాలకుల కమిటీ (సీఓఏ) తరపు న్యాయవాదులు పరాగ్ త్రిపాఠి, సీయూ సింగ్ దీనికి హాజరయ్యారు. బోర్డులో పలు సమస్యలు పరిష్కరించేందుకు వెంటనే అంబుడ్స్‌మన్‌ను నియమించాల్సిందిగా వారు కోరారు. అయితే బీసీసీఐ గుర్తింపు ఉన్న ప్రభుత్వ సంస్థల తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ ఆఫ్ ఇండియా మాత్రం అంబుడ్స్‌మన్‌ను నియమించే అధికారం కేవలం బోర్డుకే ఉందని...అది ఎన్నికలు నిర్వహించి కార్యవర్గం ఏర్పడిన తర్వాత మాత్రమే సాధ్యమని వాదించారు. అనంతరం జస్టిస్ ఎస్ఏ బోబ్డే, ఏఎం సప్రే సభ్యులుగా గల ద్విసభ్య బెంచ్ మొత్తం కేసును వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. అసలు దీనిపై వాదనలు కూడా కనీసం వారం రోజుల తర్వాత, అమికస్ క్యూరీ (కోర్టు సహాయకారి) బాధ్యతలు స్వీకరించిన తర్వాతే వింటామని తేల్చి చెప్పింది. ఇటీవలే గోపాల సుబ్రమణ్యం రాజీనామా చేసిన నేపథ్యంలో సుప్రీం కోర్టు సీనియర్ న్యాయమూర్తి పీఎస్ నర్సింహను అమికస్ క్యూరీగా ఎంపిక చేసింది. అయితే ఆయన ఎప్పుడు బాధ్యతలు చేపడతారో తెలీదు. ఆయన లేకుండా ఎలాంటి నిర్ణయాలు తీసుకోమని సుప్రీం స్పష్టం చేసింది. వాదనల తర్వాత తేదీ ఏమిటో కూడా కోర్టు ప్రకటించలేదు. దాంతో క్రికెటర్ల భవిష్యత్తు గందరగోళంలో పడింది. 'నిజానికి వినోద్ రాయ్ సూచన మేరకు 2 మ్యాచ్‌ల నిషేధంతో పని అయిపోయేది. కానీ దానికి ఒప్పుకోని డయానా ఎడుల్జీ లీగల్ టీమ్ సూచన అడగడం, వారు అంబుడ్స్‌మన్ తప్పనిసరి అని చెప్పడంతో విషయం కోర్టు దాకా వెళ్లిపోయింది. ఇప్పుడు ఎవరూ ఏమీ చేయడానికి లేదు. క్రికెటర్ల పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదు' అని బీసీసీఐ సీనియర్ సభ్యుడొకరు అభిప్రాయ పడ్డారు.



తప్పులు మానవసహజం!

ముంబై: హార్దిక్, రాహుల్‌ల వివాదంపై మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ పరోక్షంగా స్పందించాడు. నేరుగా వారి పేర్లు చెప్పకపోయినా తప్పులు చేయడం మానవ సహజమని, ఇక దానిని వదిలేయాలని అభిప్రాయ పడ్డాడు. 'నేను టీవీ షో చూడలేదు. అయితే అందరూ తప్పులు చేస్తారు. వాటి గురించి ఇంకా అతి అనవసరం. తప్పు చేసినవారు దానిని తెలుసుకొని సరిదిద్దుకుంటారని భావిస్తున్నా. అన్నీ పక్కాగా ఉండటానికి మనం యంత్రాలం కాదు మనుషులం. గతం వదిలి మళ్లీ అలాంటి తప్పు జరగకుండా మాత్రమే చూసుకోవాలి. ఎవరో ఒకరిద్దరు తప్ప నిజానికి క్రికెటర్లంతా మంచివాళ్లే. మధ్యతరగతినుంచి వచ్చి జీవితంలో ఎదిగేందుకు ఎంతో శ్రమిస్తారు కాబట్టి మంచితనం వచ్చేస్తుంది. కోట్లాది మంది నుంచి 11 మంది సభ్యుల జట్టులోకి ఎంపిక కావడం మామూలు విషయం కాదు' అని గంగూలీ వ్యాఖ్యానించాడు.

14 ఏళ్ల కుర్రాడిపై వేటు!

లైంగికపరమైన ఆరోపణలు ఎదుర్కొన్న తమ ఆటగాడిపై ముంబై క్రికెట్ సంఘం (ఎంసీఏ) చర్య తీసుకుంది. ముంబై అండర్–16 జట్టు కెప్టెన్, 14 ఏళ్ల ముషీర్ ఖాన్‌పై మూడేళ్ల నిషేధం విధించింది. డిసెంబర్‌లో జాతీయ అండర్–16 విజయ్ మర్చంట్ ట్రోఫీలో భాగంగా కడపలో ముంబై–యూపీ మధ్య క్వార్టర్ ఫైనల్ జరిగిన సందర్భంగా ఈ ఘటన చోటు చేసుకుంది. అద్భుత ప్రతిభాపాటవాలు కలిగి భవిష్యత్తులో స్టార్ కాగలడని ముంబై క్రికెట్ వర్గాల్లో ముషీర్‌పై అంచనాలు ఉన్నాయి. స్కూల్‌నుంచి లీగ్ క్రికెట్ వరకు అన్ని దశల్లో పరుగుల వరద పారించడంతో త్వరలోనే అతను అండర్–19 టీమ్‌కు ఎంపికయ్యే అవకాశాలు కనిపించాయి. మరో యువ సంచలనం సర్ఫరాజ్ ఖాన్‌కు ముషీర్ సొంత తమ్ముడు కావడం విశేషం.

సెరెనా మరో అడుగు



- మూడో రౌండ్ చేరిన అమెరికా స్టార్
- గట్టెక్కిన టాప్ సీడ్ హలెప్
- ఆస్ట్రేలియన్ ఓపెన్ టోర్నీ

మెల్‌బోర్న్: రెండేళ్ల క్రితం రెండు నెలల గర్భంతో ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ నెగ్గిన అమెరికా నల్లకలువ సెరెనా విలియమ్స్ మళ్లీ టైటిలే లక్ష్యంగా వేగం పెంచింది. 24వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ రికార్డును సమం చేసేందుకు సిద్ధమైన ఆమె సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ మూడో రౌండ్లోకి ప్రవేశించింది. టాప్‌సీడ్ హలెప్‌కు రెండో రౌండ్లోనే చావుతప్పి కన్నులొట్టపోయినంత పనైంది. ఆమె అతికష్టమ్మీద గట్టెక్కింది. వీనస్ విలియమ్స్, సీడెడ్ క్రీడాకారిణిలు ఒసాకా, స్వితోలినా, ప్లిస్కోవా మూడో రౌండ్లోకి అడుగుపెట్టారు. పురుషుల సింగిల్స్‌లో నంబర్‌వన్ సీడ్ జొకోవిచ్ సునాయాస విజయంతో ముందంజ వేయగా... రావ్‌నిక్, నిషికోరి, జ్వెరెవ్ మూడో రౌండ్‌కు చేరారు.

'అమ్మ' అలవోకగా...

మహిళల సింగిల్స్‌లో 16వ సీడ్‌గా బరిలోకి దిగిన అమెరికన్ దిగ్గజం సెరెనా రెండో రౌండ్లో దూకుడుగా ఆడింది. కోర్ట్ అంతా పాదరసంలా కదిలిన ఈ 'అమ్మ' 6–2, 6–2తో ఎజెని బౌచర్డ్ (కెనడా)పై విజయం సాధించింది. కేవలం గంటా 10 నిమిషాల్లోనే ప్రత్యర్థి ఆట కట్టించింది. టాప్ సీడ్ హలెప్ (రుమేనియా)కు అన్‌సీడెడ్ సోఫియా కెనిన్ (అమెరికా) ముచ్చెమటలు పట్టించింది. చివరకు హలెప్ 6–3, 6–7 (5/7), 6–4తో కెనిన్‌పై గట్టెక్కి ఊపిరి పీల్చుకుంది. మిగతా మ్యాచ్‌ల్లో నాలుగో సీడ్ నవొమి ఒసాకా (జపాన్) 6–2, 6–4తో తమర జిదన్సెక్ (స్లోవేనియా)పై, ఆరో సీడ్ స్వితోలినా (ఉక్రెయిన్) 6–4, 6–1తో కుజ్‌మోవ (స్లోవేకియా)పై గెలుపొందారు. ఏడో సీడ్ ప్లిస్కోవా (చెక్ రిపబ్లిక్) 4–6, 6–1, 6–0తో బ్రింగిల్ (అమెరికా)ను ఓడించగా, వీనస్ విలియమ్స్ (అమెరికా) 6–3, 4–6, 6–0తో కార్నెట్ (ఫ్రాన్స్)పై, ముగురుజా (స్పెయిన్) 6–4, 6–7 (3/7), 7–5తో జొహానా కొంటా (ఇంగ్లండ్)పై నెగ్గింది. మాడిసన్ కీస్ (అమెరికా) 6–3, 6–4తో అనస్తాసియా పాటపోవా (రష్యా)పై విజయం సాధించింది.



జోరుమీదున్న జొకో

పురుషుల సింగిల్స్‌లో సెర్బియన్ స్టార్, టాప్ సీడ్ జొకోవిచ్ జోరు పెంచాడు. రెండో రౌండ్లో అతను 6–3, 7–5, 6–4తో జో విల్‌ఫ్రెడ్ సోంగా (ఫ్రాన్స్)ను ఇంటిదారి పట్టించాడు. నాలుగో సీడ్ జ్వెరెవ్ (జర్మనీ) 7–6 (7/5), 6–4, 5–7, 6–7 (6/8), 6–1తో జెరిమి చార్డి (ఫ్రాన్స్)పై, ఎనిమిదో సీడ్ నిషికొరి (జపాన్) 6–3, 7–6 (8/6), 5–7, 5–7, 7–6 (10/7)తో కార్లోవిక్ (క్రొయేషియా)పై చెమటోడ్చి నెగ్గారు. వైల్డ్‌కార్డ్ ఎంట్రీ ఆటగాడు అలెక్సి పాపిరిన్ (ఆస్ట్రేలియా) ఏడో సీడ్ డొమినిక్ థీమ్ (ఆస్ట్రియా)కు షాకిచ్చాడు. 5–7, 4–6, 0–2తో వెనుకబడిన దశలో థీమ్ రిటైర్ట్‌హర్ట్‌గా వెనుదిరిగాడు. 11వ సీడ్ బొర్నా కొరిచ్ (క్రొయేషియా) 6–4, 6–3, 6–4తో ఫుక్సోవిక్స్ (హంగేరి)పై, 12వ సీడ్ ఫాగ్‌నిని (ఇటలీ) 7–6 (7/3), 6–3, 7–6 (7/5)తో మేయర్ (అర్జెంటీనా)పై గెలిచారు.

68 ఏళ్లలో తొలిసారి...



ధంపికి సహచరుల అభినందన

- రంజీ ట్రోఫీ సెమీ ఫైనల్లో కేరళ
- క్వార్టర్స్‌లో గుజరాత్‌పై విజయం

వాయనాడ్: దేశవాళీ ఫస్ట్ క్లాస్ టోర్నీ రంజీ ట్రోఫీలో కేరళ జట్టు సంచలనం సృష్టించింది. తమ చరిత్రలో తొలిసారి ఈ టోర్నీలో సెమీ ఫైనల్లోకి ప్రవేశించింది. గురువారం ఇక్కడ మూడో రోజే ముగిసిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో కేరళ 113 పరుగుల తేడాతో మాజీ చాంపియన్ గుజరాత్‌పై ఘన విజయం సాధించింది. 195 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన గుజరాత్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 31.3 ఓవర్లలో 81 పరుగులకే కుప్పకూలింది. రాహుల్ షా (33) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. కేరళ పేసర్లు బాసిల్ థంపి (5/27), సందీప్ వారియర్ (4/30) ప్రత్యర్థిని కుప్పకూల్చారు. పార్థివ్ పటేల్ (0)ను తొలి బంతికే సచిన్ బేబీ రనౌట్ చేశాడు. 24 పరుగులకే గుజరాత్ తమ చివరి 6 వికెట్లు కోల్పోయింది.

ట్రావన్‌కోర్–కొచ్చిన్ పేరుతో 1951–52 సీజన్‌లో రంజీ ట్రోఫీ బరిలోకి దిగిన జట్టు... కేరళ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 1957–58 సీజన్ నుంచి ఆ పేరుతో ఆడుతోంది. గత ఏడాది క్వార్టర్ ఫైనల్ చేరడం కేరళ అత్యుత్తమ ప్రదర్శన కాగా, ఈ సారి దానిని మరింతగా మెరుగుపర్చుకుంది.

ఇతర రంజీ క్వార్టర్స్ స్కోర్లు

నాగపూర్: వసీం జాఫర్ (206) డబుల్ సెంచరీతో ఉత్తరాఖండ్‌పై తొలి ఇన్నింగ్స్‌లో ఆట ముగిసే సరికి విదర్భ 6 వికెట్లకు 559 పరుగులు చేసింది. ఇప్పటికే 204 పరుగుల ఆధిక్యం లభించగా... మ్యాచ్ 'డ్రా'గా ముగిస్తే విదర్భ సెమీస్ చేరడం దాదాపు ఖాయమే.

లక్నో: ఉత్తరప్రదేశ్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్‌లో 208 పరుగులకే ఆలౌటైంది. ఫలితంగా యూపీకి 177 పరుగుల భారీ ఆధిక్యం దక్కింది. రెండో ఇన్నింగ్స్‌లో 8 వికెట్లకు 172 పరుగులు చేసిన యూపీ ఓవరాల్‌గా 349 పరుగులు ముందంజంలో ఉంది. కాబట్టి యూపీ ముందుకెళ్లటం ఇక లాంఛనమే.

బెంగళూరు: కర్ణాటకతో జరుగుతున్న మ్యాచ్‌లో రాజస్తాన్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 222 పరుగులకు ఆలౌటైంది. ఆ తర్వాత 184 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన కర్ణాటక ఆట ముగిసే సరికి 3 వికెట్లకు 45 పరుగులు చేసింది. దాంతో చివరి రోజు శుక్రవారం ఆట ఆసక్తికరంగా మారింది.

క్వార్టర్స్‌లో సైనా, శ్రీకాంత్

మలేసియా మాస్టర్స్ టోర్నీ



కౌలాలంపూర్: కొత్త ఏడాది ఆరంభ టోర్నీ మలేసియా మాస్టర్స్ సూపర్–500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత స్టార్ ప్లేయర్లు సైనా నెహ్వాల్, కిడాంబి శ్రీకాంత్ ముందంజ వేశారు. సింగిల్స్ విభాగంలో వీరిద్దరూ క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నారు. మరోవైపు పురుషుల సింగిల్స్ విభాగంలో కామన్వెల్త్ గేమ్స్ మాజీ చాంపియన్ పారుపల్లి కశ్యప్... మహిళల డబుల్స్ కేటగిరీలో అశ్విని పొన్నప్ప- సిక్కిరెడ్డి జోడీ రెండో రౌండ్‌లోనే ఓడిపోయి టోర్నీ నుంచి నిష్క్రమించారు. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో ఏడో సీడ్ సైనా (భారత్) 21–14, 21–16తో పుయ్ యిన్ యిప్ (హాంకాంగ్)పై వరుస గేముల్లో కేవలం 39 నిమిషాల్లోనే గెలుపొందింది. నేడు జరిగే క్వార్టర్స్‌లో 2017 ప్రపంచ చాంపియన్, రెండో సీడ్ నొజోమి ఒకుహారా (జపాన్)తో లండన్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత సైనా తలపడుతుంది. ప్రస్తుతం ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 9వ స్థానంలో ఉన్న సైనా ముఖాముఖీ రికార్డులో 8–4తో ఒకుహారా (వరల్డ్ నెం.2)పై ఆధిక్యంలో ఉంది. మరోవైపు పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో ఏడో సీడ్ శ్రీకాంత్ (భారత్) 23–21, 8–21, 21–18తో వాంగ్ వింగ్ కి విన్సెంట్ (హాంకాంగ్)పై పోరాడి గెలిచాడు. నేటి మ్యాచ్‌లో నాలుగో సీడ్ సన్‌వాన్‌హో (కొరియా)తో శ్రీకాంత్ తలపడతాడు. మరో మ్యాచ్‌లో క్వాలిఫయర్ కశ్యప్ 17–21, 23–25తో ఆరోసీడ్ ఆంథోని సినిసుకా జింటింగ్ (ఇండోనేసియా) చేతిలో ఓటమి పాలయ్యాడు. మహిళల డబుల్స్ రెండోరౌండ్‌లో అశ్విని పొన్నప్ప–సిక్కిరెడ్డి (భారత్) ద్వయం 18–21, 17–21తో ని కెటుట్ మహాదేవి ఇస్తారాణి- రిజ్కీ అమేలియా ప్రదీప్త (ఇండోనేసియా) జంట చేతిలో ఓడిపోయింది.

అమ్మకానికి రాజస్తాన్ రాయల్స్!

నిర్ధారించిన బీసీసీఐ

న్యూఢిల్లీ: ఐపీఎల్ ఫ్రాంచైజీ రాజస్తాన్ రాయల్స్ యాజమాన్యం సగం వాటాను అమ్మేందుకు సిద్ధమైంది. ఈ విషయాన్ని లీగ్ పాలక మండలికి, భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)కి తెలిపింది. వాటా విక్రయం తెలియగానే పలువురు బడా పారిశ్రామికవేత్తలు కొనుగోలుకు ఆసక్తి కనబరుస్తున్నారు. రాయల్స్‌లో ప్రధాన యజమాని అయిన మనోజ్ బదాలే వాటాల విక్రయం నిజమేనని వెల్లడించారు. దీన్ని బీసీసీఐ సీనియర్ అధికారి ఒకరు ధ్రువీకరించారు. గతంలో రాయల్స్, చెన్నై సూపర్ కింగ్స్ రెండేళ్లు నిషేధానికి గురైనపుడు రైజింగ్ పుణే సూపర్ జెయింట్స్ జట్టుతో లీగ్‌లో ప్రవేశించిన పారిశ్రామికవేత్త సంజీవ్ గోయెంకా ఇప్పుడు రాయల్స్ వాటాతో లీగ్‌లో పునరాగమనం చేయనున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. ఆయన ఇప్పటికే ఇండియన్ సూపర్ లీగ్ సాకర్ టోర్నీలో అట్లెటికో డి కోల్‌కతా జట్టును కలిగివున్నారు.

ఏపీలో ఒంటరిగా పోటీ చేస్తాం: కన్నా

వేంపల్లె: ఏపీలో బీజేపీ ఒంటరిగా పోటీ చేస్తుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ వెల్లడించారు. గురువారం వైఎస్సార్ జిల్లా వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం చంద్రబాబుకు రాయలసీమ అభివృద్ధి చెందటమంటే ఇష్టం లేదని విమర్శించారు. అనారోగ్య కారణంగా రాష్ట్ర పర్యటనకు రావట్లేదని, కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్‌మాధవ్ వస్తున్నట్లు తెలిపారు.

స్విమ్స్ జేడీగా ఆదికృష్ణయ్య వద్దు

- సీఎం చంద్రబాబుకు వైద్య బృందం లేఖ
- స్విమ్స్ పాలనను ఆయన కలుషితం చేస్తున్నారని ఆరోపణ
- నాన్ మెడికల్ అధికారికి పదవి కట్టబెడుతుండటంపై మండిపాటు
- నిబంధనలు కాదని సీఎం బంధువుకు పోస్టు ఇచ్చేందుకు రంగం సిద్ధం
- విజయవాడలో నేడు ఈబీ, గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం

సాక్షి, అమరావతి: శ్రీ వేంకటేశ్వరా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (స్విమ్స్)లో కీలకమైన సంయుక్త సంచాలకుడు (జాయింట్ డైరెక్టర్) పోస్టును ముఖ్యమంత్రి చంద్రబాబు సమీప బంధువుకు కట్టబెట్టేందుకు రంగం సిద్ధమైంది. ఈ నియామకాన్ని వ్యతిరేకిస్తూ వైద్య బృందం సీఎంకు, ఆరోగ్య శాఖ మంత్రికి లేఖ రాసింది. అవినీతి ఆరోపణలు ఉన్న ఆయన నియామకం వద్దంటూ అభ్యర్థించింది. నిబంధనలు అనుమతించకపోయినా.. అన్ని అభ్యంతరాలను తుంగలోతొక్కి నారా ఆదికృష్ణయ్యకు జేడీ పదవి కట్టబెట్టడానికి రంగంసిద్ధమైందని వైద్యులు విమర్శిస్తున్నారు. దీని కోసం శుక్రవారం విజయవాడలో సీఎం సమక్షంలో ఎగ్జిక్యూటివ్ బోర్డు, గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం ప్రత్యేకంగా నిర్వహించనున్నారని తెలిపారు. స్విమ్స్ ఉన్న తిరుపతిలో సమావేశం నిర్వహిస్తే వైద్యుల నుంచి ప్రతిఘటన ఎదురవుతుందని వేదికను విజయవాడకు మార్చారని వైద్యులు ఆరోపిస్తున్నారు. నారావారిపల్లెకు చెందిన ఆదికృష్ణయ్య ముఖ్యమంత్రి చంద్రబాబుకు వరుసకు సోదరుడు అవుతారు. స్వయానా ముఖ్యమంత్రే తన బంధువుకు అడ్డదారిలో పదవి కట్టబెడుతుండటంపై టీటీడీ అధికారులపై స్విమ్స్ సిబ్బంది మండిపడుతున్నారు.

స్విమ్స్‌ను కాపాడండి

పలు అవినీతి, అక్రమాల్లో నారా ఆదికృష్ణయ్య హస్తముందనే ఆరోపణలు ఉన్నాయని, ఆయన బారినుంచి సంస్థను కాపాడాలని స్విమ్స్ వైద్యబృందం ముఖ్యమంత్రికి, ఆరోగ్యశాఖ మంత్రికి, టీటీడీ బోర్డు ఈవోకు, ఆరోగ్యశాఖ ప్రత్యేక చీఫ్ సెక్రటరీకి ఇటీవల లేఖ రాసింది. స్విమ్స్ చరిత్రలో ఇప్పటివరకూ నాన్‌మెడికల్ ఆఫీసర్‌ను జేడీగా నియమించిన దాఖలాలు లేవని తెలిపారు. సుమారు వెయ్యిమంది వైద్యులు పని చేస్తున్న ఆస్పత్రిలో తమ మనోభావాలు దెబ్బతియ్యవద్దని లేఖలో వేడుకున్నారు. 1992లో క్లర్కుగా స్విమ్స్‌లో చేరిన ఆదికృష్ణయ్య.. రాజకీయ అండదండలతో పరిపాలనా విషయంలో, ఆర్థిక కార్యకలాపాలాల్లో తలదూర్చి స్విమ్స్‌ను కలుషితం చేశారని, ఇప్పటికే ఆయన ఆధిపత్యంతో డైరెక్టర్, రిజిస్ట్రార్, జాయింట్ రిజిస్ట్రార్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ తదితరులు డమ్మీలుగా మారారని, ఇప్పుడు జేడీ పదవి ఇస్తే ఇక్కడ వైద్యులు పనిచేసే పరిస్థితులు ఉండవని పేర్కొన్నారు. పలువురు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వద్ద ఆదికృష్ణయ్య డబ్బులు వసూలు చేసిన ఆరోపణలున్నాయని, వాటన్నింటిపై విజిలెన్స్ విచారణ చేయించాలని లేఖలో కోరారు. కాగా, ఈనెల 18న విజయవాడలో ముఖ్యమంత్రి సమక్షంలో జరిగే ఈ సమావేశంలో నారా ఆదికృష్ణయ్య నియామక ప్రక్రియను పూర్తిచేయాలని భావిస్తున్నారని వైద్యులు ఆరోపించారు. కీలకమైన ఈ పదవిని చేజిక్కించుకుంటే స్విమ్స్‌లో పెత్తనం చెలాయించవచ్చని ఆదికృష్ణయ్య ఆలోచన అని వారు చెబుతున్నారు. ఎగ్జిక్యూటివ్ బోర్డు సమావేశం తిరుపతిలో నిర్వహిస్తే డాక్టర్లు ఆందోళన చేయడానికి సిద్ధంగా ఉన్నారన్న విషయాన్ని గ్రహించి సమావేశాన్ని హఠాత్తుగా విజయవాడకు మార్చినట్టు స్విమ్స్ వైద్యులు తెలిపారు.

జాలర్ల వలలో మొసలి



కల్లూరు (రూరల్): కర్నూలు జిల్లా సుంకేసుల డ్యాంలో గురువారం చేపలు పట్టేందుకు వెళ్లిన జాలర్ల వలకు మొసలి చిక్కింది. దీనిని చూసిన జాలర్లు ఆందోళనకు గురై.. అటవీశాఖ అధికారులకు సమాచారమిచ్చారు. దీంతో అటవీశాఖ సిబ్బంది అక్కడికి చేరుకొని మొసలిని కర్నూలులోని సీసీఎఫ్ కార్యాలయానికి తరలించారు. ఈ మొసలిని మల్యాల లిఫ్ట్ ఇరిగేషన్ వద్ద శ్రీశైలం డ్యాం బ్యాక్ వాటర్‌లో వదిలేస్తామని సీసీఎఫ్ కార్యాలయ మేనేజర్ సి.జయరాజు, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ రమణారెడ్డి తెలిపారు.

వైఎస్సార్‌సీపీలోకి మద్దిశెట్టి

పార్టీలోకి ఆహ్వానించిన వైఎస్ జగన్



వైఎస్ జగన్ సమక్షంలో పార్టీలో చేరుతున్న మద్దిశెట్టి

సాక్షి, హైదరాబాద్: ప్రకాశం జిల్లా దర్శి అసెంబ్లీ నియోజకవర్గం నేత మద్దిశెట్టి వేణుగోపాల్ గురువారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. తన అనుచరులతో వచ్చి పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆయన నివాసంలో కలుసుకుని పార్టీలో చేరాలన్న తన అభీష్టాన్ని వెల్లడించారు. ఆయనకు వైఎస్ జగన్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి, మాజీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి సమక్షంలో ఈ చేరిక కార్యక్రమం జరిగింది. వేణుగోపాల్ 2009 ఎన్నికల్లో దర్శి నియోజకవర్గం నుంచి ప్రజారాజ్యం అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలైనా.. గణనీయ సంఖ్యలో ఓట్లు సాధించారు. కాపు సామాజిక వర్గానికి చెందిన వేణుగోపాల్ చేరికతో పార్టీకి ఆ జిల్లాలో మరింత బలం పెరుగుతుందని భావిస్తున్నారు. వైఎస్ జగన్ పోరాట పటిమకు, రాజకీయ నిబద్ధతకు ప్రభావితుడనై పార్టీలో చేరినట్లు వేణుగోపాల్ మీడియా సమావేశంలో చెప్పారు. మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ జగన్ సీఎం కావాలన్నదే తమ లక్ష్యమని.. ఆ దిశగా వేణుగోపాల్‌కు సంపూర్ణ సహకారం ఉంటుందని చెప్పారు.

19న మాజీ సైనికోద్యోగుల ర్యాలీ

సాక్షి, అమరావతి: మాజీ సైనికోద్యోగుల ర్యాలీ, సమావేశం ఈ నెల 19న గుంటూరులో నిర్వహిస్తున్నట్లు విశాఖపట్నం డిఫెన్స్ ప్రొఫెసర్ కెప్టెన్ సీజీ రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన్ మందిర్ ఆడిటోరియం వద్ద శనివారం ఉదయం 8 గంటల నుండి 4 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. లెఫ్టినెంట్ జనరల్ ఎస్‌టీ ఉపపానీ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో మేజర్ జనరల్ ఎన్.శ్రీనివాస్‌రావు, తెలంగాణ-ఆంధ్ర సబ్ ఏరియా జనరల్ ఆఫీసర్ కమాండింగ్ బ్రిగ్ సందీప్ భల్లాతోపాటు పలువురు ప్రముఖులు హాజరౌతారని కెప్టెన్ సీజీ రాజు తెలిపారు.

ఉద్దానం బాధితులకు జగన్ న్యాయం చేస్తారు

వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి



రట్టి గ్రామంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి

మందస: శ్రీకాకుళం జిల్లాలోని ఉద్దానం ప్రాంతం కిడ్నీవ్యాధితో సతమతమవుతున్న సమయంలో తిత్లీ తుపాను మరింత విధ్వంసం సృష్టించి, ప్రజలను కష్టాల్లోకి నెట్టివేసిందని వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ప్రాంత బాధితులకు తమ పార్టీ అధినేత వైఎస్ జగన్ అండగా నిలుస్తారని ఆయన భరోసా ఇచ్చారు. ప్రజా సంకల్పయాత్ర సమయంలో బాధితులకు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటారన్నారు. శ్రీకాకుళం జిల్లా మందస మండలం భేతాళపురం పంచాయతీ, రట్టి గ్రామంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తుపానుతో నష్టపోయిన కొబ్బరి చెట్టుకు రూ.1500లు నుంచి రూ.3వేలు, ఎకరా జీడి, మామిడితోటలకు హెక్టారుకు రూ.30వేలు నుంచి రూ.50 వేలుకు పెంచడం జరిగిందని, ఇచ్చిన మాటను తప్పకుండా నెరవేర్చే నాయకుడైన జగన్ ఉద్దానం ప్రజలకు న్యాయం చేస్తారన్నారు. అలాగే ప్రజలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలకు శాశ్వత పరిష్కారంగా 200 పడకల ఆసుపత్రి నెలకొల్పుతామన్నారు. ఇప్పుడున్న ప్రభుత్వం తాత్కాలిక ఉపశమనం పథకాలకే ప్రాధాన్యత ఇస్తోందని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే శాశ్వత పరిష్కారాలకే అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజల మద్దతుతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. పలాస నియోజకవర్గం సమన్వయకర్త డాక్టర్ అప్పలరాజును ఎంఎల్ఏగా చేసి, కలకాలం ప్రజాసేవలో డాక్టర్ సేవలను వినియోగించుకోవాలని కోరారు.

దుర్గగుడి పరిసరాల్లో నిషేధాజ్ఞలు

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయ పవిత్రతను కాపాడేందుకు దేవస్థానం అధికారులు నిషేధాజ్ఞలను అమలులోకి తీసుకొచ్చారు. ఏపీ పర్యటనలో భాగంగా టీఆర్‌ఎస్ నేత, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆ సమయంలో దుర్గగుడి ఆలయ ప్రాంగణంలోని ఈవో ఛాంబర్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు పాలన సరిగాలేదని, ప్రజలు అసంతృప్తితో ఉన్నారంటూ వ్యాఖ్యానించారు. తలసాని వ్యాఖ్యలతో రాజకీయ దుమారం లేచింది. ఈ నేపథ్యంలో ఈవో కోటేశ్వరమ్మ దుర్గగుడి ఆలయ పరిసరాల్లో నిషేధాజ్ఞలు అమలు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆలయానికి వచ్చే ప్రముఖులు ఇక్కడ మీడియా సమావేశాలు ఏర్పాటు చేయకూడదన్నారు. ఆలయ ప్రాంగణంలో ఎలాంటి రాజకీయ ప్రకటనలు, వ్యక్తిగత, వ్యాపారానికి సంబంధించి బ్యానర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకూడదని ఆంక్షలు విధించారు. దుర్గగుడి ప్రతిష్టను కాపాడేందుకు అందరూ సహకరించాలని ఈవో కోరారు.

పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడిగా గిరిప్రసాద్‌రెడ్డి



గిరిప్రసాద్‌రెడ్డి



శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు (టౌన్): పీఆర్టీయూ (ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్) రాష్ట్ర అధ్యక్షుడిగా ఏఎం గిరిప్రసాద్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎం.శ్రీధర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నెల్లూరు జిల్లాలోని జీవీకే మెమోరియల్ ఆస్పత్రి సమావేశ మందిరంలో గురువారం ఈ ఎన్నిక జరిగింది. సమావేశంలో 13 జిల్లాల నుంచి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పాటు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

నకిలీ ఎరువుల డీలర్లపై చర్యలు తీసుకోండి: సోమిరెడ్డి

సాక్షి, అమరావతి: నకిలీ ఎరువులు సరఫరా చేస్తున్న డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం వెలగపూడి తాత్కాలిక సచివాలయంలో ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ఇటీవల జరిగిన నకిలీ పొటాష్ ఎరువుల సరఫరాపై మంత్రి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రకాశం జిల్లాలో ఐదుగురు డీలర్లు, గుంటూరు జిల్లాలో ఒక డీలర్‌పై క్రిమినల్ చర్యలు తీసుకున్నట్లు అధికారులు వివరించారు. వివిధ ఎరువుల దుకాణదార్ల నుంచి మొత్తం 50 పొటాష్ ఎరువుల నమూనాలను పరీక్షా కేంద్రాలకు పంపినట్లు పేర్కొన్నారు. వాటి ఫలితాలు వచ్చిన వెంటనే తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటి వరకు 85 మెట్రిక్ టన్నుల పొటాష్ ఎరువును సీజ్ చేసినట్టు అధికారులు తెలిపారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

ఒంగోలు: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో పలు నేరాలకు పాల్పడిన అంతర్రాష్ట్ర దొంగల ముఠాను గురువారం ప్రకాశం జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో జిల్లా ఎస్పీ బి.సత్యయేసుబాబు నలుగురు నిందితులను మీడియా ముందు హాజరుపరిచారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. బంగారు దుకాణాల్లో వెండి, బంగారు ఆభరణాలు దొంగిలించడం, మహిళల మెడల్లో గొలుసులు లాక్కొని వెళ్లడం, ద్విచక్ర వాహనాల చోరీల్లో నిందితులది అందెవేసిన చేయి అని చెప్పారు. ఇటీవల దొనకొండ పోలీసుస్టేషన్ పరిధిలో మహిళను తుపాకీతో బెదిరించి, ఆమె మెడలో బంగారం లాక్కొని ఉడాయించారని, ఈ కేసులో భాగంగా నిందితులను అరెస్టు చేశామని చెప్పారు. వీరిలో గుంటూరు జిల్లా దుర్గి మండలం ఆత్మకూరుకు చెందిన పొన్నూరు సత్యానందం ప్రధాన నిందితుడని పేర్కొన్నారు. మిగిలిన వారిలో గుంటూరు జిల్లా మాచర్లకు చెందిన మూలి ఫణీంద్రరెడ్డి, మాచవరం మండలం వేమవరం గ్రామానికి చెందిన మోమిన్ సైదా, పొదిలి జోన్‌బాబులు ఉన్నారన్నారు. ఈ నలుగురిని విచారించగా మొత్తం 31 కేసుల తాలూకా వివరాలను వెల్లడించారన్నారు. వీరిపై ఏపీలో 9 కేసులు, తెలంగాణలో 24 కేసులు ఉన్నాయన్నారు. ఇవే కాక వీరిపై గుంటూరు జిల్లాలో మరో 15 కేసులు నమోదై ఉన్నాయని తెలిసిందన్నారు. నిందితుల నుంచి 104 గ్రాముల బంగారు ఆభరణాలు, 15 కేజీల వెండి ఆభరణాలు, ఒక పిస్టల్, 4 రౌండ్ల బుల్లెట్లు, 7 మోటారు బైకులు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. వాటిమొత్తం విలువ రూ. 14 లక్షలుగా వివరించారు.

ట్రంప్ రాజీనామా!


The Washington Post
UNPRESIDENTED
TRUMP HASTILY DEPARTS WHITE HOUSE, ENDING CRISIS
Celebrations break out worldwide as Trump era ends

ట్రంప్ రాజీనామా అంటూ నకిలీవార్తను ప్రచురించిన పేపర్

వాషింగ్టన్: అమెరికాలోని వాషింగ్టన్ ప్రజలు బుధవారం ఆశ్చర్యంలో మునిగిపోయారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రాజీనామా చేశారని 'వాషింగ్టన్ పోస్ట్' పత్రిక ఓ కథనాన్ని ప్రచురించింది. 'అన్‌ప్రెసిడెంటెడ్' అనే శీర్షికతో రాసిన కథనంలో ట్రంప్ రాజీనామాతో ప్రపంచదేశాల్లో సంబరాలు అంబరాన్ని అంటాయని వెల్లడించింది. 2019, మే 1వ తేదీతో ఉన్న ఈ పత్రికను కొందరు వాషింగ్టన్‌తో పాటు వైట్‌హౌస్ సమీపంలో ఉచితంగా పంచిపెట్టారు. ఈ తేదీని గమనించిన వ్యక్తులు ఇది నకిలీ ఎడిషన్ అని భావించారు. చివరికి ఈ విషయం వైరల్‌గా మారడంతో వాషింగ్టన్ పోస్ట్ పత్రిక స్పందిస్తూ.. అది నకిలీ ఎడిషన్ అనీ, దానితో తమకు సంబంధం లేదని ప్రకటించింది. ట్రంప్ 2019, ఏప్రిల్ 30న వైట్‌హౌస్‌ను వదిలివెళ్లిపోయినట్లు ఈ నకిలీ ఎడిషన్‌లో లీసా చుంగ్ పేరుతో కథనం ప్రచురితమైంది. ' రాజీనామా విషయంలో ట్రంప్ అధికారిక ప్రకటనను వెలువరించలేదు. 2019, ఏప్రిల్ 30న ఓవల్ కార్యాలయంలోని అధ్యక్షుడి డెస్క్ పక్కన ఓ న్యాప్‌కిన్ దొరికినట్లు నలుగురు వైట్‌హౌస్ అధికారులు తెలిపారు. అందులో ఎరుపురంగు ఇంక్‌తో 'ఇందుకు(తన రాజీనామాకు) నిజాయితీ లేని హిల్లరీ క్లింటన్‌ను, హైఫియర్‌ను, నకిలీ వార్తల మీడియాను నిందించండి' అని ట్రంప్ రాసినట్లు ఉంది. ప్రస్తుతం ఆయన శ్వేతసౌధం వదిలేసి రష్యాలోని క్రిమియాలో ఉన్న యాల్టా రిసార్ట్‌కు వెళ్లిపోయారు. దీంతో ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్ అమెరికా అధ్యక్షుడిగా వెంటనే ప్రమాణస్వీకారం చేశారు' అని కథనం ప్రచురితమైంది. ట్రంప్ రాజీనామాతో దేశవిదేశాల్లో సంబరాలు చేసుకున్నారని ఎడిషన్‌లో వార్త వచ్చింది. నకిలీ ఎడిషన్‌తో తమకు సంబంధంలేదని వాషింగ్టన్ పోస్ట్ ప్రకటించింది. 'యస్ మెన్' అనే గ్రూపు నకిలీ పత్రిక, వెబ్‌సైట్‌ను నడుపుతోందని అమెరికా జర్నలిస్ట్ రామ్సే చెప్పారు.

హెచ్1బీల శ్రమ దోచేస్తున్నారు

అమెరికాలో ఓ అధ్యయనంలో వెల్లడి



అమెరికాలో హెచ్1బీ వీసాపై ఉద్యోగం చేస్తున్నవారు దోపిడీకి గురవుతున్నారని, వేధింపుల్ని ఎదుర్కొంటున్నారని 'సౌత్ ఆసియా సెంటర్ ఫర్ ది అట్లాంటిక్ కౌన్సిల్' అనే సంస్థ జరిపిన అధ్యయనంలో తేలింది. వారికి శ్రమకు తగిన వేతనం లభించడం లేదని, పని ప్రదేశాల్లో పరిస్థితులు దారుణంగా ఉన్నాయని అమెరికాకు చెందిన ఆ సంస్థ వెల్లడించింది. ఉద్యోగులు ఇలాంటి పరిస్థితుల్లో పనిచేయడం వల్ల దేశానికే ఎక్కువ నష్టమని హెచ్చరించింది. హెచ్1బీ వీసా ద్వారా అమెరికాలో శాశ్వత నివాసానికి వీలు కల్పించేలా వీసా విధానంలో సంస్కరణలు చేస్తామని, నైపుణ్యం కలిగిన విదేశీ ఉద్యోగుల్ని ప్రోత్సహిస్తామంటూ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో ఆ సంస్థ ఈ అధ్యయనం చేసింది. హెచ్1బీ ఉద్యోగుల హక్కుల్ని కాపాడాలని, వారు పనిచేసే వాతావరణాన్ని మెరుగుపరచాలని ఆ సంస్థ తన నివేదికలో సూచించింది. వేతనాలు ఎక్కువగా ఇచ్చి ప్రతిభ కలిగిన విదేశీ ఉద్యోగుల్ని పనిలోకి తీసుకుంటే అమెరికా ఆర్థిక వ్యవస్థకు మరింత బలం చేకూరుతుందని అభిప్రాయపడింది. 'హెచ్1బీ ఉద్యోగులు తక్కువ వేతనాలకే పనిచేయాల్సి వస్తోంది. వారి శ్రమను దోపిడీ చేస్తున్నారు. వేధింపులకు గురిచేస్తున్నారు. పని చేసే ప్రదేశాల్లోనూ దారుణమైన పరిస్థితులున్నాయి' అని వివరించింది. ఈ పరిస్థితులను మెరుగుపర్చేందుకు పలుసూచనలు చేసింది. మొదట చేయాల్సింది హెచ్1బీ ఉద్యోగుల వేతనాల పెంపు అని స్పష్టం చేసింది. అపుడే ట్రంప్ కోరుకుంటున్నట్లు నిపుణులైన ఉద్యోగులు వస్తారని తెలిపింది. నైపుణ్యం కలిగిన అమెరికన్లనూ ఉద్యోగాల్లోకి తీసుకోవాలని, అర్హతల్ని బట్టి వారిని అత్యున్నత పదవుల్లో నియమించాలని పేర్కొంది. ఇక ఉద్యోగుల భర్తీ విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలని సూచించింది. హెచ్1బీ వీసాల జారీలో మొదట దరఖాస్తు చేసుకున్న వారికి మొదటి ప్రాధాన్యం ఇవ్వడం, లాటరీ ద్వారా వారిని ఎంపిక చేయడం వంటి విధానాలకు స్వస్తి పలికి, నైపుణ్యం ఆధారంగానే వీసాలివ్వాలని సూచనలు చేసింది.

కొత్త జడ్జీల ప్రమాణ స్వీకారం నేడే



జస్టిస్ దినేశ్ జస్టిస్ సంజీవ్

న్యూఢిల్లీ: కర్ణాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దినేశ్ మహేశ్వరి, ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా శుక్రవారం సుప్రీంకోర్టు జడ్జీలుగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. శుక్రవారం ఉదయం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ రంజన్ గొగోయ్.. జస్టిస్ మహేశ్వరి, జస్టిస్ ఖన్నాలతో ప్రమాణం చేయించనున్నట్లు గురువారం ఒక అధికార ప్రకటన వెలువడింది. సీజేఐ జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ ఏకే సిక్రి, జస్టిస్ ఎస్ఏ బాంబ్డే, జస్టిస్ ఎన్‌వీ రమణ, జస్టిస్ అరుణ్ మిశ్రాలతో కూడిన కొలీజియం ఈ నెల 10వ తేదీన ఈ ఇద్దరు న్యాయమూర్తులకు పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వానికి సిఫారసు చేసింది.

డేరా బాబాకు యావజ్జీవ శిక్ష



పంచ్‌కుల: జర్నలిస్ట్ రామ్‌చందర్ ఛత్రపతి హత్య కేసులో వివాదాస్పద ఆధ్యాత్మిక గురువు గుర్మీత్ రాం రహీం సింగ్(డేరా బాబా)కు న్యాయస్థానం జీవిత ఖైదు విధించింది. పంచ్‌కులలోని సీబీఐ ప్రత్యేక కోర్టు డేరాబాబా, మరో ముగ్గురికి జీవిత కారాగారం విధిస్తూ గురువారం తీర్పు వెలువరించింది. బాబా, అతని అనుయాయులు నిర్మల్ సింగ్, కుల్దీప్ సింగ్, కృష్ణలాల్ కలిసి హరియాణాలోని సిర్సా ఆశ్రమంలో 2002లో జర్నలిస్ట్ రామ్‌చందర్ ఛత్రపతిని చంపేశారు. డేరా బాబా ఓ మహిళను లైంగికంగా వేధించారంటూ ఛత్రపతి తన పత్రికలో కథనం ప్రచురించడమే ఇందుకు కారణం.

మేఘాలయ గనిలో మృతదేహం లభ్యం

న్యూఢిల్లీ/ షిల్లాంగ్: మేఘాలయలో బొగ్గు గనిలో చిక్కుకుపోయిన ఘటనలో ఎట్టకేలకు ఒకరి మృతదేహం లభ్యమైంది. దీంతో పాటు కొన్ని అస్థిపంజరాలను గుర్తించామని నేవీ ప్రతినిధి కెప్టెన్ డీకే శర్మ చెప్పారు. రిమోట్లీ ఆపరేటెడ్ వెహికల్స్ (ఆర్వోవీ)కు అమర్చిన కెమెరాల సాయంతో బుధవారం రాత్రి మృతదేహాన్ని, గురువారం అస్థిపంజరాలను గుర్తించారు. గని లోపల దాదాపు 160 అడుగుల లోతులో మృతదేహాన్ని, 210 అడుగుల లోతులో అస్థిపంజరాలను గుర్తించినట్లు చెప్పారు. గతేడాది డిసెంబర్ 13న ఈస్ట్ జైంతియా హిల్స్ జిల్లాలోని అక్రమ బొగ్గు గనిలో 15 మంది కార్మికులు చిక్కుకుపోయిన విషయం తెలిసిందే.

సీబీఐలో మరో నలుగురిపై వేటు




న్యూఢిల్లీ: అత్యున్నత స్థాయి ఎంపిక కమిటీ సీబీఐ డైరెక్టర్ పదవి నుంచి అలోక్ వర్మను తొలగించిన రోజుల వ్యవధిలోనే ఆ సంస్థలోని మరో నలుగురు అధికారులపై ప్రభుత్వం వేటు వేసింది. వీరిలో అలోక్‌వర్మతో గొడవ పెట్టుకున్న సీబీఐ ప్రత్యేక డైరెక్టర్ రాకేశ్ అస్థానా కూడా ఉన్నారు. అస్థానాతోపాటు జేడీ అరుణ్ కుమార్ శర్మ, డీఐజీ మనీశ్ కుమార్ సిన్హా, ఎస్పీ జయంత్ నైక్నవారేల పదవీకాలాన్ని ప్రభుత్వం తగ్గించింది. ఈ మేరకు సిబ్బంది మంత్రిత్వ శాఖ ఓ ప్రకటన విడుదల చేసింది.

ఫిబ్రవరి చివర్లో 'లోక్‌పాల్' సభ్యులు!

న్యూఢిల్లీ: లోక్‌పాల్ నియామక కమిటీ సభ్యుల పేర్లను ఫిబ్రవరి నెలాఖరులోగా సూచించాలని సెర్చ్ కమిటీని సుప్రీంకోర్టు కోరింది. సెర్చ్ కమిటీకి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి రంజనా ప్రకాశ్ దేశాయ్ నేతృత్వం వహిస్తున్న సంగతి తెలిసిందే. సెర్చ్ కమిటీ సమావేశాలు నిర్వహించుకునేందుకు అవసరమైన మౌలిక, మానవ, ఇతర వనరుల్ని సమకూర్చాలని ధర్మాసనం గురువారం కేంద్రానికి సూచించింది. నిర్దిష్ట కార్యాలయం లేకపోవడం, ఇతర వనరుల కొరత వల్ల సెర్చ్ కమిటీ సమావేశాలకు ఆటంకం కలుగుతోందని అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్ కోర్టు దృష్టికి రాగా బెంచ్ ఈ విధంగా స్పందించింది. గతేడాది సెప్టెంబర్ 27న 8 మంది సభ్యులతో ఏర్పాటైన సెర్చ్ కమిటీ తొలిసారి బుధవారం సమావేశమైంది. ఈ కమిటీలో ఎస్బీఐ మాజీ చైర్‌పర్సన్ అరుంధతి భట్టాచార్య, ఇస్రో మాజీ చైర్మన్ ఏఎస్ కిరణ్ కుమార్ తదితరులు సభ్యులుగా ఉన్నారు.

మా జోలికి వచ్చారు.. స్వైన్‌ఫ్లూ సోకింది



బెంగళూరు/న్యూఢిల్లీ: కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు బీకే హరిప్రసాద్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కర్ణాటకలో కాంగ్రెస్–జేడీఎస్ ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు యత్నించడం వల్లే బీజేపీ చీఫ్ అమిత్ షాకు స్వైన్ ఫ్లూ సోకిందని ఎద్దేవా చేశారు. బెంగళూరులో బీజేపీకి వ్యతిరేకంగా గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ..'కొందరు ఎమ్మెల్యేలు ఇప్పటికే రాష్ట్రానికి తిరిగివచ్చారు. దీంతో అమిత్ షాకు జ్వరం వచ్చింది. అది మామూలు జ్వరం కాదు.. స్వైన్ ఫ్లూ జ్వరం. కర్ణాటక ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు యత్నిస్తే కేవలం స్వైన్ ఫ్లూనే కాదు.. వాంతులు, విరేచనాలు వస్తాయని అర్థం చేసుకోవాలి' అని అన్నారు. దీంతో కేంద్ర మంత్రులు రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్, ముక్తార్ అబ్బాస్ నఖ్వీ, పీయూష్‌గోయల్‌తో పాటు పలువురు బీజేపీ నేతలు హరిప్రసాద్‌పై విరుచుకుపడ్డారు. ఫ్లూ జ్వరానికి చికిత్స ఉందనీ, కానీ హరిప్రసాద్‌కున్న మానసిక అనారోగ్యాన్ని తగ్గించడం కష్టమని గోయల్ విమర్శించారు. ఈ విషయమై కాంగ్రెస్ అధికార ప్రతినిధి ప్రియాంక చతుర్వేది స్పందిస్తూ.. బీజేపీ నేతల అనారోగ్యాన్ని కాంగ్రెస్ కోరుకోదని స్పష్టం చేశారు. కేంద్ర మంత్రి జైట్లీ కోలుకోవాలని కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ ట్వీట్‌చేసిన విషయాన్ని ఆమె గుర్తుచేశారు. అమిత్ స్వైన్‌ఫ్లూ జ్వరంతో ఢిల్లీలోని ఎయిమ్స్‌లో బుధవారం చేరిన సంగతి తెలిసిందే.



ముద్దుగుమ్మల 'క్యాట్ వాక్' జరగాల్సిన చోట.. డాగ్ వాక్ జరిగింది. గురువారం ముంబైలో ఓ ఫ్యాషన్ షో సమయంలో హఠాత్తుగా ఓ వీధికుక్క అక్కడికొచ్చి స్టేజీపై వయ్యారిభామలను ఒకింత భయపెట్టింది

మహారాష్ట్రలో మళ్లీ డాన్స్ బార్లు

- షరతులతో తెరుచుకునేందుకు సుప్రీంకోర్టు అనుమతి
- 2016 నాటి చట్టంలోని కొన్ని నిబంధనల కొట్టివేత



న్యూఢిల్లీ: మహారాష్ట్రలో డాన్స్ బార్లు తిరిగి తెరుచుకునేందుకు మార్గం సుగమమైంది. వాటి పని విధానం, లైసెన్సుల మంజూరుపై కఠిన ఆంక్షలు విధిస్తూ 2016లో మహారాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టంలోని పలు నిబంధనల్ని సుప్రీంకోర్టు కొట్టివేసింది. కొన్ని షరతులతో డాన్స్ బార్లు తెరుచుకునేందుకు గురువారం అనుమతిచ్చింది. డాన్స్ బార్లపై నియంత్రణలు ఉండొచ్చు కానీ పూర్తి నిషేధం అమలు చేయొద్దని జస్టిస్ ఏకే సిక్రి, జస్టిస్ అశోక్ భూషణ్‌లతో కూడిన ధర్మాసనం ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది. విద్యా సంస్థలు, ప్రార్థనా స్థలాలకు కిలోమీటరు దూరంలోపు డాన్స్ బార్లు ఏర్పాటుచేయొద్దన్న నిబంధనను కోర్టు తోసిపుచ్చింది. ముంబై లాంటి మహానగరాల్లో అనువైన చోట్ల స్థలం దొరకడం కష్టమేనని, కిలోమీటర్ నిబంధనను అమలుచేయలేమని స్పష్టతనిచ్చింది. పార్టీకి వచ్చిన వారు డాన్సర్లకు టిప్పులు ఇచ్చేందుకు అంగీకరించిన కోర్టు..వారిపై కరెన్సీ నోట్లు చల్లేందుకు నిరాకరించింది. డాన్స్ బార్లలో తప్పనిసరిగా సీసీటీవీ కెమెరాలు అమర్చాలన్న నిబంధనను కొట్టివేస్తూ..అలాంటి ఏర్పాట్ల వల్ల డాన్సర్ల వ్యక్తిగత గోప్యత దెబ్బతింటుందని పేర్కొంది.

సంపూర్ణ నిషేధం వద్దు..

'2005 నుంచి మహారాష్ట్రలో ఒక్క డాన్స్ బార్‌కు కూడా లైసెన్స్ ఇవ్వలేదు. అలా జరగకూడదు. ఈ విషయంలో నియంత్రణలు ఉండొచ్చు కానీ సంపూర్ణ నిషేధం సరికాదు' అని ధర్మాసనం పేర్కొంది. నైతిక ప్రమాణాలు కాలంతో పాటే మారతాయని, నైతికత పేరిట ప్రభుత్వం సామాజిక నియంత్రణ చెలాయించకూడదని సూచించింది. ఇకపై డాన్స్ బార్‌ల కోసం వచ్చే దరఖాస్తులను ప్రభుత్వం ఓపెన్ మైండ్‌తో అంగీకరిస్తుందని ఆశిస్తున్నామని పేర్కొంది. 2016 నాటి చట్టాన్ని సవాలుచేస్తూ హోటల్, రెస్టారెంట్ యజమానులు దాఖలుచేసిన పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టును తన తీర్పును గతేడాది ఆగస్టులోనే రిజర్వు చేసింది. గతంలో సుప్రీంకోర్టు జారీచేసిన ఆదేశాల్ని బేఖాతరు చేసేందుకే మహారాష్ట్ర ప్రభుత్వం..డాన్స్ బార్ల లైసెన్సింగ్‌కు కఠిన ఆంక్షలు విధిస్తూ చట్టం తెచ్చిందని పిటిషన్‌దారులు ఆరోపించారు.

ప్రభుత్వ వాదన బలహీనం: ఎన్సీపీ

బార్ యాజమాన్యాల అసోసియేషన్‌తో మహారాష్ట్ర ప్రభుత్వం కుమ్మక్కయిందని ప్రతిపక్ష నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) ఆరోపించింది. అందుకే కేసులో ప్రభుత్వ వాదన చాలా బలహీనంగా ఉందని దుయ్యబట్టింది. రాష్ట్రంలో డాన్స్ బార్లు తిరిగి తెరుచుకోకుండా సీఎం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. బార్‌ల నియంత్రణ చట్టాన్ని లోపరహితంగా తీర్చిదిద్దడంలో ప్రభుత్వం విఫలమైందని శివసేన మండిపడింది. సుప్రీంకోర్టు తీర్పుపై రాష్ట్ర హోం మంత్రి రంజిత్ పాటిల్ స్పందిస్తూ..డాన్స్ బార్ల ముసుగులో అసాంఘిక కార్యకలాపాలు జరగనీయమని హెచ్చరించారు. షరతులతో డాన్స్ బార్లు తిరిగి తెరుచుకునేందుకు సుప్రీంకోర్టు అనుమతివ్వడం పట్ల సామాజిక కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. బార్ డాన్సర్ల హక్కుల కోసం పోరాడుతున్న భారతీయ బార్ గర్ల్స్ యూనియన్ అధ్యక్షురాలు వర్ష కాలె..సుప్రీంకోర్టు తీర్పును గొప్ప విజయంగా అభివర్ణించారు. తాజా తీర్పు ప్రగతిశీలమైనదని మాజీ బ్యూరోక్రాట్, హక్కుల కార్యకర్త అభా సింగ్ అన్నారు. కోర్టు మొదటి నుంచీ నృత్యాన్ని ఒక వృత్తిగానే పరిగణించిందని, కానీ రాష్ట్ర సర్కారు ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయంతో ఇలాంటి మహిళల జీవించే హక్కుకు భంగం వాటిల్లిందన్నారు.

తీర్పు ముఖ్యాంశాలు

- డాన్సర్లకు టిప్పులు ఇవ్వొచ్చు కానీ నోట్లు వెదజల్లరాదు
- బార్ రూమ్, డాన్స్ ఫ్లోర్ మధ్య అడ్డుతెర తప్పనిసరి కాదు
- డాన్స్ బార్లలో సీసీటీవీలు అమర్చొద్దు
- సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 11.30 గంటల మధ్యే పనిచేయాలి
- విద్యా సంస్థలు, ప్రార్థనా మందిరాలకు కిలోమీటరు దూరంలో బార్ డాన్స్‌లు ఉండొద్దన్న నిబంధన అమలు అసాధ్యం
- చివరి పదేళ్లుగా నేరచరిత్ర లేని వారికే లైసెన్స్ మంజూరు చేయాలని పేర్కొనడం నిర్దిష్టంగా లేదు. అది అధికారుల విచక్షణకు వదిలేసినట్లుగా ఉంది.

నైట్ 'లైఫ్'... డాన్స్ బార్స్!



మెట్రో నైట్ లైఫ్‌లో డాన్స్ బార్స్ విడదీయలేని ఓ భాగం. ముంబై మహానగర సంస్కృతిలోకి చేరిన ఈ డాన్స్ బార్లు, వాటిలో చిందులు వేసే డాన్సర్ల చుట్టూ ఎన్నో విమర్శలు, మరెన్నో విషాదాలు ఉన్నాయి. మహారాష్ట్రలో 1980 తొలినాళ్లలో ముంబైకి 75 కి.మీ. దూరంలో ఉన్న ఖలాల్‌పూర్‌లో బేవాచ్ అన్న పేరుతో మొట్టమొదటిసారిగా ఈ డాన్స్‌బార్ ప్రారంభమైంది. ఇక్కడ డాన్స్ చేసేందుకు 500–600 మంది డాన్సర్లను ముంబై, థానేల నుంచి బస్సుల్లో తీసుకొని వచ్చేవారు. రాత్రంతా తాగుతూ, అమ్మాయిలు డ్యాన్స్‌లు చేస్తుంటే వారిపై కరెన్సీ నోట్లు విసురుతూ ఎంజాయ్ చేసే ఈ కల్చర్ కార్చిచ్చులా మహారాష్ట్ర అంతటా వ్యాపించింది. కొన్ని బార్లను అధికారికంగా నిర్వహిస్తే, అనధికారికంగా నిర్వహించే వాటికి లెక్కే లేదు. ఈ బార్లలో చిందులేసే డాన్సర్లు కొందరు కోటికి పడగలెత్తారు. మరికొందరు గౌరవప్రద జీవితాన్ని కూడా నోచుకోక పూట గడవడానికి ఇబ్బంది పడ్డవారూ ఉన్నారు. తరన్నూమ్ అనే డాన్సర్ ఎంత సంపాదించారంటే, ఆదాయ పన్ను శాఖ ఆమె ఇంటిపై దాడులు కూడా చేసింది. బాలీవుడ్ ప్రముఖ దర్శకుడు మాధుర్ బండార్కర్ టబూ ప్రధాన పాత్రధారిగా చాందినీబార్ అనే సినిమాను బార్ డాన్సర్ ఇతివృత్తంతో రూపొందించారు. టబూ ఈ చిత్రానికిగాను జాతీయ ఉత్తమ నటి పురస్కారాన్ని సైతం కైవసం చేసుకున్నారు.

మహారాష్ట్రలో డాన్స్ బార్స్:	4,000
వాటిలో లైసెన్స్ ఉన్నవి:	1250
ముంబైలో:	700
డాన్సర్స్:	75వేలు
(5 లక్షల మంది డాన్స్‌గర్ల్స్ ఉంటారని అనధికారిక లెక్క)	
డాన్స్‌గర్ల్స్ బార్‌లకు రాకపోకలపై ఆధారపడ్డ క్యాబ్ డ్రైవర్లు:	12,500

14 ఏళ్లుగా వివాదం

డాన్స్ బార్లతో యువత నాశనమవుతున్నారని, ఆ బార్ల మాటున చీకటి వ్యాపారం జరుగుతోందని, అమ్మాయిలు బలవంతంగా వ్యభిచార వృత్తిలోకి వెళ్తున్నారనే కారణాలతో 2005లో డాన్స్ బార్లను మహారాష్ట్ర సర్కారు నిషేధించింది. దీంతో కొన్ని వేలమంది ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారు. డాన్స్ బార్ల యజమానులు, డాన్స్ గర్ల్స్ కోర్టుకెక్కారు. 2006లో బొంబాయి హైకోర్టు ఆ నిషేధాన్ని ఎత్తేసింది. అప్పట్లో సుప్రీంకోర్టు హైకోర్టు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నిషేధాన్ని కొనసాగించింది. 2013లో డాన్స్ బార్లపై నిషేధాన్ని కొట్టేసింది. దాంతో, 2014 జూన్‌లో తిరిగి మహారాష్ట్ర ప్రభుత్వం డాన్స్ బార్లపై కొన్ని ఆంక్షలు విధిస్తూ చట్టానికి సవరణలు చేసింది. దానిపై బార్ల యజమానులు, డాన్స్ గర్ల్స్ మళ్లీ కోర్టుకు ఎక్కడంతో సుప్రీంకోర్టు బార్ల నిషేధంపై 2015, అక్టోబర్ 15న స్టే విధించింది. ఇప్పుడు ఆ ఆంక్షలలో కొన్నింటిని సమర్థిస్తూ, మరికొన్నింటిని వ్యతిరేకిస్తూ తీర్పు చెప్పింది.

ఆ డాక్యుమెంట్లు బయటపెట్టండి

రాష్ట్రపతికి శ్రీధర్ ఆచార్యులు లేఖ



సాక్షి ప్రతినిధి, న్యూఢిల్లీ: కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) డైరెక్టర్‌గా ఆలోక్‌వర్మను తొలగించడానికి కీలకంగా మారిన అన్ని పత్రాలు, నివేదికలను బహిర్గతం చేయాలని కేంద్ర సమాచార మాజీ కమిషనర్ శ్రీధర్ ఆచార్యులు కోరారు. సీబీఐతో పాటు కేంద్ర సమాచార కమిషన్(సీఐసీ) నియామకాల్లో పారదర్శకత పాటించాల్సిన అవసరముందని వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు లేఖ రాశారు. 'సీఐసీ నియామకాల నుంచే పారదర్శకత అన్నది ప్రారంభం కావాలి. సీఐసీ, సీబీఐతో పాటు అన్ని ప్రభుత్వ సంస్థలు, ఆలోక్ వర్మను తొలగించేందుకు ప్రధాని మోదీ అధ్యక్షతన ఏర్పాటైన హైలెవల్ కమిటీ, సమాచార కమిషనర్ల నియామకం సహా అన్ని ప్రభుత్వ వ్యవహారాల్లో పారదర్శకత ఉండేలా చూడాలి' అని శ్రీధర్ కోరారు. గతేడాది కేంద్ర సమాచార కమిషన్ వార్షిక సమావేశంలో కోవింద్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో అధిక సమాచారం అంటూ ఏదీ ఉండదని చెప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుతం సీవీసీతో పాటు సీబీఐలో జరుగుతున్న నియామకాలకు సంబంధించి తీవ్రమైన సమాచార లోటు ఉందని అభిప్రాయపడ్డారు. దీనివల్ల ప్రజలు తమ సమస్యలను సీఐసీ దృష్టికి నమ్మకంగా, ధైర్యంతో తీసుకెళ్లలేరని స్పష్టం చేశారు. ఆలోక్ వర్మ తొలగింపుపై సీవీసీ నివేదికను, కీలక పత్రాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం ప్రజలకు సమాచారాన్ని ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ)లోని సెక్షన్ 4 కింద అన్ని నియామకాలకు సంబంధించిన సమాచారాన్ని స్వచ్ఛందంగా వెల్లడించాల్సి ఉంటుందన్నారు. న్యాయవ్యవస్థ కన్నెర్ర చేసినప్పుడే కేంద్రం సీవీసీ వంటి సంస్థల్లో ఖాళీలను భర్తీ చేస్తోందనీ, అయినా ప్రజలకు సమాచారమివ్వడం లేదన్నారు. ప్రధాని, సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ సిక్రీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గేలు సభ్యులుగా ఉన్న హైలెవల్ కమిటీ వర్మను సీబీఐ డైరెక్టర్‌గా 2–1 మెజారిటీతో తొలగించడం తెల్సిందే.

80 ఔషధాలపై నిషేధం

జాబితాలో యాంటిబయోటిక్‌లు, నొప్పి నివారిణులు, రక్తపోటును నియంత్రించే డ్రగ్స్

న్యూఢిల్లీ: కేంద్ర ఆరోగ్య శాఖ మరో 80 ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్(ఎఫ్‌డీసీ) ఔషధాల్ని నిషేధించింది. ఇందులో నొప్పి నివారిణులు, యాంటిబయోటిక్‌లతో పాటు బీపీ, బ్యాక్టీరియా, ఫంగస్‌లతో వ్యాపించే వ్యాధుల చికిత్సకు వాడే మందులున్నాయి. ఈ ఔషధాలపై నిషేధం జనవరి 11నే అమల్లోకి వచ్చిందని తాజాగా నోటిఫికేషన్ వెలువడింది. దీంతో నిషేధానికి గురైన మొత్తం ఎఫ్‌డీసీ ఔషధాల సంఖ్య 405కు పెరిగింది. సెప్టెంబర్‌లో 325 ఔషధాలను నిషేధిత జాబితాలో చేర్చిన సంగతి తెలిసిందే. ఎఫ్‌డీసీలో రెండు, అంతకంటే ఎక్కువ ఔషధాలు స్థిర నిష్పత్తిలో ఒకే డోస్‌గా ఉంటాయి. తాజాగా నిషేధించిన ఔషధాల జాబితాలో యాంటిబయోటిక్‌లు సెఫ్‌గ్లోబ్ ఓజెడ్, టాక్సిమ్ ఓజెడ్, బ్యాక్టీరియా, ఫంగస్ వ్యాధుల చికిత్సలో వినియోగించే ఓర్‌ఫ్లాజ్ కిట్, వెజినోబాక్ట్, హైపర్‌టెన్షన్ ఔషధాలైన టెలిప్రిల్ హెచ్, లోరమ్ హెచ్, యాంటీ యాంగ్జైటి డ్రగ్ రెస్టా తదితరాలున్నాయి. డ్రగ్స్ టెక్నికల్ అడ్వైజరీ బోర్డు సిఫార్సుల మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీనియర్ అధికారి ఒకరు తెలిపారు.

'కన్నడ' కథ సుఖాంతం!



బెంగళూరు: కర్ణాటకలో రాజకీయ సంక్షోభం తప్పే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. బీజేపీ వైపు ఆకర్షితులయ్యారని భావించిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సొంత పార్టీకే విధేయత ప్రకటించి తిరిగొచ్చారు. మాజీ ముఖ్యమంత్రి సిద్దరామయ్య నేతృత్వంలో శుక్రవారం జరిగే సీఎల్పీ భేటీలో వారంతా పాల్గొనే అవకాశాలున్నాయి. ప్రభుత్వాన్ని కూల్చేందుకు ప్రతిపక్ష బీజేపీ చేసిన ప్రయత్నం విఫలమైందని చాటిచెప్పడమే లక్ష్యంగా తన బలం చాటుకోవాలని కాంగ్రెస్ భావిస్తోంది. అంతర్గత అసమ్మతిని చల్లార్చేందుకు ఆ పార్టీ ప్రయత్నాలు ముమ్మరం చేసింది. నేటి సమావేశానికి గైర్హాజరైతే తీవ్ర పరిణామాలుంటాయని తమ ఎమ్మెల్యేలను సిద్దరామయ్య హెచ్చరించారు. పార్టీలోకి తిరిగిస్తున్న అసంతృప్త ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు ఇస్తారా? అని సిద్దరామయ్యను ప్రశ్నించగా..ఆయన బదులిస్తూ మంత్రి పదవులిస్తామని ఎవరికీ చెప్పలేదని, కాంగ్రెస్‌లో అసలు అసంతృప్తే లేదన్నారు.

బీజేపీకి మిగిలింది భ్రాంతే: కుమారస్వామి

కాంగ్రెస్– జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వాన్ని అస్థిరపరిచే ఏ ప్రయత్నాలు ఫలించబోవని కర్ణాటక ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి స్పష్టం చేశారు. జనవరి 15 తర్వాత బీజేపీకి సం'క్రాంతి' అని పలికిన ఆ పార్టీ నేతలకు చివరికి సం'భ్రాంతి' మిగిలిందని ఎద్దేవా చేశారు. గురువారం విధానసౌధలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తాను రెండు, మూడు రోజులు విదేశీ పర్యటనకు వెళ్తే విమర్శించిన బీజేపీ నేతలు ఇప్పుడు మొబైల్ ఫోన్లను స్విచ్ ఆఫ్ చేసుకుని గురుగ్రామ్ హోటల్‌లో ఏం చేస్తున్నారని నిలదీశారు.

'ఆపరేషన్ కమల' చేపట్టలేదు: యడ్యూరప్ప


వచ్చే లోక్‌సభ ఎన్నికల సన్నాహాలపై చర్చించేందుకే తమ ఎమ్మెల్యేలు గురుగ్రామ్ వెళ్లినట్లు బీజేపీ కర్ణాటక అధ్యక్షుడు యడ్యూరప్ప వెల్లడించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు తాము ప్రయత్నించడం లేదని, కాంగ్రెస్– జేడీఎస్ అంతర్గత పోరుకు బీజేపీని నిందించడం సబబుకాదన్నారు. బీజేపీ నేతలు, ఎమ్మెల్యేలు ఎక్కడికి వెళ్తే కాంగ్రెస్ పార్టీకి ఎందుకని ప్రశ్నించారు. 104 మంది బీజేపీ ఎమ్మెల్యేలు గురుగ్రామ్ నుంచి బెంగళూరుకు బయల్దేరినట్లు తెలిసింది.

ఉన్నత పదవుల్లో ఇండో అమెరికన్లు

- నిఘా కమిటీలో రాజాకృష్ణమూర్తి
- మరో ముగ్గురిని కీలక స్థానాలకు నామినేట్ చేసిన ట్రంప్



ఆదిత్య బమ్జాయ్




రీటా బరన్వాల్



బిమల్ పటేల్

వాషింగ్టన్: ముగ్గురు భారతీయ అమెరికన్లను కీలక పరిపాలనా స్థానాల్లో నియమించేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నామినేట్ చేశారు. ప్రస్తుతం గేట్‌వే ఫర్ యాక్సెలరేటెడ్ ఇన్నోవేషన్ ఇన్ న్యూక్లియర్ (గెయిన్) డైరెక్టర్‌గా ఉన్న రీటా బరన్వాల్‌ను ఇంధన శాఖ (అణు ఇంధన) అసిస్టెంట్ సెక్రటరీగా, న్యాయవాద అధ్యాపకుడిగా ఉన్న ఆదిత్య బమ్జాయ్‌ని ప్రైవసీ అండ్ సివిల్ లిబర్టీస్ ఓవర్‌సైట్ బోర్డు సభ్యుడిగా, ఫైనాన్షియల్ స్టెబిలిటీ ఓవర్‌సైట్ కౌన్సిల్‌లో డెప్యూటీ అసిస్టెంట్ సెక్రటరీగా ఉన్న బిమల్ పటేల్‌ను ట్రెజరీ అసిస్టెంట్ సెక్రటరీగా నియమించేందుకు ట్రంప్ ప్రతిపాదించారు. ఈ విషయాన్ని ట్రంప్ ముందుగానే ప్రకటించినప్పటికీ, నామినేషన్లను బుధవారమే శ్వేతసౌధం నుంచి సెనెట్‌కు పంపారు. ఇప్పటికవరకు మొత్తంగా ట్రంప్ 35 మందికి పైగా భారతీయ అమెరికన్లను కీలక స్థానాల్లో నియమించారు. బరన్వాల్ కొత్త బాధ్యతల్లో భాగంగా అణు ఇంధన కార్యాలయ పాలనా వ్యవహారాలతో పాటు, అణు సాంకేతికత పరిశోధన, అభివృద్ధి విభాగం, మౌలిక సదుపాయాల విభాగ యాజమాన్య బాధ్యతలు కూడా చూడాల్సి వుంటుంది. టెక్నాలజీ డెవలప్‌మెంట్ అండ్ అప్లికేషన్ డైరెక్టర్‌గా, మెటీరియల్స్ టెక్నాలజీ మేనేజర్‌గా బాధ్యతలు నిర్వహించిన ఆమె.. అమెరికా నౌకాదళ రియాక్టర్లకు అవసరమైన అణు ఇంధన మెటీరియల్‌పై పరిశోధన జరిపారు. ఇక యేల్ విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్య అభ్యసించిన ఆదిత్యకు సివిల్ ప్రొసీజర్, పాలనాపరమైన శాసనాలు, ఫెడరల్ కోర్టులు, జాతీయ భద్రతా చట్టం, కంప్యూటర్ సంబంధిత నేరాలపై బోధన జరిపిన, రచనలు చేసిన అనుభవముంది. యూఎస్ సుప్రీంకోర్టు జస్టిస్ ఆంటోనిన్ స్కలియా వద్ద, అప్పీల్స్ కోర్టు (ఆరవ సర్క్యూట్) జడ్జి జెఫ్రీ వద్ద లా క్లర్క్‌గా విధులు నిర్వర్తించారు. అమెరికా న్యాయ శాఖలో అటార్నీ అడ్వయిజర్‌గా, ప్రైవేటు రంగంలో అప్పిలేట్ అటార్నీగా కూడా పని చేశారు. మూడో వ్యక్తి బిమల్ పటేల్ ప్రస్తుతం ఆర్థిక స్థిరత్వ వ్యవహారాల పర్యవేక్షణ మండలికి సంబంధించిన ట్రెజరీలో డిప్యూటీ అసిస్టెంట్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆర్థిక వ్యవహారాల్లో పలు సంస్థలకు సలహాలిచ్చిన అనుభవముంది.

తొలి దక్షిణాసియా వ్యక్తి



డెమోక్రటిక్ పార్టీకి చెందిన భారతీయ అమెరికన్ చట్టసభ్యుడు రాజా కృష్ణమూర్తికి నిఘాపై ఏర్పాటైన కాంగ్రెషనల్ కమిటీలో చోటు దక్కింది. ఈ ఘనత సొంతం చేసుకున్న తొలి దక్షిణాసియా వ్యక్తి ఈయనే. అమెరికా జాతీయ భద్రతను పటిష్టం చేయడం ఈ కమిటీ బాధ్యత. కృష్ణమూర్తి (45) ప్రస్తుతం ఇల్లినాయిస్ 8వ కాంగ్రెషనల్ జిల్లాకు ప్రతినిధుల సభలో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కృష్ణమూర్తిని కమిటీలో సభ్యుడిగా నియమిస్తున్నట్లు సభాపతి న్యాన్సీ పెలోసీ బుధవారం ప్రకటించారు. కృష్ణమూర్తి ఢిల్లీలో ఓ తమిళ కుటుంబంలో జన్మించారు. ఆయనకు మూడు మాసాల వయసున్నప్పుడే ఆయన కుటుంబం న్యూయార్క్‌లోని బఫెలో స్థిరపడింది.

సాక్షి బిజినెస్
శుక్రవారం 18-1-2019
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
53 ▲	15 ▲
36,374	10,905

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం...
www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (గురువారం రాత్రి 11.30గం.)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	7,052	▲ 18
డోజోన్స్	24,200	▽ 7
ఎఫ్‌టీఎస్‌ఈ 100	6,835	▽ 28
డాక్స్	10,919	▽ 13
షాంఘై	2,559	▽ 11
నికాయ్	20,402	▽ 41

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		● కొనుగోలు	● అమ్మకం
$	యూఎస్ డాలర్	థామస్‌కుక్	70.65	72.1
£	బ్రిటన్ పౌండ్	థామస్‌కుక్	90.85	93.2
€	యూరో	థామస్‌కుక్	80.4	82.45
¥	జపాన్ ఎన్ (100)	థామస్‌కుక్	64	68
AUS$	ఆస్ట్రేలియా డాలర్	థామస్‌కుక్	50.25	52.4
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	51	54.25
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	17.7	20.7
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	--	--
¥	చైనా యువాన్	థామస్‌కుక్	9.45	11.15

ప్రాఫిట్ 10వేల కోట్లు!!

క్యూ3లో రిలయన్స్ లాభం రూ.10,251 కోట్లు

- ఒక క్వార్టర్‌లో ఈ స్థాయి లాభం ఇదే తొలిసారి
- తొలి భారతీయ ప్రయివేట్ కంపెనీ కూడా ఇదే
- లాభంలో వృద్ధి 8.8 శాతం; ఆదాయం 56 శాతం అప్
- పెట్రో, రిటైల్, టెలికం విభాగాల ఊతం
- తగ్గిన రిఫైనింగ్ మార్జిన్లు




న్యూఢిల్లీ: దేశీ వ్యాపార దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో అంచనాలు మించిన లాభాలతో అదరగొట్టింది. రిఫైనరీ మార్జిన్లు తగ్గినా.. పెట్రోకెమికల్, రిటైల్, టెలికం రంగాల ఊతంతో క్యూ3లో నికర లాభం 8.8 శాతం వృద్ధితో రూ.10,251 కోట్లకు చేరింది. ఒక త్రైమాసికంలో రూ. 10,000 కోట్ల పైగా లాభం నమోదు చేసిన తొలి ప్రైవేట్ కంపెనీగా రిలయన్స్ రికార్డు సృష్టించింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రిలయన్స్ నికర లాభం రూ. 9,420 కోట్లు. అక్టోబర్–డిసెంబర్ మధ్య కాలంలో రిలయన్స్ ఆదాయం 56 శాతం ఎగిసి రూ. 1,71,336 కోట్లకు చేరింది. క్యూ3లో రిలయన్స్ నికర లాభం సుమారు దాదాపు రూ. 9,648 కోట్ల స్థాయిలో ఉంటుందని మార్కెట్ వర్గాలు అంచనా వేశాయి. 'ఇటు దేశానికి అటు వాటాదారులకు మరింత లబ్ధి చేకూర్చేందుకు రిలయన్స్ నిరంతరం కృషి చేస్తోంది. ఈ క్రమంలోనే ఒక త్రైమాసికంలో ఏకంగా రూ. 10,000 కోట్ల లాభాల మైలురాయిని దాటిన తొలి దేశీ ప్రైవేట్ కంపెనీగా నిల్చింది' అని రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ముకేశ్ అంబానీ గురువారం ఆర్థిక ఫలితాల వెల్లడి సందర్భంగా చెప్పారు. చమురు ధరలు తీవ్ర హెచ్చుతగ్గులకు లోనవుతూ సవాళ్లు ఎదురైనప్పటికీ.. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన క్యూ3లో మెరుగైన ఆర్థిక ఫలితాలు ప్రకటించగలిగామని ఆయన పేర్కొన్నారు. 'రిటైల్, జియో వ్యాపార విభాగాలు గణనీయంగా వృద్ధి చెందుతున్నాయి. కంపెనీ మొత్తం లాభదాయకత మెరుగుపడటంలో వీటి పాత్ర కూడా పెరుగుతోంది' అని ఆయన చెప్పారు. క్యూ3లో రిలయన్స్ నగదు నిల్వలు స్వల్పంగా రూ. 76,740 కోట్ల నుంచి రూ. 77,933 కోట్లకు పెరిగాయి. భారీ పెట్టుబడి ప్రణాళిక పూర్తి కావడంతో 2018 డిసెంబర్ 31 నాటికి మొత్తం రుణ భారం రూ. 2,74,381 కోట్లకు పెరిగింది. గతేడాది మార్చి 31 నాటికి ఇది రూ. 2,18,763.

రిఫైనింగ్ మార్జిన్ డౌన్ ..

రిలయన్స్ పెట్రో కెమికల్ వ్యాపార విభాగం పన్నుకు ముందస్తు లాభం 43% పెరిగి రూ. 8,221 కోట్లుగా నమోదైంది. అయితే, రిఫైనింగ్ విభాగం ఆదాయాలు వరుసగా మూడో త్రైమాసికంలో తగ్గాయి. మార్జిన్ల తగ్గుదల కారణంగా 18% క్షీణించి రూ.5,055 కోట్లుగా నమోదైంది. ముడి చమురును ఇంధనంగా మార్చే రిఫైనింగ్ ప్రక్రియకు సంబంధించిన స్థూల రిఫైనింగ్ మార్జిన్ (జీఆర్ఎం) ప్రతి బ్యారెల్‌కు 8.8 డాలర్లుగా నమోదైంది. ఇది 15 త్రైమాసికాల్లో కనిష్ట స్థాయి. సెప్టెంబర్ క్వార్టర్లో ఇది 9.5 డాలర్లుగా ఉండగా, 2017 క్యూ3లో ఇది 11.6 డాలర్లు. ఉత్పత్తి తగ్గుదల కొనసాగడం.. చమురు, గ్యాస్ వ్యాపార విభాగం పన్నుకు ముందస్తు నష్టాలు రూ. 185 కోట్లకు తగ్గాయి. క్యూ2లో ఇవి రూ. 480 కోట్లు కాగా, 2017–18 మూడో త్రైమాసికంలో రూ. 291 కోట్లు.

ప్రైవేట్‌లో టాప్..

రూ.10 వేల కోట్ల లాభాల మైలు రాయి దాటిన తొలి ప్రైవేట్ కంపెనీగా రిలయన్స్ రికార్డు సృష్టించింది. ఇప్పటిదాకా ప్రభుత్వ రంగంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీ) మాత్రమే ఒక క్వార్టర్‌లో రూ.10 వేల కోట్లకు మించి లాభాలు ప్రకటించింది. 2013 జనవరి–మార్చి త్రైమాసికంలో ఐవోసీ రూ.14,513 కోట్ల నికర లాభం నమోదు చేసింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సబ్సిడీ అంతా ఒకే క్వార్టర్‌లో అందుకోవడంతో అప్పట్లో ఐవోసీ ఈస్థాయి లాభాలు ప్రకటించడం సాధ్యపడింది. మిగతా క్వార్టర్స్‌లో నష్టాలు రావడంతో 2012–13 ఆర్థిక సంవత్సరం మొత్తం మీద ఐవోసీ రూ. 5,005 కోట్ల లాభాలు నమోదు చేయగలిగింది. గురువారం బీఎస్ఈలో రిలయన్స్ షేరు 0.30 పైసలు క్షీణించి రూ. 1,133.75 వద్ద క్లోజయ్యింది.



జియో లాభం 65 శాతం అప్..



టెలికం విభాగమైన రిలయన్స్ జియో లాభాలు మూడో త్రైమాసికంలో 65 శాతం ఎగిసి రూ. 831 కోట్లకు చేరాయి. నిర్వహణ ఆదాయం 50.9 శాతం పెరిగి రూ. 10,383 కోట్లకు పెరిగింది. అంతక్రితం త్రైమాసికంలో ఆదాయం రూ. 6,879 కోట్లు కాగా, లాభం రూ. 504 కోట్లు. సగటున యూజర్‌పై వచ్చే ఆదాయం 15.5 శాతం క్షీణించి రూ. 154 నుంచి రూ. 130కి తగ్గింది. అయితే, కస్టమర్ల సంఖ్య 16 కోట్ల నుంచి 28 కోట్లకు పెరగడంతో ఆ ప్రభావం పెద్దగా కనిపించలేదు. 'ప్రస్తుతం జియో కుటుంబ సభ్యుల సంఖ్య 28 కోట్లకు చేరింది. అందుబాటు ధరలో అత్యంత నాణ్యమైన సర్వీసులతో అందర్నీ అనుసంధానించాలన్న మా లక్ష్యాలకు అనుగుణంగా ప్రపంచం లోనే అతి పెద్ద మొబైల్ డేటా నెట్‌వర్క్‌గా ఎదుగుతోంది. గృహాలు, కంపెనీల్లోనూ కనెక్టివిటీకి కొత్త తరం ఎఫ్‌టీటీఎక్స్ సర్వీసులనుపై కసరత్తు చేస్తున్నాం ' అని అంబానీ చెప్పారు. క్యూ3లో డేటా వినియోగం 431 కోట్ల గిగాబైట్స్ నుంచి 864 కోట్ల గిగాబైట్స్‌కి చేరింది. సగటున ప్రతి యూజరు డేటా వినియోగం 9.6 జీబీ నుంచి 10.8 జీబీకి చేరింది.

రిలయన్స్ రిటైల్ లాభం రూ. 1,680 కోట్లు..



పండుగ సీజన్ అమ్మకాలు, కొత్త స్టోర్స్ ప్రారంభం మొదలైన సానుకూల అంశాల ఊతంతో రిలయన్స్ రిటైల్ విభాగం పన్నుకు ముందస్తు లాభాలు రెట్టింపై రూ.1,680 కోట్లకు పెరిగాయి. అంతక్రితం ఆర్థిక సంవత్సరం ఇదే వ్యవధిలో ఈ లాభం రూ. 606 కోట్లుగా ఉంది. మరోవైపు ఆదాయం 89 శాతం పెరిగి రూ. 18,798 కోట్ల నుంచి రూ. 35,577 కోట్లకు పెరిగింది. రిలయన్స్ రిటైల్‌కి ప్రస్తుతం దేశవ్యాప్తంగా 6,400 పైచిలుకు నగరాలు, పట్టణాల్లో 9,907 స్టోర్స్ ఉన్నాయి. క్యూ3లో 13.9 కోట్ల మంది రిలయన్స్ రిటైల్ స్టోర్స్‌ను సందర్శించారని సంస్థ తెలిపింది. నిత్యావసరాలు విక్రయించే రిలయన్స్ ఫ్రెష్, స్మార్ట్ విభాగాలు కూడా మెరుగైన పనితీరు కనపర్చాయని వివరించింది. ఇక ఫ్యాషన్.. లైఫ్‌స్టయిల్ విభాగంలో కొత్తగా 100 స్టోర్స్ ప్రారంభించామని, దీంతో కొత్తగా మరో 25 నగరాలకు కార్యకలాపాలు విస్తరించినట్లయిందని పేర్కొంది. రిలయన్స్ జ్యుయెల్స్ విభాగం 100 స్టోర్స్ మైలురాయి దాటింది. స్టోర్స్ సంఖ్య ప్రస్తుతం 57 నగరాల్లో 109కి చేరింది.

హెచ్‌యూఎల్ లాభం 1,444 కోట్లు

- నికర అమ్మకాలు 12 శాతం అప్
- 22 శాతం వృద్ధితో రూ.2,046 కోట్లకు ఎబిటా
- ఐదో క్వార్టర్‌లోనూ రెండంకెల అమ్మకాల వృద్ధి



న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ దిగ్గజం హిందుస్తాన్ యూనిలీవర్ (హెచ్‌యూఎల్) ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక కాలంలో రూ.1,444 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే క్వార్టర్‌లో రూ.1,326 కోట్ల నికర లాభం వచ్చిందని, 9 శాతం వృద్ధి సాధించామని హెచ్‌యూఎల్ తెలిపింది. అమ్మకాలు జోరుగా ఉండటం, మార్జిన్లు మెరుగుపడటంతో ఈ స్థాయి నికర లాభం సాధించామని హెచ్‌యూఎల్ సీఎమ్‌డీ సంజీవ్ మెహతా తెలిపారు. గత క్యూ3లో రూ.8,323 కోట్లుగా ఉన్న నికర అమ్మకాలు ఈ క్యూ3లో 12% వృద్ధితో రూ.9,357 కోట్లకు ఎగిశాయన్నారు. గత క్యూ3లో రూ.7,036 కోట్లుగా ఉన్న మొత్తం వ్యయాలు ఈ క్యూ3లో 9 శాతం పెరిగి రూ.7,652 కోట్లకు పెరిగాయని తెలిపారు.

మెరుగుపడిన మార్జిన్లు....

అమ్మకాల్లో రెండంకెల వృద్ధి సాధించామని, ఎబిటా మార్జిన్ 1.7% పెరిగిందని, స్థూల లాభం 17% వృద్ధి చెందిందని మెహతా వివరించారు. ఎబిటా 22 శాతం పెరిగి రూ.2,046 కోట్లకు పెరిగిందని, ఈ క్యూ3లో మంచి ఫలితాలు సాధించామని సంతృప్తి వ్యక్తం చేశారు. కీలకమైన వ్యాపారాలపై దృష్టిని కేంద్రీకరించడంతో పాటు మార్కెట్ ట్రెండ్స్‌కు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవడం మంచి ఫలితాలను ఇచ్చిందన్నారు. ముడి చమురు, కరెన్సీల్లో ఒడిదుడుకులు చోటు చేసుకున్నా, పటిష్టమైన నిర్వహణ పద్ధతుల కారణంగా మార్జిన్ మెరుగుపడిందని పేర్కొన్నారు.

నిలకడగానే డిమాండ్.....

సమీప భవిష్యత్తులో డిమాండ్ నిలకడగానే ఉండే అవకాశాలున్నాయని మెహతా చెప్పారు. సుస్థిరమైన, లాభదాయకమైన, బాధ్యతాయుత వృద్ధి సాధనపైనే ప్రధానంగా దృష్టి కేంద్రీకరిస్తున్నామని వివరించారు. గ్లాక్సోస్మిత్‌క్లైన్ కన్స్యూమర్ హెల్త్‌కేర్ విలీనానికి కావలసిన అనుమతులు పొందే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. మార్కెట్ ముగిసిన తర్వాత హెచ్‌యూఎల్ ఫలితాలు వెలువడ్డాయి. ఫలితాలపై అనిశ్చితితో ఈ షేర్ ఒడిదుడుకులకు గురైంది. చివరకు 1.1 శాతం నష్టంతో రూ.1,750 వద్ద ముగిసింది.

ఎఫ్ఎంసీజీలో టాప్ పిక్ ఇదే

అమ్మకాలు రెండంకెల వృద్ధి సాధించడం ఇది వరుసగా ఐదో క్వార్టర్ అని షేర్‌ఖాన్/బీఎన్‌పీ పారిబా విశ్లేషకుడు కస్తుర్బా పవస్కర్ వ్యాఖ్యానించారు. ఎఫ్ఎంసీజీ సెగ్మెంట్‌లో తమ టాప్ పిక్ ఇదేనని పేర్కొన్నారు.

యూఎస్ కంపెనీతో...
అరబిందో రూ.2,100 కోట్ల డీల్

ఏడు ఆంకాలజీ ఉత్పాదనల కొనుగోలు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ కంపెనీ అరబిందో ఫార్మా యూఎస్‌కు చెందిన స్పెక్ట్రమ్ ఫార్మాస్యూటికల్స్ నుంచి ఏడు బ్రాండెడ్ ఆంకాలజీ ఇంజక్టబుల్ ఉత్పాదనలను కొనుగోలు చేయనుంది. ఈ మేరకు స్పెక్ట్రమ్ ఫార్మాతో అరబిందో అనుబంధ కంపెనీ అక్రోటెక్ బయోఫార్మా ఎల్ఎల్‌సీ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డీల్ విలువ రూ.2,100 కోట్ల పైమాటే. వ్యూహంలో భాగంగా యూఎస్ మార్కెట్లో బ్రాండెడ్ ఆంకాలజీ విభాగంలో అరబిందో ప్రవేశం, విస్తరణకు ఈ డీల్ దోహదపడుతుందని ఈ సందర్భంగా సంస్థ ఎండీ ఎన్.గోవిందరాజన్ వ్యాఖ్యానించారు. ఉత్పత్తులు కంపెనీ చేతికి వచ్చిన తొలి ఏడాది వీటి నుంచి సుమారు రూ.700 కోట్ల ఆదాయం ఆశిస్తున్నట్టు చెప్పారు. అరబిందో కొనుగోలు చేస్తున్న ప్రాడక్టులకు యూఎస్‌లో మంచి గుర్తింపు ఉంది. బీఎస్ఈలో గురువారం కంపెనీ షేరు ధర క్రితం ముగింపుతో పోలిస్తే 1.62 శాతం తగ్గి రూ.774.30 వద్ద స్థిరపడింది.

బైజూస్ చేతికి అమెరికన్ కంపెనీ ఓస్మో



న్యూఢిల్లీ: ఆన్‌లైన్ విద్యా సంస్థ బైజూస్ అమెరికాకు చెందిన ఓస్మో కంపెనీని 120 మిలియన్ డాలర్లకు (రూ.850 కోట్లు) కొనుగోలు చేసినట్టు ప్రకటించింది. ఆటలతో కూడిన విద్యా విధానాలను ఓస్మో అందిస్తుంటుందని, భౌతిక రూపంలో ఉన్న బొమ్మలను ఆగ్మెంటెడ్ రియాలిటీ విధానంలో డిజిటల్ ప్రపంచంలోకి తీసుకురానున్నామని తెలిపింది. ఓస్మో స్వతంత్ర బ్రాండ్‌గానే కొనసాగుతుందని బైజూస్ ప్రకటించింది. అయితే, భౌతిక రూపం నుంచి డిజిటల్ రూపంలోకి మార్చే ఓస్మో సామర్థ్యాలు, కంటెంట్‌ను వినియోగించుకోవడం ద్వారా తన వ్యాపారాన్ని విస్తరించుకోనున్నట్టు తెలిపింది. చిన్నారులకు వినూత్నమైన, ప్రత్యేకమైన అధ్యయన సేవలు అందించేందుకు వీలు పడుతుందని పేర్కొంది.

పెట్రోలియం వ్యాపారంలోకి అదానీ

- జర్మన్ సంస్థ బీఏఎస్ఎఫ్‌తో జట్టు
- రూ.16,000 కోట్లతో ముంద్రాలో కెమికల్ ప్లాంటు



ఒప్పందం సందర్భంగా గౌతమ్ అదానీతో బీఏఎస్ఎఫ్ చైర్మన్ మార్టిన్ బ్రుడెర్మ్

న్యూఢిల్లీ: గౌతం అదానీకి చెందిన అదానీ గ్రూపు పెట్రో కెమికల్స్ రంగంలోకి అడుగుపెడుతోంది. జర్మనీ దిగ్గజ కంపెనీ బీఏఎస్ఎఫ్‌తో కలసి గుజరాత్‌లోని ముంద్రా జిల్లాలో 2 బిలియన్ యూరోలతో (రూ.16,000 కోట్లతో) పెట్రో కెమికల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించింది. ఇరు సంస్థలు ఈ మేరకు గురువారం 'వైబ్రంట్ గుజరాత్ గ్లోబల్ సమ్మిట్ 2019' వేదికగా అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. పెట్రోకెమికల్ ప్లాంట్‌కు విద్యుత్ అవసరాలు తీర్చుకునేందుకు సోలార్ విద్యుత్ ప్లాంట్, పవన విద్యుత్ ప్లాంట్‌ను కూడా ఏర్పాటు చేయనున్నాయి. పెట్రోకెమికల్ ప్లాంట్‌లో బీఏఎస్ఎఫ్‌కు మెజారిటీ వాటా, అదానీ గ్రూపునకు మైనారిటీ వాటా ఉంటాయి. ఇక విద్యుత్ ప్లాంట్ వెంచర్‌లో బీఏఎస్ఎఫ్ మైనారిటీ వాటా తీసుకుంటుంది. పెట్రోకెమికల్ రంగంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ ఇప్పటి వరకు మార్కెట్ లీడర్‌గా ఉంది. ఇద్దరు గుజరాతీ బిలియనీర్లు ముకేశ్, గౌతమ్ అదానీ ఒక వ్యాపారంలో నేరుగా పోటీ పడడం ఇదే ప్రథమం. అదానీ, బీఏఎస్ఎఫ్ ప్లాంట్ ద్వారా ప్రొపేన్ డీహైడ్రోజెనేషన్, ఆక్సో సీ4 కాంప్లెక్స్, గ్లాసియల్ అక్రిలిక్ యాసిడ్, బ్యుటిల్ అక్రిలేట్‌ను తయారు చేయనున్నాయి. వీటిని నిర్మాణం, ఆటోమోటివ్, కోటింగ్స్ విభాగాల్లో ఎక్కువగా వినియోగిస్తారు. ఈ ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతుండటంతో దిగుమతులపై ఆధారపడాల్సి వస్తోందని, భారత్‌లో తయారీకి తమ ప్లాంట్ మద్దతుగా నిలుస్తుందని ఇరు సంస్థలూ సంయుక్తంగా తెలిపాయి. భారత్‌లో తమకు ఇదే అతిపెద్ద పెట్టుబడిగా బీఏఎస్ఎఫ్ పేర్కొంది.

భారత్‌లో తయారీకి మద్దతుగా: అదానీ

''దేశంలో మధ్యతరగతి గణనీయంగా పెరుగుతుండడంతో పెట్రోకెమికల్స్‌ను భారీగా దిగుమతి చేసుకుంటున్నాం. దీంతో విలువైన విదేశీ మారకం బయటకు వెళుతోంది. మా భాగస్వామ్యం 'భారత్‌లో తయారీ' కార్యక్రమానికి ప్రోత్సాహకరంగా నిలుస్తుంది. ప్రస్తుతం దిగుమతి చేసుకుంటున్న సీ3 కెమికల్ వ్యాల్యూ చెయిన్‌తోపాటు పలు కెమికల్స్‌ను మా ప్లాంట్ తయారు చేస్తుంది'' అని గౌతమ్ అదానీ ప్రకటించారు.

వడ్డీ రేట్లు తగ్గించాలి

- ద్రవ్య లభ్యత పరిస్థితులను మెరుగుపరచాలి
- అప్పుడే వృద్ధికి బలం
- ఆర్‌బీఐకి సీఐఐ, ఫిక్కీ సూచనలు



న్యూఢిల్లీ: దేశ వృద్ధి రేటుకు ఊతమిచ్చేందుకు కీలకమైన వడ్డీ రేట్లను, నగదు నిల్వల నిష్పత్తిని తగ్గించాలని దేశ పారిశ్రామిక సంఘాలు ఆర్‌బీఐని కోరాయి. కీలకమైన మానిటరీ పాలసీ సమీక్షకు ముందు దేశ పారిశ్రామిక ప్రతినిధులతో ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ గురువారం ముంబైలో సమావేశమై వారి అభిప్రాయాలను తెలుసుకునే ప్రయత్నం చేశారు. ద్రవ్యోల్బణం కనిష్ట స్థాయికి దిగొచ్చినందున రుణాలపై అధిక వ్యయాలను తగ్గించాలని, కఠిన ద్రవ్య లభ్యత పరిస్థితులను సులభతరం చేసే దిశగా చర్యలు చేపట్టాలని పారిశ్రామికవేత్తలు ఈ సందర్భంగా కోరారు. 2018–19 ఆర్థిక సంవత్సరానికి ఆరవ ద్వైమాసిక పాలసీ సమీక్ష ఫిబ్రవరి 7న జరగనుంది. ప్రస్తుతం సీఆర్ఆర్ 4 శాతం (బ్యాంకు డిపాజిట్లలో ఆర్‌బీఐ వద్ద ఉంచాల్సిన నిష్పత్తి), రెపో రేటు 6.5 శాతంగా (బ్యాంకులకు ఆర్‌బీఐ ఇచ్చే రుణాలపై రేటు) ఉన్నాయి.

సీఐఐ సూచనలు ఇవీ...

''నగదు నిల్వల నిష్పత్తి (సీఆర్ఆర్)ని కనీసం అర శాతమయినా తగ్గించాలి. ద్రవ్యోల్బణం స్థిరంగా కనిష్ట స్థాయిల్లో కొనసాగుతున్నందున రెపో రేటును సైతం అరశాతం తగ్గించడాన్ని పరిశీలించాలి. తద్వారా రుణాలపై అధిక వ్యయ భారాన్ని తగ్గించాలి. ఎంఎస్ఎంఈ, ఇన్‌ఫ్రా రంగానికి రుణ సదుపాయాన్ని పెంచాలి'' అని సీఐఐ సూచించింది. ద్రవ్యలభ్యత పెంపునకు ఆర్‌బీఐ తీసుకున్న చర్యలను ప్రశంసించింది. ఎంఎస్ఎంఈ రంగం ఎదుర్కొంటున్న ఆర్థిక సవాళ్లను పరిష్కరించేందుకు, బ్యాంకులు కోరే అదనపు హామీలను పరిమితం చేసే అంశాన్ని పరిశీలించాలని కోరింది. సరైన హామీలు ఇచ్చినప్పుడు వ్యక్తిగత హామీలు ఇవ్వాల్సిన అవసరం లేకుండా చూడాలని కోరింది. సీఐఐ ప్రెసిడెంట్ డిసిగ్నేట్ ఉదయ్ కోటక్ ఆధ్వర్యంలో ఈ సూచనలు చేశారు. కొనుగోలు దారులకు క్రెడిట్ సదుపాయం కల్పించే లెటర్స్ ఆఫ్ అండర్‌టేకింగ్‌లను (ఎల్‌ఓయూ) ఎంఎస్ఎంఈలకు కూడా జారీ చేసేలా బ్యాంకులను ఆదేశించాలని కోరింది. బలహీన బ్యాంకుల విషయంలో కచ్చితమైన దిద్దుబాటు కార్యాచరణను పునఃసమీక్షించాలని, కనీసం ఆయా బ్యాంకులను నేషనల్ హౌసింగ్ బ్యాంకుకు రుణాలిచ్చేందుకు అయినా అనుమతించాలని కోరింది. దీనివల్ల హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీలకు నిధుల లభ్యత పెరుగుతుందని అభిప్రాయపడింది.

వృద్ధిని కూడా చూడాలి...

రెపో రేటు, సీఆర్ఆర్‌ను తగ్గించాలని మరో పారిశ్రామిక సంఘం ఫిక్కీ కూడా ఆర్‌బీఐ గవర్నర్‌ను కోరింది. దీని వల్ల దేశంలో పెట్టుబడులు పుంజుకుంటాయని, వినియోగాన్ని పెంచి వృద్ధికి తోడ్పడతాయని ఫిక్కీ ప్రెసిడెంట్ సందీప్ సోమాని పేర్కొన్నారు. ''వృద్ధిపై దృష్టి సారించేలా సర్దుబాటుతో కూడిన మానిటరీ పాలసీ అవసరం. మానిటరీ పాలసీ ఉద్దేశ్యాలు కేవలం ధరల స్థిరత్వానికే పరిమితం కాకూడదు. వృద్ధి రేటు, కరెన్సీ మారకం స్థిరత్వానికి కూడా అవసరమే'' అని సందీప్ సోమాని సూచించారు. దేశంలో నగదు లభ్యత పెంచే విధంగా ఆర్‌బీఐ మానిటరీ పాలసీ ఉండాలని, ద్రవ్య లభ్యత వృద్ధిని నిలబెట్టగలదని అసోచామ్ సూచించింది. ''ఎన్‌బీఎఫ్‌సీ, హెచ్‌ఎఫ్‌సీల నిధుల సమీకరణ సామర్థ్యాలు గణనీయంగా తగ్గాయి. నిధుల సమీకరణకు ప్రత్యామ్నాయ మార్గాలను వాటికి కల్పించాల్సి ఉంది. కేవలం ఎన్‌బీఎఫ్‌సీ, హెచ్‌ఎఫ్‌సీల ఆరోగ్యం కోసమే కాదు, జీడీపీ స్థిరమైన వృద్ధికి కూడా ఇది తప్పనిసరి అవసరం'' అని అసోచామ్ తన సూచనల్లో పేర్కొంది.

మరింత కరెన్సీ అవసరం: ఆర్‌బీఐ

కోల్‌కతా: దేశ జీడీపీ పరిమాణం పెరుగుతున్న కొద్దీ వ్యవస్థలో మరింత నగదు అవసరం ఉంటుందని రిజర్వ్ బ్యాంకు అధికారి ఒకరు అభిప్రాయపడ్డారు. 2016 నవంబర్‌లో పెద్ద నోట్ల రద్దు తర్వాత వ్యవస్థలో నగదుకు కొరత ఏర్పడిన విషయం విదితమే.

హోండా కార్ల ధరల పెంపు

- రూ.10,000 వరకు పెంపు
- వచ్చే నెల నుంచి అమలు



న్యూఢిల్లీ: హోండా కార్స్ ఇండియా లిమిటెడ్ (హెచ్‌సీఐఎల్)... తాను ఉత్పత్తి చేస్తున్న అన్ని మోడళ్ల ధరలను పెంచాలని నిర్ణయించింది. మోడల్ ఆధారంగా ఈ పెంపు రూ.7,000 నుంచి రూ.10,000 వరకు ఉంటుంది. పెరిగిన ఉత్పత్తి వ్యయాన్ని కస్టమర్లకు బదిలీ చేయడంలో భాగంగా ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు గురువారం ప్రకటించింది.

భవిష్యత్తు ఏఐ ప్రకటనలదే

- వీక్షకుల మూడ్‌ను బట్టి యాడ్స్
- రూ.61 వేల కోట్లను దాటిన అడ్వర్టయిజింగ్ పరిశ్రమ
- ఐఏఏ చైర్మన్, వరల్డ్ ప్రెసిడెంట్ శ్రీనివాసన్ స్వామి



ఐఏఏ చైర్మన్, వరల్డ్ ప్రెసిడెంట్ శ్రీనివాసన్ స్వామి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వార్తా పత్రికలు, రేడియో, టెలివిజన్, ఇంటర్నెట్, మొబైల్స్.. ఇదీ సింపుల్‌గా అడ్వర్టయిజింగ్ మాధ్యమాల వరుస క్రమం! కానీ ఇపుడు ఈ జాబితాలో ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) చేరుతోంది. ఇప్పటికే పలు అంతర్జాతీయ బ్రాండ్లు ఏఐ ఆధారిత ప్రకటనలపై పరిశోధన చేస్తున్నాయని, కొన్ని సంస్థలు త్వరలోనే దేశంలో మొబైల్ ఆధారిత ఏఐ ప్రకటనల్ని పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించే సంకేతాలున్నాయని ఇంటర్నేషనల్ అడ్వర్టయిజింగ్ అసోసియేషన్ (ఐఏఏ) చైర్మన్, వరల్డ్ ప్రెసిడెంట్ శ్రీనివాసన్ స్వామి చెప్పారు. ఏఐతో మొబైల్ అడ్వర్టయిజింగ్ మోసాలకు అడ్డుకట్ట పడుతుందని.. అందుకే ఈ విభాగం శరవేగంగా ఏఐ వైపు మళ్లుతోందని చెప్పారాయన. కొచ్చిలో జరగనున్న 44వ ఐఏఏ వరల్డ్ కాంగ్రెస్ వివరాలను గురువారమిక్కడ విలేకరులకు తెలిపారు. ''ఏఐ ప్రకటనలతో వేగం, పారదర్శకతతో పాటు ప్రకటనల కమ్యూనికేషన్‌ను ఎడిట్ చేసుకునే వీలుంటుంది. వీక్షకుల మానసిక స్థితి, ముఖ కవళికలను బట్టి ప్రకటనలను అందించవచ్చు. వయస్సు, లింగ భేదం వంటివి కూడా శోధించి అందుకు తగిన యాడ్స్ వస్తాయి. ఈ ప్రకటనలతో సమయం, డబ్బు వృథా జరగదు'' అని వివరించారు.

రూ.61,878 కోట్లకు ప్రకటనల పరిశ్రమ..

ప్రస్తుతం దేశీయ ప్రకటనల పరిశ్రమ పరిమాణం రూ.61,878 కోట్లుగా ఉందని.. ఇందులో రూ.14 వేల కోట్లు డిజిటల్ మీడియం వాటా అని తెలియజేశారు. ఏటా 10.62 శాతం వృద్ధి రేటుతో 2021 నాటికి ప్రకటనల పరిశ్రమ 82,250 కోట్లకు చేరుతుందని అంచనా వేశారు. మొత్తం పరిశ్రమలో టెలివిజన్, ప్రింట్ వాటా 70 శాతం, డిజిటల్ వాటా 17 శాతం వరకుంటుంది.

కొచ్చిలో ఐఏఏ వరల్డ్ కాంగ్రెస్..

ఐఏఏ వరల్డ్ కాంగ్రెస్‌కు తొలిసారిగా మన దేశం ఆతిథ్యం ఇస్తోంది. ఫిబ్రవరి 20–22 తేదీల్లో కొచ్చిలో జరిగే ఈ సదస్సులో రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ, యూనీలీవర్ సీఈఓ పాల్ పోలెమన్, క్వాల్‌కామ్ సీఈఓ స్టీవెన్ మోల్లిన్‌కోఫ్, యూఐడీఏఐ మాజీ చైర్మన్ నందన్ నిలేకనీ, సాఫ్ట్‌బ్యాంక్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్స్ సీఈఓ రాజీవ్ మిశ్రా తదితరులు పాల్గొంటారు. న్యూయార్క్ కేంద్రంగా పనిచేస్తున్న ఐఏఏకు ప్రపంచవ్యాప్తంగా 55 దేశాల్లో చాప్టర్లుండగా, ఇండియాలో 300 మంది సభ్యులున్నారు.

డిక్కీ తెలంగాణ ప్రెసిడెంట్‌గా రవికుమార్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దళిత్ ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (డిక్కీ) తెలంగాణ ప్రెసిడెంట్‌గా కాశర పాక రవి కుమార్ ఎన్నికయ్యారు. ఇప్పటి వరకు ప్రెసిడెంట్‌గా ఉన్న రాహుల్ కిరణ్ డిక్కీ దక్షిణ భారత వైస్ ప్రెసిడెంట్‌గా నియమితులయ్యారు. డిక్కీ తెలంగాణ చాప్టర్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా బానోత్ రమేశ్ నాయక్, వైస్ ప్రెసిడెంట్లుగా మునీంద్ర, అరుణ దాసరి ఎంపికయ్యారు.

ఎడెల్‌వీజ్ నుంచి కొత్తగా స్మాల్‌క్యాప్ ఫండ్



హైదరాబాద్: ఎడెల్‌వీజ్ అస్సెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ కొత్తగా ఓ స్మాల్ క్యాప్ ఫండ్‌ను ఆరంభిస్తున్నట్టు ప్రకటించింది. ఓపెన్ ఎండెడ్ విధానంలో పనిచేసే ఈ పథకం స్మాల్ క్యాప్ స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేస్తుందని, దీర్ఘకాలంలో మెరుగైన రాబడులు అందించడమే పథకం ఉద్దేశమని సంస్థ పేర్కొంది. ఈ ఫండ్ ఆఫర్ ఈనెల 18న ప్రారంభమవుతుందని, ఫిబ్రవరి 1 వరకు పెట్టుబడికి అందుబాటులో ఉంటుందని వివరించింది.

డాక్టర్ రెడ్డీస్‌కు ప్యాకేజింగ్‌లో 'లెక్సస్' అవార్డ్

హైదరాబాద్: లెక్సస్ ఇండియా సంస్థ రెండో ఎడిషన్ లెక్సస్ డిజైన్ అవార్డు విజేతల వివరాలను ప్రకటించింది. డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్‌కు ప్యాకేజింగ్ డిజైన్ విభాగంలో అవార్డు వరించింది. ప్రొడక్ట్ డిజైన్ విభాగంలో నియోమోషన్ మొబిలిటీ సొల్యూషన్స్ ప్రాజెక్టుకు అవార్డు దక్కింది. వీల్‌చెయిర్‌ను విడిగా ఓ వ్యక్తి అవసరాలకు అనుగుణంగా రూపొందించే ఈ ప్రాజెక్టు. ఓపెన్ కేటగిరీలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌కు చెందిన క్లీన్ ఆర్‌ఏటీ ప్రాజెక్టును అవార్డు వరించింది. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ ఆధారంగా మురుగునీటి కాల్వలను పర్యవేక్షించడం ఈ ప్రాజెక్టులో భాగం. ఇలా మొత్తం 12 కేటగిరీల్లో విజేతలను లెక్సస్ ఇండియా ప్రకటించింది.

నేటి బోర్డ్ మీటింగ్స్...

విప్రో, జీ లెర్న్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ, ఎల్ అండ్ టీ ఇన్ఫోటెక్, ధనలక్ష్మీ బ్యాంక్, ఐసీఐసీఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్, ముత్తూట్ క్యాపిటల్ సర్వీసెస్, కజారియా సిరామిక్స్, ఎన్ఐఐటీ టెక్నాలజీస్, అతుల్, 3ఐ ఇన్ఫోటెక్

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (24 క్యారెట్లు)	33,240	0
బంగారం (22 క్యారెట్లు)	31,660	0
వెండి (కిలో)	42,900	0
చెన్నై		
బంగారం (24 క్యారెట్లు)	32,670	▲ 100
బంగారం (22 క్యారెట్లు)	31,110	▲ 90
వెండి (కిలో)	42,900	0
హైదరాబాద్		
బంగారం (24 క్యారెట్లు)	32,670	▲ 100
బంగారం (22 క్యారెట్లు)	31,110	▲ 90
వెండి (కిలో)	42,900	0
ప్రొద్దుటూరు		
బంగారం (24 క్యారెట్లు)	32,850	▲ 150
బంగారం (22 క్యారెట్లు)	30,390	▲ 110
వెండి (కిలో)	40,500	0
విశాఖపట్నం		
బంగారం (24 క్యారెట్లు)	33,410	0
బంగారం (22 క్యారెట్లు)	31,080	0
వెండి (కిలో)	41,000	▲ 500
విజయవాడ		
బంగారం(24 క్యారెట్లు)	33,450	
బంగారం (22 క్యారెట్లు)	30,500	
వెండి (కిలో)	40,400	▲ 400
ఏపీ బులియన్ అసోసియేషన్		
బంగారం (24 క్యారెట్లు)	33,580	▲ 90
బంగారం (22 క్యారెట్లు)	31,110	▲ 90
వెండి (కిలో)	40,500	0

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	51.88 (రాత్రి 11.30కు)	$52.31 (బుధవారం ముగింపు)
బ్రెంట్	61.03 (రాత్రి 11.30కు)	$61.32 (బుధవారం ముగింపు)

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 18-01-2019

విజయవాడ	435-00
విశాఖపట్నం	435-00
చిత్తూర్	443-00
వరంగల్	420-00
చెన్నై	450-00
ముంబై	468-00
నమక్కల్	435-00
గోదావరి	435-00
17-1-2019 ఫామ్ ధర...	
హైదరాబాద్	418-00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.80
బెంగళూరు	445-00
కోల్‌కత్త	466-00
ఢిల్లీ	450-00

10,900 పాయింట్ల పైకి నిఫ్టీ

- మిశ్రమంగా అంతర్జాతీయ సంకేతాలు
- తగ్గిన చమురు ధరలు
- మూడో రోజూ లాభాల్లోనే మార్కెట్
- 53 పాయింట్లు పెరిగి 36,374కు సెన్సెక్స్
- 15 పాయింట్ల లాభంతో 10,905కు నిఫ్టీ



అంతర్జాతీయ సంకేతాలు మిశ్రమంగా ఉన్నప్పటికీ, షేర్ల వారీ కదలికల కారణంగా గురువారం స్టాక్ మార్కెట్ లాభాల్లో ముగిసింది. స్టాక్ సూచీలు వరుసగా మూడో రోజూ లాభపడ్డాయి. ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 10,900 పాయింట్లపైకి ఎగబాకింది. 15 పాయింట్లు పెరిగి 10,905 పాయింట్లకు చేరింది. 300 పాయింట్ల రేంజ్‌లో కదలాడిన సెన్సెక్స్ చివరకు 53 పాయింట్ల లాభంతో 36,374 పాయింట్ల వద్ద ముగిసింది. మరో మూడు వారాల్లో మధ్యంతర బడ్జెట్ రానుండటం, కీలక కంపెనీల క్యూ3 ఫలితాల నేపథ్యంలో అనిశ్చితి నెలకొనడంతో స్టాక్ సూచీలు లాభ, నష్టాల మధ్య దోబూచులాడాయి. ఇటీవల పుంజుకున్న ముడి చమురు ధరలు 1% మేర పతనం కావడం, గత ఐదు రోజులుగా పతనమవుతున్న రూపాయి పుంజుకోవడం సానుకూల ప్రభావం చూపించాయి. ఫార్మా, ప్రభుత్వ రంగ బ్యాంక్ షేర్లు నష్టపోగా, ప్రైవేట్ బ్యాంక్, ఐటీ, వాహన షేర్లు లాభపడ్డాయి.

297 పాయింట్ల రేంజ్‌లో సెన్సెక్స్...

సెన్సెక్స్ లాభాల్లోనే ఆరంభమైంది. మధ్యాహ్నం వరకూ లాభాల్లోనే కొనసాగింది. ఆ తర్వాత నష్టాల్లోకి జారిపోయింది. చివరి గంటలో కొనుగోళ్ల మద్దతుతో మళ్లీ లాభాల్లోకి వచ్చింది. ఒక దశలో 147 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్ మరో దశలో 150 పాయింట్లు వరకూ నష్టపోయింది. మొత్తం మీద రోజంతా 297 పాయింట్ల రేంజ్‌లో కదలాడింది. కొరియా సూచీ మినహా మిగిలిన ఆసియా మార్కెట్లు నష్టపోయాయి. యూరప్ మార్కెట్లు కూడా నష్టాల్లోనే ముగిశాయి.

- క్యూ3 ఫలితాలు బాగా ఉంటాయనే అంచనాలతో యాక్సిస్ బ్యాంక్ షేర్ లాభపడింది. ఇంట్రాడేలో జీవిత కాల గరిష్ట స్థాయి, రూ.679ను తాకిన ఈ షేర్ చివరకు 2 శాతం లాభంతో రూ.676 వద్ద ముగిసింది. గత రెండు వారాల్లో ఈ షేర్ 12 శాతం పెరిగింది.
- సన్ ఫార్మా షేర్ 5.7% నష్టపోయి రూ.427 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లో బాగా నష్టపోయిన షేర్ ఇదే.
- ఆర్థిక ఫలితాలు వెల్లడి నేపథ్యంలో రిలయన్స్ ఇండస్ట్రీస్, హిందుస్తాన్ యూనిలివర్ షేర్లు చెరో 1 శాతం నష్టపోయాయి. మార్కెట్ ముగిసిన తర్వాత ఈ రెండు కంపెనీల ఫలితాలు వెలువడ్డాయి.

గురువారం స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	2,457
ఎన్‌ఎస్‌ఈ	27,591
ఎన్‌ఎస్‌ఈ (డెరివేటివ్స్)	17,48,184
ఎఫ్‌ఐఐ	842
డీఐఐ	- 727

నిఫ్టీ 50

టాప్ 10 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
GAIL	332.75	2.23
BPCL	354.15	1.99
INFRATEL	280.75	1.78
AXISBANK	674.9	1.64
HCLTECH	952.8	1.55
TCS	1,895.00	1.55
HINDPETRO	243.85	1.35
HDFC	2,000.20	1.28
IOC	137.5	1.25
KOTAKBANK	1,217.80	1.25

టాప్ 10 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
SUNPHARMA	423.8	-6.61
YESBANK	200.65	-3.7
ZEEL	440.8	-2.5
EICHERMOT	20,335.00	-1.93
SBIN	297.4	-1.9
BAJAJFINSV	6,354.95	-1.7
IBULHSGFIN	816	-1.64
BAJFINANCE	2,531.15	-1.51
HINDUNILVR	1,750.00	-1.27
ULTRACEMCO	3,838.00	-1.26

ఫెడరల్ బ్యాంక్ లాభం రూ.333 కోట్లు

- 28 శాతం వృద్ధి
- ఇతర ఆదాయం దన్ను



ముంబై: ప్రైవేట్ రంగ ఫెడరల్ బ్యాంక్ ఈ ఆర్థిక సంవత్సరం డిసెంబర్ క్వార్టర్లో రూ.334 కోట్ల నికర లాభాన్ని సాధించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే క్వార్టర్‌లో సాధించిన నికర లాభం రూ.260 కోట్లతో పోలిస్తే 28 శాతం వృద్ధి సాధించామని బ్యాంక్ తెలిపింది. ఇతర ఆదాయం బాగా పెరగడంతో నికర లాభం ఈ స్థాయిలో పెరిగిందని ఫెడరల్ బ్యాంక్ ఎమ్‌డీ, సీఈఓ శ్యామ్ శ్రీనివాసన్ చెప్పారు. రుణాలు 25 శాతం వృద్ధి చెందాయని, నికర వడ్డీ ఆదాయం 13 శాతం వృద్ధితో రూ.1,077 కోట్లకు పెరిగిందని పేర్కొన్నారు. నికర వడ్డీ మార్జిన్ మాత్రం 3.3 శాతం నుంచి 3.17 శాతానికి తగ్గిందని తెలియజేశారు.

ఇతర ఆదాయం 51 శాతం అప్...: ట్రేడింగ్ లాభాలు ఆరోగ్యకరంగా ఉండటంతో వడ్డీయేతర ఆదాయం రూ.229 కోట్ల నుంచి 51 శాతం వృద్ధితో రూ.345 కోట్లకు చేరిందని శ్రీనివాసన్ వెల్లడించారు. కేటాయింపులు రూ.162 కోట్ల నుంచి రూ.190 కోట్లకు ఎగిశాయని, ప్రొవిజినల్ కవరేజ్ రేషియో 68 శాతానికి ఎగసిందని వివరించారు. ఏడాది కాలంలో ఇది 70 శాతానికి పెరగగలదన్నారు.

పెరిగిన మొండి బకాయిలు...

స్థూల మొండి బకాయిలు 2.52 శాతం నుంచి 3.14 శాతానికి పెరిగాయని శ్రీనివాసన్ తెలిపారు. ప్రస్తుతం కష్టాల్లో ఉన్న జెట్ ఎయిర్‌వేస్ కంపెనీకి ఎలాంటి రుణాలూ ఇవ్వలేదని పేర్కొన్నారు. అయితే ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్ గ్రూప్ కంపెనీలకు రూ.245 కోట్ల మేర రుణాలిచ్చామని, తాము రుణాలు మంజూరు చేసిన ఈ గ్రూప్ ఎస్‌పీవీలు (స్పెషల్ పర్పస్ వెహికల్) మంచి పనితీరు సాధిస్తున్నాయని, అందుకని ఈ రుణాలపై ఎలాంటి ఇబ్బందులు లేవని వివరించారు. ఫెడరల్ బ్యాంక్ ఫలితాలు ఇన్వెస్టర్లను మెప్పించలేకపోయాయి. బీఎస్‌ఈలో ఫెడరల్ బ్యాంక్ షేర్ 3 శాతం క్షీణించి రూ.89 వద్ద ముగిసింది.

బీహెచ్‌ఈఎల్ ఎలక్ట్రిక్ చార్జింగ్ స్టేషన్లు

ఢిల్లీ–చండీగఢ్ హైవేపై ఏర్పాటు



న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్ వాహనాల కోసం ఢిల్లీ– చండీగఢ్ జాతీయ రహదారిపై సోలార్ ఆధారిత చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నట్టు ప్రభుత్వ రంగంలోని బీహెచ్‌ఈఎల్ ప్రకటించింది. ''250 కిలోమీటర్ల పరిధిలో మధ్య మధ్యలో ఈ ఎలక్ట్రిక్ చార్జర్లను ఏర్పాటు చేస్తున్నాం. దీనివల్ల మధ్యలో చార్జింగ్ అయిపోతుందేమో!! ప్రయాణించటం కష్టమేమో!! అనే భయాలు ఎలక్ట్రిక్ వాహనాదారుల్లో తొలగుతాయి. ఎలక్ట్రిక్ వాహన ప్రయాణాలపై విశ్వాసం పెరుగుతుంది'' అని భెల్ వివరించింది. దేశంలో వాహన కాలుష్యాన్ని తగ్గించడంతోపాటు, ఇంధన దిగుమతులకు పరిష్కారంగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించే చర్యలను కేంద్ర ప్రభుత్వం చేపట్టిన విషయం తెలిసిందే. అయితే, చార్జింగ్ వసతుల లేమి కొనుగోళ్లకు అడ్డుపడుతోంది. ఎలక్ట్రిక్ చార్జింగ్ స్టేషన్లను తామే సొంతంగా డిజైన్ చేయటంతో పాటు తయారీ, సరఫరా, ఇన్‌స్టాల్ కూడా చేస్తామని బీహెచ్‌ఈఎల్ తెలిపింది. ప్రతీ ఎలక్ట్రిక్ ఛార్జింగ్ స్టేషన్ రూఫ్‌టాప్ సోలార్ పవర్ ప్లాంట్‌తో ఉంటుందని, వేగంగా, నిదానంగా చార్జ్ చేసే వసతులు కూడా ఉంటాయని వివరించింది. బీహెచ్‌ఈఎల్ ఇప్పటికే ఢిల్లీలోని ఉద్యోగ్ భవన్‌లో డీసీ చార్జర్లను ఏర్పాటు చేసింది. ఎలక్ట్రిక్ చార్జర్ల ఏర్పాటుకు సంబంధించి మరో ఆర్డర్ కూడా సంస్థ నిర్వహణలో ఉంది.

ఎల్‌టీటీఎస్ ఆదాయం రూ.1,317 కోట్లు

కంపెనీకి మిలియన్ డాలర్ల డీల్స్ 8...

న్యూఢిల్లీ: లార్సెన్ అండ్ టుబ్రో టెక్నాలజీ సర్వీసెస్ కంపెనీ నికర లాభం కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక కాలంలో 47 శాతం పెరిగింది. గత క్యూ3లో రూ.126 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ3లో రూ.186 కోట్లకు పెరిగిందని ఎల్ అండ్ టీ టెక్నాలజీ సర్వీసెస్ (ఎల్‌టీటీఎస్) తెలిపింది. ఆదాయం రూ.969 కోట్ల నుంచి 36% పెరిగి రూ.1,317 కోట్లకు చేరిందని కంపెనీ సీఈఓ, ఎమ్‌డీ కేశబ్ పాండా తెలిపారు. డాలర్ల పరంగా చూస్తే, ఆదాయం 23 శాతం పెరిగి 18.57 కోట్ల డాలర్లకు పెరిగిందని పేర్కొన్నారు. వివిధ సెగ్మెంట్లలో మిలియన్ డాలర్ల డీల్స్‌ను ఎనిమిదింటిని సాధించామని వివరించారు. ఈ క్యూ3లో నికరంగా 1,192 ఉద్యోగాలు ఇచ్చామని, దీంతో మొత్తం ఉద్యోగుల సంఖ్య 14,777కు పెరిగిందని పేర్కొన్నారు. ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈలో ఎల్‌టీటీఎస్ షేర్ 2.3 శాతం లాభపడి రూ.1,689 వద్ద ముగిసింది.

ఏపీజీవీబీ లాభం రూ.450 కోట్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ (ఏపీజీవీబీ) డిసెంబరుతో ముగిసిన తొమ్మిది నెలల కాలానికి చక్కని పనితీరు కనబరిచింది. అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 12 శాతం వృద్ధితో రూ.450 కోట్ల నికరలాభాన్ని ఆర్జించింది. డిపాజిట్లు 7.47 శాతం పెరిగి రూ.14,827 కోట్లకు, అడ్వాన్సులు 19.06 శాతం పెరిగి రూ.15,897 కోట్లకు చేరినట్లు బ్యాంకు చైర్మన్ వి.నర్సిరెడ్డి తెలిపారు. గృహ రుణాలు చక్కని వృద్ధితో రూ.1,054 కోట్ల నుంచి రూ.1,657 కోట్లకు ఎగశాయి. క్యాపిటల్ అడెక్వసీ రేషియో 15.75 నుంచి 16.37 శాతానికి చేరిందని, కాసా 42.15 నుంచి 43.09 శాతానికి, ఆర్‌వోఏ 2.25 నుంచి 2.30 శాతానికి చేరినట్లు బ్యాంకు తెలియజేసింది. ఇక నికరవడ్డీ మార్జిన్ కూడా 4.15 నుంచి 4.34 శాతానికి పెరిగింది. కాస్ట్ ఆఫ్ ఫండ్స్ 5.24 నుంచి 5.05 శాతానికి వచ్చింది. వ్యయాల శాతం 27.75 నుంచి 27.35 శాతానికి తగ్గిందని బ్యాంకు తెలియజేసింది.



చైర్మన్ వి.నర్సిరెడ్డి


సైయంట్ లాభం రూ.92 కోట్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇంజనీరింగ్ టెక్నాలజీ కంపెనీ సైయంట్ డిసెంబరు త్రైమాసికానికి కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.92 కోట్ల నికరలాభాన్ని ఆర్జించింది. గతేడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 5 శాతం అధికం. ఆదాయం 20.8 శాతం పెరిగి రూ.1,187 కోట్లకు చేరింది. కంపెనీ చేతిలో నగదు నిల్వలు రూ.1,230 కోట్లు ఉన్నట్టు ప్రకటించింది. గురువారం బీఎస్‌ఈలో కంపెనీ షేరు ధర క్రితం ముగింపుతో పోలిస్తే 0.71 శాతం అధికమై రూ.627.55 వద్ద స్థిరపడింది.

రూ.700 కోట్లు ఇస్తా.. షరతులు వర్తిస్తాయ్ !

ఎస్‌బీఐకు నరేష్ గోయల్ లేఖ



న్యూఢిల్లీ: నిధుల కటకటతో ఇబ్బందులు పడుతున్న జెట్ ఎయిర్‌వేస్‌లో పెట్టుబడులు పెట్టడానికి ఆ కంపెనీ చైర్మన్ నరేష్ గోయల్ ముందుకు వచ్చారు. కానీ కొన్ని షరతులకు అంగీకరిస్తేనే ఈ పెట్టుబడులు పెడతానని వెల్లడించారు. జెట్ ఎయిర్‌వేస్‌లో రూ.700 కోట్ల మేర పెట్టుబడులు పెట్టడంతో పాటు తన షేర్లను మొత్తాన్ని తనఖా పెట్టేందుకు సిద్ధమని ఆయన తెలిపారు. అయితే తన వాటా 25 శాతం కంటే తగ్గకుండా ఉంటేనే ఇది సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎస్‌బీఐ చైర్మన్ రజనీశ్ కుమార్‌కు ఒక లేఖ రాశారు. జెట్‌ఎయిర్‌వేస్‌లో ఇప్పటికే భాగస్వామిగా ఉన్న ఎతిహాద్ మరిన్ని పెట్టుబడులు పెట్టడానికి కఠినమైన నిబంధనలు విధిస్తున్న నేపథ్యంలో ఆయన ఈ ఆఫర్‌ను ఇవ్వడం ప్రాధాన్యత సంతరించుకుంది. తన వాటా 25 శాతం కన్నా తగ్గకుండా ఉండేలా చూడాలని, టేకోవర్ కోడ్ వర్తించకుండా చూడాలని, ఈ మేరకు సెబీ మినహాయింపు ఇవ్వాలని ఆ లేఖలో నరేశ్ గోయల్ పేర్కొన్నారు. ప్రస్తుతం జెట్ ఎయిర్‌వేస్‌లో ఆయనకు 51 శాతం వాటా ఉంది. స్టాక్ మార్కెట్లో లిస్టైన కంపెనీలో ప్రమోటర్ వాటా నిర్దేశిత పరిమితికి లోబడి తగ్గితే, సెబీ టేకోవర్ కోడ్ ప్రకారం ఓపెన్ ఆఫర్ ఇవ్వాల్సి వస్తుంది. జెట్ ఎయిర్‌వేస్, కంపెనీలో వాటాదారుల ప్రయోజనాలకు విఘాతం కలగకుండా సమంజసమైన పరిష్కారం కనుగొనాలని ఆ లేఖలో ఆయన కోరారు. కాగా జెట్ ఎయిర్‌వేస్‌ను గట్టెక్కించడానికి పరిష్కార ప్రణాళికపై కసరత్తు చేస్తున్నామని ఎస్‌బీఐ వెల్లడించింది. ఈ లేఖ నేపథ్యంలో దీంతో ఈ షేర్ 5 శాతం లాభంతో రూ. 285 వద్ద ముగిసింది. 5 శాతం నష్టంతో ట్రేడింగ్‌ను ఆరంభించిన ఈ షేర్ ఇంట్రాడే కనిష్టం నుంచి చూస్తే, 15 శాతం రికవరీ అయింది.

రూ.8,800 కోట్లు సమీకరించిన ఎస్‌బీఐ



న్యూఢిల్లీ: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) విదేశీ మార్కెట్ల నుంచి భారీగా నిధులు సమీకరించింది. విదేశీ మార్కెట్లో బాండ్ల జారీ ద్వారా రూ.8,800 కోట్లు (125 కోట్ల డాలర్లు) సమీకరించామని ఎస్‌బీఐ తెలిపింది. వ్యాపార విస్తరణ కోసం ఈ నిధులు వినియోగిస్తామని పేర్కొంది. 85 కోట్ల డాలర్ల విలువైన ఐదేళ్ల కాలపరిమితి గల ఫిక్స్‌డ్ రేట్ అన్‌సెక్యూర్డ్ బాండ్లను రెండు దఫాలుగా జారీ చేశామని, వీటి కూపన్ రేట్ 4.37 శాతమని తెలిపింది. అలాగే 40 కోట్ల డాలర్ల విలువైన మూడేళ్ల కాలపరిమితి గల బాండ్ల జారీ చేశామని, వీటి కూపన్ రేటు4 శాతమని వివరించింది. ఈ రెండు రకాల కాలపరిమితి గల బాండ్లకు వడ్డీని ఆరు నెలలకొకసారి చెల్లిస్తామని పేర్కొంది. ఈ బాండ్లను సింగపూర్ స్టాక్ ఎక్స్ఛేంజ్, ఇండియా ఇంటర్నేషనల్ ఎక్స్ఛేంజ్‌ల్లో లిస్టింగ్ చేస్తామని ఎస్‌బీఐ తెలిపింది.

ఇక ఓలా పోస్ట్-పెయిడ్



ముందుగా సర్వీసులను వినియోగించుకుని.. ఆ తరువాత 15–రోజుల్లో బిల్లు మొత్తాన్ని చెల్లించే విధంగా తమ కస్టమర్లకు వెసులుబాటును అందిస్తున్నట్లు ట్యాక్సీ యాగ్రిగేటర్ ఓలా ప్రకటించింది. గతేడాదిలో ప్రయోగాత్మకంగా పలు ప్రాంతాల్లో ఈ సేవలను అందించగా.. 30 శాతం నెలవారీ వృద్ధిరేటు నమోదైందని, ఇక నుంచి ఈ విధానాన్ని దేశవ్యాప్తంగా అమలుచేయనున్నామని తెలియజేసింది.

ఆన్‌లైన్ ఫుడ్‌లోకి 'పేటీఎం'



డిజిటల్ చెల్లింపుల సంస్థ పేటీఎం.. ఆన్‌లైన్ ద్వారా ఆహారం అందించే సేవల్లోకి అడుగుపెట్టినట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా, ఇప్పటికే ఈ వ్యాపారంలో ఉన్నటువంటి జొమోటోతో జట్టుకట్టింది. ఢిల్లీ–ఎన్‌సీఆర్‌లో తొలుత సేవలను ప్రారంభించామని, ఈ నెల చివరినాటికి దేశవ్యాప్తంగా 100 నగరాల్లో సేవాలను ప్రారంభించనున్నామని ప్రకటించింది.

యూకో బ్యాంక్: ప్రైవేట్ ప్లేస్‌మెంట్‌తో షేర్ల జారీ ద్వారా రూ.1,000 కోట్లు సమీకరించడానికి డైరెక్టర్ల బోర్డ్ ఆమోదం తెలిపింది. అలాగే టైర్ –2 బాండ్ల జారీ ద్వారా రూ.500 కోట్ల సమీకరణ ప్రతిపాదన కూడా బోర్డ్ ఆమోదం పొందింది. ఎంప్లాయీ స్టాక్ పర్చేజ్ స్కీమ్ కింద ఉద్యోగులకు 20 కోట్ల వరకూ షేర్లను జారీ చేయడానికి కూడా బ్యాంక్ డైరెక్టర్ల బోర్డ్ ఓకే చెప్పింది.

ఫ్లిప్‌కార్ట్ ఇండియాలోకి రూ.1,431 కోట్లు



న్యూఢిల్లీ: ఈ–కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ ఇండియా తాజాగా రూ. 1,431 కోట్లు సమీకరించింది. సింగపూర్‌కి చెందిన మాతృ సంస్థ ఫ్లిప్‌కార్ట్ నుంచి ఈ నిధులు సమీకరించినట్లు సంస్థ తెలియజేసింది. ఈ నిధులకు ప్రతిగా మాతృ సంస్థకు 4.86 లక్షల షేర్లు కేటాయించామని, ఒక్కో షేరు ధరను రూ. 29,400గా నిర్ణయించామని కంపెనీ వెల్లడించింది. గతేడాది డిసెంబర్‌లో కూడా ఫ్లిప్‌కార్ట్ ఇండియాలో ఫ్లిప్‌కార్ట్ రూ.2,190 కోట్లు పెట్టుబడి పెట్టింది. విదేశీ పెట్టుబడులున్న ఈ–కామర్స్ సంస్థల నిబంధనలను కేంద్రం కఠినతరం చేసిన తరుణంలో ఫ్లిప్‌కార్ట్ ఇండియాలోకి ఈ పెట్టుబడులు రావడం గమనార్హం. ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి రానున్న ఈ నిబంధనలకు గడువును పొడిగించాలంటూ ఈ–కామర్స్ దిగ్గజాలు అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ సంస్థలు కేంద్ర ప్రభుత్వాన్ని ఇప్పటికే కోరాయి.

బిజినెస్ రిజిస్టర్‌పై కేంద్రం కసరత్తు



న్యూఢిల్లీ: కొత్త ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా వ్యాపార సంస్థల లెక్కింపు చేపట్టనున్న నేపథ్యంలో... జాతీయ బిజినెస్ రిజిస్టర్ కూడా రూపొందించాలని కేంద్రం యోచిస్తోంది. దేశీయంగా వివిధ వ్యాపారాల వివరాలన్నీ ఇందులో ఉంటాయి. సీఎస్‌సీ ఈ–గవర్నెన్స్ సర్వీసెస్‌తో కలిసి నిర్వహించిన సదస్సులో పాల్గొన్న సందర్భంగా గణాంకాలు, పథకాల అమలు శాఖ కార్యదర్శి ప్రవీణ్ శ్రీవాస్తవ ఈ విషయాలు చెప్పారు. ఏడో విడత వ్యాపార సంస్థల గణన నిర్వహణ బాధ్యతలను సీఎస్‌సీ ఈ–గవర్నెన్స్‌కి (సీఎస్‌సీ ఎస్‌పీవీ) కేంద్రం అప్పగించింది. సీఎస్‌సీ ప్రస్తుతం దేశవ్యాప్తంగా 3 లక్షల కామన్ సర్వీస్ సెంటర్స్ నిర్వహిస్తోందని, ఇవన్నీ కూడా సర్వే విధులు నిర్వర్తిస్తాయని ప్రవీణ్ తెలిపారు. సీఎస్‌సీ ఎస్‌పీవీ సర్టిఫికేషన్ పొందిన ఎన్యూమరేటర్లను జనాభా గణన సర్వే కోసం వినియోగించుకునే వీలుంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ సర్వేలో సేకరించే వివరాలు జాతీయ స్థాయిలో విధానపరమైన నిర్ణయాలు తీసుకునేందుకు తోడ్పడగలవని ప్రవీణ్ చెప్పారు. దేశవ్యాప్తంగా సుమారు 20 కోట్ల కుటుంబాలుండగా.. ప్రతి కుటుంబం సర్వేకి ఎన్యూమరేటరుకు రూ. 15–20 మేర చెల్లించిన పక్షంలో ఎకనమిక్ సెన్సస్‌పై రూ. 300 కోట్ల దాకా వ్యయం కాగలదని అంచనా వేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

'జీవన్ శాంతి'కి రూ.750 కోట్ల ప్రీమియం

- ఈ ఏడాది దీంతోనే రూ.2,000 కోట్లు
- ఎల్‌ఐసీ సౌత్ సెంట్రల్ జీఎమ్ సుశీల్ కుమార్ వెల్లడి



హైదరాబాద్: ఎల్‌ఐసీ కొత్తగా అందుబాటులోకి తెచ్చిన జీవన్ శాంతి పాలసీకి మంచి స్పందన లభిస్తోందని, ఈ పాలసీ ఒక్కదాంతోనే ఈ ఏడాది ఇప్పటిదాకా రూ.750 కోట్ల ప్రీమియం ఆదాయం వచ్చిందని ఎల్‌ఐసీ సౌత్ సెంట్రల్ జోన్ జోనల్ మేనేజర్ టి.సి. సుశీల్ కుమార్ చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి ఒక్క జీవన్ శాంతి పాలసీ ప్రీమియం ఆదాయమే రూ.2,000 కోట్ల మేర ఉండగలదన్న అంచనాను ఆయన వ్యక్తంచేశారు. సౌత్ సెంట్రల్ జోన్ ఈ డిసెంబర్ క్వార్టర్లో రూ.35,000 కోట్ల ప్రీమియమ్ ఆదాయాన్ని ఆర్జించిందని, ఈ ప్రీమియమ్ ఆదాయం ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి రూ.55,000 కోట్లకు చేరుతుందని ఆయన విశ్వాసం వ్యక్తంచేశారు. గత ఏడాది డిసెంబర్ నాటికి మొత్తం రూ.25,000 కోట్ల క్లెయిమ్‌లు సెటిల్ చేశామన్నారు. ఇటీవల జరిగిన మైసూర్, కరీంనగర్ దుర్ఘటనల్లో డెత్ క్లెయిమ్‌లను రెండు రోజుల్లోనే పరిష్కరించామని, పాలసీదారుల పట్ల తమ నిబద్ధతకు ఇదే నిదర్శనమని పేర్కొన్నారు. తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలు సౌత్ సెంట్రల్ జోన్ కిందకు వస్తాయని, ఈ రాష్ట్రాల్లోని ఎల్‌ఐసీ ఏజెంట్లు మంచి పనితీరు చూపుతున్నారని ప్రశంసించారు. అమెరికాలో జరగబోయే మిలియన్ డాలర్ రౌండ్ టేబుల్‌కు ఈ రాష్ట్రాల నుంచి మొత్తం 1,385 ఏజెంట్లు అర్హత సాధించే అవకాశాలున్నాయని పేర్కొన్నారు.

ఎన్‌ఎస్‌ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ADANI PORT	394.5	389.3
ASIAN PAINT	1389.6	1389.75
AXIS BANK L	676.65	664
BAJAJ AUTO	2729.65	2717.45
BAJAJ FINSE	6359	6464.85
BAJAJ FINAN	2535.9	2569.85
BHARTI AIRT	332.05	333.95
BPCL	355.2	347.25
CIPLA LTD	509.6	511.5
COAL INDIA	232.05	232.05
EICHER MOTO	20369.95	20735.7
GAIL (INDIA	332.4	325.5
GRASIM INDU	828.1	826.3
HCL TECHNOL	954.7	938.25
HDFC LTD	2004.55	1975
HDFC BANK L	2132.3	2120.2
HERO MOTOCO	2903.6	2879.85
HINDALCO I	206	208.4
HPCL	244.2	240.6
HUL	1751.5	1772.55
INDIABULLS	816.75	829.6
ICICI BANK	374.6	375.3
INDUSIND BA	1523	1526.7
BHARTI INFR	280.45	275.85
INFOSYS LIM	733.35	736.8
INDIAN OIL	137.65	135.8
ITC LTD	293.95	294.05
JSW STEEL L	289	286.45
KOTAK MAHIN	1219.95	1202.75
LARSEN & T	1346.05	1342.15
MAHINDRA &M	734.65	726.25
MARUTI SUZU	7336.25	7310.25
NTPC LTD	144.9	146.35
OIL AND NAT	145	146.35
POWER GRID	193.9	192
RIL	1134.45	1135.9
SBI	297.4	303.15
SUN PHARMAC	426.55	453.8
TATA MOTORS	184.9	185.45
TATA STEEL	473.15	474.55
TCS	1894.3	1870.15
TECH MAHIND	705.55	699.9
TITAN COMPA	961.55	961.2
ULTRATECH C	3846.45	3887
UPL LIMITED	769.05	766.1
VEDANTA LIM	197.45	196.3
WIPRO LTD	335.4	336.55
YES BANK	201.5	208.35
ZEE ENTERTA	440.9	452.1

నిఫ్టీ నెక్స్ట్ ఫిఫ్టీ

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ABB INDIA L	1286.7	1287.45
ADITYA BIRL	95.45	96.35
ACC LIMITED	1455.15	1473.95
AMBUJA CEME	215.25	216.85
ASHOK LEYLA	93.25	93.95
BANDHAN BAN	449.75	448.65
BANK OF BAR	119.2	121
BHARAT ELEC	87.2	88.9
BHEL	70.15	68.35
BIOCON LIMI	657.65	650.7
BOSCH LIMIT	19150.55	19089.4
BRITANNIA I	3207.1	3175.75
CADILA HEAL	355.85	352.55
COLGATE PAL	1326.6	1330.75
CONTAINER C	694.4	696.9
DABUR INDIA	420.3	423.85
DLF LIMITED	184.2	182.95
AVENUE SUPE	1368	1393.25
GENERAL INS	258	258.25
GODREJ CONS	793.3	774.95
HAVELLS IND	676.15	683.45
HDFC STAND	390.85	387.5
HINDUSTAN Z	271.75	272.6
ICICI LOMBA	875.9	860.3
ICICI PRU L	349.75	347.25
VODAFONE ID	36.95	36.4
INTERGLOBE	1112.9	1136.55
L&T FINANCE	141.3	141.85
LIC HOUSING	490.7	481.85
LUPIN LIMIT	868.75	863.2
MARICO LIMI	380.2	380.4
UNITED SPIR	594.95	595.2
MOTHERSON S	159.6	162.3
MRF LTD	65802.8	65991.2
NHPC LTD	25.55	25.85
THE NEW IND	182.5	183.55
NMDC LTD.	91.85	93.3
ORACLE FIN	3694.4	3682.75
OIL INDIA L	172.75	173.55
PIRAMAL ENT	2387.9	2372.15
PETRONET LN	221.95	220.5
P&G HYGIENE	9996.95	9896.85
PIDILITE IN	1151.55	1154
STEEL AUTHO	49.9	50.4
SBI LIFE IN	623.35	621.4
SHREE CEMEN	15914.7	15822.95
SIEMENS LTD	1064.8	1060.55
SHRIRAM TRA	1149.5	1188.2
SUN TV NETW	564.95	573.45

బీఎస్‌ఈలో ఏపీ,టీఎస్ స్టాక్స్

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
AditSpin	6.01	6.32
Alphageo	476.95	478.45
Alu Flouride	123.4	121.85
Amar Raja Bat	781.65	765.15
And Bank	28.8	29.1
And Cemen	5.73	5.8
And Paper	448.65	450.4
And Petro	68	67.15
Aries Agro Ltd	98.2	101.4
Aurobindo Ph	774.25	787.05
Avantel Soft	228.15	230.7
Avanti Feeds	378.65	383.15
AvonOrg	6.39	6.14
BN Rathi Sec	25.8	26
Bakelite	17.05	17.85
Balaji Amin	482.2	483.45
Bambino Agro	188.5	193
Baron Info	0.19	0.19
Bartronics	7.15	7.21
Bhagira Chem	436.45	442.4
Bhagya Nag	36.5	36.9
Bhagya Wood	18.1	17.25
Bhaskar Agro	32.45	30.95
Brilliant Sec	1.12	1.07
CIL Securi	15.8	15.75
Cont Coffee	267	264.25
CoroFert	454.35	453.85
Country Club	7.45	7.42
Cubex Tub	14.55	14.78
Cybermate	2.07	2.16
DR Reddy	2617.15	2621.85
Danlaw Tec	93	94.55
DecCement	401.95	395
Divi's Lab	1504.25	1520.75
Divya Granit	98.9	94.2
Dredgin Corp	437.4	446
Empee Sugars	1.49	1.43
Everest Org	116	116.25
Fortune Info	40.35	39.5
Four Soft	37	36.85
GMR Infra	16.3	16.6
GVK Power	7.49	7.57
Gati Corpn	80.8	81.45
Gayatri Proj	182	184.15
Gayatri Sugrs	2.88	2.9
Gennex Lab	3.63	3.63
GodavDru	23	22.55
Goldstn Tele	240	244.35
Goldstone Tech	15.75	15.7
Granules (I)	90.05	91.2
HBL Nife Pow	28.95	28.75
HYDIndus	1981.55	2043
Heritage Food	534	537.2
Hifco Marwel	67.2	68.55
HindFlurocarb	15.8	16.5
IDL Industrs	271.45	268.1
IQMS Soft	10.55	10.56
IVRCL Infras	1	0.99
IndoNationl	705.35	710
Infotech En	627.8	623.15
JSTL	38.75	37.45
KCP LTD	89.45	89.95
KNR Constructio	210.55	216.15
Kabsons Indu	6.7	6.5
KakatiCem	195.5	196.25
Kallam Spg	18	17.8
Kernex Micro	26.7	28.1
Krebs Bio	125.35	127.5
LGS Global	2.85	2.85
LancoIndus	188.1	189.1
Lokesh Mach	45.45	45.5
Lotus Choc	24.2	23.05
MIC Elec	0.92	0.96
Madhucon Proje	7.18	6.71
Maytas Infra	14.7	14.3
Medinova Dia	18.85	19.8
Mold-tek	48	46.4
Moldtek Plastic	262.9	260.9
Moschip Semi	24.5	25
NCCBlue Wat	5.76	5.49
NCLInd	128.5	129
NETTLINX	48	50.5
NMDC Ltd	91.8	93.35
NagarAgrich	27.85	27.5
NagarConst	89.55	88.55
Natco Pharma	692.65	679.9
Nava Bh Ventur	111	112.25
Neha Inter	4.18	4
Neocure Ther	2.47	2.4
Neuland Lab	506	502.1
Nihar Info Glo	13.5	14
Nile	365	366.85
Northgate Tech	0.73	0.76
Oil Country	15.25	15.4
Ortin Lab	15.3	15.35
Padmalaya Tele	2.38	2.3
Panyam Cemen	13.68	13.59
Peeti Securt	5.64	5.38
PennInd	37.65	37.9
Phytochem I	45	46.15
Pitti Lamin	66.05	64.85
Pokarna	188.8	182.95
Prajay Engs	8.85	8.35
PremiExpl	236.6	237.25
Prism Cement	84.45	85.4
Raasi Refrac	14.37	13.7
Rain Industries	122.5	123.45
Ram Informat	42.35	40.8
RavilFin	13	13
RavilGr	13.3	12.7
Reg.Ceramic	4.51	4.55
Restile Cer	4.05	3.98
Sagar Cem	641	655.2
Sai Wires(I)	1.11	1.14
Samkrg Pist	191.7	194.65
SangInd	57.9	60.75
Satvah. Ispat	9.2	9.3
Saven Techno	25.4	26.7
South Bio Tech	2.05	2.05
SrRayAlk	36.35	35.75
Srinivasa Ship	40	39.5
Sujana Metal	0.41	0.41
Sujana Towers	1.32	1.38
Suryachakra Pow	0.3	0.31
Suryalata Sp	127.5	133.6
Suven Pharma	218	219.55
TCI Finance	14.8	15
Taj Gvk Hotel	179.4	180.05
Tanla Solutions	30.25	30.25
Trans Biotek	5.17	4.93
Transport Co	291.6	294.5
Trendy Knit	0.24	0.23
V&K Soft	4.1	4.05
VBC Ferro	41.6	39.75
VST Indus	3200.7	3269.2
Vamshi Rubb	31.95	29.7
Viceroy Hotels	4.45	4.55
VijayTextil	42.5	41.2
Vimta Labs	284.9	291.1
Virat Crane	33	33.15
Virinchi Con	80	81.15
VisakaInd	426.15	429.75
Vista Pharma	28.8	28.7
Vivimed Labs	33.3	33.7
Vjil Consult	40.5	41.3
ZenoTech Lab	31.9	34.95

ఎల్‌సీహెచ్ సత్తా

బెంగళూరులోని హిందూస్థాన్ ఏరోనాటిక్స్ సంస్థ (హెచ్ఏఎల్) దేశీయంగా రూపొందించిన తేలికపాటి పోరాట హెలికాప్టర్ (ఎల్‌సీహెచ్) మరో మైలురాయిని అధిగమించింది. గాల్లో ఎగురుతున్న లక్ష్యాన్ని ఎయిర్ టు ఎయిర్ క్షిపణి ద్వారా ఎల్‌సీహెచ్ విజయవంతంగా ఛేదించినట్లు హెచ్ఏఎల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది.



ఎల్‌సీహెచ్ నుంచి దూసుకుపోతున్న క్షిపణి

నాదస్వర విద్వాన్ నాగూర్ కన్నుమూత

- 1965 నుంచి ఆకాశవాణిలో కచేరీల నిర్వహణ
- పలు బిరుదులు అందుకున్న విద్యాంసులు



నాగూర్ సాహెబ్ (ఫైల్)

అద్దంకి: నాదస్వర విద్వాన్ నాగూర్ సాహెబ్ (90) గురువారం అద్దంకిలోని తన స్వగృహంలో అనారోగ్యంతో కన్నుమూశారు. ప్రకాశం జిల్లా జె.పంగులూరు మండలం కశ్యాపురం గ్రామానికి చెందిన నాగూర్ సాహెబ్ తండ్రి ఖాశీం సాహెబ్ పేరు మోసిన నాదస్వర విద్వాంసులు. తల్లి హుస్సేన్‌భీ. 1930వ సంవత్సరంలో నాగూర్ సాహెబ్ జన్మించారు. ఆయన సోదరుడు దస్తగిరి సైతం నాదస్వర విద్వాంసులు. అద్దంకి ప్రాంతంలో ఇద్దరూ నాదస్వర ద్వయంగా పేరు గాంచారు. తొలి గురువు అయిన తండ్రి వద్దే సంగీతంలో ప్రాథమిక విద్యను నేర్చుకున్నారు. తరువాత మేనమామ నాగులుప్పలపాడు మండల గొనసపూడికి చెందిన మస్తాన్ సాహెబ్ దగ్గర ఉన్నత విద్యను నేర్చుకున్నారు. తమిళనాడులోని తంజావూరు గ్రామానికి చెందిన దొరై కణ్ణన్ వద్ద కర్ణాటక సంగీతం నేర్చుకున్నారు. ఆల్ ఇండియా రేడియో విజయవాడ కేంద్రంలో 1965 నుంచి 2000 సంవత్సరం వరకు నాదస్వర కచేరీలు చేశారు. అక్కడ బీ హైగ్రేడు, ఏ గ్రేడు కళాకారునిగా గుర్తింపు పొందారు. 2011లో తమిళనాడు ప్రభుత్వం నుంచి ప్రముఖ నాదస్వర విద్వాంసుడు పద్మశ్రీ షేక్ చినమౌలానా స్మారక అవార్డును, నాదస్వర విద్వాన్, నాద కోవిద బిరుదులను అందుకున్నారు. ఈయన శిష్యుడు ప్రముఖ నాదస్వర విద్వాంసుడు చినమౌలానా మనవడు బాబుల్ మధురైలో గొప్ప విద్వాంసుడుగా పేరు పొందారు. తూర్పుగోదావరి జిల్లా అమలాపురంలో సంగీత దర్శకుడు కె.విశ్వనాథ్‌చే నాదస్వర మణిరత్న బిరుదును పొందారు. సుమారు 5వేల మందికిపైగా ఔత్సాహిక కళాకారులకు హార్మోనియం, నాదస్వరం, ఫ్లూట్, క్లారినెట్ వంటి ఎన్నో వాయిద్యాలను నేర్పారు. నాగూర్‌సాహెబ్‌కు ఇద్దరు అబ్బాయిలు, ఇద్దరు అమ్మాయిలు. ఒక కుమారుడు ఎస్‌కే షాజహాన్ గూడూరులో ఎక్సైజ్ ఇన్‌చార్జ్ సీఐగా పనిచేస్తున్నారు. మరో కుమారుడు తండ్రి వారసత్వాన్ని స్వీకరించి నాదస్వర కళాకారుడయ్యాడు. రెండున్నరేళ్లుగా అనారోగ్య కారణంగా వాయిద్యానికి దూరంగా ఉంటూ గురువారం తన స్వగృహంలో తదిశ్వాస విడిచారు. గాత్ర వాయిద్య కళాకారుల సంఘ నాయకుడు శేషగిరిరావు, కోలాటం కళాకారుడు జాన్ సాహెబ్, రంగస్థల కళాకారుడు అద్దంకి నాగేశ్వరరావు, కోటేశ్వరమ్మతోపాటు మరి కొందరు కళాకారులు, నూర్ భాషా సంఘ నాయకులు ఆయన మృతికి సంతాపం తెలిపారు.



అలంగానల్లూరులో జల్లికట్టు హోరు

సాక్షి, చెన్నై: ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తమిళ సాహస క్రీడ జల్లికట్టు గురువారం మదురై జిల్లా అలంగానల్లూరులో హోరెత్తింది. 848 ఆంబోతులు రంగంలోకి దిగగా, వీటిని పట్టుకునేందుకు బృందాలుగా 1,400 మంది దిగారు. తేని, దిండుగల్, మదురై, శివగంగై, విరుదు నగర్, తిరుచ్చి, రామనాథపురం, తూత్తుకుడి, తంజావూరు జిల్లాల నుంచి పేర్గడించిన రైతులు, ప్రజా ప్రతినిధులకు చెందిన ఆంబోతులు కదనరంగంలో వాడివాసల్ నుంచి దూసుకొచ్చాయి. అక్కడి మునియాండి స్వామి, ముత్తాలమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజల అనంతరం జల్లికట్టును ప్రారంభించారు. విజేతలకు పలువురు అన్నాడీఎంకే ఎంపీల సమక్షంలో బంగారు, వెండి వస్తువులు, మోటారు సైకిళ్లు కానుకగా ప్రకటించారు. సీఎం పళనిస్వామి, డిప్యూటీ సీఎం పన్నీరు సెల్వం నేతృత్వంలో ఓవరాల్ చాంపియన్‌కు కారును బహుమతిగా ఇచ్చారు. అయితే జల్లికట్టులో దాదాపు 30 మంది గాయపడ్డారు. సందర్శకుల గ్యాలరీలో కుర్చుని వీక్షిస్తున్న అలంగానల్లూరుకు చెందిన షడయాండి గుండెపోటుతో మరణించాడు.

ఎక్సైజ్ అధికారులపై పెరుగుతున్న దాడులు

- బెల్టు షాపుల జోలికి రావద్దంటూ బెదిరింపులు
- రెండురోజుల క్రితం మచిలీపట్నం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో సీఐపై దాడి
- మద్యం మాఫియాకు అధికార పార్టీ నేతల అండ



సాక్షి, అమరావతి: ఎక్సైజ్ అధికారులపై మద్యం మాఫియా దాడులు పెరుగుతున్నాయి. బెల్టు షాపుల జోలికొస్తే అంతు చూస్తామని బెదిరింపులకు దిగుతున్నారు.రెండు రోజుల క్రితం కూడా కృష్ణా జిల్లా మచిలీపట్నం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఎక్సైజ్ సీఐపై మద్యం బెల్టు దుకాణం నిర్వాహకులు దాడి చేశారు. సీఐకి చెందిన బైక్‌ను ధ్వంసం చేశారు. బెల్టు షాపులను అడ్డుకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. రాష్ట్రంలో మద్యం బెల్టు దుకాణాలు లేనేలేవని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోంది. కానీ, మద్యం దుకాణాలకు అనుబంధంగా బెల్టు దుకాణాలను పగలూ, రాత్రీ అనే తేడా లేకుండా నడుపుతున్నారు. బెల్టు షాపులు, ఎమ్మార్పీ ఉల్లంఘనలకు అధికార పార్టీ నేతలు అండగా నిలుస్తున్నారు. దీంతో మద్యం మాఫియా మరింత రెచ్చిపోతోంది. ఏకంగా ఎక్సైజ్ అధికారులపైనే దాడులకు తెగబడుతుండడం గమనార్హం. మచిలీపట్నంలో బెల్టు షాపు నిర్వాహకులు అబ్కారీ అధికారులపై దాడులకు దిగడం ఎక్సైజ్ వర్గాలనే నివ్వెరపరుస్తోంది. గతేడాది చిత్తూరు జిల్లాలో నాటుసారా తయారీ స్థావరాలను ధ్వంసం చేసేందుకు వెళ్లిన ఎక్సైజ్ అధికారులపైనా దాడులు జరిగాయి. అంతకుముందు గంజాయి అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రయత్నించిన ఎక్సైజ్ అధికారులను గంజాయి ముఠాలు కార్లతో గుద్దించగా, ఓ కానిస్టేబుల్ మరణించిన సంగతి తెలిసిందే.

పెరిగిన బెల్టు షాపుల జోరు

రాష్ట్రంలో నెల రోజులుగా బెల్టు దుకాణాల జోరు పెరిగింది. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంతో మద్యం మాఫియా రెచ్చిపోతోంది. సార్వత్రిక ఎన్నికలకు గడువు సమీపిస్తున్న నేపథ్యంలో మద్యం వ్యాపారుల జోలికి వెళ్లవద్దని ఉన్నత స్థాయి నుంచి ఆదేశాలు అందడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టించుకోవడం మానేశారు. గతేడాది మే వరకు బెల్టుషాపులపై నమోదు చేసిన కేసుల వివరాలను సీఎం కోర్ డ్యాష్‌బోర్డులో పొందుపరిచారే తప్ప గత ఆరునెలలుగా ఎన్ని కేసులు నమోదు చేశారు.. ఎన్ని షాపులను రద్దు చేశారో ఆ వివరాలను పొందుపరచకపోవడం గమనార్హం. గుంటూరు, తూర్పుగోదావరి, ప్రకాశం, నెల్లూరు, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో బెల్టు షాపులపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాల్‌సెంటర్‌లో బెల్టు దుకాణాలపై ఫిర్యాదులను స్వీకరించడం లేదు.

భార్య, బిడ్డలకు నిప్పంటించి హత్య

- తల్లిదండ్రులతో కలసి ఓ కిరాతకుడు దుశ్చర్య
- అక్కడికక్కడే ముగ్గురూ మృతి
- కర్నూలు జిల్లాలో దారుణం

బనగానపల్లె: గర్భవతి అయిన భార్యను, బిడ్డలను తల్లి దండ్రులతో కలసి కిరాతకంగా చంపేశాడో దుర్మార్గుడు. కర్నూలు జిల్లా బనగానపల్లె మండలం పండ్లాపురం గ్రామంలో గురువారం తెల్లవారుజామున ఈ ఘటన చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బేతంచెర్ల పట్టణం సంజీవనగర్ కాలనీకి చెందిన కొట్టాల బాలసుబ్బమ్మ, గోవిందరాజుల చిన్న కుమార్తె వెంకటలక్ష్మమ్మ (35)ను 15 ఏళ్ల క్రితం బనగానపల్లె మండలం పండ్లాపురానికి చెందిన పుట్టా లక్ష్మమ్మ, లక్ష్మన్నల కుమారుడు శివరామయ్యకు ఇచ్చి వివాహం చేశారు. కట్నకానుకల కింద నాలుగు తులాల బంగారం, 40 వేల నగదు ఇచ్చారు. వీరికి కుమారుడు పవన్‌కుమార్ (12), కుమార్తె పావని (9) ఉన్నారు.

వేధించి చంపారు!

పెళ్లయిన కొంత కాలానికే వెంకటలక్ష్మమ్మను ఏదో ఒక కారణాన్ని ఎత్తిచూపి భర్త, అత్త, మామ వేధించడం మొదలుపెట్టారు. ప్రస్తుతం వెంకటలక్ష్మమ్మ 4 నెలల గర్భిణి కాగా, గర్భం తీయించుకోవాలంటూ భర్త తరచూ వేధించేవాడు. ఆమె అంగీకరించకపోవడంతో ఆమెను ఎలాగైనా వదిలించుకోవాలని పథకం పన్నారు. గురువారం తెల్లవారుజామున అందరూ నిద్రలో ఉండగా.. వెంకటలక్ష్మమ్మ, కుమారుడు పవన్‌కుమార్, కుమార్తె పావనిపై భర్త శివరామయ్య, అత్తమామలు లక్ష్మమ్మ, లక్ష్మన్న డీజిల్ పోసి నిప్పంటించారు. వారి శరీరాలు పూర్తిగా కాలిపోవడంతో అక్కడికక్కడే చనిపోయారు. వెంకటలక్ష్మమ్మ తండ్రి గోవిందరాజులు, సోదరుడు వెంకటాద్రి ఫిర్యాదు మేరకు నందివర్గం ఎస్ఐ కేసు నమోదు చేశారు. సంఘటనా స్థలాన్ని నంద్యాల డీఎస్పీ గోపాలకృష్ణ, పాణ్యం ఇన్‌చార్జ్ సీఐ రవికృష్ణారెడ్డి పరిశీలించారు.

చితి నుంచి.. పోస్టుమార్టంకు

ముజఫర్‌నగర్: చితిపై దహనమవుతున్న మృతదేహాన్ని పోలీసులు పోస్ట్‌మార్టంకు తరలించిన ఘటన ఉత్తరప్రదేశ్‌లో చోటుచేసుకుంది. ముజఫర్‌నగర్ జిల్లాలోని గోథానా గ్రామానికి చెందిన 50 ఏళ్ల మహిళ మరణించడంతో కుటుంబ సభ్యులు దహన సంస్కారాలకు ఏర్పాట్లు చేశారు. అయితే మహిళను అత్తింటివారే చంపారని ఆమె సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు చితిపై కాలుతున్న మృతదేహాన్ని తీసి పోస్ట్‌మార్టంకు పంపించారు. మహిళ భర్త విజయ్‌పాల్‌తో పాటు మరో నలుగురుపై కేసు నమోదు చేశామని, నిందితులు అందరూ పరారీలో ఉన్నారని పోలీసు అధికారి అమర్దీప్ లాల్ తెలిపారు.

ప్రత్తికోళ్లలంకలో ఉద్రిక్తత

- ఓ వర్గం వారిపై ప్రత్యర్థుల దాడులు
- పలువురికి గాయాలు, ఇళ్లలో ఫర్నీచర్ ధ్వంసం
- చింతమనేని హస్తం ఉందని బాధితుల ఆరోపణ



ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరిన బాధితులు

ఏలూరు రూరల్: పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు మండలం కొల్లేరు గ్రామం ప్రత్తికోళ్లలంకలో మరోసారి ఘర్షణలు చెలరేగాయి. గురువారం ఉదయం ఓ వర్గం ప్రజలు మరోవర్గంపై దాడులకు తెగబడ్డారు. కర్రలు చేతబట్టి ఇళ్లలోకి చొరబడి దొరికిన వారిని దొరికినట్టు బాదారు. విలువైన ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. దీంతో బాధిత వర్గం వారు గ్రామం విడిచి పారిపోయారు. గాయాలతో పలువురు ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరగా, మరికొందరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అండతో టీడీపీ వర్గీయులు ఘర్షణలు సృష్టించారని ఆసుపత్రిలో చేరిన బాధితులు బలే చంద్రబాబు, వై.తిరుమలరావు తదితరులు ఆరోపిస్తున్నారు. గురువారం ఉదయం 10 గంటలకు వందలాది మంది గ్రామ సెంటర్‌కు చేరుకుని పథకం ప్రకారం ప్రత్యర్థి వర్గం ఇళ్లపై దాడులు చేశారని మహిళలు చెప్పారు. పోలీసులు గ్రామానికి చేరుకోవడంతో ప్రస్తుతం ప్రశాంతంగా ఉన్నా ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న భయం ప్రజలను వెంటాడుతోంది.

ఘర్షణకు మూలం

గ్రామ మాజీ సర్పంచ్ ఒకరు గతంలో గ్రామ పంచాయతీ నిధులు పెద్ద మొత్తంలో దుర్వినియోగం చేశాడని నాలుగేళ్ల క్రితం స్థానికులు ఆరోపించారు. ఈ విషయమై గ్రామంలో ఘర్షణలు చెలరేగి మాజీ సర్పంచి కుటుంబీకుల ఇళ్లపై దాడులు కూడా జరిగాయి. అనంతరం గ్రామంలోని 15 బంటాల (ఒక్కొక్క బంటాలో 80 నుంచి 100 మంది ఉంటారు) ప్రజలు కలిసి గ్రామంలో చేపల చెరువులను సాగు చేపట్టారు. 4 నెలల క్రితం బంటాల పెద్దల మధ్య చిచ్చురేగి రెండు వర్గాలుగా విడిపోయారు. అప్పటి ఏలూరు డీఎస్పీ ఈశ్వరరావుకు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. ఆయన సూచనల మేరకు ఇరువర్గాలు ఒక అంగీకారానికి వచ్చాయి. దీనిలో భాగంగా పెద్దల వద్ద ఉన్న రూ.15 కోట్లలో మాజీ సర్పంచికి కొంత నష్టపరిహారం చెల్లించాలని, అప్పులు, ఖర్చులు తీర్చిన తర్వాత ఈ నెల 18వ తేదీన చెరువుల పంపకాలు చేపట్టాలని నిర్ణయించారు. ఒప్పందాలు కొన్ని అమలు జరగగా, శుక్రవారం చెరువుల పంపకాలు జరగాల్సి ఉంది. దీనికి సరిగ్గా ఒక్కరోజు ముందే ఘర్షణలు చెలరేగడం విశేషం.

దాడుల వెనక చింతమనేని హస్తం

దాడుల వెనుక స్థానిక ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ హస్తం ఉందని బాధితులు చంద్రబాబు, తిరుమలరావు, శ్రీనివాస్ ఆరోపిస్తున్నారు. గ్రామంలో 7 బంటాలకు చెందిన (సుమారు 700 మంది ప్రజలకు) పెద్దలు చింతమనేనిని ధిక్కరించి కొద్దిరోజుల క్రితం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ కొఠారు అబ్బయ్య చౌదరిని కలసి అండగా ఉండాలని కోరారు. దీనికి తోడు ఈ నెల 14న గ్రామకూడలిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఈ రెండు సంఘటనలు జీర్ణించుకోలేని ఎమ్మెల్యే చింతమనేని స్థానిక నేత మహాలక్ష్మీరాజును ఉసిగొల్పి దాడులు చేయించారని అంటున్నారు.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP), and D. No. 5- 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503. Editor: V. Murali, Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23794.

సాక్షి
ఫ్యామిలీ
విజయవాడ ॥ శుక్రవారం
18-1-2019

అవును చిత్రమే!
ఉగ్రవాదంపై ఒక పదహారేళ్ల అమ్మాయి
ఉగ్రురాలవడం చిత్రమే!
బందూకు చూపినా
మారాకు వణకకపోతే అది చిత్రమే!
'నీ ఆలోచన కరెక్టు కాదు' అని
మెదడులోకి బుల్లెట్ దింపినా..
ఆలోచన ఆగకపోతే అది చిత్రమే!
ఆ అమ్మాయి బయోపిక్‌ని
ఐరాస సెలబ్రేట్ చెయ్యడం చిత్రమే.

ఐక్యరాజ్య సినిమా
గుల్ మకాయ్


జనవరి 25న లండన్‌లో స్క్రీనింగ్ కాబోతున్న గుల్‌మకాయ్‌ని చూసేందుకు ప్రపంచ దేశాల నుంచి 450 మంది అధికారులు వస్తున్నారు

గుర్తు కోసం చెప్పడమిది.

ఇవాళ శుక్రవారం కదా. వచ్చే శుక్రవారం.. జనవరి 25న లండన్‌లో 450 మంది అత్యున్నతస్థాయి అధికార ప్రతినిధులు కలుస్తున్నారు. ఐక్యరాజ్య సమితి నుంచి కొందరు, దేశాలన్నిటినీ కలుపుకుపోయే 'ఈమ్‌శామ్' అనే ఒక సంస్థ ఉంది.. ఆ సంస్థ నుంచి కొందరు, ఇంకా.. ఇండో–పాక్ దౌత్యవేత్తలు, బ్రిటన్ హై కమిషన్ నుంచి కొందరు వస్తున్నారు. వీళ్లతో పాటు మరో ముగ్గురు ముఖ్యులు.. లండన్‌లో ఫ్లయిట్ దిగుతారు. ఏదో పెద్ద విషయమే అయి ఉంటుంది. ఇండియా, పాకిస్తాన్, బ్రిటన్, ఐక్యరాజ్య సమితి ఒకచోట కలుస్తున్నాయంటే.. కచ్చితంగా అది చిన్న సంగతైతే కాదు. అత్యవసర పరిస్థితులలో మాత్రమే ఇలా జరుగుతుంది.

• • •

తాలిబాన్! అఫ్గానిస్తాన్‌లో యుద్ధం (జిహాద్) చేస్తున్న ఉగ్రవాద సంస్థ. ఇప్పుడు నిద్రాణంలో ఉంది. నిద్రాణంలో ఉందంటే నిద్రపోతోందని కాదు. ఏ క్షణమైనా నిద్రలేవొచ్చని. 'దాని ముఖం. లేచి ఏం చేస్తుంది?' అని లోకల్ కుర్రాళ్లకు ధైర్యం చెప్పి, తుపాకుల్ని భుజానికెత్తుకుని అమెరికా సైన్యం ఈమధ్యే అఫ్గానిస్తాన్ నుంచి వెళ్లిపోయింది. ఇప్పుడు కొంచెం ప్రశాంతంగా ఉందక్కడ. అక్కడే కాదు. పాకిస్తాన్‌లో, భారత్‌లో కూడా! అఫ్గాన్ బార్డర్‌లో ఇప్పుడు రోజూ ఉదయాన్నే పక్షులు స్వేచ్ఛగా సూర్య స్నానాలు చేసి, మధ్యాహ్నమంతా దొరికిందేదో తిని, సాయంకాల విన్యాసాలు చేస్తున్నాయి. నేలపై మసి బొగ్గుల్లేవు. నింగిలో అగ్ర విమానాల గగ్గోలు లేదు.

రెండేళ్ల క్రితం వరకు ఈ మూడు దేశాల్లో (పాక్, ఇండియా, అఫ్గానిస్తాన్) ఇంత ప్రశాంతత లేదు. ఆరేళ్ల క్రితమైతే.. ప్రశాంతత అనే మాటకు అర్థమే లేదు. పాకిస్తాన్ అందర్నీ ఒణికిస్తుంది కదా, పాకిస్తానే వణికిపోతున్న టైమ్ అది.. తాలిబాన్‌ల దెబ్బకి! మొహమ్మద్ ఒమర్ వర్తమానం అందిందంటే.. 'పోస్ట్' అంటూ ఆత్మాహుతి బాంబు డోర్ దగ్గర డెలివరీ అయినట్లే. తీసుకుని ఎక్కడ పడేయాలి దాన్ని. ఎంత పాక్ అయితే మాత్రం ఎన్నాళ్లని ఆ బాంబుని నెత్తిమీదే పెట్టుకుని తనని తను కాపాడుకుంటుంది. ఇక ముల్లా అఖ్తర్ మన్సూర్ పాక్‌లోకి దిగాడంటే.. అధ్యక్ష భవనంలో ఆ పూట కార్యక్రమాలు క్రమం తప్పాల్సిందే. ఫస్ట్ ప్రయారిటీ ముల్లా. తర్వాతే ఆహార పానీయాలు. ఇండియాక్కూడా తిండీ నీళ్లు దక్కని రోజులున్నాయి. కనీసం టాయ్‌లెట్‌కి వెళ్లనివ్వలేదు తాలిబాన్‌లు. ఇండియన్ ఫ్లయిట్‌ను హైజాక్ చేసి (1999), వారం రోజులు ఎటూ కదలనివ్వలేదు.

ఇప్పుడు ఒమర్, మన్సూర్ ఇద్దరూ లేరు. ఒమర్‌ని టీబీ తీసుకుపోయిందని పాక్ పత్రిక 'ది ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్' రాసింది. రెండేళ్ల వరకు ఒమర్ చనిపోయిన సంగతే ప్రపంచానికి తెలియకుండా షో నడిపింది తాలిబాన్! మన్సూర్‌ను అమెరికన్ సైనికులు ఎయిర్ స్ట్రైక్‌లో చంపేశారు. తాలిబాన్‌కు ఇప్పుడు ఇద్దరే నాయకులు మిగిలారు. వాళ్లు 'మిగిలిన నాయకులు' మాత్రమే. నాయకులు కాదు.

ఒమన్, మన్సూర్.. చనిపోయేవరకూ ఎవర్నీ బతకనివ్వలేదు. పాక్‌ని చెప్పు చేతల్లో ఉంచుకున్నారు. పాక్ చేత పనులన్నీ చెప్పి చేయించుకున్నారు. గవర్నమెంట్ పాకిస్తాన్‌దే. పాకిస్తాన్ ఏ డ్రెస్ వేసుకోవాలన్నది, ఇండియాతో పాక్ ఎంతసేపు మాట్లాడాలన్నది డిసైడ్ చేసేది మాత్రం ఒమర్, మన్సూర్. ఇద్దరూ అంత పవర్‌ఫుల్. ఆ పవర్‌తో వాళ్లు సరిపెట్టుకుని ఉంటే బాగుండేది. అమ్మాయిల జోలికి వచ్చారు! జోలికి రావడం అంటే అసభ్యంగా ఏమీ బిహేవ్ చెయ్యలేదు. 'స్కూల్లేదు ఏం లేదు. ఇంట్లో ఉండండి' అని ఆజ్ఞ జారీ చేశారు. 'ఆడపిల్లలు స్కూల్‌బ్యాగుతో రోడ్డు మీద కనిపిస్తే కాల్చిపారేస్తాం'' అని శాంపిల్‌గా రెండు రౌండ్‌లు గాల్లోకి కాల్పులు కూడా జరిపారు. అదే వారి చావుకొచ్చింది. ఎక్కడో జరిపిన ఆ కాల్పుల చప్పుడు పాకిస్తాన్‌లోని 'స్వాత్' లోయలో ప్రతిధ్వనించింది. ఆ లోయలోని ఒక ఇంట్లో శ్రద్ధగా పరీక్షకు ప్రిపేర్ అవుతున్న ఓ పదిహేనేళ్ల బాలికను ఆ కాల్పులు డిస్టర్బ్ చేశాయి.

''ఏంటి నాన్నా ఇది?'' అంది.

''వాళ్లంతే'' అన్నాడు తండ్రి.

''స్కూల్‌కి వెళితే చంపేయడం ఏంటి నాన్నా'' అంది.

''వాళ్లంతేనమ్మా'' అన్నాడు తండ్రి.

త్వరగా తెల్లారితే బాగుండనుకుంది ఆ బాలిక.. స్కూలుకు వెళ్లడం కోసం! తెల్లారింది. తయారై స్కూలుకు బయల్దేరింది. స్కూలుకు వెళ్లి, పరీక్ష రాసి, బస్‌లో వస్తుంటే.. తాలిఫాన్‌లు ఆ అమ్మాయి మీద, ఇంకో అమ్మాయి మీద కాల్పులు జరిపారు. రెండో అమ్మాయి తప్పించుకుంది. ఈ అమ్మాయికి తలలో బులెట్ దిగింది. కోమాలోకి వెళ్లిపోయింది. తాలిబాన్‌లు ఆ బాలిక తలలోకి బులెట్ దిగబడిందనే అనుకున్నారు కానీ, ఆ బాలికే బుల్లెట్‌లా మారి, తమ ఆధిపత్యపు కణతల్లో దిగబడుతుందని ఊహించలేదు.

వారం తర్వాత ఆ బాలిక కోమాలోంచి బయటికి వచ్చింది. మూడు నెలల తర్వాత ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయింది. తిరిగి స్కూల్‌కి బయల్దేరింది!

తాలిబాన్‌లకు తొలి చావు అది. చావంటే ప్రాణం పోవడం మాత్రమే కాదు. ఆజ్ఞ ధిక్కారం జరగడం కూడా. ఆ బాలిక తాలిబాన్‌లను 'గుల్ మకాయ్' అనే పేరుతో స్మూత్‌గా ఒక్కో పోటూ పొడవడం మొదలు పెట్టింది. బీబీసీలో గుల్ మకాయ్. బ్లాగుల్లో గుల్ మకాయ్.

''గుల్ మకాయ్ ఎవరు?'' .. తాలిబాన్ ఆరా తీసింది.

''భాయ్.. అది పెన్ నేమ్'' అన్నారు అనుచరులు.

''అసలు పేరేంటి?''

''మలాలా. మలాలా యూసాఫ్జాయ్''.

• • •

గుర్తు చేయడం కోసం చెప్పడమిది.

వచ్చే శుక్రవారం ప్రపంచంలోని వివిధ దేశాల నుంచి నాలుగు వందల యాభై మంది లండన్‌లో కలుస్తున్నారు. వాళ్లు వస్తున్నది సదస్సుకోసం, సమావేశం కోసం కాదు. సినిమా చూడ్డం కోసం.

ఆ సినిమా పేరు.. 'గుల్ మకాయ్'. మలాలా బయోపిక్! దర్శకుడు అమ్జాద్ ఖాన్. నిర్మాతలు సంజ్‌సింఘ్లా, ప్రీతీ వియల్ లాలూ. స్క్రీన్ ప్లే భస్వాతి చక్రవర్తి. వీళ్లందరికన్నా పెద్ద పేరు రీమ్ షేక్. మలాలా పాత్రలో నటిస్తున్నది ఈ అమ్మాయే. చిన్న పిల్లపై బయోపిక్ ఏంటి? చిన్న పిల్ల పాత్రను పోషిస్తున్న మరో చిన్న పిల్ల రీమ్ షేక్ పేరు పెద్ద పేరు ఎలా అవుతుంది? మలాలా ఎఫెక్ట్ ఇది. చిన్న వయసులోనే కదా తను అంత పెద్ద తాలిబాన్‌లకు ఎదురు తిరిగింది. చిన్న వయసులోనే కదా అంత పెద్ద నోబెల్ బహుమతి పొందింది. చిన్న వయసులోనే కదా మూడు ఇన్‌స్పైరింగ్ బుక్స్ (ఐయామ్ మలాలా, మలాలాస్ మ్యాజిక్ పెన్సిల్, ఉయ్ ఆర్ డిస్‌ప్లేస్డ్) రాసింది.

'గుల్ మకాయ్'లో మలాలా తండ్రి జియావుద్దీన్‌గా అతుల్ కులకర్ణి, మలాలా తల్లిగా దివ్యాదత్త నటిస్తున్నారు. గత ఏడాది జనవరిలో చనిపోయిన విలక్షణ నటుడు ఓమ్ పురి ఈ చిత్రంలో జనరల్ కయానీగా నటించారు. ఇవన్నీ సాధారణ విషయాలు. అసాధారణం ఏంటంటే.. ఐక్యరాజ్య సమితి తొలిసారిగా ఒక సినిమాకు నిర్వహిస్తున్న స్క్రీనింగ్ ఈవెంట్ ఇది! 'ఈమ్‌శామ్'తో (పౌష్టికాహార నివారణకు కృషి చేస్తున్న ఖండాంతర ప్రభుత్వాల సంస్థ) కలిసి, ఐరాస మళ్లీ ఫిబ్రవరి మధ్యలో న్యూయార్క్‌లోని తన ప్రధాన కార్యాలయంలో 'గుల్ మకాయ్'ని ప్రదర్శించబోతోంది. మరి మన దేశంలో ఎప్పుడు విడుదల అవుతుంది? ఏప్రిల్లో. ఎగ్జామ్స్ తర్వాత.

అన్నట్లు లండన్‌లో పెద్దపెద్ద వాళ్లతో కలిసి 'గుల్ మకాయ్' సినిమాను చూడబోతున్న ఆ ముగ్గురూ ఎవరు? మలాలా ప్లస్ ఆమె తల్లిదండ్రులు.


మలాలా


రీమ్ షేక్

రీల్ మలాలా.. రీమ్ షేక్

బయోపిక్‌లు తీసేవాళ్ల అదృష్టం ఏంటంటే.. రియల్ లైఫ్ పాత్రలకు తగిన పోలికలున్న రీల్ లైఫ్ నటులు దొరకడం. 'గుల్ మకాయ్'లో మలాలా పాత్రకు అచ్చుగుద్దినట్లుగా కాకపోయినా, ఇంచుమించు ఆ అమ్మాయిలానే ఉన్న రీమ్ షేక్ అనే అమ్మాయి దొరికింది. మలాలా జీవితం 16వ యేట మొదలైంది కాబట్టి ఈ పదహారేళ్ల అమ్మాయిని ఎంపిక చేసుకున్నారు. ప్రస్తుతం తను జీటీవీలో వస్తున్న 'తుఝ్‌సే హై రాబ్తా'లో కల్యాణి దేశ్‌ముఖ్ అనే పాత్రలో నటిస్తోంది. రీమ్ పుట్టింది ముంబైలో. ఆరవ యేటలోనే నటనలోకి వచ్చింది. టీవీ సీరియళ్లలో ఇప్పటికే ఆమెది ఎనిమిదేళ్ల కెరీర్! 13 సీరియళ్లలో నటించింది. 2016లో బెజోయ్ నంబియార్ 'వజీర్' సినిమాలో చిన్న క్యారెక్టర్ వేసింది. రెండు అవార్డులు వచ్చాయి. ఒక అవార్డుకు నామినేట్ అయింది. రియల్ లైఫ్‌లో మలాలా పోషిస్తున్న పెద్ద పాత్ర లానే, రీల్ లైఫ్‌లో రీమా తన వంతు పాత్రలో గుర్తింపు తెచ్చుకుంటోంది.

యువనేత్రి

ఊహించని వరం ఊరికి నేతృత్వం!

- అనుకోకుండా సర్పంచ్ పదవి • అదీ ఏకగ్రీవం
- పల్లె పదవికి ఎన్నికైన విద్యార్థిని
- ఎన్నికల వ్యయం సున్నా, సర్కారు భారీ నజరానా

కాకా రుద్రజారాణి సాధారణ విద్యార్థిని. ఎలాంటి రాజకీయ వాసనలు, వారసత్వాలు లేని కుటుంబం. తండ్రి (ఇప్పుడు లేరు), తల్లి, అన్న.. గౌరారంలో ఇదీ ఆమె కుటుంబం. ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం గౌరారం గ్రామ పంచాయతీ ఇటీవలే ఎస్టీ స్థానంగా రిజర్వ్ అయింది. ఈ గ్రామ పంచాయతీ పరిధిలో వీళ్లదొక్కటే గిరిజన కుటుంబం. తల్లి అంగన్‌వాడీ కార్యకర్త కావడంతో ఎస్టీ మహిళ కోటాలో గౌరారం సర్పంచ్ అయ్యే అవకాశం రాణికే వచ్చింది. రుద్రజారాణి పెనుబల్లిలో డిగ్రీ పూర్తి చేసి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో బీఈడీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. డిగ్రీ పూర్తయ్యాక పిల్లలకు పాఠాలు బోధించాల్సిన రుద్రజారాణికి డిగ్రీ కాకుండానే గ్రామాన్ని ఏలి, అభివృద్ధి చేసుకునే అదృష్టం ఇలా అనుకోకుండా వరించింది. గ్రామ పంచాయతీలో ఒకే గిరిజన (కోయ తెగకు) కుటుంబం ఉండటంతో పోటీ అనేది లేకుండా పోయింది. ఏకగ్రీవం కావడం ద్వారా తెలంగాణ ప్రభుత్వం నుండి ఈ గ్రామానికి పది లక్షల నజరానా దక్కనుంది. గ్రామస్థాయిలో అత్యున్నత పదవి అయిన సర్పంచ్ పీఠం ఆమెకు అనుకోని బహుమతిలా లభించినందుకు తల్లి కాకా సుజాత, సోదరుడు రాణా ప్రతాప్ సంతోషపడుతుండగా, గ్రామస్తులు కూడా ఆమె అదృష్టాన్ని చూసి హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.


రుద్రజారాణి

విడిపోవడం వరమైంది

గతంలో గౌరారం గ్రామ పంచాయతీలో పార్థసారథి పురం, ఉప్పల చెలక గ్రామాలు ఉండేది. అయితే ఇటీవల గ్రామ పంచాయతీల పెంపులో భాగంగా ప్రభుత్వం రెండింటిని విడదీసి రెండు గ్రామ పంచాయతీలుగా చేసింది. గతంలో గిరిజన కుటుంబాల వారే ఈ పంచాయతీని ఏలేవారు. ప్రస్తుతం గౌరారం విడిపోయి 997 ఓటర్లు ఉన్న గ్రామ పంచాయతీగా అవతరించింది. నేషనల్ హైవేకు ఆనుకొని ఉన్న ఈ పంచాయతీ పరిధిలో ఉప్పల చలక, వావిలపాడు గ్రామాలున్నాయి. ఇక్కడ 270 కుటుంబాలు ఉన్నాయి. ఇక్కడ కాకా సుజాతకు చెందిన గిరిజన కుటుంబమే ఉంది. ఫలితంగా ఆ కుటుంబానికి చెందిన రుద్రజారాణికే సర్పంచ్ పదవి దక్కింది.


సోదరుడు, తల్లితో రుద్రజా రాణి

నాన్న కోరిక నేను నెరవేరుస్తా

అమ్మను సర్పంచ్ చేయాలని నాన్న ఎప్పుడూ అనేవారు. కానీ అప్పట్లో నాన్న కోరిక నెరవేరలేదు. నేను నాన్న కల నిజం చేస్తున్నాను. బీఈడీ అభ్యసిస్తూనే నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటా. గ్రామ అభివృద్ధికి పాటు బడతా. నాకు రాజకీయాలు తెలియవు. అయినా ఏ సమస్యలు ఉన్నా పరిష్కారానికి నావంతు కృషి చేస్తా.

– రుద్రజారాణి

ఫలించిన తండ్రి కల

రుద్రజారాణి తండ్రి కాకా వెంకటేశ్వర్లు పెనుబల్లి మండలం లింగగూడెం వీఆర్వోగా పనిచేసేవారు. అనారోగ్యం కారణంగా గత ఏడాది మృతి చెందారు. దీంతో ఆ ఉద్యోగం కుమారుడు రాణాప్రతాప్‌కు వచ్చింది. అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తున్న తన భార్యను ఎలాగైనా గ్రామ పంచాయతీ సర్పంచ్ చేయాలని భర్త వెంకటేశ్వర్లు బతికున్న రోజుల్లో ఎన్నో కలలు కన్నాడు. ఆ కల ఇప్పుడు తన కూతురి రూపంలో నిజమైంది. ఎలాంటి పోటీ లేకుండానే సర్పంచ్ పీఠం కూతురికి దక్కింది.

– ఎం.ఏ.సమీర్, సాక్షి

బ్యూటిప్స్

ఫెయిర్ ప్యాక్స్

అరటిపండు గుజ్జు లేదా బొప్పాయి గుజ్జులో ముల్తానీమిట్టి వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించాలి. ఆరిన తరవాత చల్లని నీటితో కడిగితే చర్మం మృదువుగా తయారవుతుంది.


పెరుగులో ఆరెంజ్ జ్యూస్ లేదా తేనె కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి ప్యాక్‌లా వేసుకుని ఆరిన తర్వాత శుభ్రపరుచుకోవాలి. క్రమం తప్పకుండా ఈ విధంగా చేస్తే చర్మానికి మంచి నిగారింపు వస్తుంది.

క్యారట్ జ్యూస్‌ని ముఖంపై రాసుకుని వేళ్లతో వలయాలుగా చుడుతూ మసాజ్ చేసుకోవాలి. ఈ జ్యూస్ మంచి స్క్రబ్‌లా ఉపయోగపడుతుంది.

టొమాటో లోపలి గుజ్జు అంతా తీసి పీల్‌తో చర్మంపై రబ్‌చేసుకోవాలి. ఇది మంచి స్క్రబ్‌లా ఉపయోగపడుతుంది.

ఉడకబెట్టిన క్యాబేజ్‌ని మిక్సీలో వేసుకుని మెత్తని గుజ్జులా చేసుకోవాలి. దానిలో తేనె, శనగ పిండి కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి ఆరిన తర్వాత కడిగేయాలి. వారానికి మూడు సార్లు ఈ విధంగా చేస్తే చర్మం కాంతివంతంగా తయారవుతుంది.

నాలుగు బాదాం పలుకులను పాలలో ఒక రాత్రంతా నానబెట్టి మరుసటి రోజు మెత్తని గుజ్జులా చేసుకోవాలి. ఈ ప్యాక్‌ని ముఖానికి వేసుకుని ఆరిపోయిన తర్వాత కడుక్కోవాలి. పొడిచర్మం గలవారికి ఈ ప్యాక్ బాగా పనిచేస్తుంది.



చెట్టు నీడ

నాలుగు ఫిర్యాదులు

ఖలీఫా ఉమర్ (రజి) పరిపాలనా కాలమది. అరబ్బు సామ్రాజ్యంలోని ఒక ప్రాంతానికి సయీద్ ఆమిర్‌ను గవర్నర్‌గా నియమించారాయన. కొన్ని నెలల తరువాత గవర్నర్ల పాలనా తీరును పరిశీలించే క్రమంలో ఖలీఫా ఉమర్ (రజి) సయీద్ ఆమిర్ (రజి) ప్రాంతానికి వెళ్లారు. ఖలీఫా తనిఖీ చేయడానికి వచ్చారని తెలిసి ప్రజలంతా మస్జిదులో హాజరయ్యారు. ఖలీఫా... పక్కనే ఉన్న గవర్నర్ సయీద్ బిన్ ఆమిర్ గురించి ఏమైనా ఫిర్యాదులున్నాయా? అని ప్రజలనుద్దేశించి అడిగారు. కొంతమంది కలగజేసుకుని గవర్నర్ గురించి నాలుగు ఫిర్యాదులు చేశారు. ''గవర్నర్ గారు ఫజర్ నమాజు తరువాత కలవరు'' అన్న ఫిర్యాదుకు సంజాయిషీ ఇవ్వమని కోరారు.

అందుకు సయీద్ బిన్ ఆమిర్ ''అయ్యా, మా ఆవిడ అనారోగ్యంతో బాధపడుతోంది. ఇంటి పనులన్నీ నేనే స్వయంగా చేయాలి. ఉదయాన్నే నమాజు తరువాత ఇల్లు ఊడ్చి, అంట్లు కడిగి, రొట్టెల పిండి కలిపి రొట్టెలు చేస్తున్నాను. మంచానికే పరిమితమైన నా భార్య అవసరాలు తీరుస్తున్నాను. బట్టలు ఉతుకుతున్నాను. ఇంటిపనులన్నీ చేస్తున్నాను కాబట్టి ఆ వేళలో ప్రజలకోసం సమయం కేటాయించలేకపోతున్నాను. నౌకరును పెట్టుకునేంత స్థోమత నాకు లేదు'' అని సమాధానమిచ్చారు. 'వారంలో ఒకరోజు ప్రజలను కలవరు' అన్నది మరో ఫిర్యాదు. దానికి సయీద్ బిన్ ఆమిర్ ''ఈ విషయం నేనెంతో రహస్యంగా ఉంచదలుచుకున్నాను. ప్రజలు మీముందు ఫిర్యాదు చేశారు కాబట్టి చెప్పక తప్పడం లేదు. నాకున్నది ఒకే ఒక్క జత బట్టలు. వాటిని వారానికోసారి ఉతికి ఆరేస్తాను. అవి ఆరేదాకా నా భార్య బట్టలు తొడుక్కుంటాను. అందుకే వారంలో ఒకరోజు బయటికి రాను' అని చెప్పారు. 'నువ్వు రాత్రుళ్లు ఎవ్వరినీ కలవవు' అన్నది మూడో ఫిర్యాదు. ''నా తల వెంట్రుకలు, గెడ్డం అన్నీ నెరసిపోయాయి. ప్రభువు పిలుపు ఎప్పుడొస్తుందో తెలియదు. నా పాపాల చిట్టా చాంతాడంత ఉంది. పగలంతా ప్రజాసేవలో గడపడం మూలాన దైవారాధనకు తీరిక దొరకడం లేదు కాబట్టి రాత్రుళ్లు అల్లాహ్ ఆరాధనలో లీనమవుతాను' అని చెప్పాడు. 'ఒక్కోసారి స్పృహతప్పి పడిపోతాడు' అన్నది నాలుగో ఫిర్యాదు

'నేను నలభై ఏళ్ల వయస్సులో కలిమా చదివి విశ్వాసినయ్యాను. నలభై ఏళ్ల వరకూ నేను చేసిన పాపాలు గుర్తుకొచ్చినప్పుడల్లా స్పృహ తప్పిపడిపోతున్నాను. ప్రళయం రోజు నా పాపాల గురించి అల్లాహ్ నిలదీస్తే నేనేం జవాబు చెప్పాలన్నదే నా భయమంతా. నాకోసం ప్రార్థించండి'' అని అన్నాడు. అలాగే, 'ఖలీఫా గారూ ఈ నాలుగు ఫిర్యాదులకు మీరేం శిక్ష వేసినా నేను భరించేందుకు సిద్ధమే' అని చెప్పాడు.

''ఓ అల్లాహ్ ఇలాంటి మరింతమంది గవర్నర్లను నాకివ్వు'' అంటూ రోదిస్తూ ఖలీఫా ఉమర్ తన రెండు చేతుల్ని పైకెత్తి అల్లాహ్‌ను వేడుకున్నారు.

– ముహమ్మద్ ముజాహిద్

ఇద్దరు కూతుళ్లు

తప్ప నాన్నా

తండ్రి పేరు రొనాల్డ్ ఫెంటీ. కూతురి పేరు రాబిన్ రిహానా ఫెంటీ. తండ్రికి ఎంటర్‌టైన్‌మెంట్ బిజినెస్ ఉంది. 'ఫెంటీ ఎంటర్‌టైన్‌మెంట్'. కూతురికి బ్యూటీ బిజినెస్ ఉంది. 'ఫెంటీ బ్యూటీ'. ఈ పేర్లు, బిజినెస్ పేర్లు అలా ఉంచితే.. రిహానాకు గాయనిగా, బిజినెస్‌ఉమన్‌గా, దౌత్యవేత్తగా, డాన్సర్‌గా, పాటల రచయిత్రిగా మంచి పేరుంది. ఆ పేరు ఆమె ఫెంటీ బిజినెస్ బ్రాండ్ వాల్యూని అమాంతం పెంచేసింది. ఫెంటీ లిప్‌స్టిక్‌లు, ఫెంటీ లోదుస్తులు అంటే అమ్మాయిలకు పిచ్చి. ఫెంటీ అనే ఇంటి పేరు ఈ కూతురికి ఆ తండ్రి ఇచ్చిందే అయినా, తన 'ఫెంటీ' బ్రాండ్ పేరును తండ్రి అతడి ఎంటర్‌టైన్‌మెంట్ బిజినెస్‌కి వాడుకోవడం రిహానాకు నచ్చలేదు. ఆమెకు మాటైనా చెప్పకుండా, ఆమె పేరు చెప్పి కోటీ యాభై లక్షల డాలర్ల 'టాలెంట్ హంట్' టూర్ డీల్ కుదుర్చుకున్నాడు. 'మా అమ్మాయి వచ్చి పెర్‌ఫార్మ్ చేస్తుంది' అని మాట కూడా ఇచ్చేశాడు. ''అదేంటి డాడీ..'' అంటే, ''రెండు బిజినెస్‌లూ మనవే కదమ్మా'' అన్నాడు. రిహానాకు తండ్రి తీరు నచ్చలేదు. ''ఇంటి పేరు మీరిచ్చిందే కావచ్చు. బ్రాండ్ పేరు నేను సంపాదించుకున్నది నాన్నా'' అంది. అని ఊరుకుంటుందనే అనుకున్నాడు ఆ తండ్రి. కానీ ఆ కూతురు కోర్టుకు వెళ్లింది. తన తండ్రి తన బ్రాండ్ నేమ్‌ను వాడకుండా నిరోధించాలని రిహానా కేస్ ఫైల్ చేసింది. ఈ బార్బడోస్ గాయని ఆస్తుల ప్రస్తుత విలువ 26 కోట్ల డాలర్లు. ఆస్తుల విలువ ఎంతని కాదు, మనిషిగా మన విలువ ఎంతో అది ముఖ్యం అంటోంది రిహానా!

• • •


రాబిన్ రిహానా ఫెంటీ


తండ్రి రొనాల్డ్ ఫెంటీతో రాబిన్ రిహానా


ఇంకో అమ్మాయి పేరు ఆశ. ఆ అమ్మాయి తండ్రి పేరు రామ్ విలాస్ పాశ్వాన్. కేంద్ర మంత్రి. లోక్ జనశక్తి పార్టీ అధ్యక్షుడు. ఆ తండ్రికి వ్యతిరేకంగా ఈ కూతురు బిహార్ రాజధాని పాట్నాలో ధర్నాకు కూర్చుంది. ''పాశ్వాన్ తక్షణం క్షమాపణ చెప్పాలి' అని డిమాండ్ చేసింది. నాన్న కదా అనుకోలేదు. 'పాశ్వాన్' అనే అనింది! ఆ రోజు మధ్యాహ్నం పన్నెండు గంటలప్పుడు కొందరు మహిళలతో కలిసి వచ్చి లోక్ జనశక్తి పార్టీ ఆఫీసు బయట ఆశా బైఠాయించింది. ''పాశ్వాన్.. క్షమాపణ చెప్పండి'' అనే ప్లకార్డ్ ఆమె చేతిలో ఉంది. ఆర్జేడీ నాయకురాలు, బిహార్ మాజీ ముఖ్యమంత్రి రబ్రీదేవిని 'అంగూఠా ఛాప్' అని కామెంట్ చేశారు పాశ్వాన్. చదువులేని మనిషి అని అర్థం ఆ మాటకు. ఆ మాట నచ్చలేదు ఆశాకు. తండ్రి అనడం అసలే నచ్చలేదు. ''ఇది ఒక మాజీ ముఖ్యమంత్రిని మాత్రమే అవమానించడం కాదు, నాతో సహా రాష్ట్రంలోని మహిళలందర్నీ అవమానించడమే'' అని ఆశా ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణాల వారికి పది శాతం రిజర్వేషన్ ఇస్తూ ఎన్డీయే ప్రభుత్వం పార్లమెంటులో బిల్లును ప్రవేశపెట్టినప్పుడు ఆర్జేడీ పార్టీ వ్యతిరేకించింది. ''వాళ్లకు నినాదాలివ్వడం, చదువురాని వాళ్లను ముఖ్యమంత్రిని చెయ్యడం మత్రమే తెలుసు'' అని ఎవర్నీ పేరు పెట్టి అనకుండా ప్రెస్ కాన్ఫరెన్స్‌లో పాశ్వాన్ విమర్శించారు. ''ఇలా అనడం తప్పు. రబ్రీదేవికి పాశ్వాన్ క్షమాపణ చెప్పాలి'' అన్నది ఆశా డిమాండ్. కూతురు డిమాండ్ చేసింది కదా అని పాశ్వానేమీ రబ్రీదేవికి అపాలజీ చెప్పలేదు. బహుశా ఆ వివాదం పార్టీ ఆఫీసు నుంచి పాశ్వాన్ ఇంటికి మరలి ఉండాలి. పాశ్వాన్‌కు ముగ్గురు కుమార్తెలు, ఒక కొడుకు. ఉష, ఆశ ఆయన మొదటి భార్య రాజ్‌కుమారి కూతుళ్లు. ఇంకో కూతురు ఈష, కొడుకు చిరాగ్ రెండో భార్య రీనా సంతానం. ఆశా భర్త అనిల్ సాధు. 2015లో బిహార్‌లోని బొచ్చాన్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి లోక్ జన శక్తి పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. తర్వాత కొన్ని నెలలకు ఆర్జేడీలో చేరి, ఆ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు అయ్యారు. లాలూ ప్రసాద్ అడిగితే కనుక వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తన తండ్రిపై పోటీగా హాజీపూర్ బరిలో నిలిచేందుకు ఆశ సిద్ధంగా ఉన్నారు. గట్టి అమ్మాయే.


తండ్రి రామ్‌విలాస్ పాశ్వాన్‌తో ఆశ


రామ్‌విలాస్ పాశ్వాన్ కుమార్తె ఆశ

సాక్షి
ఫ్యామిలీ
విజయవాడ ॥ శుక్రవారం
18-1-2019

లవ్ డాక్టర్ నన్నడగొద్దు ప్లీజ్


ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ రామ్ అన్నయ్యా! నేనొక అబ్బాయిని చాలా గాఢంగా ప్రేమించాను. ఆ విషయం అబ్బాయికి కూడా వన్ ఇయర్ బ్యాక్ చెప్పాను. కానీ తను ఆల్‌రెడీ లవ్‌ఫెయిల్యూర్ అట. 'తనని మరిచిపోలేకపోతున్నాను. తనే నా లైఫ్' అని నాకు 'నో' చేశాడు. నేను కాల్ చేస్తే మాట్లాడతాడు. కలవమంటే కలుస్తాడు. మరోవైపు నేను తనకి ప్రపోజ్ చేసే కొద్దిరోజుల ముందే మా బావ నాకు ప్రపోజ్ చేశాడు. 'నువ్వంటే నాకు చాలా ఇష్టం' అన్నాడు. నేను ప్రేమించిన అబ్బాయి కోసం 'ఆల్‌రెడీ నేను ఒకరిని లవ్ చేస్తున్నాను' అని మా బావకి చెప్పాను. అయినా సరే 'నేను నీకోసం ఎప్పటికైనా ఎదురు చూస్తాను, ఇంట్లో ఒప్పించి పెళ్లి చేసుకుందాం' అని చెప్పి వెళ్లిపోయాడు. పోని నేను ప్రేమించిన అబ్బాయిని మరిచిపోదామంటే నా వల్ల కావట్లేదు. దాంతో మా బావని చాలా బాధపెడుతున్నాను. నా వల్ల తను బాధపడుతుంటే భరించలేకపోతున్నాను. నాకు మంచి సలహా ఇవ్వండి ప్లీజ్.

– స్వాతి

ఈ ట్రయాంగిల్ లవ్ స్టోరీలు అన్నీ చాలా డిప్రెషన్‌గా ఉంటాయ్‌రా బంగారం.

అసలు వాటిలో పడకూడదు!!

'ఎందుకు సార్? అది బెర్ముడా ట్రయాంగిల్ లాగా.. విమానాల్ని సైతం మింగేసినట్టు.... హార్ట్‌తో పాటు మనిషిని కూడా మింగేస్తాయా సార్ ఈ ట్రయాంగిల్ లవ్ స్టోరీస్?'

నీలూ! బెర్ముడా ట్రయాంగిల్ తాతకు ముత్తాతల్లాంటివి ఈ ట్రయాంగిల్ లవ్ స్టోరీస్! అస్సలు పడకూడదు!!

'మరి ఇప్పుడు మీ సిస్టర్ ఏం చెయ్యాలి సార్?'

ముందు కొంచెం సెటిల్డ్‌గా ఆలోచించాలి. మనకి పెంట ఇప్పుడు అవసరమా? మనకిష్టమున్నవాడు కన్నీళ్ల కుడితిలో పడి గిలగిల కొట్టుకుంటున్నాడు. వాడితో పెట్టుకుంటే మనం కష్టాల కుడితిలో ఈదుతూ మునుగుతూ బతకాలి. బావేమో నీ మనసు అక్కర్లేదు నువ్వు ఉంటే చాలు అని సొంగలు కార్చుతున్న కుక్కపిల్లలా ఉన్నాడు. ఇప్పుడు వాడితో పెట్టుకుంటే... యాక్ తూ అంతా కంపు సొంగే!!

'సెటిల్డ్‌గా ఎలా ఆలోచించాలి సార్?'

నీలూ! స్వాతీకి కూడా ఒక వాల్యూ ఉంది. ఒక స్టాండర్డ్ ఉంది. ఇప్పుడు లైఫ్ కొంచెం స్టేబిలిటీ ఉండాలి. తొందరపాటు మాని... అహ్లాదంగా లైఫ్ లీడ్ చెయ్యాలి. హ్యాపీ థింగ్స్ చెయ్యాలి. ఈ యూజ్‌లెస్ లవ్ బెర్ముడా ట్రయాంగిల్ నుంచి బయటపడి.. ప్రశాంతంగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి!!

లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్,
రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34.
lovedoctorram@sakshi.com

ఏప్రిల్ ఫిక్స్


మహేశ్‌బాబు

మహేశ్‌బాబు లేటెస్ట్ చిత్రం 'మహర్షి' విడుదల వాయిదా పడిందంటూ వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. ఈ విషయంపై చిత్ర సన్నిహిత వర్గాల్ని సంప్రదించగా అలాంటిదేం లేదని పేర్కొన్నాయి. వంశీ పైడిపల్లి దర్శకత్వంలో మహేశ్‌బాబు హీరోగా తెరకెక్కుతున్న చిత్రం 'మహర్షి'. అశ్వనీదత్, 'దిల్' రాజు, పీవీపీ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. పూజా హెగ్డే కథానాయిక. ఈ సినిమాను ముందుగా ఏప్రిల్ 5న రిలీజ్ చేయడానికి ప్లాన్ చేశారు. అయితే జూన్‌లో విడుదల కానుందంటూ తాజాగా వార్తలు వినిపించాయి. ముందుగా అనుకున్నట్టు ఏప్రిల్ 5న ఈ సినిమా విడుదల కాకపోయినా ఏప్రిల్ నెలలోనే రిలీజ్ కన్ఫార్మ్ అట. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ పొల్లాచ్చిలో జరుగుతోంది. పది రోజుల పాటు సాగే ఈ షెడ్యూల్‌లో మహేశ్‌తో పాటు ముఖ్య తారాగణమంతా పాల్గొంటారు. ఈ సినిమాలో మహేశ్‌బాబు స్టూడెంట్‌గా, బిజినెస్‌మేన్‌గా కనిపించనున్నారు. 'అల్లరి' నరేశ్ కీలక పాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీ ప్రసాద్, కెమెరా: కేయు మోహనన్.

నా కళ్లు తెరిపించింది


తాప్సీ

2018 బాలీవుడ్ బాగా కలిసొచ్చింది తాప్సీకి. మూడు హిట్స్ అందుకోవడమే కాకుండా నటిగా అద్భుతమైన మార్కులు సంపాదించారామె. లేటెస్ట్‌గా యంగ్ హీరో కార్తీక్ ఆర్యన్‌తో కలసి 'పతీ పత్నీ అవుర్ వో' అనే చిత్రం రీమేక్‌లో నటించడానికి అంగీకరించారు. ఈ సినిమా షూటింగ్ ఫిబ్రవరి నుంచి ప్రారంభం కావాలి. అయితే చివరి నిమిషంలో ఈ సినిమాలో హీరోయిన్ తాప్సీ కాదని చిత్రబృందం అనౌన్స్ చేయడంతో ఆమె షాక్ అయ్యారు. ఈ విషయం గురించి తాప్సీ మాట్లాడుతూ –''ఈ సినిమా కోసం నా షెడ్యూల్ అంతా సెట్ చేసుకొని వాళ్లకు డేట్స్ ఇచ్చాను. నేను హీరోయిన్ కాదని తెలియడంతో షాక్ అయ్యాను. దర్శక–నిర్మాతలను అడిగితే సరైన సమాధానం ఇవ్వడం లేదు. ఈ విషయంపై ఎంత క్లారిటీ తెచ్చుకుందామనుకున్నా జవాబు చెప్పకుండా మాట దాటేస్తున్నారు. ఈ విషయం కొంచెం ముందే తెలిసినా ఈ సినిమా కోసం సర్దుబాటు చేసిన డేట్స్ వేరే సినిమాలకైనా ఇచ్చేదాన్ని. ఈ సంఘటన వల్ల ఇకనుంచైనా జాగ్రత్తగా ఉండాలనే విషయం అర్థం అయింది. ఒక విధంగా చెప్పాలంటే జరిగిన సంఘటన నా కళ్లు తెరిపించింది'' అని తాప్సీ పేర్కొన్నారు.

ఆ ఫీలింగ్ కలగలేదు!


నిత్యామీనన్

ఇప్పటివరకు సౌత్‌లో సత్తా చాటి నటిగా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు కథానాయిక నిత్యామీనన్. ఈ ఏడాది ఆమె నార్త్ వైపు(బాలీవుడ్) కూడా దృష్టిసారించారు. ఇస్రో (ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్) మార్స్ మిషన్ ఆధారంగా తెరకెక్కుతోన్న హిందీ చిత్రం 'మిషన్ మంగళ్' సినిమాలో నిత్యామీనన్ శాస్త్రవేత్తగా నటిస్తున్నారు. అక్షయ్ కుమార్, విద్యాబాలన్, సోనాక్షీ సిన్హా, తాప్సీ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. హిందీలో ఆమె 'బ్రీత్ 2' అనే వెబ్ సిరీస్‌లో అభిషేక్ బచ్చన్‌కు జోడీగా నటిస్తున్నట్లు వెల్లడించారు. ఇన్ని రోజులు సౌత్ ఇండస్ట్రీలో వర్క్ చేసిన మీరు ఇప్పుడు నార్త్ ఇండస్ట్రీలో ఎలాంటి అనుభవాలను ఎదుర్కొంటున్నారు అన్న ప్రశ్నను నిత్యామీనన్‌ను అడిగినప్పుడు– ''హిందీ పరిశ్రమలో నేను ఇప్పుడు సినిమాలు చేస్తున్నాను కానీ ఇక్కడి వారికి నేను తెలుసు. నా సినిమాలు కొన్ని హిందీలో డబ్ అయ్యాయి. న్యూ కమర్‌ని అని, అవుట్‌సైడర్‌ని అన్న ఫీలింగ్ కలగలేదు నాకు. తక్కువ కాలంలోనే స్నేహితులుగా కలిసిపోయాం. ఇప్పుడు నేను హిందీలో చేస్తున్న రెండు ప్రాజెక్ట్స్‌కు కెమెరామెన్స్ తమిళులే. వారితో నేను తమిళంలోనే మాట్లాడుతున్నాను. అక్కడ కంఫర్ట్‌గానే ఉంది. 'మిషన్ మంగళ్' సినిమాలో నా షూటింగ్ పూర్తికావొచ్చింది. బ్రీత్ వెబ్‌సిరీస్ 'బ్రీత్ 2'లో నటిస్తున్నా. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత బయోపిక్ 'ఐరన్‌లేడీ' సినిమాలో లీడ్ రోల్ చేయడం చాలా ఎగ్జైటింగ్‌గా ఉంది'' అన్నారు.

ఎల్వీ ప్రసాద్‌గారు ఎందరికో స్ఫూర్తి -బాలకృష్ణ


వైవీఎస్ చౌదరి, రాధ, రమేశ్ ప్రసాద్, బాలకృష్ణ, గీతాంజలి, సురేశ్ కొవ్వూరి

''ఎల్వీ ప్రసాద్‌గారి గురించి చెప్పడం అంటే సూరీడికి వెలుగు చూపించడమే. ఆయన ఒక వ్యవస్థ. సినిమా రంగంలో తనకు ఇష్టమైన అన్ని శాఖల్లోనూ ఆయన రాణించారు. ప్రసాద్ ల్యాబ్స్ అనే గొప్ప సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేశారు. సర్వేంద్రియానాం నయనం ప్రధానం అంటారు. అందుకే ఐ ఇన్‌స్టిట్యూట్‌ను ఏర్పాటు చేశారు. ఆయన ఎంతో మందికి స్ఫూర్తి. గతాన్ని ఎవరూ మర్చిపోకూడదు. భావి తరాలకు చెప్పాలి. ఎల్వీ ప్రసాద్‌గారి కలల్ని ఆయన తనయుడు సాకారం చేయడం ఆనందంగా ఉంది'' అని హీరో బాలకృష్ణ అన్నారు. అక్కినేని లక్ష్మీ వరప్రసాద్(ఎల్వీ ప్రసాద్) 111వ జయంతిని గురువారం హైదరాబాద్‌లో నిర్వహించారు. సీనియర్ నటి గీతాంజలి మాట్లాడుతూ– ''నన్ను అందరూ సీతమ్మ అని పిలుస్తున్నారంటే కారణం పెద్దాయన ఎన్టీఆర్‌గారే. 'సీతారామకల్యాణం' తర్వాత నేను చేసిన సినిమా 'ఇల్లాలు'. అప్పట్లో ఎల్వీ ప్రసాద్‌గారి మెప్పు పొందాను'' అన్నారు. ఎల్వీ ప్రసాద్ తనయుడు రమేశ్ ప్రసాద్ మాట్లాడుతూ– ''మా నాన్నకి సినిమా తప్ప మరేమీ తెలియదు. నన్ను నటుణ్ని చేయాలన్నది ఆయన కోరిక. అయితే ఓ సారి 'సంసారం' సినిమా షూటింగ్‌లో అంత సేపు స్టూడియోలో కూర్చోవడం ఇష్టం లేక ఆయన్ని విసిగించాను. అప్పటి నుంచి నాకు యాక్టింగ్ మీద పెద్దగా ఆసక్తిలేదు. ఇంజనీరింగ్ పూర్తి చేశాక ఈ రంగంలోకి వచ్చాను'' అన్నారు. ''ఎల్వీ ప్రసాద్, ఎన్టీఆర్... ఇద్దరూ మహావృక్షాలు. తాము సంపాదించినదాన్ని సినిమా రంగంలోనే పెట్టుబడి పెట్టారు. వారి వారసత్వాన్ని వారి పిల్లలు కొనసాగిస్తున్నారు. ఎల్వీ ప్రసాద్‌గారి మీద ఆయన తనయుడు రమేష్ ప్రసాద్‌గారు ఓ మంచి బయోపిక్ తీయాలి'' అని దర్శక–నిర్మాత వైవీఎస్ చౌదరి అన్నారు.



ఇస్మార్ట్ శంకర్

డబుల్ ధిమాక్ శంకర్ ఈ నెల 24 నుంచి షూటింగ్ షురూ చేయనుండట. పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రామ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'ఇస్మార్ట్ శంకర్'. శంకర్ అనే పక్కా మాస్ కుర్రాడి పాత్రలో రామ్ కనిపించనున్నారు. పీసీ కనెక్ట్స్ బ్యానర్‌పై చార్మీ, పూరీ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఈ నెల 24 నుంచి ప్రారంభం కానుంది. సరికొత్త కథతో, రామ్‌ను ఓ కొత్త యాంగిల్‌లో ఈ సినిమాలో పూరి చూపించనున్నారట. ఇందులో హీరోయిన్ ఎవరన్నది ఇంకా ఫిక్స్ అవ్వలేదు. ఈ చిత్రానికి సంగీతం : మణిశర్మ.


రాజా గౌతమ్

నాన్నగారి ఆరోగ్యం బాగుంది - గౌతమ్

ప్రముఖ హాస్య నటులు బ్రహ్మానందంకు గుండె ఆపరేషన్ జరిగిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆయన ముంబైలోని ఆస్పత్రిలో ఉన్నారు. ఈ విషయం తెలిసిన ఆయన అభిమానులు, సన్నిహితులు, శ్రేయోభిలాషులు కలవరపడ్డారు. అయితే బ్రహ్మానందం ఆరోగ్యం నిలకడగానే ఉందంటూ ఆయన తనయుడు, హీరో రాజా గౌతమ్ తెలిపారు. ''కొన్ని నెలలుగా నాన్నగారికి ఛాతిలో అసౌకర్యంగా అనిపించడంతో హైదరాబాద్‌లోని ప్రముఖ డాక్టర్‌ని సంప్రదించారు. వారి సలహా మేరకు ముంబైలోని 'ఏషియన్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్' లో సోమవారం (14.1.2019) గుండె ఆపరేషన్ విజయవంతంగా పూర్తయింది. శ్రీ రమాకాంత్ పాండాగారు శస్త్ర చికిత్స చేశారు. ప్రస్తుతం నాన్నగారి ఆరోగ్యం మెరుగ్గా ఉంది. ఐసీయు నుంచి సాధారణ గదికి మార్చాం. నాన్నగారి అభిమానులు, శ్రేయోభిలాషులు, సినీ పరిశ్రమలోని ప్రముఖుల ప్రేమాభిమానాలు, ఆశీస్సులు వల్ల నాన్నగారి ఆరోగ్యం చాలా మెరుగ్గా ఉంది. వారందరికీ కృతజ్ఞతలు'' అన్నారు రాజా గౌతమ్. కాగా బ్రహ్మానందం కుమారులు రాజా గౌతమ్, సిద్ధార్థ్‌లు ప్రస్తుతం తండ్రితో పాటు ముంబైలో ఉన్నారు.


సల్మాన్‌ఖాన్

ఫోర్.. సిక్స్!

ఆఫ్ సైడ్, ఆన్ సైడ్ అన్న తేడా లేకుండా ఫీల్డర్స్‌ను పరిగెత్తించారు సల్మాన్‌ఖాన్. అవును.. సల్మాన్ క్రికెట్ ఆడారు. కానీ స్టేడియంలో కాదు. 'భారత్' సినిమా షూటింగ్ లొకేషన్ ప్లేస్‌లో. అలీ అబ్బాస్ జాఫర్ దర్శకత్వంలో సల్మాన్ హీరోగా రూపొందుతున్న సినిమా 'భారత్'. 'ఓడ్ టు మై ఫాదర్' అనే కొరియన్ చిత్రానికి ఇది హిందీ రీమేక్. ఇందులో కత్రినా కైఫ్ కథానాయిక. దిశాపాట్నీ, టబు, జాకీ ష్రాఫ్, సునీల్ గ్రోవర్ కీలక పాత్రలు చేస్తున్న ఈ సినిమా ఫైనల్ షెడ్యూల్ స్టార్ట్ అయ్యింది. షూట్ కంప్లీట్ అయిన తర్వాత సల్మాన్ అండ్ టీమ్ సరదాగా క్రికెట్ ఆడారు. ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇక 'భారత్' విషయానికొస్తే.. ఈ సినిమా టీజర్‌ను రిపబ్లిక్ డే సందర్భంగా ఈ నెల 26న విడుదల చేయాలని చిత్ర బృందం ప్లాన్ చేస్తోంది. ఈ ఏడాది రంజాన్‌కు 'భారత్' సినిమా విడుదల కానుంది.

ఈ పాటకు ట్యూన్ తెలుసా?



కట్ చేయ్...దాచేయ్...

చెలియా అడుగుదామా చలినే కాస్త పెరగమని
ఇదిగో తరుణం ఇకపై జ్వలనం
సఖియా తెలుపుదామా సుధనే కాస్త పొంగమని
ఇదిగో అదరం ఇకపై వదలం

ఓ సముద్రాలనే దాటే తుఫానల్లే రావే
సరాగాలనే మీటే స్వరంలాగ రావే
సమయత్తమైనాకే సమీపంగ రావే
సమావేశమౌ కాలంలో సమస్తాన్ని తేవే

సునంద దరికి దా దా
సరదా పవనమై వెళదాం
ఆహా ఓహో హాహా
సునంద కదిలి దా దా
కలిసీ కవనమే కడదాం
ఆహా ఓహో హాహా

పగలంత ప్రేమించేసే పిచ్చిదాన్ని నేనే
రాతిరంతా వేచి చూసే రతి నేనే
ఓ వెన్నెలంతా వెచ్చబెట్టి వెన్నపూస తీసి
జాబిలమ్మ తినిపించే మనతోనే
గది మొత్తం దుస్తులల్లేగోడలపై చిత్రమల్లే
దేహంపై ఊపిరల్లే పంచావే గుర్తులే
॥చెలియా॥

కనులా నిప్పు గనులా
పనులా తేనె సానములా
తనతో కలిశా తరువై విరిశా
క్షణమా ప్రేమ ధనమా
రణమా శాంతి కారణమా
సగమై నిలిచా జగమే మరిచా ॥సముద్రాలనే॥

చిత్రం: దేవ్ ; రచన: చంద్రబోస్
గానం: హరిహరణ్, భరత్ సుందర్, అర్జున్ చండీ, క్రిష్, శరణ్య గోపీనాథ్
సంగీతం: హ్యారిస్ జయరాజ్


కార్తికేయ

వెంటనే ఓకే చెప్పేశా!

'ఆర్‌ఎక్స్ 100' ఫేమ్ కార్తికేయ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం రెగ్యులర్ షూటింగ్ గురువారం నుంచి ఒంగోలులో ప్రారంభమైంది. అర్జున్ జంధ్యాలని దర్శకునిగా పరిచయం చేస్తూ, జ్ఞాపిక ఎంటర్‌టైన్‌మెంట్స్, స్ప్రింట్ టెలీ ఫిలిమ్స్ పతాకాలపై అనిల్ కడియాల, తిరుమల్ రెడ్డి ఈ సినిమా నిర్మిస్తున్నారు. కార్తికేయ మాట్లాడుతూ– ''ఆర్‌ఎక్స్ 100' తర్వాత చాలా కథలు విన్నాను. అర్జున్ జంధ్యాల చెప్పిన కథ బాగా నచ్చడంతో వెంటనే ఓకే చెప్పేశా. ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా ఉంటుంది'' అన్నారు. ''బోయపాటి శ్రీనుగారి దగ్గర దర్శకత్వశాఖలో పనిచేశాను. ఆయన నాకు గురువుగారు మాత్రమే కాదు. సోదర సమానులు. కార్తికేయగారి వల్లే ఈ చిత్రం ఇంత త్వరగా పట్టాలెక్కింది. కథానుగుణంగా ఒంగోలులో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నాం'' అన్నారు అర్జున్ జంధ్యాల. ''ఈ చిత్రంతో సినిమా రంగంలో అడుగుపెడుతున్నందుకు ఆనందంగా ఉంది. గురువారం నుంచి ఫిబ్రవరి 8 వరకు ఒంగోలు పరిసరాల్లో తొలి షెడ్యూల్ చిత్రీకరిస్తాం. ఈ షెడ్యూల్లోనే కీలక సన్నివేశాలు, రెండు పాటలను తెరకెక్కిస్తాం. ప్రస్తుతం హీరోయిన్ ఎంపిక జరుగుతోంది. టైటిల్ త్వరలోనే వెల్లడిస్తాం'' అని అనిల్ కడియాల, తిరుమల్ రెడ్డి చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: చైతన్య భరద్వాజ్, కెమెరా: 'ఆర్‌ఎక్స్ 100' ఫేమ్ రామ్, ఆర్ట్ డైరెక్టర్: జీయమ్ శేఖర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: శివ మల్లాల.


మేఘా ఆకాశ్

చాన్స్ కొట్టేశారా?

తెలుగులో అనుకున్నంత స్పీడ్‌గా సినిమాలు ఒప్పుకోకపోయినా తమిళంలో మంచి ఫామ్‌తో దూసుకెళ్తున్నారు మేఘా ఆకాశ్. ఇటీవలే రజనీకాంత్ 'పేట' సినిమాలో చిన్న రోల్ కూడా చేశారు. తాజాగా తెలుగులో నాని సరసన హీరోయిన్‌గా నటించే చాన్స్ కొట్టేశారని టాక్. 'మనం' ఫేమ్ విక్రమ్ కుమార్, నాని కాంబినేషన్‌లో ఓ చిత్రం రూపొందనున్న సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్ ఈ సినిమాను నిర్మించనున్నారు. పీసీ శ్రీరామ్ కెమెరామేన్. ఈ సినిమాలో హీరోయిన్‌గా మేఘా ఆకాశ్ పేరుని ఫిక్స్ చేశారట. సినిమా అనౌన్స్‌మెంట్ రోజు 'నాని... మరో ఐదుగురు' అంటూ పేర్కొన్నారు చిత్రబృందం. అంటే ఈ సినిమాలో ఐదుగురు భామలు ఉండే ఛాన్స్ ఉందా? వేచి చూడాలి. 'జెర్సీ' సినిమా షూటింగ్ పూర్తయిన తర్వాత ఫిబ్రవరి నుంచి ఈ సినిమా షూట్‌లో జాయిన్ అవుతారట నాని.

స్నేహితుల సాయంతో...

శివ కంఠంనేని టైటిల్ పాత్రలో నటించిన చిత్రం 'అక్కడొకడుంటాడు'. లైట్ హౌస్ సినీ మ్యాజిక్ పతాకంపై కె. శివశంకర్ రావు, రావుల వెంకటేశ్వర రావు నిర్మిస్తున్నారు. శ్రీపాద విశ్వక్ దర్శకుడు. రామ్ కార్తీక్, శివ హరీశ్, అలేఖ్య, రసజ్ఞ దీపికా హీరో, హీరోయిన్లు. సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ చిత్రం ట్రైలర్‌ను హైదరాబాద్‌లో విడుదల చేశారు. ట్రైలర్‌ను ప్రముఖ హీరో నాగశౌర్య విడుదల చేయగా, ఈ చిత్రంలోని 'ఆడి పాడి గడిపేద్దాం..' అనే పాటను ప్రముఖ నిర్మాత కె.యస్. రామారావు విడుదల చేశారు. ''సస్పెన్స్ థ్రిల్లర్ కథాంశంతో తెరకెక్కిన ఈ చిత్రం ట్రైలర్, పోస్టర్‌లు ఆకట్టుకున్నాయి'' అన్నారు నాగశౌర్య. ''టైటిల్ పాత్రలో శివ కంఠంనేని బాగా ఒదిగిపోయారు'' అన్నారు కేయస్ రామారావు. ''డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల జరిగే అనర్థాలను మా చిత్రంలో చూపిస్తున్నాం'' అన్నారు శివ కంఠంనేని. శ్రీపాద విశ్వక్ మాట్లాడుతూ– ''అనుకోని ఆపదలో చిక్కుకున్న ప్రేమజంటకు స్నేహితుల సహాయం అందే సమయంలో మరో అపాయం ఎదురవుతుంది. ఆ ప్రేమ జంట ఎలా బయటపడుతుందనే అంశంతో తెరకెక్కిన చిత్రమిది. త్వరలోనే సినిమాలోని అన్ని పాటలను విడుదల చేస్తాం'' అన్నారు.


శివ కంఠంనేని

కాసుకో సుడోకు

8	7	5	4		9		2	
	6		8			9		
				5			8	4
		8	3					7
4	2	7				8	3	1
6					7	2		
5	8			1				
		6			3		1	
	4		9		8	5	7	2

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

8	6	2	9	4	1	3	7	5
5	3	4	7	2	8	9	1	6
1	9	7	5	3	6	4	2	8
2	4	5	3	8	7	6	9	1
9	8	3	6	1	2	5	4	7
7	1	6	4	5	9	2	8	3
3	5	1	2	7	4	8	6	9
6	2	8	1	9	3	7	5	4
4	7	9	8	6	5	1	3	2

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
శుక్రవారం
18-1-2019

ఫ్యాషన్

దుకుట్టీలు

**దుపట్టా జారదు... చేతికి అడ్డం రాదు
మోయాల్సిన అవసరం ఉండదు
జాగ్రత్త చేసుకోవాల్సిన కష్టం ఉండదు
ఈ దుపట్టాలు కుట్టిన దుపట్టాలు.
దుకుట్టీలు.**



బ్రౌన్ కలర్ సిల్క్ లెహెంగాకు స్టోన్, కట్‌దానా, జర్దోసీ వర్క్ చేసిన గ్రీన్ కలర్ బ్లౌజ్. ఆభరణాల అవసరం లేకుండా బ్లౌజ్ ప్యాటర్న్‌కు నెక్ దగ్గర జత చేసిన దుపట్టా స్టైల్ క్లచ్.



ఎంబ్రాయిడరీ చేసిన లేత పచ్చ రంగు సిల్క్ గౌన్, దానికి జత చేసిన జరీ అంచులు గల ముదురు పసుపు దుపట్టా ప్రత్యేక ఆకర్షణ.

లంగా ఓణీ స్టైల్‌లో డిజైన్ చేసిన వెస్టర్న్ గౌన్ ఇది. అంటే టూ ఇన్ వన్ స్టైల్ అన్నమాట. దీనికి ఎడమ భుజం మీదుగా దుపట్టా స్టైల్ వచ్చేలా డిజైన్ చేశారు. దీంతో ఇది పూర్తిగా ఇండోవెస్టర్న్ లుక్‌తో ఆకట్టుకుంటుంది.

జార్జెట్ గౌన్‌కి సింపుల్ ఎంబ్రాయిడరీ చేసిన దుపట్టాను మెడకు హారంలా ఉండేలా జత చేశారు.

నిర్వహణ:
ఎన్.ఆర్.



లెహంగా, చోలీ, దుపట్టా ఒకే రంగులో ఉన్న ఇండో వెస్టర్న్ స్టైల్ లుక్. చోలీకి మెడ భాగంలో జత చేసిన దుపట్టా ఈ డ్రెస్‌కి ప్రధాన ఆకర్షణ.



ఇది లెహంగా కుర్తీ స్టైల్. దీనికి దుపట్టా మోడల్ లుక్ వచ్చేలా పవిట, కొంగు భాగాలను హైలైట్ చేస్తూ ఎంబ్రాయిడరీతో డిజైన్ చేశారు.



డిజైనర్ లంగాఓణీలలో ఎన్నో మార్పులు వచ్చాయి. లెహంగాకు నడుము దగ్గర ఓణీని జత చేసి ఓ భిన్నమైన లుక్‌ని తీసుకు వచ్చారు.



ఎంబ్రాయిడరీ చేసిన లాంగ్ డిజైనర్ గౌన్‌కి దుపట్టాని భుజం మీదుగా సన్నగా తీసి, కింది భాగం ఫ్లెయిర్ ఎక్కువ ఉండేలా జత చేశారు.



వెస్టర్న్ గౌన్‌కి నెటెడ్ దుపట్టా రెండు భుజాలమీదుగా తీసి, నడుము దగ్గర జత చేయడంతో లుక్‌లో భిన్నమైన మార్పు కనిస్తోంది.



లెహెంగా–ఛోలీని కలుపుతూ డిజైన్ చేసిన అందమైన దుపట్టా. సంప్రదాయ వేడుకల్లో ఈ స్టైల్ హైలైట్‌గా నిలుస్తుంది.

మేని మెరుపునకు మేలైన ఆహారాలు

చర్మానికి మేలు చేసే ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవడం వల్ల మేని సౌందర్యాన్ని కాపాడుకోవచ్చు. దీర్ఘ కాలం పాటు యౌవనంగా కనిపించడానికి ఈ ఆహారం దోహదపడుతుంది. ఆ ఆహార వివరాలు...

ఆహారం: తాజా చేపలు, అవిశెలు, బాదం... వీటిల్లో ఒమేగా ఫ్యాటీ యాసిడ్స్ ఎక్కువ.
ప్రయోజనం: ఇవి చర్మంలోని తేమను బయటకు వెళ్లనివ్వకుండా కాపాడి చర్మాన్ని మెరుస్తూ ఉండేలా చేస్తాయి. చర్మాన్ని నునుపుగా చేస్తాయి.
ఆహారం: ముడిబియ్యం, పొట్టు తీయని ధాన్యాలు, బార్లీ, పొట్టు తీయని గోధుమలతో చేసిన బ్రెడ్స్... వీటిల్లో పీచు పదార్థాలు ఎక్కువ.
ప్రయోజనం: శరీరంలోని విషాలను తొలగించి బయటకు పంపుతాయి. ఇందులోని పీచుపదార్థాలు చర్మం బిగుతుదనాన్ని కాపాడతాయి.
ఆహారం: విటమిన్–బి6 ఎక్కువుండే ఆహారమైన క్యాలీఫ్లవర్, పొద్దుతిరుగుడు గింజల నూనె, వాల్‌నట్, అవకాడో.
ప్రయోజనం: హార్మోన్లలోని అసమతౌల్యం వల్ల వచ్చే మొటిమలను విటమిన్–బి6 నివారిస్తుంది. హార్మోన్ల సమతౌల్యత సక్రమంగా ఉండేలా చూస్తుంది.
తాజా పండ్లు: అన్ని రకాల తాజాపండ్లలో విటమిన్లతోపాటు యాంటీ–ఆక్సిడెంట్స్ ఉంటాయి.
ప్రయోజనం: చర్మాన్ని ముడతలు పడేలా చేసే ఫ్రీ–రాడికల్స్‌ను తొలగించడానికి ఉపయోగపడతాయి. యౌవనంగా ఉండాలంటే తాజా పండ్లు తినాలి.

చర్మం గ్లో తగ్గించే పదార్థాలు:
ఈ తరహా ఆహారాలు ఎక్కువగా తీసుకుంటే చర్మానికి అంతగా మేలు జరగదు. మితిమీరి తీసుకుంటే కీడు జరిగే అవకాశాలు కూడా ఎక్కువే. అందుకే ఇవి తీసుకునే సమయంలో విచక్షణతో ఉండాలి. ఈ ఆహారం వివరాలివి...
ఆహారం: కాఫీ, టీ, శీతలపానీయాలు, కోలా డ్రింక్స్, ఎనర్జీ డ్రింక్స్.
చేటు: వీటిల్లో కెఫిన్‌పాళ్లు ఎక్కువ. ఇది చర్మంలో నుంచి తేమను సంగ్రహించి చర్మం పొడిబారేలా చేస్తుంది.
ఆహారం: చాక్లెట్లు, సోడా డ్రింక్స్, భోజనం తర్వాత తినే తీపి పదార్థాలు, తీపి పానీయాలు.



చేటు: తీపి ఎక్కువగా ఉండే ఆహారాల వల్ల ఇన్‌ఫ్లమేషన్ పెరుగుతుంది. మొటిమలు వస్తాయి.
ఆహారం: బేకరీ ఫుడ్స్, బర్గర్స్, నిల్వ ఉంచి తీసుకునే క్యాన్‌డ్ ఫుడ్.
చేటు: ఇందులోని అనారోగ్యకరమైన కొవ్వు పదార్థాలు చర్మసౌందర్యాన్ని దెబ్బతీస్తాయి. చర్మం త్వరగా ముడతలు పడేందుకు దోహదం చేస్తాయి.
ఆహారం: నూనె పదార్థాలు, వేపుళ్లు, చిప్స్, ఫ్రెంచ్ ఫ్రైస్, ఎక్కువ కాలం నిల్వ ఉంచేందుకు ఉపయోగించే మార్జరిన్ నూనె ఉపయోగించిన పదార్థాలు.
చేటు: ఇందులో ట్రాన్స్–ఫ్యాటీ యాసిడ్స్ ఎక్కువ. ఇవి రక్తంలో కొవ్వు పదార్థాలను పెంచి చర్మంపై మొటిమలు పెరిగేందుకు దోహదం చేస్తాయి.

హోమియో కౌన్సెలింగ్స్

ఫ్యామిలీ డాక్టర్

టెండనైటిస్ తగ్గుతుందా?

నా వయసు 42 ఏళ్లు. నేను క్రికెట్ ఎక్కువగా ఆడతాను. ఇటీవల కొంతకాలంగా చేయి కదిలించినప్పుడు భుజంలో విపరీతమైన నొప్పితో బాధపడుతున్నాను. డాక్టర్‌ను సంప్రదిస్తే టెండన్స్‌కి సంబంధించిన వ్యాధి అని చెప్పారు. ఎన్ని మందులు వాడుతున్నా సమస్య నుంచి ఉపశమనం లభించడం లేదు. హోమియో చికిత్స ద్వారా దీన్ని పూర్తిగా నయం చేసే అవకాశం ఉందా?

- కె. ఆనంద్ మోహన్, నందిగామ



మీరు వివరంగా తెలిపిన లక్షణాలను బట్టి మీరు టెండినైటిస్ సమస్యతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. సాధారణంగా మన శరీరంలోని కండరాలను ఎముకలతో జతపరిచే తాడు లాంటి కణజాలాన్ని టెండన్స్ అని అంటాము. ఇవి ఫైబ్రస్ కణజాలంతో ఏర్పడతాయి. వీటికి సాగగల గుణం ఉండటం వల్ల ఒత్తిడిని తట్టుకునే సామర్థ్యం కలిగి ఉంటాయి. కాబట్టి అవి కండరాలు ముడుచుకునే సమయంలో, ఎముకలు, కీళ్ల కదలికలకు సహకరిస్తాయి. ఏ కారణం చేతనైనా వీటికి హానికలిగితే, కదలికలు ఇబ్బందికరంగా మారి తీవ్రమైన నొప్పిని కలిగిస్తాయి.

ఈ టెండన్స్ ఇన్ఫెక్షన్‌కు గురికావడాన్ని టెండినైటిస్ అంటారు. శరీరంలో ఎక్కడైనా ఏర్పడే ఈ సమస్య... భుజాలలో, మోచేతుల్లో, మణికట్టు, బొటనవేలు మొదటి భాగంలో, తుంటి, మోకాలు, మడమలు వంటి ప్రాంతాల్లో ఎక్కువగా కనిపిస్తుంది. ఏ వయసు వారిలోనైనా కనిపించే ఈ సమస్య ఎక్కువగా పెద్దవయసు వారిలో (ముఖ్యంగా 40 ఏళ్లు పైబడినవారిలో) కనిపిస్తుంది. ఆ వయసు వారిలో సాధారణంగా టెండాన్స్ సాగేతత్వం, ఒత్తిడిని తట్టుకునే శక్తి తగ్గిపోవడం వల్ల ఈ సమస్య ఏర్పడుతుంది.

కారణాలు... ● వయసు పెరగడం, గాయం కావడం. ● వృత్తిరీత్యా లేదా హాబీల కారణంగా టెండన్స్‌పై అధిగ ఒత్తిడి కలిగించే ఒక రకమైన కదలికలను ఎక్కువగా కొనసాగించడం. ఉదా: కంప్యూటర్ కీ–బోర్డులు, మౌస్‌లు ఎక్కువగా వాడటం, కార్పెంటింగ్, పెయింటింగ్ మొదలైనవి.

క్రీడల వల్ల...
● పరుగెత్తడం, టెన్నిస్, బాస్కెట్‌బాల్, గోల్ఫ్, బౌలింగ్ మొదలైనవాటివల్ల ● డయాబెటిస్, రుమటాయిడ్ ఆర్థరైటిస్, స్థూలకాయం వంటి ఇబ్బందులతో బాధపడేవారిలో ఈ సమస్యకు గురయ్యే అవకాశం ఉంది ● కొన్ని ఇన్ఫెక్షన్‌ల వల్ల కూడా ఈ టెండినైటిస్ సంభవించే అవకాశం ఉంది.

లక్షణాలు... ● టెండినైటిస్‌కి గురైన ప్రదేశంలో నొప్పి, బిగువుగా ఉండటం ● ఆ భాగాన్ని కదిలించినప్పుడు నొప్పి అధికమవ్వడం ● కొన్ని రకాల శబ్దాలు వినిపించడం, వాపు, చేతితో తాకితే ఆ ప్రదేశం వేడిగా అనిపించడం ● ఎర్రగా మారడంవంటి లక్షణాలను గమనించవచ్చు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు...
● కంప్యూటర్లను, కీబోర్డులను, మౌస్‌లను సరైన పొజిషన్‌లో సర్దుబాటు చేసుకోవడం ● పనిలో కొంత విశ్రాంతి తీసుకోవడం ● వ్యాయామాలు ఒకేసారి అధిక ఒత్తిడికి గురిచేసేలా కాకుండా నెమ్మదిగా ప్రారంభించడం ● క్రీడలలో కోచ్ సలహా మేరకు జాగ్రత్తలు పాటించడం వంటి జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఈ సమస్య నుంచి దూరంగా ఉండవచ్చు.

చికిత్స: జెనెటిక్ కాన్స్‌టిట్యూషన్ చికిత్స విధానం ద్వారా రోగి మానసిక, శారీరక పరిస్థితులు, తత్వాలను పరిగణనలోకి తీసుకొని చికిత్స అందించడం ద్వారా రోగి తాలూకు రోగ నిరోధకశక్తిని సరిచేయడం వల్ల ఎలాంటి ఇన్‌ఫ్లమేషన్ ఉన్నా దానిని నయం చేయడమే కాకుండా టెండన్స్‌ను దృఢపరచి సమస్యను సమూలంగా దూరం చేయడం జరుగుతుంది.



డా॥ శ్రీకాంత్ మొర్లావర్,
సీఎండీ, హోమియోకేర్ ఇంటర్నేషనల్, హైదరాబాద్

ఉబ్బిన రక్తనాళాలు, చికిత్స చెప్పండి

నా వయసు 46 ఏళ్లు. కనీసం పది నిమిషాల పాటు నిల్చోలేకపోతున్నాను. కాళ్లు లాగుతున్నాయి. కాళ్లపై నరాలు ఉబ్బి పాదాలు నలుపు రంగులోకి మారుతున్నాయి. దీనికి హోమియోలో పరిష్కారం ఉందా?

- డి. సౌజన్య, *కరీంనగర్*

మీకు ఉన్న సమస్యను వేరికోస్ వెయిన్స్ అంటారు. శరీరంలోని సిరలు బలహీనపడటం వల్ల ఈ వేరికోస్ వెయిన్స్ సమస్య వస్తుంది. ఈ సమస్యలో రక్తనాళాల రంగు మారడం లేదా నలుపు రంగుకి రావడం జరుగుతుంది. ఈ వ్యాధి ఎక్కువగా కాళ్లలో కనిపిస్తుంటుంది. ముఖ్యంగా మారుతున్న జీవనశైలి, అవగాహన లేమి వల్ల ఈ వ్యాధి తీవ్రరూపం దాల్చి ఇతర సమస్యలకు దారితీస్తోంది. సాధారణంగా రక్తం కింది నుంచి గుండెవైపునకు వెళ్లే సమయంలో భూమ్యాకర్షణకు వ్యతిరేక దిశలో రక్త సరఫరా అవుతుండటం వల్ల రక్తప్రసరణ మందగించడం, కాళ్ల ఒత్తిడి పెరగడం జరగవచ్చు. ఈ క్రమంలో సిరలు (రక్తనాళాలు) నలుపు లేదా ఊదా రంగుకు మారుతాయి. దీనివల్ల కాళ్లలో తీవ్రమైన నొప్పి ఏర్పడి నడవడానికీ వీలు కాదు. ఈ వేరికోస్ వెయిన్స్ వ్యాధి శరీరంలోని ఇతర భాగాలలోనూ వస్తుంది కానీ 80 శాతం కేసుల్లో ఇది కాళ్లపైనే కనిపిస్తుంది.

సాధారణంగా 30 ఏళ్ల పైబడిన వారిలో ఈ వేరికోస్ వెయిన్స్ కనిపిస్తుంది. మహిళలు, స్థూలకాయులు, వ్యాయామం చేయనివారిలో ఇది ఎక్కువగా కనిపిస్తుంది.

కారణాలు... ● ముందుకు ప్రవహించాల్సిన రక్తం వెనకకు రావడం ● కొంతమంది మహిళల్లో గర్భధారణ సమయంలో వచ్చే హార్మోన్ల మార్పులు ● ఎక్కువ సేపు నిలబడి చేయాల్సిన ఉద్యోగాల్లో (పోలీస్, సెక్యూరిటీ సిబ్బంది, కండక్టర్, వాచ్‌మేన్, సేల్స్‌మెన్, టీచర్లు వంటి) ఉద్యోగాలలో ఉండేవారికి ఈ సమస్య వచ్చే అవకాశాలు ఎక్కువ.

లక్షణాలు... ● కాళ్లలో నొప్పి, మంట, కాళ్లలోని కండరాలు బిగుసుకుపోవడం ● కొద్దిసేపు నిలబడితే నొప్పి రావడం, దాని తీవ్రత పెరుగుతూ పోవడం ● చర్మం దళసరిగా మారడం ● చర్మం ఉబ్బడం, పుండ్లు పడటం

వ్యాధి నిర్ధారణ...
అల్ట్రాసౌండ్, డ్యూప్లెక్స్ డాప్లర్ అల్ట్రా సౌండ్.

చికిత్స... వేరికోస్ వెయిన్స్, వేరికోసిల్ వంటి వ్యాధులకు హోమియోపతి చికిత్సలో అనుభవం ఉన్న, పరిశోధనల అనుభవం ఉన్న వైద్యులు చికిత్స చేస్తారు. వ్యాధి తీవ్రతను పరిశీలించి, రోగి వ్యక్తిగత లక్షణాలను పరిగణనలోకి తీసుకొని ఆపరేషన్ అవసరం లేకుండానే మంచి మందులు సూచిస్తారు. హోమియోలో ఈ సమస్యకు హామామెలిస్, పల్సటిల్లా, కాల్కేరియా, గ్రాఫైటిస్, కార్బోవెజ్, ఆర్నికా మొదలైన మందులు అందుబాటులో ఉన్నాయి. వాటిని నిపుణులైన డాక్టర్ల పర్యవేక్షణలో వాడాలి.



డాక్టర్ కె. శ్రీనివాస్ గుప్తా,
ఎండీ (హోమియో),
స్టార్ హోమియోపతి, హైదరాబాద్

ఒళ్లంతా తెల్లమచ్చలు పెరుగుతున్నాయి... తగ్గేదెలా?

నా వయసు 39 ఏళ్లు. నా శరీరమంత తెల్లమచ్చలు వచ్చాయి. మొదట్లో కాస్త చిన్నవిగా ఉండి, ఇప్పుడు క్రమంగా పెద్దవవుతూ అందరూ గమనించేలా ఉంటున్నాయి. ఎంతో మానసిక వేదన అనుభవిస్తున్నాను. నాకు హోమియోలో పరిష్కారం సూచించండి.

- కె. అమరేశ్వరరావు, *మిర్యాలగూడ*

శరీరానికి చర్మం ఒక కవచం లాంటిది. అన్ని అవయవాలలో చర్మం అతి పెద్దది. ఇందులో చెమట గ్రంథులు, రక్తనాళాలు, నరాలతో పాటు చర్మం చాయకు కారణమైన మెలనోసైట్స్ కూడా ఉంటాయి. ఏప్రాంతంలోనైనా చర్మంలో ఉండే ఈ కణాలు తగ్గినప్పుడు అక్కడ తెల్ల మచ్చలు వస్తాయి. ఈ మచ్చలనే బొల్లి లేదా ల్యూకోడెర్మా అంటారు. ఇప్పుడు మీరు ఇదే సమస్యతో బాధపడుతున్నారు.

చర్మం వెలుపల పొరల్లో ఉండే మెలనోసైట్ కణజాలాలు విడుదల చేసే 'మెలనిన్ అనే ప్రత్యేక పదార్థం, టైరోసినేజ్ అనే ఎంజైమ్ వల్ల సరైన మోతాదులో విడుదల అవుతుంది. బొల్లి వ్యాధిలో ఈ ఎంజైము అనేక కారణాల వల్ల లోపిస్తుంది. దాంతో మెలనిన్ విడుదలకు అంతరాయం ఏర్పడి, చర్మం రంగును కోల్పోతుంది.

● బొల్లి వ్యాధికి ముఖ్యమైన కారణాల్లో మానసిక ఒత్తిడి ఒకటి. ఇది స్త్రీ, పురుషుల తేడా లేకుండా, వయసుతో సంబంధం లేకుండా రావచ్చు. డిప్రెషన్, యాంగ్జైటీ న్యూరోసిస్ మొదలైన మానసిక పరిస్థితులు దీనికి దారితీయవచ్చు.
● పోషకాహారలోపం కూడా బొల్లి వ్యాధికి దారితీయవచ్చు.
● జన్యుపరమైన కారణాలతో వంశపారంపర్యంగా కూడా వ్యాధి రావచ్చు.
● దీర్ఘకాలిక గ్యాస్ట్రిక్ సమస్యలు : ఆహారంలో రాగి, ఇనుము మొదలైన ధాతువులు లోపించడం వల్ల విటమిన్లు, ప్రొటీన్ల వంటి పోషకాహార లోపం వల్ల గానీ, అమీబియాసిస్, బద్దెపురుగుల వంటి పరాన్నజీవుల వల్లగానీ తెల్లమచ్చలు కనిపించవచ్చు.
● మందులు, రసాయనాలు దుష్ఫలితాలు, క్వినోన్స్, క్లోరోక్విన్, యాంటీబయాటిక్స్ వంటి పరిశ్రమల్లో పనిచేయడం లేదా వాటిని సరైన మోతాదులో వాడకపోవడం వల్ల కూడా బొల్లి వ్యాధి వచ్చే అవకాశం ఉంది.
● కొన్ని ఎండోక్రైన్ గ్రంథులు స్రవించే హార్మోన్స్ లోపాలు, డయాబెటిస్‌లో వంటి వ్యాధులలో తెల్లమచ్చలు ఎక్కువగా కనిపించే వీలుంది.
● వ్యాధి నిరోధక శక్తి (ఇమ్యూనిటీ) తగ్గడం, మన వ్యాధి నిరోధకత మనకే ముప్పుగా పరిణమించే ఆటో ఇమ్యూన్ డిసీజెస్ వల్ల మన సొంతకణాలే మనపై దాడి చేయడం వల్ల కూడా బొల్లి సోకే అవకాశం ఉంది.

లక్షణాలు: మొదట చిన్న చిన్న మచ్చలుగా ఏర్పడి, ఆ తర్వాత శరీరం అంతటా వ్యాపిస్తాయి. చివరకు తెలుపు రంగులోకి మారతాయి. చర్మం పలుచబడినట్లు అవుతుంది. కొన్నిసార్లు ఎండవేడిని తట్టుకోలేరు. జుట్టు రంగుమారడం, రాలిపోవడం, వంటి లక్షణాలు ఉంటాయి. ఈ మచ్చలు ముఖ్యంగా చేతులు, పెదవులు, కాళ్ల మీద రావచ్చు. ఇవి పెరగవచ్చు లేదా అని పరిమాణంలో ఉండిపోవచ్చు.

చికిత్స: తెల్లమచ్చలకు హోమియోలో మంచి చికిత్స అందుబాటులో ఉంది. తూజా, నైట్రిక్ యాసిడ్, నేట్రమ్‌మ్యూరియాటికమ్, ఆర్సెనికమ్ ఆల్బమ్, లాపిస్ అల్బా, రస్టాక్స్ వంటి మందులతో తెల్లమచ్చలకు సమర్థంగా చికిత్సను అందించవచ్చు.



డాక్టర్ టి.కిరణ్ కుమార్, డైరెక్టర్,
పాజిటివ్ హోమియోపతి,
విజయవాడ, వైజాగ్

పరి పరిశోధన

జ్ఞాపకశక్తికి దగ్గర దారి.. గీతలే!



ఏ విషయాన్నైనా గుర్తుంచుకోవాలంటే బొమ్మలు గీయడానికి మించిన దగ్గర దారి లేదంటున్నారు వాటర్లూ యూనివర్శిటీ శాస్త్రవేత్తలు. పదేపదే రాయడం ద్వారా బాగా గుర్తుండిపోతుందన్న విషయం చాలాకాలంగా తెలిసినప్పటికీ, బొమ్మలు గీయడమన్నది అంతకంటే మెరుగైన మార్గమని తాము ఇటీవల జరిపిన ఒక అధ్యయనం స్పష్టం చేస్తోందని మెలిస్సా మీడ్ అనే శాస్త్రవేత్త తెలిపారు. వయసు మళ్లిన తరువాత బొమ్మలు గీయడం అలవాటు చేసుకోవడం ద్వారా జ్ఞాపకశక్తి లోపాలు, అల్జైమర్స్, మతిమరుపు వంటి సమస్యలను అధిగమించవచ్చునని మెలిస్సా అంటున్నారు. 20 – 80 మధ్య వయసు వారు దాదాపు 50 మందిపై తాము ఈ అధ్యయనం చేశామన్నారు. రెండు గుంపులుగా విడదీసిన వీరికి వరుసగా కొన్ని పదాలు చూపినప్పుడు ఆ పదాన్ని, వివరణను రాయడంతోపాటు బొమ్మకూడా గీయాల్సి ఉంటుంది. కొంత సమయం తరువాత వాటిల్లో వీలైనన్ని పదాలను గుర్తు చేసుకోమని అడిగారు. యువకులు పదాలు బాగా గుర్తుపెట్టుకోగలిగారు. అది అసాధారణం కాకపోయినా బొమ్మలు గీసిన పదాలను అన్ని వర్గాల వారూ ఎక్కువగా గుర్తు పెట్టుకోవడం తమను ఆశ్చర్యం కలిగించిందని మెలిస్సా వివరించారు. ఒకేరకమైన సమాచారాన్ని పలు విధాలుగా చూపుతూండటం వల్ల బొమ్మలు ఎక్కువగా గుర్తుండిపోతున్నాయని, పైగా చేతులు కూడా తోడవడం వల్ల మెదడులో సమాచారం మరింత బాగా ముద్రపడిపోతుందని మెలిస్సా తెలిపారు.

పళ్లు శుభ్రం చేసే పద్ధతితో డేంజర్!



మనకు పెద్దగా అలవాటు లేదుగానీ.. ఇతర దేశాల్లో పళ్లను శుభ్రం చేసుకునే పద్ధతిలో ఫ్లాసింగ్ ఒకటి. బ్రష్ చేసిన తరువాత పళ్ల మధ్య చిక్కుకున్న ఆహారాన్ని ఒక దారం సాయంతో తొలగించుకోవడాన్ని ఫ్లాసింగ్ అంటారు. బాగుందిగానీ.. ఈ ఫ్లాసింగ్ కోసం వాడుతున్న ప్రత్యేకమైన దారం కారణంగా పళ్ల మధ్య పాలిఫ్లూరోర అల్కైల్ (పీఎఫ్ఏ) రసాయన పదార్థాలు పోగుపడుతున్నట్లు తాజా అధ్యయనం ఒకటి చెబుతోంది. కాలిఫోర్నియా పబ్లిక్ హెల్త్ ఇన్‌స్టిట్యూట్ కొంతమంది కార్యకర్తల రక్తనమూనాలను పరీక్షించడం ద్వారా ఈ నిర్ధారణకు వచ్చారు. ఫర్నిచర్ మొదలుకొని అనేక ఇతర వస్తువుల్లో నీటిని దూరంగా ఉంచేందుకు ఈ పీఏఫ్ఏలను వాడుతున్నారు. పైగా అంత తేలికగా నాశనమయ్యే రసాయనమూ కాదిది. మార్కెట్‌లో అందుబాటులో ఉన్న 18 కంపెనీలు ఈ పీఎఫ్ఏను ఫ్లాసింగ్ దారాల పై పూతగా వాడుతున్నట్లు తెలిసింది. పళ్లమధ్య ఈ దారాన్ని ఉంచి కదిలించినప్పుడు పూతలోని రసాయనాలు అక్కడే పోగుపడుతున్నాయని.. తరువాత కండరాల్లోకి కూడా చేరిపోతున్నాయని తాము గుర్తించినట్లు కేటీ బోరోనా అనే శాస్త్రవేత్త తెలిపారు. పీఎఫ్ఏలతో కేన్సర్ వంటి ప్రమాదకరమైన వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నది తెలిసిందే. అనేక ఇతర పదార్థాల నుంచి కూడా ఈ పీఎఫ్ఏ శరీరంలోకి ప్రవేశించేందుకు అవకాశం ఉంది.

మురుగు శుద్ధితో భూతాపోన్నతికి చెక్!



పట్టణం, నగరం... ఏదైనా మురుగునీటి కాల్వలు సర్వసాధారణం కదా. దుర్గంధం వెదజల్లుతూ పలురకాల వ్యాధులకు కారణమవుతున్న మురుగు నీటితో ఈ భూమికి మేలు చేయవచ్చునని అంటున్నారు ప్రిన్స్‌టన్ యూనివర్శిటీ శాస్త్రవేత్తలు. భూతాపోన్నతికి కారణమవుతున్న కార్బన్‌డయాక్సైడ్ వంటి గ్రీన్‌హౌస్ వాయువులను ఒడిసిపట్టేందుకు మురుగుకాల్వలు మేలైన మార్గమని వీరు సూచిస్తున్నారు. ఈ అంశంపై తాము ఇటీవల విస్తృత అధ్యయనం నిర్వహించామని, భూతాపోన్నతికి చెక్ పెట్టేందుకు మురుగునీటి కాల్వలు ఉపయోగపడతాయని తేలినట్లు జేసన్ రెన్ అనే శాస్త్రవేత్త తెలిపారు. వాతావరణ మార్పులను అడ్డుకునేందుకు నీళ్లు ఉపయోగపడతాయని ఇప్పటివరకూ ఎవరూ ఆలోచించలేదని, మురుగునీటి శుద్ధీకరణ ప్లాంట్ల ద్వారా మిథేన్ ఉత్పత్తితోపాటు అనేక ఇతర విలువైన ఖనిజాలను రాబట్టుకోవడం ద్వారా పర్యావరణానికి మేలు చేయవచ్చునని తమ అధ్యయనం ద్వారా తెలిసిందని జేసన్ అంటున్నారు. వాతావరణం నుంచి సేకరించిన కార్బన్‌డయాక్సైడ్‌ను పంపడం ద్వారా జరిగే మురుగునీటి శుద్ధీకరణతో ఎంతో ప్రయోజనం ఉంటుందని వివరించారు. మురుగునీటి ద్వారా విలువైన మిథేన్, కార్బనేట్ ఖనిజాలు, ఎరువులను తయారు చేసేందుకు ఇప్పటికే అనేక టెక్నాలజీలు అందుబాటులో ఉన్నాయని జేసన్ గుర్తు చేశారు.



స్క్రీన్ టెస్ట్

రైతులకు సంక్రాంతి ఎంత పెద్ద పండగో, సినిమా పరిశ్రమకు కూడా అంతే పెద్ద పండగ. తెలుగు రాష్ట్రాల్లోని ప్రజలందరూ సంక్రాంతి మూడ్‌లోనే ఉన్నారు. అందుకే సంక్రాంతి సినిమాల గురించి, సినిమా వాళ్ల సంక్రాంతి గురించి ఈ వారం క్విజ్...



1 2012, 2013, 2014 వరుసగా సంక్రాంతికి తన సినిమాలను విడుదల చేసిన టాప్ హీరో ఎవరో కనుక్కోండి?
ఎ) ప్రభాస్ బి) మహేశ్‌బాబు
సి) చిరంజీవి
డి) అల్లు అర్జున్



2 తెలుగు నిర్మాతల్లో ఏ నిర్మాతను 'సంక్రాంతి రాజు' అన్నారో తెలుసా?
ఎ) జీవీజీ రాజు బి) 'దిల్' రాజు
సి) అర్జున్ రాజు డి) యం.యస్. రాజు

3 ఈ సంక్రాంతికి (2019) విడుదలైన సినిమాల్లో ఏ బాలీవుడ్ హీరోయిన్ తెలుగు తెరకు పరిచయమయ్యారో చెప్పకోండి?
ఎ) విద్యాబాలన్ బి) కియరా అద్వానీ సి) శ్రద్ధాకపూర్
డి) కంగనా రనౌత్

4 'సోగ్గాడే చిన్ని నాయనా' అంటూ 2017 సంక్రాంతికి వచ్చారు నాగార్జున. ఆ చిత్రంలో బంగార్రాజు సరసన నటించిన నటి గుర్తున్నారా?
ఎ) లావణ్యా త్రిపాఠి బి) రమ్యకృష్ణ
సి) అనసూయ డి) అనుష్క

5 తెలుగు వారి పెద్ద పండగ 'సంక్రాంతి'. ఆ పేరుతో విడుదలైన సినిమాలో తెలుగులో పేరున్న నలుగురు హీరోలు నటించారు. వెంకటేశ్, శ్రీకాంత్, శివబాలాజీలతో పాటు మరో తమ్ముడుగా నటించిన ఆ నటుడెవరో చెప్పండి? (ఇప్పుడు ఆ నటుడు తెలుగు సినిమాల్లో ఓ ప్రముఖ హీరో)
ఎ) శర్వానంద్ బి) తరుణ్ సి) రోహిత్ డి) ఆకాశ్

6 'సంక్రాంతి వచ్చిందే తుమ్మెద... సరదాలు తెచ్చిందే తుమ్మెద...' అనే పాట 'సోగ్గాడి పెళ్లాం' చిత్రంలోనిది. ఈ పాటలో నటించిన హీరో ఎవరో గుర్తు తెచ్చుకోండి?
ఎ) మోహన్‌బాబు బి) హరనాథ్
సి) చంద్రమోహన్ డి) శ్రీధర్

7 మహేశ్‌బాబు, వెంకటేశ్ 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు' సంక్రాంతికి విడుదలై విజయం సాధించింది. ఆ చిత్రదర్శకుడెవరో కనుక్కోండి?
ఎ) శ్రీకాంత్ అడ్డాల బి) సుకుమార్
సి) కృష్ణవంశీ డి) త్రివిక్రమ్

8 'శతమానం భవతి ' చిత్రంలోని సంక్రాంతి పాటలో శర్వానంద్, అనుపమా పరమేశ్వరన్ సందడి చేశారు. "గొబ్బిళ్లో గొబ్బిళ్లు....' అంటూ సాగే ఆ పాట రచయితెవరో కనుక్కోండి?
ఎ) అనంత శ్రీరామ్ బి) సిరివెన్నెల
సి) రామజోగయ్య శాస్త్రి డి) శ్రీమణి

9 ఎన్టీ రామారావును 'మనదేశం' చిత్రం ద్వారా తెలుగు చిత్రసీమకు పరిచయం చేశారు ఎల్వీ ప్రసాద్. వారిద్దరి కాంబినేషన్‌లో అనేక సినిమాలు వచ్చినప్పటికీ 1955లో వచ్చిన ఓ సినిమా సంక్రాంతికి విడుదలై సంచలనం సృష్టించింది. ఆ చిత్రం పేరేంటి?
ఎ) మనదేశం బి) షావుకారు
సి) సంసారం డి) మిస్సమ్మ



10 2017 సంక్రాంతికి బాలకృష్ణ హీరోగా నటించిన చిత్రం 'గౌతమి పుత్ర శాతకర్ణి' రిలీజైంది. అది ఆయన నటించిన 100వ చిత్రం. క్రిష్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో గౌతమిగా నటించిన ప్రముఖ బాలీవుడ్ నటి ఎవరో తెలుసా?
ఎ) రవీనా టాండన్ బి) టబు
సి) హేమమాలిని డి) సుస్మితా సేన్

11 'శంకర్ దాదా జిందాబాద్' తర్వాత చిరంజీవి హీరోగా చేసిన చిత్రం 'ఖైదీ నంబర్ 150'. ఎన్ని సంవత్సరాల గ్యాప్ తర్వాత చిరు ఈ సినిమా చేశారో తెలుసా ? (ఈ సినిమా సంక్రాంతికి విడుదలైంది)
ఎ) 7 ఏళ్లు బి) 8 ఏళ్లు
సి) 10 ఏళ్లు డి) 6 ఏళ్లు

12 2010 సంక్రాంతికి విడుదలై సంచలన విజయం సాధించిన జూనియర్ యన్టీఆర్ సినిమా పేరేంటో తెలుసా? (చిన్న క్లూ: ఆ చిత్రంలో ఎన్టీఆర్ ద్విపాత్రాభినయం చేశారు)
ఎ) అదుర్స్
బి) ఆంధ్రావాలా
సి) యమదొంగ
డి) నరసింహుడు

13 ఈ ప్రముఖ దర్శకుని సినిమా ఒక్కసారి కూడా సంక్రాంతి బరిలోకి రాలేదు. ఎవరా దర్శకుడు. కొంచెం మెదడుకి పదును పెట్టండి?
ఎ) పూరి జగన్నాథ్
బి) వీవీ వినాయక్
సి) ఎస్.ఎస్. రాజమౌళి
డి) సుకుమార్

14 ప్రభాస్ కెరీర్‌లో ఇప్పటివరకు రెండు చిత్రాలు మాత్రమే సంక్రాంతి



పందెంలో నిలిచాయి. అందులో ఒకటి వీవీ వినాయక్ దర్శకత్వం వహించిన 'యోగి'. మరో చిత్రం ఏంటో కనుక్కుందామా?
ఎ) వర్షం బి) పౌర్ణమి
సి) బిల్లా డి) మున్నా

15 'సంక్రాంతి', 'గోరింటాకు', 'దీపావళి' మూడు పండగల పేర్లతో ఉన్న సినిమాలలో హీరోయిన్‌గా నటించిన నటి ఎవరో కనుక్కుందామా?
ఎ) స్నేహ బి) ఆర్తి అగర్వాల్
సి) సౌందర్య డి) కల్యాణి

16 'ఊరంతా సంక్రాంతి' చిత్రంలో ఇద్దరు పాపులర్ హీరోలు నటించారు. అందులో ఒకరు ఏయన్నార్. మరో హీరో ఎవరు?
ఎ) కృష్ణ బి) శోభన్‌బాబు
సి) కృష్ణంరాజు డి) నాగార్జున

17 కమల్‌హాసన్ నటించిన 'మహానది' చిత్రంలో 'సంక్రాంతి..సంక్రాంతి...' అనే హిట్ పాట ఉంది. ఈ సినిమా సంగీత దర్శకుడెవరో తెలుసా?
ఎ) ఇళయరాజా బి) దేవా
సి) ఎస్.ఎ. రాజ్‌కుమార్
డి) కేవీ మహదేవన్



18 తన మొదటి చిత్రంతోనే సంక్రాంతి బరిలో నిలిచిన దర్శకుడెవరో తెలుసా? ఆయన దర్శకత్వం వహించిన మూడు చిత్రాలు ఇప్పటి వరకు సంక్రాంతి పోటీలో నిలిచాయి. ఇంతకీ ఎవరా దర్శకుడు?
ఎ) శ్రీను వైట్ల బి) బోయపాటి శ్రీను
సి) క్రిష్ డి) శేఖర్ కమ్ముల



19 2019 సంక్రాంతికి ఒకే ఒక డబ్బింగ్ సినిమా విడుదలైంది. ఆ చిత్రం 'పేట'. రజనీకాంత్ హీరోగా నటించిన ఈ చిత్రంలో ఆయన సరసన నటించిన ఇద్దరు హీరోయిన్లలో ఒకరు త్రిష. మరో హీరోయిన్?
ఎ) నయనతార బి) రాధికా ఆప్టే
సి) సిమ్రాన్ డి) మీనా

20 సంక్రాంతి అనగానే తెలుగు సినీ పరిశ్రమలో పెద్ద సినిమాలు రిలీజవుతాయి. 2017 సంక్రాంతికి చిరంజీవి నటించిన 150వ చిత్రం 'ఖైదీ నంబర్ 150', బాలకృష్ణ 100వ చిత్రం 'గౌతమి పుత్ర శాతకర్ణి' వచ్చాయి. ఈ రెండు చిత్రాలకు మాటల రచయిత ఒక్కరే. ఆయనెవరు?
ఎ) వక్కంతం వంశీ బి) అబ్బూరి రవి
సి) బుర్రా సాయిమాధవ్ డి) యం.రత్నం





నిర్వహణ:
శివ మల్లాల

సమాధానాలు
[illegible]

మీరు 6 సమాధానాల కంటే తక్కువ చెబితే... మీకు సినిమా అంటే ఇష్టం
10 సమాధానాల వరకూ చెప్పగలిగితే... మీకు సినిమా అంటే ఇంట్రెస్ట్
15 సమాధానాల వరకూ చెప్పగలిగితే... మీకు సినిమా అంటే పిచ్చి
20 సమాధానాలూ చెప్పగలిగితే... ఇంకోసారి ఈ క్విజ్ చదవకండి!

ఎడారిలో యాక్షన్

రాజస్థాన్ వెళ్లడానికి అంతా సిద్ధం చేసుకుంటున్నారు హీరో గోపీచంద్. అక్కడి ఎడారిలో విలన్స్ భరతం పడతారట. గోపీచంద్ హీరోగా తిరు దర్శకత్వంలో ఏకే ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై రామబ్రహ్మం సుంకర నిర్మాణంలో ఓ సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. అజయ్ సుంకర, అభిషేక్ అగర్వాల్ సహ నిర్మాతలు. ఈ సినిమా తొలి షెడ్యూల్ చిత్రీకరణ రాజస్థాన్‌లో జై సల్మీర్‌లో ఈ నెల 21న మొదలవుతుందని సమాచారం. దాదాపు 45 రోజుల పాటు ఈ షెడ్యూల్ ఉంటుంది. ముఖ్యంగా యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తారు. స్క్రిప్ట్ పరంగా ఈ సినిమాలో ఇద్దరు హీరోయిన్స్‌కి చాన్స్ ఉందట. ఆల్రెడీ టీమ్ సెర్చింగ్ స్టార్ట్ చేశారు. త్వరలో అధికారిక సమాచారం వెలువడే అవకాశం ఉంది. విశాల్ చంద్రశేఖర్ స్వరాలు సమకూర్చుతున్న ఈ సినిమాకు మాటల రచయిత: అబ్బూరి రవి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కిషోర్ గరికపాటి.



గోపీచంద్

రెండేళ్లు... పద్నాలుగు గంటలు



కదలకుండా కుర్చీలో ఐదు గంటలకు మించి కూర్చోవాలంటే ఎవరైనా కాస్త ఇబ్బంది పడాల్సిందే. అలాంటిది 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్' సినిమాలోని క్యారెక్టర్ కోసం హీరో మాధవన్ దాదాపు 14 గంటలు మేకప్‌తో అలాగే కుర్చీలో కూర్చుండిపోయారట. ఇస్రో మాజీ శాస్త్రవేత్త నంబి నారాయణన్ జీవితం ఆధారంగా తమిళం, హిందీ, తెలుగు భాషల్లో రూపొందుతున్న ఈ సినిమాలో మాధవన్ హీరోగా నటిస్తున్నారు. అంతేకాదు ఒక దర్శకుడు కూడా. అనంత మహాదేవన్ మరో దర్శకుడు. ''నంబి నారాయణన్ పాత్ర కోసం రెండేళ్లు కష్టపడ్డాం. ఇప్పుడు ఈ సినిమాలోని నా పాత్ర లుక్ కోసం కుర్చీలో పద్నాలుగు గంటలు కూర్చుండిపోవాల్సి వచ్చింది'' అని పేర్కొన్నారు మాధవన్. ఈ సినిమా సమ్మర్‌లో విడుదల కానుంది. 'సవ్యసాచి' సినిమాతో తెలుగులో డైరెక్ట్ చిత్రం చేసిన మాధవన్ నెక్ట్స్ 'వస్తాడు నా రాజు' ఫేమ్ హేమంత్ మధుకర్ దర్శకత్వంలో మరో తెలుగు సినిమాలో హీరోగా నటించనున్నారు. అనుష్క, అంజలి, షాలినీ పాండే ప్రధానపాత్రల్లో కనిపిస్తారు. మార్చిలో ఈ సినిమా షూటింగ్ స్టార్ట్ కానుంది.

మాధవన్

ఆ చాన్స్ ఇప్పుడొచ్చింది

సన్నీలియోన్‌కు ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. ఆమె వేసే స్టెప్పులకు కుర్రకారు హార్ట్ బీట్ పెరుగుతుంది. ఇప్పటికే చాలా స్పెషల్ సాంగ్స్‌లో నర్తించిన సన్నీ తాజాగా మరో సాంగ్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. 'పులిమురుగన్' (తెలుగులో 'మన్యం పులి') ఫేమ్ వైశాక్ దర్శకత్వంలో మమ్ముట్టి హీరోగా మలయాళంలో 'మధుర రాజా' అనే సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. 2010లో వచ్చిన 'పోకిరి రాజా' సినిమాకు ఇది సీక్వెల్. ఈ సినిమాలో సన్నీలియోన్ స్పెషల్ సాంగ్ చేయనున్నారు. ''మమ్ముట్టిసార్‌తో స్క్రీన్ షేర్ చేసుకోవాలని ఎప్పటినుంచో ఎదురు చూస్తున్నాను. ఆ చాన్స్ ఇప్పుడు వచ్చింది. ఇది నాకో మంచి అవకాశం. ఈ సాంగ్ గురించి నాకు తెలుసు. ఏదో సినిమాలో కావాలని పెట్టే పాట కాదిది. చాలా ఇంపార్టెన్స్ ఉంది. ఆ విషయం నాకు మరింత ఆనందాన్ని కలిగిస్తోంది'' అని సన్నీ చెప్పారు. ఈ సాంగ్ కోసం సన్నీలియోన్ ఆల్రెడీ ప్రాక్టీస్ కూడా స్టార్ట్ చేసేశారు. వచ్చే నెలలో కొచ్చిలో ఈ పాట చిత్రీకరణకి ప్లాన్ చేశారు టీమ్. కాగా సన్నీలియోన్ టైటిల్ రోల్‌లో 'వీరమహాదేవి' అనే పీరియాడికల్ మూవీ రూపొందుతున్న సంగతి తెలిసిందే.



సన్నీ లియోన్